

'మట్టిని నమ్ముకున్న వ్యక్తి రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 301

బుధవారం 22-1-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



వైష్ణవి 'హ్యాట్రిక్'

5 పరుగులిచ్చి 5 వికెట్లు తీసిన స్పిన్నర్. మలేసియాపై నెగ్గిన టీమిండియా -14లో



ట్రంప్ టారిఫ్ టెర్రర్

అధిక వెయిటేజీ షేర్ల పతనం.. 7 లక్షల కోట్ల సంపద ఆవిరి -15లో



5న కుంభమేళాలో పుణ్యస్నానం

ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలోని త్రివేణి సంగమ స్థలిలో ఫిబ్రవరి 5న మోదీ పుణ్యస్నానం ఆచరిస్తారని సమాచారం.

వివరాలు 6లో ▸



తెరపైకి ఏడాది బీఈడీ కోర్సు!

పదేళ్ల తర్వాత.. ఏడాది బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఎన్‌సీటీఈ నిర్ణయించింది.

వివరాలు 6లో ▸



ఘోర విషాదం...

తుర్కియేలోని గ్రాండ్ కర్టల్ హోటల్‌లో మంటలు చెలరేగిన ఘటనలో 66 మంది ప్రాణాలు కోల్పోగా, 51 మంది గాయపడ్డారు.

వివరాలు 6లో ▸



లెక్కలెందుకు దాచారు?

'కాళేశ్వరం'పై విచారణ జరుపుతున్న జస్టిస్ ఘోష్ కమిషన్ రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిపై ప్రశ్నల వర్షం కురిపించింది

వివరాలు 5లో ▸

దండకారణ్యం
నెత్తురోడింది

ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దుల్లో భారీ ఎన్‌కౌంటర్..

16 మంది మావోయిస్టులు మృతి

మృతుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి.. కీలక నేతలు ఉన్నట్టు ప్రచారం



దండకారణ్యంలో గాలింపు చర్యలకు తరలివెళ్తున్న కేంద్ర పోలీసు బలగాలు

- సోమవారం ఉదయమే మొదలైన ఎన్‌కౌంటర్.. దశల వారీగా ఎదురుకాల్పులు
- తొలిరోజున ఇద్దరు.. రెండో రోజు 14 మంది మృతదేహాలు లభ్యం
- ఇంకా కొనసాగుతున్న బలగాల కూంబింగ్
- 25 నుంచి 30 మంది వరకు మావోయిస్టులు మృతిచెంది ఉండొచ్చనే అంచనాలు
- కాంకేర్ ఎన్‌కౌంటర్ జరిగి వారం తిరగకముందే మరో ఎదురుదెబ్బ



చలపతి (ఫైల్)

గెరిల్లా సేనాని

ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన తొలి కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి

నక్సలిజం కొన ఊపిరితో ఉంది: అమిత్ షా

- వివరాలు 12లో

చర్ల/ మల్కన్‌గిరి/ సాక్షి, పాడేరు

వరుస ఎన్‌కౌంటర్లతో కుదేలవుతున్న మావోయిస్టులకు ఊహించని షాక్ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 18 మంది మృతి చెంది వారం తిరగకముందే.. ఛత్తీస్‌గఢ్- ఒడిశా సరిహద్దుల్లో గరియాబంద్ జిల్లా కులారీఘాట్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 16 మంది మావోయిస్టులు మరణించారు. ఇందులో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, ఏఓబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు చలపతి కూడా ఉన్నట్టు గుర్తించారు. అయితే మృతుల సంఖ్య 25 నుంచి 30 వరకు ఉండవచ్చని భావిస్తున్నారు. మంగళవారం రాత్రి తర్వాత కూడా ఎదురుకాల్పులు, కూంబింగ్ కొనసాగుతూ ఉండటంతో బుధవారం దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

19వ తేదీ నుంచే కూంబింగ్..

దండకారణ్యంలోని కులారీఘాట్ అటవీ ప్రాంతంలో 60 మందికిపైగా మావోయిస్టులు సమావేశం అయ్యారన్న నిఘా వర్గాల సమాచారంతో బలగాలు రంగంలోకి దిగాయి. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సీఆర్‌పీఎఫ్, కోబ్రా, డిస్ట్రిక్ట్ ఫోర్స్, ఒడిశాకు చెందిన ఎస్‌ఓజీ (స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్) బలగాలు ఈ నెల 19 నుంచి సరిహద్దుల్లో కూంబింగ్ మొదలుపెట్టాయి. ఈ క్రమంలో 20వ తేదీన ఉదయం పోలీసు బలగాలు, మావోయిస్టులు ఎదురుపడటంతో ఎన్‌కౌంటర్ మొదలైంది. తొలిరోజు

మిగతా 12వ పేజీలో ▶



- ప్రపంచ ఆరోగ్య సంస్థకు గుడ్‌బై
- డ్రగ్స్ గ్యాంగ్‌లపై ఉగ్రవాద ముద్ర
- వలస నేరగాళ్లకు మరణ శిక్ష
- 'పారిస్' ఒప్పందం నుంచి వెనక్కి
- మద్దతుదారులకు క్షమాభిక్ష

జన్మతః పౌరసత్వం రద్దు

ట్రంప్ బిగ్ షాక్

అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే సంచలన నిర్ణయాలు

పదుల సంఖ్యలో ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకాలు

- అక్రమ వలసదార్లను బయటకు పంపించాలని స్పష్టీకరణ
- టిక్‌టాక్‌పై నిషేధం 75 రోజులపాటు నిలిపివేత
- మెక్సికో సరిహద్దుల్లో జాతీయ అత్యవసర పరిస్థితి
- క్యాపిటల్ భవనంపై దాడి ఘటనలోని 1,500 మందికి క్షమాభిక్ష
- డొనాల్డ్ ట్రంప్ ఆర్డర్లకు కోర్టుల్లో సవాళ్లు ఎదురయ్యే అవకాశం
- అమలు కావడం కష్టమే అంటున్న న్యాయ నిపుణులు

భారతీయుల్లో భయం.. భయం

ఏమిటీ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్? 6లో

న్యూస్‌రీల్

మా పేర్లు ఎందుకు లేవు?



'మీ కాళ్లు మొక్కుతా.. ఇందిరమ్మ ఇల్లు ఇప్పియ్యండి..', 'లబ్ధిదారుల జాబితా తప్పులతడకలా ఉంది.. మేం ఈ గ్రామసభను బహిష్కరిస్తున్నాం..', 'అర్హుల జాబితాలో మా పేర్లు లేవు..' ఇవీ రాష్ట్రవ్యాప్తంగా రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, తెల్లరేషన్ కార్డుల పథకాల కింద లబ్ధిదారుల జాబితాల ప్రకటన.. అభ్యంతరాల స్వీకరణ కోసం మంగళవారం నిర్వహించిన గ్రామసభల్లో వ్యక్తమైన స్పందనలు.. పలుచోట్ల తమ పేర్లు అర్హుల జాబితాలో లేకపోవడంపై ప్రజలు అధికారులను నిలదీశారు.

- వివరాలు 12లో ▶

నేటి నుంచి జేఈఈ మెయిన్ పరీక్షలు



జాతీయ ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ–మెయిన్ పరీక్షలు మొదటి దఫా బుధవారం ప్రారంభం అవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు రెండు లక్షల మంది ఈ పరీక్షలకు హాజరు కానున్నారు. తెలంగాణలో 10 పట్టణాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసిన అధికారులు.. అన్నిచోట్లా ఏర్పాట్లు పూర్తి చేశారు.

- వివరాలు 2లో ▶

బీటెక్ జోరు.. ఎంటెక్ బేజారు!



దేశవ్యాప్తంగా బీటెక్‌కు ఆదరణ పెరుగుతుంటే, మరోవైపు ఎంటెక్‌లో ప్రవేశాలు గణనీయంగా తగ్గుతున్నాయి. బీటెక్ చేసిన వారిలో కనీసం 10% కూడా ఎంటెక్ వైపు వెళ్లడం లేదని ఏఐసీటీఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది.

- వివరాలు 2లో ▶

ఇదండీ జగత్



మీరు ఎంత త్వరగా ఇక్కడి నుండి వెళితే అంత మంచిది.. లేకుంటే మాజీ సీఎం అయ్యే ప్రమాదముంది సార్!

రూ.15 వేల కోట్ల పెట్టుబడులు

ప్రభుత్వంతో మేఘా ఇంజనీరింగ్ మూడు కీలక ఒప్పందాలు

- 2160 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు, వేయి మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, వెల్నెస్ రిసార్ట్ ఏర్పాటుకు అంగీకారం
- 'స్కై రూట్' పెట్టుబడులు 500 కోట్లు.. సీఎం రేవంత్ సమక్షంలో ఒప్పందం
- రాకెట్ తయారీ,ఇంటిగ్రేషన్ టెస్టింగ్ యూనిట్ ఏర్పాటుకు సంసిద్ధత
- రాష్ట్రంలో పెట్టుబడులకు యూనిలీవర్ ఆసక్తి
- కామారెడ్డి జిల్లాలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు ఓకే



స్కై రూట్ కో ఫౌండర్ పవన్ కుమార్‌ను సత్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, జయేశ్‌రంజన్

సాక్షి, హైదరాబాద్: మేఘా ఇంజనీరింగ్ ఇండస్ట్రీస్‌తో రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల పెట్టుబడులు, వేలాది ఉద్యోగాల కల్పనకు సంబంధించి మూడు కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో జరుగుతున్న సమావేశాల్లో ఈ ఒప్పందాలు కుదిరాయి. రూ.11 వేల కోట్లతో 2160 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును తెలంగాణలో మేఘా సంస్థ ఏర్పాటు చేయనుంది. తద్వారా నిర్మాణ దశలో వేయి, నిర్వహణ దశలో 250 ఉద్యోగాల

మిగతా 2వ పేజీలో ▶

మళ్లీ త్రిసభ్య కమిటీకే..



కృష్ణా జలాల తాత్కాలిక పంపిణీ బాధ్యత అప్పగింత

- '66:34' కేటాయింపులను వ్యతిరేకించిన తెలంగాణ
- ఏపీ ఈ ఏడాది ఇప్పటికే 76% నీళ్లు వాడిందని అభ్యంతరం
- వాడీవేడిగా కృష్ణా బోర్డు భేటీ

సాక్షి, హైదరాబాద్: కృష్ణా జలాల తాత్కాలిక సర్దుబాటు బాధ్యతను మళ్లీ త్రిసభ్య కమిటీకే అప్పగిస్తూ కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) నిర్ణయం తీసుకుంది. దీనికి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు అంగీకరించాయి. మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో బోర్డు చైర్మన్ అతుల్‌జైన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ తరఫున నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా, ఈఎన్‌సీ జి.అనిల్‌కుమార్, అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం ఎస్‌ఈ విజయ్‌కుమార్, ఏపీ జలవనరుల శాఖ ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, బోర్డు

మిగతా 3వ పేజీలో ▶

నిర్మాతల ఇళ్లలో ఐటీ సోదాలు



దిల్ రాజు నివాసం వద్ద..

- దిల్ రాజు, పుష్ప–2 నిర్మాతలు నవీన్, యలమంచిలి రవిశంకర్, మరికొందరి ఇళ్లలో తనిఖీలు
- ఏకకాలంలో 8 చోట్ల 55 బృందాలతో సోదాలు
- భారీ బడ్జెట్ సినిమాలకు సొమ్ము సమకూర్చే ఫైనాన్షియర్లపైనా దాడులు
- బ్యాంక్ ఖాతా, లాకర్ల వివరాలు అధికారులకు ఇచ్చామన్న దిల్ రాజు భార్య వైగారెడ్డి

- వివరాలు 3లో ▶

బీటెక్ జోరు.. ఎంటెక్ బేజారు!



రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా ఇదే తీరు

ఎంటెక్ చేసినా పెద్దగా ప్రయోజనం ఉండటం లేదనే భావన

నైపుణ్యంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌కే ఐటీ కంపెనీల ప్రాధాన్యం

ఏడేళ్లలో దేశవ్యాప్తంగా 25 వేల వరకు తగ్గిన ఎంటెక్ ప్రవేశాలు

సత్వర ఉపాధి, ఎమ్మెస్ లక్ష్యం.. గణనీయంగా పెరుగుతున్న బీటెక్ అడ్మిషన్లు

గ్రాడ్యుయేషన్ తర్వాత మాస్టర్స్ వైపు మొగ్గు చూపని విద్యార్థులు

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా బీటెక్‌కు ఆదరణ పెరుగుతుంటే, మరోవైపు ఎంటెక్‌లో మాత్రం ప్రవేశాలు గణనీయంగా తగ్గుతున్నాయి. సత్వర ఉపాధి, వీలైతే అమెరికా లాంటి దేశాల్లో ఎమ్మెస్ లక్ష్యంతో బీటెక్‌లో చేరుతున్న విద్యార్థులు.. పై చదువు విషయంలో నిరాసక్తత ప్రదర్శిస్తున్నారు. దానివల్ల ఎలాంటి ప్రయోజనం లేదన్న ధోరణితో పాటు, పలు మాస్టర్ డిగ్రీ కాలేజీల్లో అవసరమైన మౌలిక వసతులు, సరైన బోధన సిబ్బంది ఉండక పోవడం కూడా ఇందుకు కారణమవుతోందని నిపుణులు చెబుతున్నారు. అలాగే ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ చేయాలన్నా ఎంటెక్‌తో పనిలేకపోవడం కూడా ప్రవేశాలు తగ్గడానికి మరో కారణమని విశ్లేషిస్తున్నారు. మరోవైపు సాఫ్ట్‌వేర్ కంపెనీలు కూడా ఎంటెక్‌కు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వడం లేదు. దీనివల్ల విద్యార్థుల్లో అదనంగా ఉండే నైపుణ్యం కూడా అంతగా ఏమీ ఉండదని సంస్థలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే సాంకేతిక విద్యలో గ్రాడ్యుయేషన్ తర్వాత యువత ఉపాధి వైపు మళ్లిపోతున్నారు. అనేకమంది ఎంఎస్ కోసం విదేశాలకు వెళ్తున్నారు. బీటెక్ చేసిన వారిలో కనీసం 10 శాతం కూడా ఎంటెక్ వైపు వెళ్లడం లేదని ఏఐసీటీఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఏదీ కుదరని పక్షంలో ఎంటెక్‌లో చేరే విద్యార్థులు అత్యాధునిక సాంకేతిక కోర్సుల వైపు మొగ్గు చూపుతున్నారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది.

తగ్గిన సీట్లు.. ప్రవేశాలు

అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) ఎంటెక్ ప్రవేశాలపై ఇటీవల పూర్తిస్థాయి సమాచారం వెల్లడించింది. ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశాలు ఏడేళ్ల కనిష్టానికి పతనమైనట్టు పేర్కొంది. ఏడేళ్ల క్రితం దేశవ్యాప్తంగా ఎంటెక్ కోర్సుల్లో 68,677 మంది చేరితే, గత మూడు విద్యా సంవత్సరాల్లోనూ ఈ సంఖ్య దాదాపుగా 45 వేలు మాత్రమే కావడం గమనార్హం. ఈ మేరకు అందుబాటులో ఉన్న ఎంటెక్ సీట్ల సంఖ్య కూడా క్రమంగా తగ్గుతూ వస్తోంది. 2017–18లో దేశవ్యాప్తంగా 1.85 లక్షల సీట్లు ఉంటే, 2024–25 నాటికి 1.24 లక్షలకు తగ్గాయి. ఇక రాష్ట్రంలో 2019–20 విద్యా సంవత్సరంలో 12,892 మంది ఎంటెక్‌లో చేరితే 2023–24 నాటికి ఆ సంఖ్య ఏకంగా 5,271కి దిగజారిపోవడం గమనార్హం.

బీటెక్‌లో భిన్న పరిస్థితి

బీటెక్ విషయంలో దేశవ్యాప్తంగా ఎంటెక్‌కు భిన్నమైన పరిస్థితి కన్పిస్తోంది. 2017–18లో 14.75 లక్షల సీట్లుంటే, 7.50 లక్షల మంది విద్యార్థులు చేరారు. 2023–24లో సీట్ల సంఖ్య 13.49 లక్షలకు తగ్గినా..విద్యార్థుల చేరిక మాత్రం గణనీయంగా పెరిగి 11.21 లక్షలకు చేరింది. దాదాపు 58% విద్యార్థులు కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్ వంటి కోర్సుల్లోనే చేరుతున్నారు. గ్రాడ్యుయేషన్ తర్వాత సత్వర ఉపాధి, విదేశాల్లో ఎమ్మెస్ తదితర కారణాలతోనే బీటెక్‌లో ప్రవేశాలు పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు.

ఎంటెక్‌తోనూ మంచి భవిష్యత్తు

వాస్తవానికి ఎంటెక్‌లో కొన్ని బ్రాంచీలకు భవిష్యత్తులో మంచి డిమాండ్ ఉంటుందని నిపుణులు అంటున్నారు. ఎంటెక్ కంప్యూటర్ సైన్స్, సంబంధిత కొత్త బ్రాంచీల్లో ఉత్తీర్ణులైన వారికి ఇంజనీరింగ్ కాలేజీల్లో బోధించే అర్హత లభిస్తుంది. బీటెక్‌లో ప్రవేశాలు గణనీయంగా పెరుగుతున్న విషయం విదితమే కాగా అందుకు అనుగుణంగా అధ్యాపకుల అవసరం కూడా ఏర్పడుతోంది. తెలంగాణ వ్యాప్తంగా 1.35 లక్షల బీటెక్ సీట్లున్నాయి. ఇందులో సీఎస్ఈ, ఐటీ, సంబంధిత సీట్లే 68 వేల వరకు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో కంప్యూటర్ సైన్స్ సంబంధిత పాఠ్యాంశాలను బోధించే అధ్యాపకులకు డిమాండ్ పెరుగుతోంది. ఎంటెక్ సీఎస్ఈ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, మెషిన్ లెర్నింగ్, రోబోటిక్స్ లాంటి స్పెషలైజేషన్ ఉంటే మంచి వేతనాలు లభించే అవకాశం కూడా ఉందని నిపుణులు చెబుతున్నారు. ఏఐసీటీఈ లెక్కల ప్రకారం ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడు అవసరం. దీన్నిబట్టి కీలకమైన బ్రాంచీలను పరిగణనలోకి తీసుకున్నా తెలంగాణలోని 68 వేల సీట్లకుగాను 3,400 మంది అధ్యాపకుల అవసరం ఉందని విశ్లేషిస్తున్నారు.

దేశ వ్యాప్తంగా ఎంటెక్ సీట్లు, ప్రవేశాల వివరాలు

సంవత్సరం	సీట్లు	చేరిన విద్యార్థులు
2017-18	1,86,000	69,000
2018-19	1,81,000	67,000
2019-20	1,68,000	63,000
2020-21	1,48,000	63,000
2021-22	1,37,000	54,000
2022-23	1,30,000	44,000
2023-24	1,25,000	45,000
2024-25	1,24,000	44,000

అదనంగా వచ్చేదేమీ ఉండటం లేదు

సీఎస్‌సీ బీటెక్ తర్వాత ఐటీ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఐటీ రంగంలో చేరిన తర్వాత స్వతహాగా పరిజ్ఞానం ఉంటేనే పురోగతి సాధ్యం. ఒకవేళ రెండేళ్ల పాటు ఎంటెక్ చేసి వచ్చినా ప్యాకేజీలో పెద్దగా మార్పు ఉండదు. బీటెక్ ఫ్రెషర్స్‌కు ఇచ్చే వేతనమే అప్పుడూ ఉంటుంది. అలాంటప్పుడు ఎంటెక్ వల్ల ప్రయోజనం ఏమిటి?

– నీలేశ్ పుల్లెల
ఐటీ ఉద్యోగి

అర్హత కాదు.. నైపుణ్యమే ముఖ్యం

ఐటీ రంగంలో ఉన్నతమైన అర్హత కన్నా అభ్యర్థి నైపుణ్యానికి పెద్దపీట ఉంటుంది. బీటెక్ తర్వాత పలు రౌండ్ల ఇంటర్వ్యూల్లో కంపెనీలు విద్యార్థి నైపుణ్యాన్ని అంచనా వేస్తాయి. నైపుణ్యంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పరిగణనలోకి తీసుకుని ఉద్యోగాలిస్తాయి. ఈ కారణంగానే ఎక్కువ మంది బీటెక్ తర్వాత ఐటీ రంగంలోకి వస్తున్నారు.

– రాహుల్ సౌరభ్
ఐటీ కంపెనీ హెచ్‌ఆర్ విభాగం ఉద్యోగి

తెలంగాణ రాష్ట్రంలో ఎంటెక్‌లో ప్రవేశాలు

2019-20 (సంవత్సరం)	2020-21	2021-22	2022-23	2023-24
12,892	7,625	6,063	5,271	5,001

క్లుప్తంగా...

చట్టాలతోనే ప్రజా హక్కులకు రక్షణ

ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్‌లో అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: భారత రాజ్యాంగాన్ని అనుసరించి పార్లమెంట్ రూపొందించిన చట్టాలు దేశంలో ప్రజాస్వామ్య బలోపేతానికి తోడ్పడుతూ దేశ ప్రజల హక్కులకు రక్షణగా నిలుస్తున్నాయని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. బిహార్ రాజధాని పాట్నాలో జరుగుతున్న 85వ ఆల్ ఇండియా ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ (ఏఐపీఓసీ)లో రెండో రోజు మంగళవారం ప్రసాద్ కుమార్ ప్రసంగించారు. రాజ్యాంగ విలువల బలోపేతానికి పార్లమెంటు, రాష్ట్ర శాసనసభల తోడ్పాటు అంశంపై ఆయన మాట్లాడారు. 'వ్యవసాయం, విద్య, వైద్య సేవలు, సామాజిక పథకాలు, మౌలిక వసతుల కల్పన వంటి కీలక అంశాలకు తెలంగాణ శాసనసభ ప్రాముఖ్యత ఇచ్చింది. భూ భారతి, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వంటి చట్టాల రూపకల్పన ద్వారా తెలంగాణ అసెంబ్లీ మెజారిటీ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తోంది. తెలంగాణ శాసనసభ్యులు రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నడుచుకుంటూ రాష్ట్ర ప్రజల సంక్షేమానికి ఉపయోగపడే చట్టాలకు రూపకల్పన చేస్తున్నారు. రైతుల ప్రయోజనాల కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తూ ఎక్కువ నిధులు కేటాయిస్తోంది'అని స్పీకర్ చెప్పారు.

పరిశ్రమల ఖాతాల్లో ప్రోత్సాహక నిధులు

రూ.వెయ్యి కోట్ల బకాయిలు విడుదల

సాక్షి, హైదరాబాద్: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)కు ప్రోత్సాహకాల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. గత ప్రభుత్వం పదేళ్లుగా పరిశ్రమలకు ఇవ్వాల్సిన రూ.4236 కోట్ల ప్రోత్సాహకాలు విడుదల కాకపోవడంతో బకాయిలు పేరుకుపోయాయి. పారిశ్రామికవేత్తల విజ్ఞప్తి మేరకు బకాయిలు దశలవారీగా చెల్లిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. సీఎం హామీ మేరకు రూ.వెయ్యి కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులు మంగళవారం పరిశ్రమల ఖాతాల్లో జమ అయ్యాయి. దీంతో పలువురు పారిశ్రామికవేత్తలు హర్షం వ్యక్తం చేశారు. మూడేళ్లుగా పరిశ్రమలకు రూపాయి ప్రోత్సాహకం అందలేదని, బకాయిలు కూడా చెల్లించి చిన్న పరిశ్రమలను ఆదుకున్నందుకు ఆదిభట్ల ఇండస్ట్రియల్ అసోసియేషన్ (నాదర్‌గుల్) అధ్యక్షుడు సీహెచ్ జలంధర్ రెడ్డి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసులకు ఆరోగ్య భద్రత సేవల పునరుద్ధరణ

సాక్షి, హైదరాబాద్: ఇటీవల పోలీసు సిబ్బందికి నిలిపివేసిన ఆరోగ్య భద్రత సేవల పునరుద్ధరణపై తెలంగాణ పోలీస్ అధికారుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. పోలీసులకు ఆరోగ్య భద్రత సేవలను నిలిపివేయాలని తెలంగాణ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ నిర్ణయించింది. దీంతో ఈనెల 20 నుంచి కొన్ని ఆసుపత్రులు చికిత్సలను నిలిపివేశాయి. ఈ నేపథ్యంలో డీజీపీ జితేందర్.. హాస్పిటల్స్ అసోసియేషన్‌తో సంప్రదింపులు జరిపారు. ఈ మేరకు తిరిగి చికిత్సలు ప్రారంభిస్తున్నట్టు అసోసియేషన్ ప్రకటించింది. నిరంతరం అత్యవసర విధుల్లో ఉండే పోలీసులకు ఆరోగ్యం ముఖ్యమని భావించి చికిత్సల పునరుద్ధరణకు చర్యలు తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం, డీజీపీ జితేందర్, తెలంగాణ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్, సీనియర్ అధికారులు, భద్రత కార్యదర్శి గోపాల్‌రెడ్డిలకు పోలీసు అధికారుల సంఘం తరఫున ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

అనుమతుల్లేకున్నా కిడ్నీలు మార్చేస్తూ..

పొరుగు రాష్ట్రాల యువతులకు డబ్బు ఆశ చూపించి గాలం

- హైదరాబాద్‌లో అవసరమైన వారికి కిడ్నీ మార్పిడి చికిత్సలు
- వైద్యాధికారులు, పోలీసుల తనిఖీలు.. ఎలాంటి అనుమతులు లేవని గుర్తింపు
- పోలీసుల అదుపులో అలకనంద ఆస్పత్రి నిర్వాహకుడు



అలకనంద ఆస్పత్రిని సీజ్ చేస్తున్న వైద్యాధికారులు

చైతన్యపురి (హైదరాబాద్): నగరంలో కిడ్నీ రాకెట్ గుట్టు రట్టయింది. సాధారణ వైద్య చికిత్సలకు (జనరల్) మాత్రమే అనుమతి తీసుకుని ఏకంగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేస్తూ రూ.లక్షల్లో దోపిడీకి పాల్పడుతున్న ఆస్పత్రి నిర్వాకాన్ని వైద్యాధికారులు, పోలీసులు బట్టబయలు చేశారు. ఆస్పత్రి నిర్వాహకుడిని పోలీసులు అరెస్టు చేశారు. డీఎంహెచ్ఓ, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధి డాక్టర్స్ కాలనీలోని అలకనంద ఆస్పత్రిలో అనుమతుల్లేకుండా కిడ్నీల మార్పిడి దందా సాగిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు, ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి మంగళవారం సాయంత్రం ఆస్పత్రిపై దాడి చేశారు. జనరల్, ప్లాస్టిక్ సర్జరీల నిమిత్తం ఆస్పత్రి నిర్వహణకు 6 నెలల అనుమతి తీసుకున్న సుమంత్ అనే వ్యక్తి.. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన అమాయక యువతులకు డబ్బు ఆశ చూపి కిడ్నీలు దానం చేసేందుకు ఒప్పిస్తున్నాడు. హైదరాబాద్‌లో అవసరమైన వారికి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు చేయిస్తున్నాడు. ఇవన్నీ ఎలాంటి అనుమతులు లేకుండానే చేస్తున్నట్లు గుర్తించిన జిల్లా వైద్యాధికారులు.. పోలీసులతో కలిసి ఆస్పత్రిలో తనిఖీలు చేశారు. ఇద్దరు కిడ్నీ దాతలతో పాటు ఇద్దరు కిడ్నీ మార్పిడి చేయించుకున్న రోగులను కనుగొన్నారు. అధికారులు దాడులు చేస్తున్న విషయం తెలుసుకొని వైద్యులు పరారయ్యారు. దీంతో చికిత్స పొందుతున్న నలుగురు బాధితులను అధికారులు అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అలకనంద ఆస్పత్రిని సీజ్ చేశారు. కిడ్నీ మార్పిడి చికిత్స కోసం ఒకొక్కరి నుంచి సుమారు రూ.58 లక్షలు తీసుకున్నట్లు అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. ఎలాంటి అనుమతి లేకుండానే ఇతర రాష్ట్రాల నుంచి వైద్యులను పిలిపించి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేస్తున్నట్లుగా గుర్తించినట్లు డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

కిడ్నీ రాకెట్ ముఠాపై కఠిన చర్యలు: రాజనర్సింహ

అలకనంద ఆసుపత్రి ఉదంతంపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆరా తీశారు. కిడ్నీ మార్పిళ్లకు పాల్పడిన డాక్టర్లు, ఆసుపత్రి యాజమాన్యం, ఇతర బాధ్యులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని చెప్పారు

నేటి నుంచి జేఈఈ మెయిన్ పరీక్షలు

రోజూ రెండు సెషన్లలో నిర్వహణ

- తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు రెండు లక్షల మంది విద్యార్థులు
- ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమన్న ఎన్టీఏ

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ–మెయిన్ పరీక్షలు మొదటి దఫా బుధవారం ప్రారంభం అవుతున్నాయి. దేశవ్యాప్తంగా సుమారు 12 లక్షల మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయడానికి దరఖాస్తు చేసుకున్నారు. అందులో తెలుగు రాష్ట్రాల నుంచి సుమారుగా రెండు లక్షల మంది హాజరుకానున్నారు. తెలంగాణలో 10 పట్టణాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసిన అధికారులు.. అన్నిచోట్లా ఏర్పాట్లు పూర్తి చేశారు. బీఈ, బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈనెల 22, 23, 24 తేదీలతోపాటు 28, 29 తేదీల్లో రోజూ రెండు సెషన్లలో పరీక్ష నిర్వహించనున్నారు. బీఆర్క్, బీప్లానింగ్ పరీక్షను ఈ నెల 30న నిర్వహిస్తారు. అభ్యర్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) స్పష్టం చేసింది. మొదటి సెషన్ పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తారు. పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ విధానంలో పరీక్ష ఉంటుంది. విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ తీసుకొని రావడానికి వీల్లేదని ఎన్టీఏ చెప్పింది.

ఆర్టీసీ ప్రైవేటీకరణపై కాంగ్రెస్ రహస్య ఎజెండా: పువ్వాడ

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ ప్రైవేటీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం రహస్య ఎజెండాతో ముందుకెళ్తోందని, ప్రైవేటీకరణ యత్నాలను బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ రాకేశ్ కుమార్‌తో కలిసి పువ్వాడ మంగళవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రజా రవాణా నుంచి తప్పుకోవాలని ప్రభుత్వం చూస్తోందని, ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశం పేరిట రాష్ట్ర డిపోలను ప్రైవేటీకరించడానికి ప్రభుత్వం నిర్ణయించిందని ఆరోపించారు. ఇప్పటికే వరంగల్ డిపోను జేబీఎం అనే సంస్థకు ప్రభుత్వం అప్పజెప్పిందని, సూర్యాపేట, నల్లగొండ, హైదరాబాద్‌లోని పలు డిపోలను కూడా ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించిందని తెలిపారు.

రూ.15 వేల కోట్ల పెట్టుబడులు

▶ మొదటి పేజీ తరువాయి

కల్పన సాధ్యమవుతుంది. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వ్యవస్థకు సంబంధించిన ప్రాజెక్టులనూ ఈ సంస్థ స్థాపిస్తుంది. తద్వారా పునరుత్పాదక ఇంధనం, సుస్థిర అభివృద్ధిలో రాష్ట్రం అగ్రస్థానం చేరేందుకు తోడ్పడుతుంది. ఒప్పందంలో భాగంగా వ్యూహాత్మక ప్రదేశాల్లో రూ.3 వేల కోట్లతో వేయి మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వ్యవస్థను స్థాపిస్తుంది. తద్వారా వచ్చే రెండేళ్లలో ప్రత్యక్షంగా వేయి, పరోక్షంగా మూడు వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధికి బాటలు వేసేలా వికారాబాద్ జిల్లా అనంతగిరిలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో రూ.వేయికోట్లతో వెల్నెస్ రిసార్ట్‌ను మేఘా సంస్థ నెలకొల్పుతుంది. తద్వారా నిర్మాణ దశలో 2వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. వరల్డ్ ఎకనమిక్ ఫోరం సమావేశాల్లో భాగంగా రెండోరోజు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం వివిధ కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో సమావేశమైంది. మేఘాతో ఒప్పందాలపై మంత్రి శ్రీధర్ బాబు హర్షం వ్యక్తంచేశారు.



మేఘా అధినేత కృష్ణారెడ్డితో మంత్రి శ్రీధర్‌బాబు, జయేశ్‌రంజన్

'స్కై రూట్' పెట్టుబడులు రూ.500 కోట్లు

హైదరాబాద్‌ను త్వరలోనే ప్రైవేటు రంగంలో అంతరిక్ష కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణలో ప్రైవేటు రంగంలో రూ.500 కోట్లతో రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్ టెస్టింగ్ యూనిట్ ఏర్పాటుకు స్కై రూట్ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. దావోస్‌లో ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో కంపెనీ ప్రతినిధులు అవగాహన ఒప్పందం (ఎంఓయూ)పై సంతకాలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ఒప్పందం పట్ల హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌కు చెందిన సంస్థ ఆధునిక సాంకేతిక రంగంలో విజయం సాధించటం గర్వంగా ఉందన్నారు. తెలంగాణకు చెందిన యువకులు ప్రపంచంలోనే అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించడంతోపాటు, రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు రావడాన్ని అభినందించారు. స్కైరూట్ కంపెనీతో ఒప్పందం చేసుకోవడం అంతరిక్ష రంగంపై తమ వ్యూహాత్మక దృష్టిని చాటిచెబుతుందని సీఎం అన్నారు. తెలంగాణ, హైదరాబాద్ రైజింగ్ లక్ష్యసాధనలో తాము భాగస్వామ్యం వహిస్తామని స్కైరూట్ కో ఫౌండర్ పవన్ కుమార్ చందన అన్నారు.

వివిధ సంస్థలతో సంప్రదింపులు

కాలిఫోర్నియాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఏఐ హార్డ్‌వేర్, ఏఐ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో పేరొందిన 'సాంబనోవా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ'చీఫ్ గ్రోత్ ఆఫీసర్ సూలేతో ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు బృందం చర్చించింది. తెలంగాణలో సెమీకండక్టర్ పరిశ్రమల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై వివరించింది. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ తెలంగాణ పెవిలియన్‌లో జరిగిన సమావేశంలో శ్రీధర్ బాబు లాజిస్టిక్స్ కంపెనీల్లో పేరొందిన ఎజిలిటీ సంస్థ చైర్మన్ తారెక్ సుల్తాన్‌ను కలిశారు. వ్యవసాయ రంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించటంతో పాటు రైతుల ఆదాయాన్ని స్థిరంగా పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతలను మంత్రి శ్రీధర్ బాబు వివరించారు.

ఇండస్ట్రీస్ ఇన్ ఇంటెలిజెంట్ ఏజ్

దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సమావేశాలు 'ఇండస్ట్రీస్ ఇన్ ఇంటెలిజెంట్ ఏజ్'అనే థీమ్‌తో ప్రారంభమయ్యాయి. శాస్త్ర సాంకేతిక అధునాతన పరిజ్ఞానానికి అనుగుణంగా పారిశ్రామిక వ్యూహాల మార్పు, పెరుగుతున్న ఇంధన అవసరాలు సమకూర్చుకోవాలనే ఇతివృత్తంతో రౌండ్ టేబుల్ సమావేశాలు, సెమినార్లు నిర్వహిస్తున్నారు. వివిధ దేశాలు, రాష్ట్రాల ప్రతినిధులతోపాటు ఆయా రంగాలకు చెందిన నిపుణులు, పారిశ్రామికవేత్తలు దాదాపు మూడు వేలమంది ఈ సదస్సులో పాల్గొంటున్నారు. దావోస్ పర్యటనలో భాగంగా అమెజాన్, సిఫీ టెక్నాలజీస్ కంపెనీల ప్రతినిధులతో రాష్ట్ర బృందం చర్చలు జరపనుంది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) సారథ్యంలో వివిధ కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో సీఎం రేవంత్ భేటీ అవుతారు.

యూనిలీవర్‌తో ఒప్పందం

దావోస్ పర్యటనలో భాగంగా దిగ్గజ కంపెనీ యూనిలీవర్ సంస్థ సీఈఓ హీన్ షూమేకర్, చీఫ్ సప్లై ఆఫీసర్ విల్లెమ్ ఉయిజెన్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు బృందం చర్చలు జరిపింది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, సీఎంఓ ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రమోషన్ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి చర్చల్లో పాల్గొన్నారు. తెలంగాణలో వ్యాపారం, పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వినియోగ వస్తువుల తయారీలో ప్రపంచంలోనే పేరొందిన యూనీలివర్ బృందానికి రేవంత్ వివరించారు. తెలంగాణలో వినియోగ వస్తువులకు భారీ మార్కెట్ ఉందని, తమ ప్రభుత్వం అనుసరిస్తున్న సులభతర వాణిజ్య విధానాలు వ్యాపారాలకు అనువుగా ఉంటాయన్నారు. చర్చలు ఫలప్రదం కావడంతో తెలంగాణలో పెట్టుబడులకు యూనిలీవర్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ ఒప్పందంలో భాగంగా కామారెడ్డి జిల్లాలో పామాయిల్ తయారీ యూనిట్‌తోపాటు రాష్ట్రంలో బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని కంపెనీ ప్రకటించింది. ఈ యూనిట్ ఏర్పాటుతో ఇతర ప్రాంతాల నుంచి బాటిల్ క్యాప్‌ల దిగుమతి చేసుకుంటుండగా ఇకపై స్థానికంగా తయారవుతాయి. కాగా, కామారెడ్డిలో అవసరమైన భూమిని కేటాయిస్తామని సీఎం హామీ ఇచ్చారు.

డిపోల్లో ఎలక్ట్రిక్‌తో పాటు ఇతర బస్సుల నిర్వహణ

ఆర్టీసీ నిర్ణయం.. 'సాక్షి' కథనం నేపథ్యంలో స్పందన



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ డిపోల్లో ఎలక్ట్రిక్ బస్సులతో పాటు కొన్ని ఆర్టీసీ సొంత బస్సులు, ఇప్పటికే తిప్పుతున్న అద్దె బస్సుల నిర్వహణ కూడా కొనసాగించాలని ఆర్టీసీ నిర్ణయించింది. అంటే హైబ్రిడ్ పద్ధతిలో డిపోలను వాడనుంది. ఎలక్ట్రిక్ బస్సులను భారీ సంఖ్యలో సమకూర్చుకుంటున్న నేపథ్యంలో, వాటి సరఫరా సంస్థకు డిపోలను కేటాయించనున్న తీరును వివరిస్తూ 'ప్రైవేటు చేతికి ఆర్టీసీ డిపోలు'శీర్షికతో మంగళవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో సంస్థ వైఖరిపై ఉద్యోగులతో పాటు, ప్రజల్లో కూడా ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో ఆర్టీసీ స్పందించింది. డిపోలను కేవలం ఎలక్ట్రిక్ బస్సులకే పరిమితం చేయకుండా, ఇతర బస్సులకు కూడా ఉపయోగిస్తామని ప్రకటించింది. 'డిపోల నిర్వహణ పూర్తిగా ఆర్టీసీ అధీనంలోనే ఉంటుంది. కార్యకలాపాలన్నీ సంస్థ ఆధ్వర్యంలోనే నడుస్తాయి. ఎలక్ట్రిక్ బస్సులను సరఫరా చేసే సంస్థ డిపో స్థలాన్ని చార్జింగ్, పార్కింగ్ కోసం మాత్రమే వినియోగించుకుంటుంది..'అని స్పష్టం చేసింది. 'గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు (జీసీసీ) పద్ధతిలో నడిచే ఎలక్ట్రిక్ బస్సుల విషయంలో డ్రైవర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం సంస్థలో డ్రైవర్లకు కొరత ఉంది. వివిధ కేటగిరీలకు సంబంధించి 3,038 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఇప్పటికే అనుమతి ఇచ్చింది. ఆ నియామక ప్రక్రియ వివిధ నియామక సంస్థల పరిశీలనలో ఉంది..'అని పేర్కొంది.

ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కు అస్వస్థత

డెహ్రాడూన్ పర్యటనలో గుండెపోటు..
ఆస్పత్రికి తరలింపు.. స్టెంట్ వేసిన వైద్యులు




డెహ్రాడూన్ ఆస్పత్రిలో కోలుకున్న అనంతరం కుమారులు, బీఆర్ఎస్ నాయకులతో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

చిలకలగూడ (హైదరాబాద్): బిజినెస్ పని మీద డెహ్రాడూన్ వెళ్లిన మాజీ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ అస్వస్థతకు గురయ్యారు. ఛాతీలో నొప్పి రావడంతో ఆయనను ఆస్పత్రికి తరలించగా, వైద్యపరీక్షలు నిర్వహించి స్టెంట్ వేసిన వైద్యులు ప్రాణాపాయం లేదని చెప్పారు. వ్యాపార భాగస్వాములు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే పద్మారావు ఈనెల 18వ తేదీన డెహ్రాడూన్ వెళ్లారు. ఆదివారం ఉదయం ఛాతీలో నొప్పి రావడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు రక్తనాళంలో బ్లాక్ ఉన్నట్లు గుర్తించి స్టెంట్ వేశారు. సమాచారం అందుకున్న పద్మారావు కుటుంబసభ్యులు, పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆదివారం సాయంత్రానికి డెహ్రాడూన్ చేరుకున్నారు. కాగా, పద్మారావుగౌడ్ అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికార ప్రతినిధులు డెహ్రాడూన్‌లో ఉన్న ఆయన కుమారులకు ఫోన్ చేసి పద్మారావు ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. కాగా, ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన పద్మారావుగౌడ్ మంగళవారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు.

డ్వాక్రా మహిళలకు త్వరలో రెండు చీరలు

95% పనులు సిరిసిల్లలోని పవర్‌లూమ్స్‌కే: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: నేత కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చెప్పారు. త్వరలోనే రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వం తరఫున రెండు చీరలు ఇవ్వబోతున్నామన్నారు. చీరల తయారీ ఆర్డర్‌ను స్థానిక పవర్‌లూమ్స్‌కే ఇవ్వనున్నట్లు వివరించారు. మంగళవారం సీఎల్పీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ తొలిదశలో భాగంగా 4.6 కోట్ల మీటర్ల చీరల తయారీకి ఆర్డర్లు ఇచ్చామని చెప్పారు. అందులో 90 శాతం పనులను సిరిసిల్లలోని 20 వేల పవర్‌లూమ్స్‌కు ఇచ్చామని... దీనివల్ల ఇక్కడి నేత కార్మికులకు 8 నెలలపాటు ఉపాధి దొరుకుతుందన్నారు. కమీషన్లకు కక్కుర్తి పడిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరలను సూరత్ నుంచి కిలోల చొప్పున తెప్పించిందని, ఈ విషయాన్ని స్వయంగా కేటీఆరే అసెంబ్లీ సాక్షిగా ఒప్పుకున్నారని ఆది శ్రీనివాస్ గుర్తుచేశారు. సిరిసిల్ల ప్రజలకు చర్మంతో చెప్పులు కుట్టించినా తప్పు లేదని గప్పాలు కొట్టిన కేటీఆర్... పదేళ్లు మంత్రిగా ఉండి సిరిసిల్ల ప్రాంతానికి నూలు డిపో తేలేకపోయారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ కారణంగా సిరిసిల్లలోని ఒక్క చేనేత కార్మికుడి జీవితం కూడా మార లేదని ఆరోపించారు. తాము ఇప్పుడు వేములవాడలో రూ. 50 కోట్లతో నూలు డిపో ఏర్పాటు చేసి 90 శాతం సబ్సిడీతో కార్మికులకు నూలు సరఫరా చేస్తున్నామని, కేటీఆర్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్పాలని విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు.



2,76,288 ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రోబోటిక్స్ ప్రకారం 2023లో చైనా సంస్థలు ఇన్‌స్టాల్ చేసిన రోబోల సంఖ్య. ఇది ఆ ఏడాది ప్రపంచంలోని మొత్తం రోబోల్లో 51 శాతం

మనతో రోబో రన్!

ప్రపంచంలోనే తొలిసారిగా మనుషులతో కలిసి రోబోల పరుగు

12 వేల మంది అథ్లెట్లతో హాఫ్ మారథాన్‌లో పాల్గొననున్న డజన్లకొద్దీ రోబోలు

చైనా రాజధాని బీజింగ్‌లో ఏప్రిల్‌లో జరగనున్న వినూత్న పోటీ

ఎన్నో రంగాల్లో మనిషికి సవాల్ విసురుతున్న మరమనుషులను చైనా.. ప్రపంచంలోనే తొలిసారిగా చరిత్రాత్మక పోటీకి రంగంలోకి దింపుతోంది. అథ్లెట్లు, హ్యూమనాయిడ్ రోబోలకు కలిపి మొట్టమొదటిసారిగా హాఫ్ మారథాన్ (21 కి.మీ.) పరుగు పందెం నిర్వహించనుంది. ఏప్రిల్‌లో జరగనున్న ఈ పోటీకి చైనా రాజధాని బీజింగ్‌లోని డాక్సింగ్ జిల్లా వేదిక కానుంది. ఇందులో డజన్లకొద్దీ హ్యూమనాయిడ్ రోబోలు సుమారు 12 వేల మంది అథ్లెట్లతో పోటీపడనున్నాయి. ఈ రేసులో టాప్‌-3లో నిలిచే రేసర్లకు (అథ్లెట్లు అయినా లేక హ్యూమనాయిడ్ రోబోలైనా) బహుమతులిస్తారని 'సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' తెలిపింది. బీజింగ్ ఆర్థిక–సాంకేతికత అభివృద్ధి ప్రాంతం లేదా ఈ–టౌన్ పరిపాలనా సంఘం ఈ వినూత్న పోటీని నిర్వహించనుంది. 20కన్నా ఎక్కువ రోబో తయారీ సంస్థలు హాఫ్ మారథాన్‌లో పాల్గొననున్నాయి.

స్పెషల్ ఎట్రాక్షన్‌గా 'టియాంగోంగ్'



మారథాన్‌లో పాల్గొనే రోబోలలో చైనాకు చెందిన ఎంబాడీడ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రోబోటిక్స్ ఇన్నోవేషన్ సెంటర్ అభివృద్ధి చేసిన టియాంగోంగ్ హ్యూమనాయిడ్ రోబో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ రోబోకు గంటకు సగటున 10 కి.మీ. వేగంతో పరిగెత్తే సామర్థ్యం ఉందని 'ద డైలీ సీపీఈసీ' పేర్కొంది. గతేడాది బీజింగ్‌లో జరిగిన హాఫ్ మారథాన్‌లో రేసు మొదలైనప్పటి నుంచి చివరిదాకా ఈ రోబో మనుషులతో కలిసి పరుగెత్తింది.

చైనాలో రోబోల అభివృద్ధి ఎందుకంటే..

చైనాలో వృద్ధుల సంఖ్య పెరిగిపోవడంతో శ్రామికశక్తి తగ్గుముఖం పట్టింది. దీంతో దేశం జనాభాపరమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ సమయంలో ఇతర దేశాలతో పోటీపడాలన్నా.. ఆర్థికవృద్ధిని పెంచాలన్నా శ్రామికశక్తి అవసరం. దీనిని భర్తీ చేయడానికి చైనా హ్యూమనాయిడ్ రోబోలకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. చైనా ఆగస్టులో హ్యూమనాయిడ్ రోబోలతో ఫుట్‌బాల్, ట్రాక్ అండ్ ఫీల్డ్ లాంటి పోటీలు నిర్వహించనుంది. – సాక్షి, సెంట్రల్‌డెస్క్

కండిషన్స్ అప్లై..

హాఫ్ మారథాన్‌లో పాల్గొనే రోబోల విషయంలో చైనా కొన్ని షరతులు విధించింది. అవేమిటంటే..

- రోబోలన్నీ మనిషి ఆకృతిలో కనిపించాలి.
- వాకింగ్ లేదా రన్నింగ్ లాంటి కదలికల లక్షణాలు కలిగి ఉండాలి. అంటే వాటికి చక్రాలు ఉండరాదన్నమాట.
- రోబోల కనీస ఎత్తు 1.6 అడుగుల నుంచి గరిష్ఠంగా 6 అడుగుల మధ్య ఉండాలి.
- హిప్‌–టు–ఫుట్ పొడవు అంటే నడుము నుంచి పాదం వరకు 1.47 అడుగుల ఎత్తు ఉండాలి.
- రిమోట్ ద్వారా నియంత్రించే రోబోలు లేదా పూర్తిస్థాయిలో ఆటోమేటిక్ హ్యూమనాయిడ్‌లను పోటీలోకి దింపాలి. అయితే అవసరమైతే పోటీ మధ్య బ్యాటరీలను మార్చుకోవచ్చు.

కాంగ్రెస్ ప్రభుత్వానివి డైవర్షన్ రాజకీయాలు

మాజీ మంత్రి కొప్పుల విమర్శ



సాక్షి, హైదరాబాద్: ప్రజలను వంచిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని, కాలయాపన కోసమే మళ్లీ రేషన్‌కార్డులకు దరఖాస్తులు తీసుకుంటున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజమెత్తారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, పలు కార్పొరేషన్ చైర్మన్లు రవీందర్‌సింగ్, దూదిమెట్ల బాలరాజ్, లోక బాపురెడ్డిలతో కలిసి కొప్పుల మీడియాతో మాట్లాడారు. రేషన్‌కార్డుల కోసం ఎన్నిసార్లు దరఖాస్తులు తీసుకుంటారని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం రేషన్‌కార్డుల సంఖ్య ఎలా తగ్గించాలనే ఆలోచన చేస్తోందని, దరఖాస్తుల కోసం ప్రారంభమైన గ్రామసభల్లో ప్రజల ఆగ్రహం స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో ప్రజలకు చేసింది శూన్యమని పేర్కొన్నారు. రేషన్ కార్డులపై నిబంధనలు సరళతరం చేసి వెంటనే జారీ చేయాలని, బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే రేషన్ కార్డుల ఆదాయ పరిమితి పెంచుతామని హామీ ఇచ్చారు. రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో దళితులకు సరైన ప్రాతినిధ్యంలేదని కొప్పుల విమర్శించారు.

పోడు భూముల్లో 50 వేల సౌర విద్యుత్ పంప్‌సెట్లు

సందీప్‌కుమార్ సుల్తానియా వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో తొలి విడతగా 50 వేల సౌర విద్యుత్ పంప్ సెట్లను ఏర్పాటు చేయనున్నట్లు ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా తెలిపారు. గిరిజనుల పోడు భూముల్లో మొత్తం 2.5 లక్షల సౌర విద్యుత్ పంప్ సెట్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన సంక్షేమం, అటవీ, ఇంధన శాఖల అధికారులతో మంగళవారం సచివాలయంలో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సందీప్‌కుమార్ సుల్తానియా మాట్లాడుతూ.. పీఎం కుసుమ్ పథకం కింద రాష్ట్రానికి లక్ష సౌర పంప్‌సెట్లను మంజూరు చేయాలని కేంద్ర పునరుత్పాదక ఇంధనశాఖకు లేఖ రాశామన్నారు.

తెలుగు సినీ నిర్మాతల ఇళ్లలో ఐటీ సోదాలు

- దిల్‌రాజు, పుష్ప–2 నిర్మాతలు నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, మరికొందరి ఇళ్లలో తనిఖీలు
- ఏకకాలంలో ఎనిమిది చోట్ల 55 బృందాలతో సోదాలు చేసిన అధికారులు
- భారీ బడ్జెట్ సినిమాలకు సొమ్ము సమకూర్చే ఫైనాన్షియర్లపైనా దాడులు
- పలు పత్రాలు, బ్యాంకు స్టేట్‌మెంట్లను స్వాధీనం చేసుకున్న ఐటీ అధికారులు
- బ్యాంక్ ఖాతా, లాకర్ల వివరాలు అధికారులకు ఇచ్చామన్న దిల్‌రాజు భార్య వైగారెడ్డి



సోదాలు ముగిసిన అనంతరం తన నివాసం వద్ద దిల్‌రాజు

సాక్షి, హైదరాబాద్: తెలుగు సినీ నిర్మాతల నివాసాలు, కార్యాలయాల్లో ఆదాయ పన్నుశాఖ అధికారులు మంగళవారం సోదాలు నిర్వహించారు. తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) చైర్మన్, నిర్మాత దిల్‌రాజు ఇల్లు, కార్యాలయాలతోపాటు.. పుష్ప–2 చిత్ర నిర్మాతలు నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నివాసాల్లో, మైత్రీ మూవీస్ సంస్థ కార్యాలయాల్లోనూ తనిఖీలు చేపట్టారు. ప్రముఖ గాయని సునీత భర్త రామ్‌కు చెందిన మ్యాంగో మీడియా సంస్థలోనూ ఐటీ సోదాలు కొనసాగినట్టు తెలిసింది. అంతేకాదు భారీ బడ్జెట్ సినిమాలకు ఫైనాన్స్ చేసే సత్య రంగయ్య, అభిషేక్ అగర్వాల్‌ల ఇళ్లలోనూ సోదాలు చేశారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, గచ్చిబౌలి సహా నగరంలోని ఎనిమిది చోట్ల 55 బృందాలతో తనిఖీలు నిర్వహించినట్టు సమాచారం.

సినిమాల ఆదాయం లెక్కలపై ఫోకస్

ఇటీవల విడుదలైన గేమ్ ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలను దిల్‌రాజు నిర్మించారు. భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమాలకు అయిన ఖర్చు, వచ్చిన వసూళ్లు తదితర అంశాలపై ఐటీ అధికారులు ప్రధానంగా ఫోకస్ పెట్టినట్టు తెలిసింది. దిల్‌రాజు ఇంటితోపాటు ఆయన సోదరుడు శిరీశ్, కుమార్తె హన్సితరెడ్డి నివాసాల్లోనూ ఐటీ సోదాలు కొనసాగాయి. ఈ సందర్భంగా పలు కీలక పత్రాలను, ఐటీ చెల్లింపులకు సంబంధించిన పత్రాలు, బ్యాంకు స్టేట్‌మెంట్లను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఇక పుష్ప–2 సినిమా నిర్మించిన మైత్రీ మూవీ మేకర్స్ సంస్థకు చెందిన మైత్రీ నవీన్, యలమంచిలి రవిశంకర్, సీఈఓ చెర్రీ, మైత్రి సంస్థ భాగస్వాముల ఇళ్లలోనూ ఐటీ అధికారుల సోదాలు కొనసాగాయి. పుష్ప–2 సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.1,800 కోట్లకుపైగా కలెక్షన్లు రాబట్టినట్టు వార్తలు వచ్చిన నేపథ్యంలో.. ఐటీ చెల్లింపులకు సంబంధించి అధికారులు పలు ఆధారాలు సేకరించినట్టు తెలిసింది.

అడిగిన వివరాలన్నీ ఇచ్చాం: దిల్‌రాజు భార్య వైగారెడ్డి

తనిఖీల్లో భాగంగా ఐటీ అధికారులు దిల్‌రాజు సతీమణి వైగారెడ్డిని తమ కారులో తీసుకెళ్లారు. దిల్‌రాజు, ఇతర కుటుంబ సభ్యులకు చెందిన బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకున్నారు. బ్యాంకు లాకర్లను పరిశీలించిన అనంతరం ఆమెను తిరిగి అదే వాహనంలో ఇంటివద్దకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఐటీ సోదాలపై వైగారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇవి సాధారణంగా జరిగే సోదాలు మాత్రమేనని చెప్పారు. బ్యాంకు ఖాతాల వివరాలు కావాలని అధికారులు అడిగారని, అవి ఇచ్చామని, బ్యాంకు లాకర్లు తెరిచి చూపించామని తెలిపారు.

నారీ'శక్తి' వెలుగులిక!

- త్వరలో మహిళా సంఘాలకు 'సౌర విద్యుదుత్పత్తి ప్లాంట్ల స్థాపన బాధ్యత
- 64 మెగావాట్ల విద్యుదుత్పత్తి లక్ష్యం
- మొత్తం రూ.192 కోట్ల పెట్టుబడి
- ఒకటి, రెండు రోజుల్లో వర్క్ ఆర్డర్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మహిళా సంఘాలకు.. సౌర విద్యుత్ ప్లాంట్ల స్థాపన బాధ్యతలు అప్పగించేందుకు రంగం సిద్ధమైంది. ప్రతి జిల్లాలో రెండు మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తి బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించనున్నారు. దీనికి సంబంధించిన వర్క్ ఆర్డర్లను ఒకటి, రెండురోజుల్లోనే అందించనున్నట్టు ప్రభుత్వ వర్గాల సమాచారం. సచివాలయంలో మంగళవారం జరిగిన పీఆర్ ఆర్డీ, ఆర్థిక శాఖ అధికారుల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు అనుగుణంగా.. రాష్ట్రంలోని 32 జిల్లాల్లో (హైదరాబాద్ మినహాయించి) 64 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ఇందుకోసం బ్యాంకర్లతో చర్చలు పూర్తయి, ఒప్పందాలు, రుణాలు అందించే ప్రక్రియకు మరికొంత సమయం పట్టే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో యుద్ధప్రాతిపదికన పైలెట్ ప్రాజెక్టు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం. ఈ విషయంలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ప్రతి జిల్లాలో రెండు మెగావాట్ల విద్యుదుత్పత్తికి ప్రణాళిక సిద్ధం చేయనున్నారు. ఒక్కొక్క మెగావాట్ ఉత్పత్తికి రూ.3 కోట్ల వ్యయం కానుండగా.. దీనికి సంబంధించి ఇంకా బ్యాంకర్లతో ఒప్పందాలు, విధి విధానాలు పూర్తి కావలసి ఉంది. మహిళా సంఘాల ద్వారా సౌర విద్యుదుత్పత్తిలో ఆలస్యం లేకుండా పీఆర్ ఆర్ డీ శాఖ చర్యలు చేపడుతోంది.

రుణాలు సమకూర్చనున్న 'స్త్రీనిధి'

మొత్తంగా 64 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అవసరమైన రుణాలను స్త్రీనిధి సంస్థ సమకూర్చనుంది. ఈ ప్రాజెక్ట్ కోసం మొత్తం రూ.192 కోట్ల పెట్టుబడి అవసరం కాగా, 10 శాతం అంటే రూ.30 కోట్లు.. విలేజ్ ఆర్గనైజేషన్లు అందించనున్నాయి. స్త్రీనిధి ద్వారా మిగిలిన రూ.162 కోట్లను ప్రభుత్వం సమకూర్చనుంది. మార్చి 8నాటికి బ్యాంకర్లతో రుణాలిప్పించి.. వెయ్యి మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తి చేసేలా చర్యలు చేపట్టాలని భావిస్తున్నట్టు ప్రభుత్వ వర్గాల సమాచారం.

మళ్లీ త్రిసభ్య కమిటీకే..

▶ మొదటి పేజీ తరువాయి

సభ్యకార్యదర్శి డీఎం రాయ్‌పురే పాల్గొన్నారు. కృష్ణా జలాల్లో ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీల వాటా ఉండగా, 66:34 నిష్పత్తిలో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలను తాత్కాలిక సర్దుబాటు పేరుతో 2015 జూన్‌లో కేంద్ర జలశక్తి శాఖ జరిపిన కేటాయింపులను ఇకపై కొనసాగించడానికి అంగీకరించమని రాహుల్ బొజ్జా తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే త్రిసభ్య కమిటీ ఈసారి తెలంగాణకు కొంత వరకు కేటాయింపులు పెంచుతుందని బోర్డు చైర్మన్ హామీ ఇచ్చారని రాహుల్ బొజ్జా తెలిపారు. సమావేశానంతరం ఈఎన్‌సీ జి.అనిల్‌కుమార్‌తో కలిసి ఆయన మీడియాకు ఆ వివరాలు వెల్లడించారు. కృష్ణానది 71 శాతం తెలంగాణలో విస్తరించి ఉన్న నేపథ్యంలో రాష్ట్రానికి 71 శాతం, ఏపీకి 29 శాతం జలాలను కేటాయించాలని తాము కృష్ణా ట్రిబ్యునల్‌–2లో వాదనలు వినిపించిన అంశాన్ని బోర్డుకు వివరించామన్నారు. ట్రిబ్యునల్ నిర్ణయం వచ్చే వరకు 50:50 నిష్పత్తిలో తాత్కాలిక పంపిణీ జరపాలని డిమాండ్ చేశామని చెప్పారు. ఏపీ కొత్తగా ప్రతిపాదించిన గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు వివరాలను అందించాలని కేఆర్‌ఎంబీ, జీఆర్‌ఎంబీలకు కోరామన్నారు.

ప్రతి చుక్కను లెక్కించాల్సిందే..

పోతిరెడ్డిపాడు ద్వారా కృష్ణా జలాలను ఇతర బేసిన్లకు తరలించడాన్ని అడ్డుకోవాలని బోర్డును కోరామని రాహుల్‌బొజ్జా తెలిపారు. చెన్నైకి తాగునీరు మాత్రమే సరఫరా చేయాలని, సాగునీటి అవసరాలకు తరలించడం అక్రమమని వాదించామన్నారు. ఏటా 200 టీఎంసీలకు పైగా కృష్ణా జలాలను ఏపీ బేసిన్ వెలుపలి ప్రాంతాలకు తరలిస్తోందని అభ్యంతరం తెలిపారు. పోతిరెడ్డిపాడు, బనకచర్లతోపాటు ఏపీలోని మొత్తం 11 అవుట్ లెట్ల ద్వారా తరలిస్తున్న ప్రతీ చుక్కను పక్కాగా లెక్కించడానికి 11 టెలీమెట్రీ స్టేషన్లు ఏర్పాటు చేయాలని కోరామని రాహుల్ బొజ్జా తెలిపారు. పాలమూరు–రంగారెడ్డి, డిండి వంటి అనుమతి లేని ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరం వ్యక్తం చేయగా, ప్రస్తుతం వీటికి నీటి కేటాయింపులు ట్రిబ్యునల్ పరిధిలో ఉందని బదులిచ్చామన్నారు. తెలంగాణలోని ప్రాజెక్టులకు అవసరమైన నీళ్లను కేటాయించుకునే హక్కు తమకు ఉంటుందన్నారు.

సాగర్‌పై సీఆర్‌పీఎఫ్ బలగాల ఉపసంహరణ

నాగార్జునసాగర్ ప్రాజెక్టుపై ఉన్న సీఆర్‌పీఎఫ్ బలగాలను ఉపసంహరించాలని తాము కోరగా, ఏపీ సైతం అంగీకరించిందని రాహుల్‌బొజ్జా తెలిపారు. ఇరు రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని పరిశీలించాక 2 నెలల తర్వాత ఉపసంహరిస్తామని బోర్డు చైర్మన్ హామీ ఇచ్చారన్నారు. కృష్ణా జలాల్లో వాటాలు తేలే వరకు శ్రీశైలం, నాగార్జునసాగర్‌లోని తమ కాంపోనెంట్లతోపాటు హైడల్ పవర్ ప్రాజెక్టులను ఇచ్చే ప్రసక్తే లేదన్నారు.

ప్రమాదంలో శ్రీశైలం జలాశయం



శ్రీశైలం జలాశయ ప్లంజ్‌పూల్ (నీళ్ల స్పిల్‌వే గేట్ల నుంచి దూకి కిందకు పడే ప్రాంతం) వద్ద 300–400 మీటర్ల లోతు వరకు భారీ గుంతలు ఏర్పడ్డాయని తెలంగాణ ఈఎన్‌సీ అనిల్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే మరమ్మతులు చేయాలని ఏపీని కోరామన్నారు. టెలీమెట్రీల ఏర్పాటుకు రూ.6 కోట్లను భరిస్తామని తెలియజేశామన్నారు. ఈ ఏడాది 780 టీఎంసీల కృష్ణా జలాల లభ్యత ఉండగా, ఇప్పటికే ఏపీ 500 టీఎంసీలు(76శాతం) వాడుకోగా, తెలంగాణ కేవలం 180 టీఎంసీలు మాత్రమే వాడిందన్నారు. ఏపీ అధిక వినియోగానికి తగ్గట్టు తెలంగాణకు వాటాలు పెంచాలని కోరామని చెప్పారు.

– తెలంగాణ ఈఎన్‌సీ అనిల్‌కుమార్

బచావత్ కేటాయింపులకు రక్షణ కల్పించాలి

బచావత్ ట్రిబ్యునల్ (కృష్ణా ట్రిబ్యునల్‌–1) కేటాయింపుల ఆధారంగా ఏపీకి 66 శాతం, తెలంగాణకి 34 శాతం కృష్ణా జలాలను పంపిణీ చేయాలని కోరామని ఏపీ ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. కృష్ణా ట్రిబ్యునల్‌–2లో వాటాలు తేలే వరకు ఈ మేరకు కేటాయింపులను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ట్రిబ్యునల్ నిర్ణయం వచ్చేవరకు త్రిసభ్య కమిటీ పరస్పర అంగీకారంతో నీళ్లను పంచుకుంటామన్నారు. టెలీమెట్రీల ఏర్పాటుపై తమ ప్రభుత్వం చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. శ్రీశైలం జలాశయ ప్లంజ్‌పూల్‌కు మరమ్మతుల కోసం సీఎస్‌ఎంఆర్‌ఎస్‌ఈతో అధ్యయనం చేయిస్తున్నామని, కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) అధికారులతో చర్చించి మరమ్మతులపై నిర్ణయం తీసుకుంటామన్నారు. కృష్ణా బోర్డు కార్యాలయాన్ని ఏపీకి తరలించాలని డిమాండ్ చేశారు.

– ఏపీ ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వర్లు

అదో లొట్టపీసు కమిటీ

కాంగ్రెస్ నేతలు ఎం.కోదండరెడ్డి, అన్వేశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు జరుగుతున్నాయంటూ బీఆర్‌ఎస్ ఏర్పాటు చేసిన అధ్యయన కమిటీ లొట్టపీసు కమిటీ అని, అదో జోకర్ల కమిటీ అని కాంగ్రెస్ పార్టీ ఎద్దేవా చేసింది. ఈ కమిటీలో ఉన్న సత్యవతి రాథోడ్, జోగు రామన్న ఏనాడైనా రైతులను పట్టించుకున్నారా? వారికి రైతు సమస్యలపై అవగాహన ఉందా? అని రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేశ్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశంలో వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు, వ్యవసాయ సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డిలతో కలిసి వారు మాట్లాడారు. రైతుల ఆత్మహత్యలపై కేటీఆర్, హరీశ్‌రావు మొసలికన్నీరు కారుస్తున్నారన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, అలాంటి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలను మానుకోవాలని కోదండరెడ్డి, అన్వేశ్‌రెడ్డి హితవు పలికారు.

ఆగ్రోస్ భూములను పరిరక్షిస్తాం

ఆగ్రోస్ చైర్మన్ బాలరాజు, ఎండీ రాములు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఆగ్రోస్ సంస్థ భూములను పరిరక్షించేందుకు అవసరమైన ప్రణాళిక రూపొందించినట్లు ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు, ఎండీ రాములు తెలిపారు. ఆగ్రోస్ భూములు అన్యాక్రాంతం అయ్యాయనే ప్రచారం అవాస్తవమని స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లోని ఆగ్రోస్ భూములను పరిశీలించి వచ్చిన అధికారులు మంగళవారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆగ్రోస్‌కు రాష్ట్రవ్యాప్తంగా 590 ఎకరాల భూమి ఉందన్నారు. మౌలాలీలో 3 ఎకరాలు కబ్జా కాగా, ఇది ఉమ్మడి రాష్ట్రంలోనే ఆక్రమణకు గురైందని చెప్పారు. దీనిపై ఇప్పటికే హైడ్రాకు ఫిర్యాదు చేశామని వెల్లడించారు.



ప్రతిదీ మంచి హృదయంతో చేయండి.
ప్రతిఫలంగా ఏమీ ఆశించకండి.
మీకు నిరాశ అనేది ఉండదు.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 22 జనవరి 2025

భవిష్యత్తు బంగారమేనా?

అనుకున్నదే అయింది. అమెరికా నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తూనే డొనాల్డ్ ట్రంప్ తన మాటలు, చేతలు, చేష్టల ద్వారా సంచలనాలు సృష్టించారు. గతంలో దేశానికి 45వ అధ్యక్షుడిగా పనిచేసి, తాజాగా 47వ అధ్యక్షుడిగా సోమవారం పదవీ ప్రమాణ స్వీకారం చేసిన ట్రంప్ తన తొలి ప్రసంగంలోనే 'ఇక నుంచి అమెరికాకు స్వర్ణయుగం' అంటూ అమెరికన్లలో ఆశలు, ఆకాంక్షలు పెంచారు. అయితే, 'అమెరికాను మళ్ళీ ఘనమైన దేశంగా తీర్చిదిద్దాల'ని (మాగా) నినదిస్తూ ఆయన ప్రకటించిన కొన్ని చర్యలు ఆధిపత్య, విస్తరణవాదానికి ప్రతీకగానూ ప్రతిధ్వనించాయి. వర్తమాన ప్రపంచ అధికార క్రమాన్ని మార్చివేసే పలు చర్యలకు నడుం బిగిస్తున్న తీరు, అలాగే కోవిడ్, చైనాలను సాకుగా చూపుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి, అలాగే పర్యావరణ రక్షణపై ప్యారిస్ ఒప్పందం నుంచి పక్కకు తప్పుకుంటున్నట్లు ప్రకటించడం ప్రపంచాన్ని నివ్వెరపరుస్తోంది.

ట్రంప్ పదవీ ప్రమాణ స్వీకారం పైకి సాదాసీదా అధికార మార్పిడిగా అనిపించవచ్చు. రాజకీయ ప్రత్యర్థులు సైతం చిరునవ్వులు చిందిస్తూ సౌహార్దం చూపుకుంటున్నట్టు కనిపించవచ్చు. అంతమాత్రాన అంతా మామూలే అనుకొంటే పొరపాటు. పదవీ ప్రమాణ స్వీకారోత్సవంలో దర్శనమిచ్చిన ఐక్యతకు భిన్నంగా ప్రత్యర్థులపై తుపాకులు ఎక్కుపెట్టిన తీరు ఆయన ప్రసంగంలో స్పష్టంగా వినిపించింది. కునారిల్లిన దేశాన్ని తాను మాత్రమే మళ్ళీ పునరుత్తేజితం చేయగలనన్న భావన కలిగించడంతో పాటు ఆయన ఒకటికి రెండు జాతీయ ఎమర్జెన్సీలు ప్రకటించడం పెను పర్యవసానమే. అలాగే, చైనా నుంచి పనామా కాలువను వెనక్కి తీసుకోవాలని పిలుపునివ్వడమూ వివాదాస్పదమే. బలప్రయోగం ద్వారా మాత్రమే సాధ్యమయ్యే అలాంటి పనుల ప్రస్తావన నిప్పుతో చెలగాటానికి సిద్ధమని స్పష్టం చేయడమే. ఇక, గద్దెనెక్కిన తొలిరోజునే 'గల్ఫ్ ఆఫ్ మెక్సికో'ను 'గల్ఫ్ ఆఫ్ అమెరికా'గా ట్రంప్ ప్రకటించడంతో రానున్న రోజుల్లో అంతర్జాతీయంగా మరెన్ని ఆశ్చర్యకర పరిణామాలు చోటుచేసుకుంటాయనే ఉద్విగ్నత నెలకొంది.

పదవి చేపడుతూనే ట్రంప్ చకచకా సంతకాలు చేసిన పదుల సంఖ్యలోని కార్యనిర్వాహక ఆదేశాలు ఆసక్తికరం. పర్యావరణ పరిరక్షణను గాలికొదిలేయడం, జన్మహక్కుగా సంక్రమించే పౌరసత్వంపై అమెరికా రాజ్యాంగాన్ని సైతం తోసిపుచ్చడం లాంటివి ఇట్టే మింగుడుపడే అంశాలు కావు. జాతీయతతో సంబంధం లేకుండా దేశంలో చట్టవిరుద్ధంగా నివసిస్తున్నవారికి పుట్టినబిడ్డలకు సైతం 150 ఏళ్ళ పైచిలుకుగా అమెరికా పౌరసత్వం దక్కుతూ వచ్చింది. కానీ, నెల రోజుల్లో అమలులోకి రానున్న తాజా ఆదేశం ఫలితంగా ఇప్పుడిక అలాంటి పిల్లలకు పౌరసత్వ పత్రాలివ్వరు. అదేమంటే, 1868లో చేసిన 14వ సవరణ కింద అమెరికా గడ్డపై పుడితేచాలు ఆ పిల్లలకు మారుమాట లేకుండా పౌరసత్వమివ్వాలనేమీ లేదనీ, సవరణను తప్పుగా వ్యాఖ్యానించారనీ ట్రంప్ వాదన. తాత్కాలిక వీసాలతో అమెరికాలో నివసిస్తూ, ఉద్యోగాధారిత గ్రీన్‌కార్డ్‌కై దీర్ఘ కాలంగా నిరీక్షిస్తున్న 10 లక్షల పైచిలుకు మంది భారతీయులకు ఈ కొత్త నిర్ణయం అశనిపాతమే. ఇప్పటికే కొన్నిచోట్ల ఇమ్మిగ్రేషన్ లాయర్లు కోర్టుకెక్కిన ఈ ఆదేశం గనక అమలైతే, తాత్కాలిక వర్క్ వీసాలు, టూరిస్ట్ వీసాలపై అగ్రరాజ్యంలో ఉంటున్నవారి సంతానానికి అక్కడి పౌరసత్వ ఆశలు అడుగంటినట్లే.

2022 నాటి అమెరికా జనాభా లెక్కలపై ప్యూ రిసెర్చ్ విశ్లేషణ ప్రకారం అమెరికాలో 48 లక్షల మంది భారతీయ అమెరికన్లుంటే, వారిలో మూడింట రెండొంతుల మంది వలసజీవులే. కేవలం 34 శాతం, మరో మాటలో 16 లక్షల మంది మాత్రం అగ్రరాజ్యంలోనే పుట్టారు. ఇక, చట్టవిరుద్ధమైన వలసల్ని అడ్డుకుంటాననీ, సరైన పత్రాలు లేని లక్షలాది వలస జీవుల్ని దేశం నుంచి పంపివేస్తాననీ ట్రంప్ చేసిన గర్జన కూడా లక్షలమందికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఆ జాబితాలో మెక్సికో (40 లక్షలు), ఎల్ సాల్వడార్ (7.5 లక్షలు) తర్వాత 7.25 లక్షల మంది భారతీయులదే మూడో స్థానం. ఫలితంగా, ట్రంప్ ప్రతి మాట, ప్రతి అడుగు మనవాళ్ళలో ఆదుర్దా పెంచుతోంది. ఈ పరిస్థితుల్లో ట్రంప్ కొత్త ఏలుబడిలో భారత్‌తో బంధం ఎలా ఉంటుందన్నది ఆసక్తికరం. మరోపక్క డెమోక్రాట్లను జనం బాధలు పట్టని కులీనులుగా చిత్రించి, సామాన్య పౌరుల సంరక్షకుడిగా ఎన్నికల్లో తనను తాను చూపుకొన్న ట్రంప్‌ను అతిగా నమ్మి మోసపోయామనే భావన రేకెత్తడం సహజమే. చేతిలోని నియంత్రణ నిర్ణయాలే అండగా ఇటీవలే ఓ బ్రాండెడ్ క్రిప్టో టోకెన్ ద్వారా ఆయన వందల కోట్ల డాలర్ల లబ్ధి పొందాడనే విమర్శలూ గుప్పుమంటున్నాయి.

రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన 80 ఏళ్ళ తర్వాత కీలక సమయంలో పగ్గాలు చేపట్టిన ట్రంప్ తన మద్దతుదారులకై ఏమైనా చేసేలా ఉన్నారు. 2021లో అమెరికా అధ్యక్ష భవనంపై దాడి చేసిన దాదాపు 1500 మంది దుండగులకూ ఆయన తక్షణం సామూహిక క్షమాభిక్ష ప్రసాదించడమే అందుకు తార్కాణం. నాలుగేళ్ళు విచారించి, శిక్షలు వేసిన న్యాయవ్యవస్థను అలా నూతన అధ్యక్షుడు పరిహసించినట్టయింది. ఆశ్రితులు, ఆర్థిక దాతలు, బంధు మిత్రులకై క్షమాభిక్ష వ్యవస్థను దుర్వినియోగం చేయడంలో నిన్నటి బైడెన్ నుంచి నేటి ట్రంప్ దాకా అందరూ ఒకే తాను గుడ్డలన్న మాట. కాలు మోపిననాడే కాపురం చేసే లక్షణం తెలిసిందన్నట్టు ట్రంప్ 2.0 హయాం ఆరంభమవుతూనే రోజులు ఎలా ఉండనున్నాయో తేటతెల్లమైంది. బహుళ ధ్రువ ప్రపంచం వైపు అంతర్జాతీయ అధికార క్రమం అడుగులేస్తున్న కాలంలో 'అమెరికా ఫస్ట్' నినాదంతో సామాజిక, ఆర్థిక రంగాల్లో ట్రంప్ ఆధిపత్యభావ నిర్ణయాలు రానున్న నాలుగేళ్ళలో ప్రపంచాన్ని కుదిపేయడం ఖాయం.

పనిగంటల్లో మహిళను మరిచారా?

విశ్లేషణ



సుష్మా రామచంద్రన్

వారంలో ఎన్ని గంటలు పనిచేయాలి? ఈ మధ్య కాలంలో దేశం మొత్తమ్మీద విపరీతమైన చర్చ లేవనెత్తిన ప్రశ్న ఇది. ఏడాది క్రితం 'ఇన్ఫోసిస్' వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి దేశం కోసం వారంలో 70 గంటలు పనిచేయాలని సూచించడంతో మొదలైందీ చర్చ. ఇది సద్దుమణిగేలోపు, 'లార్సెన్ అండ్ టూబ్రో' (ఎల్ అండ్ టీ) ఛైర్మన్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్ వారంలో 90 గంటలు పని చేయాలని ఇచ్చిన సలహా మళ్లీ దుమారం రేకెత్తించింది. 'ఆదివారాలు ఎంత సేపని మీ భార్యల ముఖాలు చూస్తూ కూర్చుంటారు, ఆఫీసులకు వచ్చి పనిచేయండి' అని కూడా ఆయన చతుర్లు ఆడారు. ఈ సరదా వ్యాఖ్య కాస్తా సోషల్ మీడియాలో వైరల్ అయింది. లక్షల జోకులు, మీమ్స్ పుట్టుకొచ్చాయి. నారాయణమూర్తి, సుబ్రహ్మణ్యన్ లాంటి పారిశ్రామిక దిగ్గజాలు యథాలాపంగా చేసిన వ్యాఖ్యలను బట్టి వారిని జడ్జ్ చేయడం మంచిది కాదు. కానీ సుదీర్ఘ పనిగంటలను వారు సీరియస్‌గానే ప్రతిపాదిస్తున్నట్టు కనిపిస్తోంది.

వ్యాపార రంగంలో వారిద్దరి నైపుణ్యాన్ని పరిగణనలోకి తీసుకుని చూస్తే ఆ వ్యాఖ్యలకు మనం విలువ ఇవ్వాలి. దేశంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విప్లవానికి పునాదులు వేసిన వ్యక్తి, ప్రపంచంలోనే అతిపెద్ద కంపెనీని నిలబెట్టిన వ్యక్తి నారాయణమూర్తి. ఎల్ అండ్ టీ ఛైర్మన్ కూడా ఆషామాషీ వ్యక్తి కాదు. 5,690 కోట్ల డాలర్ల విలువైన, ఫోర్బ్స్ జాబితాలో నమోదైన కంపెనీని నడిపిస్తున్నారు. కాబట్టి వీరి దృష్టి కోణాలకు ప్రాధాన్యం ఉంటుంది.

ఇంటి పని మాటేమిటి?

నారాయణమూర్తి, సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యల నేపథ్యంలో కనిపించే ఒక అంశం ఏమిటంటే... వీరిరువురి భార్యలకు సొంతంగా ఉద్యోగాలేమీ లేకపోవడం. దీనివల్ల మన సంరక్షణ బాధ్యతలు చూసుకునే వ్యక్తులు మన అభివృద్ధిలో ఎంత మేరకు భాగస్వాములో తెలియకుండా పోతుంది. వీరిద్దరు చెప్పినట్లు వారానికి 70 లేదా 90 గంటలు పనిచేశామనుకోండి... మహిళలు ఉద్యోగాలు చేయడం చాలా కష్టమైపోతుంది. ఎందుకంటే కుటుంబ బాధ్యతలు అంత ఎక్కువ పెరిగిపోతాయి కాబట్టి!

ఉద్యోగాలు చేసే వారి పిల్లల సంరక్షణ కోసం దేశంలో ఇప్పటి వరకూ ఎలాంటి ఏర్పాట్లూ లేవు. ఇలా ఉండి ఉంటే తల్లులు కూడా ఎక్కువ సమయం ఉద్యోగ బాధ్యతల నిర్వహణలో గడిపేందుకు అవకాశం ఏర్పడేది. వారంలో 70 లేదా 90 గంటలు పనిచేయాలన్న ఆలోచన వెనక ఆ ఉద్యోగి జీవిత భాగస్వామికి ఉద్యోగం ఏదీ లేదన్న నిర్ధారణ ఉండి ఉండాలి. పితృస్వామిక భావజాలం ఎక్కువగా ఉండే భారతదేశ నేపథ్యాన్ని లెక్కలోకి తీసుకుంటే... ఆ జీవిత భాగస్వామి మహిళే అయి ఉంటుంది. ఈ వ్యవహారంలో భార్య ప్రస్తావన వచ్చేందుకు ఇంకోటి కూడా కారణం. భార్యలు ఇంటిపట్టున తీరికగా ఉన్నారు అన్న అంచనా. ఇంకోలా చెప్పాలంటే... ఇంట్లో పని మొత్తం అంటే ఇల్లూడ్చడం, వంట, పిల్లల మంచిచెడ్డలు, వయసు మళ్లిన వారి బాగోగులన్నీ ఇతరులు ఎవరో చూసుకుంటున్నారన్నమాట. వాస్తవం ఏమిటంటే... ఇలా పనులు చేసిపెట్టే వారు ఏమీ అంత చౌకగా అందుబాటులో ఉండరు.



ఈ దృష్ట్యా చూస్తే... ఈ ఇద్దరు ప్రముఖులు పని అంటే కేవలం ఇంటి బయట చేసేది మాత్రమే అన్న అంచనాతో మాట్లాడటం సమంజసం కాదు. ఇంటి పని కూడా చాలా శ్రమతో కూడుకున్నది, సమయం తీసుకునేదని వీళ్ల గుర్తించి ఉండాల్సింది. పైగా ఇంటి పనులు సాధారణంగా ఆడవారే చేస్తుంటారు. ప్రపంచవ్యాప్తంగా, ఇంకా ముఖ్యంగా భారతదేశంలో ఇదే ధోరణి కనిపిస్తుంది. ఇంట్లో ఆడవాళ్లు చేసే శ్రమ విలువ ఎంతో అర్థం చేసుకోవాలంటే ఆ మధ్య వచ్చిన మలయాళ సినిమా 'ద గ్రేట్ ఇండియన్ కిచెన్' ఒకసారి చూడాలి.

మహిళ శ్రామిక శక్తి భాగస్వామ్యం ఎంత?

ఈ నేపథ్యంలో దేశంలో మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం ఎంత అన్న ప్రశ్నకు ప్రాధాన్యం ఏర్పడుతుంది. అంతర్జాతీయంగా మహిళల భాగస్వామ్యం సగటున 51 శాతం ఉంటే భారత్‌లో గణనీయంగా తక్కువ ఉండేందుకు కారణాలు ఏమిటో తెలుసుకునేందుకు చాలా ప్రయత్నాలే జరిగాయి. అయితే, ఇటీవలి కాలంలో ఈ సంఖ్య కొంచెం ఎక్కువగా ఉండటం ఊరటనిచ్చే అంశం. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం, మహిళల భాగస్వామ్యం 2017–18లో 23.3 శాతం మాత్రమే ఉంటే, 2023–24లో 41.7 శాతానికి పెరిగింది. పురుషుల భాగస్వామ్యం సుమారుగా 78.8 శాతం ఉండటం గమనార్హం.

ఆర్థికవేత్తలు శమికా రవి, ముదిత్ కపూర్‌లు చేసిన ఒక అధ్యయనం ప్రకారం, దేశంలో శ్రమశక్తిలో పెళ్లయిన మగవారి భాగస్వామ్యం చాలా ఎక్కువ. అదే సమయంలో పెళ్లయిన మహిళల సంఖ్య చాలా తక్కువ. తల్లి లేదా తండ్రి ఉద్యోగస్తుడైతే ఆ యా కుటుంబాల్లో పిల్లలపై ప్రభావాన్ని కూడా పరిశీలించారు. తండ్రి ఉద్యోగస్తుడైతే ఆ ప్రభావం దాదాపు లేకపోయింది. మహిళల విషయానికి వస్తే పిల్లలున్న కుటుంబాల్లోని మహిళలు శ్రామిక శక్తిలో భాగం కావడం కేరళ వంటి రాష్ట్రాల్లో బాగా తగ్గిపోయింది. బిహార్, పంజాబ్, హరియాణా వంటి రాష్ట్రాల్లో శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం వరుసగా తక్కువగా నమోదవుతున్నట్లు ఈ అధ్యయనం ద్వారా తెలిసింది.

అసంఘటిత రంగం మాటేమిటి?

పని గంటలు పెంచాలన్న అంశంపై వివాదం చెలరేగుతున్న నేపథ్యంలో ఏమాత్రం నియంత్రణ లేని అసంఘటిత రంగం పరిస్థితిని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. పని గంటలను అసాధారణంగా పెంచి చిన్న వ్యాపారులు ఉద్యోగుల శ్రమను దోపిడి చేసే అవకాశం ఉంది. నగర ప్రాంతాల్లో గిగ్ ఆర్థిక వ్యవస్థ చాలా ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తోంది. వీరికి పనివేళలు నిర్దిష్టంగా ఉంటాయి కానీ టార్గెట్లు ఎక్కువ ఇవ్వడం ద్వారా అధిక శ్రమకు గురి చేస్తుంటారు. ఇంటి పని చేసే వారి విషయంలోనూ పనివేళలు, వేతనాలపై ఎలాంటి నియంత్రణ లేదు.

పనిగంటలపై మొదలైన చర్చ ఏయే రంగాల్లో నియంత్రణ వ్యవస్థల అవసరం ఉందన్నది గుర్తించేందుకు ఉపయోగపడవచ్చు. అయితే అసంఘటిత రంగంలో ఉన్న వారు తమంతట తామే పనివేళలను నిర్ధారించుకునే అవకాశం ప్రస్తుతానికైతే లేదన్నది విధాన నిర్ణేతలు గుర్తుపెట్టుకోవాలి.

ఇంకో విషయం వారంలో ఎన్ని గంటలు పనిచేయాలన్న విషయంపై మొదలైన చర్చ కొన్ని సానుకూల అంశాలను తెరపైకి తెచ్చింది. పని చేసే సమయం ముఖ్యమా? చేసిన పని తాలూకూ నాణ్యత ముఖ్యమా అన్నది వీటిల్లో ఒకటి. అదృష్టవశాత్తూ చాలా మంది కార్పొరేట్ బాసులు సమయం కంటే నాణ్యతకే ఓటు వేశారు. ఒక్కటైతే నిజం... నారాయణ మూర్తి, సుబ్రహ్మణ్యన్ వంటి తొలి తరం వ్యాపారవేత్తలు తమ వ్యాపారాలపై ఏకాగ్ర చిత్తంతో పని చేయడం వల్లనే ఇప్పుడీ స్థితికి ఎదిగారు. అయితే విజయానికి మార్గాలు అనేకం. రతన్‌టాటా వంటి వారు పారిశ్రామికంగా ఎదుగుతూనే ఇతర వ్యాపకాలను కూడా చూసుకోగలిగారు. అభివృద్ధి పథంలో మన సంరక్షకుల పాత్రను కూడా విస్మరించలేము. మొత్తమ్మీద చూస్తే ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థ అవసరాలేమిటన్నది సంకుచిత దృష్టితో కాకుండా సమగ్రంగా చూడటం మేలు!

వ్యాసకర్త సీనియర్ ఫైనాన్షియల్ జర్నలిస్ట్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

- 'ఇన్ఫోసిస్' నారాయణమూర్తి, 'ఎల్ అండ్ టీ' సుబ్రహ్మణ్యన్ లాంటి పారిశ్రామిక దిగ్గజాలు యథాలాపంగా చేసిన వ్యాఖ్యలను బట్టి వారిని జడ్జ్ చేయడం మంచిది కాదు. కానీ సుదీర్ఘ పని గంటలను వారు సీరియస్‌గానే ప్రతిపాదిస్తున్నట్టు కనిపిస్తోంది.
- వీరిద్దరు చెప్పినట్లు వారానికి 70 లేదా 90 గంటలు పని చేశామనుకోండి... మహిళలు ఉద్యోగాలు చేయడం కష్టమైపోతుంది. ఉద్యోగాలు చేసే వారి పిల్లల సంరక్షణ కోసం దేశంలో ఇప్పటివరకూ ఎలాంటి ఏర్పాట్లూ లేవు.
- అసంఘటిత రంగం పరిస్థితిని కూడా లెక్కలోకి తీసుకోవాలి. పని గంటలను అసాధారణంగా పెంచి చిన్న వ్యాపారులు ఉద్యోగుల శ్రమను దోపిడీ చేసే అవకాశం ఉంది.
- పని గంటలపై మొదలైన చర్చ ఏయే రంగాల్లో నియంత్రణ వ్యవస్థల అవసరం ఉందన్నది గుర్తించేందుకు ఉపయోగపడటం ఒక సానుకూలాంశం.

సోషల్ మీడియా

వైదొలగడమే సరి!



ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) నుంచి వైదొలగాలన్న ట్రంప్ నిర్ణయం సరైనదే! డబ్ల్యూహెచ్ఓ క్యాన్సర్ ప్రోగ్రామ్ మాజీ డైరెక్టర్‌గా ఆ కార్యక్రమాలు ఏవి చేయడానికైనా అందులో సభ్యదేశంగా ఉండనక్కరలేదని చెప్పగలను. ఆ సంస్థ పాడైపోయింది. బ్రిటన్ కూడా వైదొలగాలి. మనం మిత్రదేశాలతో కలిసి పనిచేస్తూ వాటికి సహకరించాలి.

– కరోల్ సైకోరా, బ్రిటన్ అంకాలజిస్ట్

అర్థమవుతోందా?



ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏం చేస్తుందో, ప్రపంచ ఆరోగ్యాన్ని కాపాడటంలో అంతర్జాతీయ ఆరోగ్య సహకారం ఎందుకు ముఖ్యమో ఎవరికైనా కనీసం అర్థమవుతోందా? అందులోంచి వైదొలగాలన్న ట్రంప్ నిర్ణయం మంచి పతాక శీర్షిక అవుతుందేమోగానీ ప్రాథమిక వాస్తవాలు విస్మరణకు గురయ్యాయి.

– దేవీ శ్రీధర్, ప్రొఫెసర్

కరిగే కాలం



సరిగ్గా యాభై ఏళ్ల క్రితం, 1975 జనవరి 21న 'దీవార్' విడుదలైంది. కాలం ఎలా నిశ్శబ్దంగా, ఎంత వేగంగా గడిచిపోతుంది! అదెప్పుడూ జరుగుతూ ఉండేదే, అయినా ఆశ్చర్యానికి గురిచేస్తూనే ఉంటుంది. ('మేరే పాస్ మా హై' డైలాగ్ ఈ హిందీ చిత్రంలోదే.)

– జావేద్ అఖ్తర్, 'దీవార్' సహ రచయిత

జీవిత చక్రం



జీవిత పాఠాలు: చెట్టు నుంచి రాలిపడిన ఆకు తిరిగి మట్టిలో కలిసి అదే చెట్టుకు పోషణను అందిస్తుంది. జీవిత చక్రం అలా కొనసాగుతుంది. మనం కూడా అలాంటి జీవిత చక్రంలో ముఖ్యమైన భాగమే. ఆ ఆకు కంటే ఎక్కువా కాదు, తక్కువ కూడా కాదు.

– శేఖర్ కపూర్, దర్శకుడు

మనవాళ్లే రిచ్!



సగటు తమిళ ఎమ్మెల్యే కన్నా ధనవంతులమని ఎంతమంది అమెరికన్ సెనేటర్లు చెప్పుకోగలరంటారు?

– కార్తీక్ బాలచంద్రన్, వైద్యుడు

ఇన్ బాక్స్

తెలుగు భాషకు గొడుగు

వ్యవహారిక భాషా ఉద్యమం, సవర జాతి పేరు వంటివి వినగానే గుర్తుకు వచ్చేది గిడుగు వెంకట రామమూర్తి పంతులు. ఆయన 1863 ఆగస్ట్ 29న ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో పర్వతాలపేటలో జన్మించారు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి విజయనగరంలో మేనమామగారి ఇంట్లో ఉంటూ మహారాజావారి ఇంగ్లీషు పాఠశాలలో ప్రవేశించి మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. గురజాడ అప్పారావు ఆయన సహాధ్యాయి. పర్లాకిమిడి రాజావారి స్కూల్లో చరిత్ర అధ్యాపకునిగా ఉద్యోగజీవితం ప్రారంభించి ప్రైవేటుగా చదివి బీఏ పట్టా పుచ్చుకున్నారు. ఆ రోజుల్లో సవరల జీవితాన్ని దగ్గరగా చూసిన ఆయన కొన్నేళ్లపాటు వారి భాష నేర్చుకొని వారికి చదువు చెప్పడానికి ఉపక్రమించారు.



గిడుగు వెంకట రామమూర్తి పంతులు

సవరభాషలో పుస్తకాలు రాసి, సొంతడబ్బుతో స్కూళ్ళు పెట్టి చదువు చెప్పే ఏర్పాట్లు చేశారాయన. మద్రాసు ప్రభుత్వం వారు ఈ కృషికి మెచ్చి 'రావు బహదూర్' బిరుదు ఇచ్చారు. ముప్పై అయిదేళ్ళ కృషితో ఇంగ్లీషులో సవరభాషా వ్యాకరణాన్నీ, సవర-ఇంగ్లీషు కోశాన్నీ నిర్మించారు. మద్రాసు ప్రభుత్వం ఈ కృషికి గాను 'కైజర్-ఇ-హింద్' అనే స్వర్ణ పతకం ఇచ్చి గౌరవించింది. ఉద్యోగ విరమణ తరువాత పర్లాకిమిడిలోనే ఉంటూ మొత్తం ఆంధ్రదేశమంతా సంచరిస్తూ భాష, విద్య, శాసన పరిశోధన, చరిత్ర పరిశోధనలకు సంబంధించిన ఎన్నో ఉద్యమాలు తలకెత్తుకున్నారు.

1936లో బ్రిటిష్ ప్రభుత్వం ఒరిస్సాకు ప్రత్యేక ప్రావిన్సును ఏరాటు చేస్తూ తెలుగు వాళ్ళు అత్యధికంగా ఉన్న పర్లాకిమిడిని కూడా ఒరిస్సా రాష్ట్రంలో కలపడానికి నిర్ణయించినప్పుడు, ఆ నిర్ణయం పట్ల అసమ్మతి ప్రకటిస్తూ రాజమండ్రి వచ్చేశారు. అప్పటి నుంచి తాను స్వర్గస్థులయ్యేదాకా నాలుగేళ్ళ పాటు రాజమండ్రిలోనే కడపటి రోజులు గడిపారు. ఆయన రచనలలో ముఖ్యమైనవి 'బాలకవి శరణ్యము', 'ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజము', 'గద్యచింతామణి' వంటివి. గిడుగు అనగానే ప్రజలకు స్ఫురించేది వాడుకభాష గురించి చేపట్టిన మహోద్యమమే! ఈ ఉద్యమం ఫలితంగానే నేడు మనం పాఠశాలల్లో, సమాచార ప్రసార సాధనాల్లో, సాహిత్యంలో వాడుక భాషను ఉపయోగించు కోగలుగుతున్నాం.

– ఎం. రామ్ ప్రదీప్, జి.వి.వి. సభ్యులు, తిరువూరు
(నేడు గిడుగు వెంకట రామమూర్తి వర్ధంతి)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్ర జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

అసాధ్యం సుసాధ్యమై...

సందర్భం



పగుడాకుల బాలస్వామి

అయోధ్య రామాలయంలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ జరిగి ఏడాది కావడంతో అక్కడ వార్షికోత్సవ శోభ కనిపిస్తోంది. 2024 జనవరి 22న రాములవారికి జరిగిన ప్రాణ పతిష్ఠ ఘట్టాలు తలుచుకుంటే ఒళ్లంతా పులకరిస్తోంది. 'అసలు అయోధ్య రామ మందిరం అనేది ఓ కల. అది సాధ్యం కాని అంశమని కొట్టిపారేసిన రోజుల నుంచి... అయోధ్యలో రామ మందిరాన్ని నిర్మించి హిందువుల కలను సాకారం చేసిన సుదినం అత్యంత పవిత్రమైనది' అని హిందువులు భావిస్తున్నారు. దసరా, దీపావళి, సంక్రాంతి పండగలను మించిన శుభదినం రాముల వారి మందిరం ప్రారంభమైన రోజు. ఈ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందూ సమాజం వేడుక చేసుకోవడానికి సిద్ధమైంది. 'ప్రతిష్ఠ ద్వాదశి' అనే పేరుతో మహత్తర కార్యక్రమం నిర్వహించింది 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్'.

త్రేతాయుగంలో రాములవారి పట్టాభిషేకంలో పాల్గొనని ప్రజలంతా నేడు (కలియుగంలో) ప్రాణ పతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనడం అత్యంత అదృష్టంగా భావిస్తున్నారు. న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా సుప్రీం కోర్టులో విజయం సాధించి నిర్మించుకున్న మందిరం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ఆగర్భ శ్రీమంతుని నుంచి యాచకుని వరకు... భక్తులు మనస్ఫూర్తిగా విరాళాలు సమర్పించి నిర్మించుకున్న ఈ మందిరం... హిందువుల స్వాభిమాన సంకేతం. ప్రపంచంలోని ప్రతి హిందువులో ఆత్మవిశ్వాసం నింపిన అయోధ్య రామ మందిరం ప్రారంభ ఘడియలు అపురూపం. అమోఘం! విరామ మెరుగని పోరాటంలో ఎన్నో ఘట్టాలు. ఊరు–వాడ, ఇల్లు–వాకిలి... ఎటు చూసినా రాముడి జెండా రెప రెపలు, ఊరేగింపులు, కోలాటాలు, భజనలు... అంతా రామ నామ జపమే! 'జైశ్రీరామ్' నినాదాలతో లోకమంతా ఆధ్యాత్మికత్వం వెల్లివిరిసింది.

ఐదు శతాబ్దాల క్రితం విదేశాల నుండి వచ్చిన వారు ధ్వంసం చేసిన రామమందిరాన్ని అనేక ఆటుపోట్లు ఎదుర్కొంటూ పోరాడి విజయం సాధించి పునర్నిర్మించుకున్న ఆలయంలో... రాములవారి ప్రాణ ప్రతిష్ఠ మహా ఉత్సవంలో ప్రతి హిందువును భాగస్వామిని చేయాలని తీసుకున్న సంకల్పం స్ఫూర్తిదాయకం. ప్రతి ఇంటికి రాములవారి అక్షింతలు అందజేసి మందిర ప్రారంభానికి ఆహ్వానించిన కార్యక్రమం ప్రశంసనీయం. 2024 జనవరి 1 నుంచి 15 వరకు కనివిని ఎరుగని రీతిలో అయోధ్య అక్షింతలు వితరణ చేశారు. దేశంలోని ఐదు లక్షల పదివేలకు పైగా గ్రామాలకు వెళ్లి దాదాపు 11 కోట్ల కుటుంబాలకు అక్షింతలు అంద జేసిన కార్యక్రమం ఓ ఆధ్యాత్మిక విప్లవం సృష్టించింది. దాదాపు 40 కోట్లకు పైగా శ్రీరామ భక్తులను కలిసి అక్షింతలు ఇచ్చి అయోధ్యకు ఆహ్వానించారు.

అయోధ్య మందిరం ప్రారంభం రోజున రామభక్తులు పెద్ద ఎత్తున తమ భక్తిని చాటుకున్నారు. మార్కెట్‌లో ఉన్న పూలు, పండ్లు, పూజా ద్రవ్యాలు పూర్తి స్థాయిలో భక్తుల అవసరాలను తీర్చలేకపోయాయి. కాషాయ జండాల తయారీకి కాషాయవస్త్రం కూడా కావలసినంత దొరకలేదు. అంటే అంత పెద్ద ఎత్తున హిందువులు ఆ రోజు పూజాదికాలు నిర్వహించారన్నమాట. దేవాలయాలు క్రిక్కిరిసి పోయాయి. దీపావళిని మించి జనవరి 22వ తేదీ రాత్రి టపాసులు పేలాయి. ప్రతి ఇంటిపై దీపాలు వెలిగాయి.



అయోధ్య బాలరాముడు

ప్రాణ ప్రతిష్ఠ తరువాత దేశంలోని నలుమూలల నుంచి ప్రత్యేక రైళ్లలో రామభక్తులు అయోధ్యకు తరలి వెళ్లారు. అత్యంత నియమ నిష్ఠలు, భక్తిశ్రద్ధలతో రాముల వారిని దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు. జన్మ తరించిన అనుభూతితో ఆనంద డోలికల్లో మునిగి తేలారు. ఐదు శతాబ్దాల తర్వాత మందిర ప్రాంగణంలోకి కాలుపెట్టిన రామ భక్తుల అనుభూతి అంతా ఇంతా కాదు.

అయోధ్య రామాలయ నిర్మాణం ప్రారంభం తర్వాత ప్రపంచ వింతలలో ఒకటైన తాజ్ మహల్‌ను మించి అయోధ్య రాముడిని దర్శించుకోవడం విశేషంగా చెప్పవచ్చు. 2024 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు 13.55 కోట్ల మంది భారతీయులు, లక్షలాదిమంది విదేశీయులు రాములవారి దర్శన భాగ్యం పొందారు. మందిరం ప్రారంభించిన తర్వాత మొట్టమొదటి దీపావళికి రికార్డు స్థాయిలో దీపోత్సవం నిర్వహించారు. దీపావళి రోజు 25 లక్షల దీపాలు ఏకకాలంలో వెలిగించి గిన్నిస్ రికార్డులు సొంతం చేసుకున్నారు. 1121 మంది ఒకేసారి గంగా హారతి ఇచ్చి రికార్డు సృష్టించారు.

వ్యాసకర్త ప్రచార ప్రసార ప్రముఖ్,
విశ్వహిందూ పరిషత్ తెలంగాణ । 99129 75753
(నేటితో అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ జరిగి ఏడాది)

పురుష ప్రయత్నం

'ఆరంభరహితు బొందునెయారయ సంపదలు?' అన్నాడు నన్నయ ఆంధ్ర మహాభారతం సభాపర్వంలో. 'ఆరంభ రహితుడు' – అనగా 'ప్రారంభంలో సరైన మానవ ప్రయత్నం చేయనివాడు' ఏ ప్రయోజనమూ పొందడానికి అర్హుడు కాడు. ఏ పనికైనా సరైన ఆరంభంలో సగం సఫలత దాగి ఉంటుంది. తక్కువ నేర్పు కలిగిన వాడైనప్పటికీ, ఒక పనిని సరైన సమయంలో ఆరంభించిన కారణం చేత, ఏ ప్రయత్నమూ చేయకుండా నిద్రపోతున్న నేర్పరియైన వ్యక్తిని సైతం అధిగమిస్తాడని అన్నాడు నన్నయ. 'తత్తర మొప్పదు పనియెడ' అని కూచిమంచి తిమ్మకవి 'శివలీలా విలాసము' కావ్యంలో చెప్పినట్లుగా, ఏ పనిలో నైనా తొందరపడి తప్పులు చేయడం వలన అసలుకే మోసం వస్తుంది. చేయవలసిన పనిని గురించి ముందుగానే బాగా ఆలోచించి, కంగారు పడకుండా చేసేవాడు ఉత్తముడు. అలాంటి వాడినే లక్ష్మీదేవి ఆదరిస్తుంది. 'సకల యత్నంబుల నుత్సాహంబె మనుజులకు సకలార్థ మూలము' అని 'రంగనాథ రామయాణం' చెప్పింది. అన్ని ప్రయత్నాలలోను తగినంత ఉత్సాహంతో పనిచేసినప్పుడు మాత్రమే మనుషులకు సంపద చేకూరుతుందని ఆ మాటల తాత్పర్యం. అయితే, అన్ని సమయాలలోను శరీర బలం మీదనే ఆధారపడడం వలన పూర్తి ప్రయోజనం సాధించలేము. కాబట్టి 'బలిమి జేయరాని పని యెట్టిదైన, నుపాయ బలముచేత జేయవచ్చు' అన్నాడు చరిగొండ ధర్మన 'చిత్ర భారతము' కావ్యంలో. తలపెట్టిన పనిని ఫలవంతం చేయడానికి సరిపోయేంతగా బుద్ధి బలం కూడా ప్రయోగించాలి. ఇలా, ఇన్ని జాగ్రత్తలు తీసుకుని మానవ ప్రయత్నం ఎంత పకట్బందీగా చేసినప్పటికీ, దైవం ఆ ప్రయత్నానికి తోడుగా లేకపోతే, ఆశించిన ఫలితం దక్కదని ఆంధ్ర మహాభారతం, అనుశాసనిక పర్వంలో ఒక చక్కని ఉదాహరణతో చెప్పాడు తిక్కన.



జ్యోతిర్మయం

పౌరుషమ్ము దైవంబు తోడ్పాటు లేక
ఫలము బొందంగ నేరదు, పార్థివేంద్ర!
విత్తు సహకారి గాకున్న రిత్తనేల
వంధ్య మగుగాక, తా ఫలవంతమగునె?

'పౌరుషము' అంటే పురుష ప్రయత్నం అని అర్థం. పురుష ప్రయత్నానికి భగవంతుడి సహాయం, సహకారం లేకుండా సఫలం చెందదు. విత్తనం తోడ్పాటు లేకుండా వట్టి నేల ఏమి చేయగలదు? బీడుభూమిగా మిగిలి పోతుంది కదా! అలాగే దైవం తోడుగా లేని మానవ ప్రయత్నం కూడా సఫలం చెందదు.

– భట్టు వెంకటరావు


గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** బ.అష్టమి ప.1.24 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** స్వాతి రా.1.08 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.11.52 నుండి 12.40 వరకు, **అమృతఘడియలు:** ప.3.14 నుండి 5.01 వరకు ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.45.

ఇప్పటిది ఓకే.. మరి అప్పట్లో..



ప్రస్తుత కుంభమేళా కనీసం రూ.2-4 లక్షల కోట్ల రెవెన్యూ జనరేట్ చేస్తుందన్నది ఓ అంచనా. మరి అప్పట్లో అంటే 1870లో అలహాబాద్‌లోనే బ్రిటిష్ ప్రభుత్వం తొలిసారిగా అధికారికంగా నిర్వహించిన కుంభమేళాలో ఎంత వచ్చి ఉంటుంది? కరెక్టుగా చెప్పాలంటే.. రూ.41,824! ఇందులో పావు వంతు క్షురకుల నుంచి వసూలు చేసిన పన్నుల ద్వారా వచ్చినదే. అప్పటి కుంభమేళాలో భక్తజనం కోసం 2,500-3,000 మంది క్షురకులను పెట్టారు. ఇక్కడ వ్యాపారం చేసుకున్నందుకు గానూ వీరి నుంచి రూ.4 చొప్పున పన్ను వసూలు చేశారు. ఈ కుంభమేళాతో వచ్చిన సొమ్ములో కొంత భాగాన్ని బ్రిటిష్ ప్రభుత్వం అలహాబాద్‌లో మౌలిక వసతుల కల్పనకు.. అలాగే అల్ఫ్రెడ్ పార్క్, అలహాబాద్ మ్యూజియం, వైద్య సదుపాయాల కోసం వెచ్చించింది. తర్వాత 1882లో జరిగిన కుంభమేళాలో రూ.49,840 మేర ఆదాయం వచ్చిందట.

- సాక్షి, సెంట్రల్‌డెస్క్





క్లుప్తంగా...

మహిళా రోగి ఆత్మహత్య

- జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఘటన

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా జనరల్ ఆస్పత్రి మహిళల వార్డులోని టాయిలెట్ గదిలో ఒక మహిళా రోగి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. టూటౌన్ ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ కథనం ప్రకారం.. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం కందన్‌పల్లికి చెందిన నారమ్మ(30) మూడు రోజుల కిందట.. కడుపు నొప్పి, జ్వరం, వాంతులతో బాధపడుతూ నారాయణపేట ఆస్పత్రిలో చేరింది. అనంతరం ఆమెను ఈ నెల 20న మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ఆస్పత్రిలోని మహిళల వార్డుకు తరలించారు. మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో రోగి టాయిలెట్ గదిలోకి వెళ్లి చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇది గమనించిన ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలికి ముగ్గురు పిల్లలున్నారని, ఆరేళ్లుగా భర్తకు దూరంగా.. తల్లి ఇంటి దగ్గర ఉంటోందని ఎస్‌ఐ వెల్లడించారు. ఆత్మహత్యకు ఆరోగ్య సమస్యలతో పాటు కుటుంబ కలహాలే కారణం కావచ్చని.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై ఆస్పత్రి ఆర్‌ఎంవో డాక్టర్ శిరీషను వివరణ కోరగా.. మృతురాలు నారమ్మను నర్సులు, ఇతరులెవరూ దూషించలేదని, ఉదయం 7 గంటలకు చికిత్స కూడా అందించారని స్పష్టం చేశారు.

తల్లి మందలించిందని..

ఉరివేసుకొని కుమారుడి ఆత్మహత్య



ఆస్పత్రిలో సాక్షిత్ రెడ్డి మృతదేహం

ఖలీల్‌వాడి: చదువుపై దృష్టి పెట్టాలని తల్లి మందలించినందుకు ఎనిమిదో తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్న నవనీత, తన చిన్నకొడుకు సాక్షిత్‌రెడ్డి (14)తో నిజామాబాద్ నగరం మహాలక్ష్మి నగర్‌లో నివాసం ఉంటోంది. భర్త, పెద్ద కుమారుడు హైదరాబాద్‌లో ఉంటున్నారు. సాక్షిత్‌రెడ్డి స్థానిక ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. చదువులో అంతంత మాత్రంగానే ఉండటంతో చదువుపై శ్రద్ధ పెట్టాలని కుమారుడిని మంగళవారం ఉదయం తల్లి మందలించింది. కొడుకును స్కూలుకు వెళ్లమని చెప్పి, అనంతరం తను పనిచేసే స్కూలుకు వెళ్లిపోయింది. కాగా సాక్షిత్‌రెడ్డి స్కూలుకు రాలేదని ఫోన్ రావడంతో నవనీత ఇంటి నంబర్‌కు ఫోన్ చేసింది. ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానంతో ఇంటికి వచ్చిన నవనీతకు, చీరతో ఉరివేసుకున్న కుమారుడు కనిపించాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

కాళేశ్వరం రుణాల లెక్కలెందుకు దాచారు?

ఆర్థిక శాఖ స్పెషల్ సీఎస్‌కు జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్న

- కాళేశ్వరంపై విచారణలో రామకృష్ణారావు క్రాస్ ఎగ్జామినేషన్
- 'కోర్ కమిటీ'భేటీలపై జవాబు చెప్పలేక తడబడిన అధికారి
- 9- 10.5% వడ్డీలతో రుణాలు తీసుకున్నారని వెల్లడి
- నేడు బీఆర్‌ఎస్ నేత వి ప్రకాశ్ క్రాస్ ఎగ్జామినేషన్





బీఆర్‌కే భవన్‌లోకి వస్తున్న జస్టిస్ పీసీ ఘోష్, కమిషన్ ఎదుట హాజరయ్యేందుకు వెళుతున్న రామకృష్ణారావు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌ల నిర్మాణంలో అవినీతిపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకీ చంద్రఘోష్ కమిషన్ రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావుపై ప్రశ్నల వర్షం కురిపించింది. క్రాస్ ఎగ్జామినేషన్‌లో భాగంగా మంగళవారం కమిషన్ ఆయనను ప్రశ్నించింది. కొన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పేందుకు రామకృష్ణారావు తడబడటంతో 'మీ మీదేమీ వేసుకోవద్దు'అని అసహనం వ్యక్తంచేసింది. 2015లో జారీ చేసిన ఓ జీవో ప్రకారం కోర్ కమిటీ తరచుగా మీతో సమావేశమై ప్రాజెక్టు పురోగతిని వివరించిందా? అని కమిషన్ ఆయన్ను ప్రశ్నించగా, కమిటీలోని ఇంజనీర్లు తనను కలిసి ప్రాజెక్టు పురోగతిని వివరించి బిల్లులకు నిధులు కోరేవారని రామకృష్ణారావు బదులిచ్చారు. ఆ సమావేశాల మినిట్స్ ఏమయ్యాయి? అని కమిషన్ అడగటంతో సమాధానమివ్వలేక ఆయన తడబడ్డారు. దీంతో మీ మీదేమీ వేసుకోవద్దు అని కమిషన్ సూచించింది.

బడ్జెట్‌లో కాళేశ్వరం రుణాలెందుకు చూపలేదు?

కాళేశ్వరం ప్రాజెక్టు కోసం 2021–22లో తీసుకున్న రూ.35,257 కోట్ల బడ్జెటేతర రుణాలను రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనల్లో చూపగా, 2022–23లో రూ.9,596 కోట్లు, 2023–24లో రూ.2,545 కోట్ల బడ్జెటేతర రుణాలను ఎందుకు చూపలేదని కమిషన్ ప్రశ్నించింది. ఆ రుణాలను బడ్జెట్ ప్రతిపాదనల్లో చూపితే రాష్ట్ర రుణపరిమితికి కేంద్రం కోతలు విధించే అవకాశం ఉండడంతో వాటిని బడ్జెట్‌లో చూపలేదని రామకృష్ణారావు వివరించారు. దీంతో ఇది తెలంగాణ ఫిస్కల్ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ చట్టానికి విరుద్ధమని కమిషన్ మండిపడింది.

ప్రభుత్వమే రుణాలు తిరిగి చెల్లిస్తుంది..

కాళేశ్వరం కార్పొరేషన్ తీసుకున్న రుణాల విషయంలో ఆర్థిక శాఖ బాధ్యత ఏమిటని కమిషన్ ప్రశ్నించగా, వాటికి ప్రభుత్వం పూచీకత్తు ఇచ్చినందున ఆర్థిక శాఖ వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తుందని రామకృష్ణా రావు బదులిచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వడ్డీ రూ.6,519 కోట్లు, అసలు రూ.7,382 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. రుణాలను 9 నుంచి 10.5 శాతం వడ్డీలతో తీసుకున్నారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రుణాల సమీకరణకే కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ (కేఐపీసీఎల్) ఏర్పాటైందని చెప్పారు. కేఐపీసీఎల్‌కు ఆదాయం ఎక్కడి నుంచి వస్తుంది? అని ప్రశ్నించగా, పరిశ్రమలకు నీళ్లను విక్రయించడం ద్వారా రూ.7 కోట్ల ఆదాయం వచ్చిందని వెల్లడించారు. రుణాల సమీకరణ బాధ్యత కేఐపీసీఎల్‌దేనని చెప్పారు.

బరాజ్‌ల నిర్మాణంలో తీవ్ర ఉల్లంఘనలు

బరాజ్‌లను టర్న్‌కీ పద్ధతిలో కట్టాలని జీవో 145 పేర్కొంటుండగా, ప్రభుత్వం తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడిందని కమిషన్ తప్పుబట్టింది. జీవోలో అలా ఉందని, ప్రాజెక్టును మాత్రం పీస్ రేటు విధానంలో నిర్మించారని రామకృష్ణారావు తెలిపారు. బరాజ్‌లకు అనుమతిచ్చే విషయంలో ఆర్థిక శాఖ మంత్రి ఆమోదం తీసుకుంటారా? అని కమిషన్ ప్రశ్నించగా, అది తప్పనిసరి అని వివరించారు. బరాజ్‌ల పాలసీలను శాసనసభ ముందు ప్రభుత్వం ఉంచిందా? అని ప్రశ్నించగా, తనకు తెలియదని సమాధానమిచ్చారు.

నేటి నుంచి వరుసగా...

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ బుధవారం బీఆర్‌ఎస్ నేత వి.ప్రకాశ్‌ను ప్రశ్నించనుంది. గురు, శుక్ర, శని వారాల్లో వరుసగా సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బరాజ్‌ల నిర్మాణ సంస్థలైన నవయుగ, అఫ్కాన్స్, ఎల్ అండ్ టీల ప్రతినిధులను క్రాస్ ఎగ్జామినేషన్ చేయనుంది.

ఎన్‌కౌంటర్లతో ఉద్యమాలను అణచివేయలేరు

ప్రొఫెసర్ హరగోపాల్



సాక్షి, హైదరాబాద్: ఎన్‌కౌంటర్లతో ఉద్యమాలను అణచివేయలేరని..ఒక ముహూర్తం పెట్టుకొని..ఆ సమయానికి ఉద్యమాలు ఆగిపోతాయని చరిత్ర తెలిసిన వారెవరూ అనబోరని ప్రొఫెసర్ హరగోపాల్ వ్యాఖ్యానించారు. వరుస ఎన్‌కౌంటర్లలో పదుల సంఖ్యలో మావోయిస్టుల హతం, 'నక్సల్స్ లేని భారత్ దిశగా కీలక అడుగులు..దేశంలో నక్సలిజం కొనఊపిరితో ఉంది'అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ట్వీట్ చేసిన నేపథ్యంలో హరగోపాల్ పైవిధంగా స్పందించారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. 'స్పార్టకస్ నుంచి భవిష్య సమాజం వరకు మనుషుల మధ్య సమన్యాయం వచ్చేవరకు..మనుషులంతా సమానంగా బతికే దాకా సమాజంలో నిరంతరం భిన్నరకాల పోరాటాలు జరుగుతూనే ఉంటాయి. ఆదివాసీల ప్రయోజనాలు నెరవేరేదాకా, అభివృద్ధి ఫలితాలు వారికి చేరేదాకా..ఏదో ఒకరూపంలో వారు ప్రతిఘటిస్తూనే ఉంటారు. సమస్య మూలాల్లోకి పోకుండా కేవలం ఉద్యమాలను అణచివేస్తామంటే అది ఏకపక్షం అవుతుంది. ఎంత నిర్బంధం అయినా.. మనిషి స్వప్నం తుడిచివేయడం ఏ పాలకపక్షానికి సాధ్యం కాదు'అని పేర్కొన్నారు.

యాభై ఏళ్ల విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానం'పై సదస్సులు

'యాభై ఏళ్ల విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానం'పై ఫిబ్రవరి 20,21 తేదీల్లో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో హరగోపాల్ మాట్లాడుతూ మళ్లీ దేశవ్యాప్తంగా నిర్బంధం వచ్చిందని, ఈ సమయంలో మరోమారు ఉద్యమాల అవసరం ఉందన్నారు. తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రబాబు ఆర్విన్, ఆనాటి విద్యార్థి ఉద్యమనేతలు శ్రీనివాస్, గోపరాజు సుధ, సజయ, సాంబమూర్తి తమ అనుభవాలు వివరించారు.

ఆ నలుగురు రైతులను విడుదల చేయండి

లగచర్ల ఘటనపై పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: లగచర్ల ఘటనలో సంబంధం ఉందంటూ అరెస్టు చేసిన నలుగురు రైతులను విడుదల చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. వారి వద్ద రూ.25 వేల వ్యక్తిగత బాండ్ తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా జైలు సూపరింటెండెంట్‌కు సూచించింది. ఒకే అంశంపై మూడు ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయడాన్ని తప్పుబట్టింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ న్యాయవాది (పీపీ)కి స్పష్టం చేస్తూ, తదుపరి విచారణ వచ్చే నెల 12కు వాయిదా వేసింది. వికారాబాద్ జిల్లా లగచర్లలో అధికారులపై దాడి ఘటనకు సంబంధించి బొంరాస్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో రైతులు ముదావత్ రమేశ్, గోపాల్ నాయక్, మదారయ్య, మంగ్యా నాయక్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. తొలి ఎఫ్‌ఐఆర్ 153లో వీరిని అరెస్టు చేయగా బెయిల్‌పై విడుదలయ్యారు. ఆ తర్వాత ఎఫ్‌ఐఆర్ 154, 155 లోనూ వీరు నిందితులని పేర్కొంటూ పోలీసులు మరోసారి అరెస్టు చేశారు. దీనిపై రైతులు కోర్టును ఆశ్రయించారు. ఒకే అంశంపై పలు ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారని, కావాలని పోలీసులు మరో రెండు కేసులు పెట్టారని పేర్కొన్నారు. 154, 155లను రద్దు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టారు.

పేర్లు తప్ప వారి పాత్రపై వివరాలు ఏవీ?

ప్రభుత్వం తరఫున పీపీ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలు వినిపిస్తూ.. సాక్షులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా 154, 155 ఎఫ్‌ఐఆర్‌లలో పిటిషనర్లను పోలీసులు నిందితులుగా చేర్చారని చెప్పారు. అయితే పిటిషనర్ల పేర్లు ప్రస్తావించడం తప్ప వారికి వ్యతిరేకంగా ఏమీ పేర్కొనలేదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. పిటిషనర్ల పాత్ర ఏంటో వివరించలేదన్నారు. పిటిషనర్లు వ్యవసాయదారులని, దాదాపు మూడు నెలలుగా జైల్లో ఉంటున్నారని గుర్తు చేశారు. వారి వద్ద వ్యక్తిగత బాండ్ తీసుకుని విడుదల చేయాలని ఆదేశించారు.

'రియల్' బ్రోకర్ చెంప ఛెళ్లుమనిపించిన ఈటల

- ప్లాట్ల కొనుగోలుదారులకు అండగా ఉంటానని హామీ



రియల్ ఎస్టేట్ బ్రోకర్‌పై చేయి చేసుకుంటున్న ఈటల

పోచారం: మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఓ రియల్ ఎస్టేట్ బ్రోకర్ చెంప ఛెళ్లుమనిపించిన ఘటన మంగళవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండల పరిధిలోని కొర్రెముల్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామంలోని సర్వే నంబర్లు 739 నుంచి 749 వరకు ఉన్న 149 ఎకరాల్లో ఏర్పడిన ఏకశిలానగర్ కాలనీలో సుమారు 2 వేలకుపైగా ప్లాట్లను అన్ని వర్గాలకు చెందిన ప్రజలు కొనుగోలు చేశారు. కొందరు కొనుగోలుదారులను ప్లాట్లలో ఇళ్లు కట్టుకోనివ్వకుండా ఓ రియల్టర్ ఇబ్బందులు పెడుతున్నారని ఏకశిలానగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎంపీ ఈటల దృష్టికి సోమవారం తీసుకెళ్లారు. దీంతో వెంచర్‌ను పరిశీలించేందుకు ఈటల మంగళవారం కాలనీకి వెళ్లారు. బాధితుల సమస్యలను విని వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వెంచర్‌లో ఓ చిరుద్యోగి కట్టుకున్న ఇంటిని చూడటానికి వెళ్తుండగా కొందరు వ్యక్తులు మద్యం సేవిస్తూ అమర్యాదగా కనిపించారు. దీంతో ఆగ్రహించిన ఈటల ఓ వ్యక్తిపై చెంప దెబ్బకొట్టారు. మరో వ్యక్తిని కూడా ప్లాట్ల యజమానులు చుట్టుముట్టి కొట్టారు. మరో నలుగురు పారిపోయారు. దెబ్బలు తిన్న వారు ఓ రియల్టర్ వద్ద పనిచేస్తున్నారని.. వారి పేర్లు ఉపేందర్, రఫీక్ అని తెలిసింది.

ప్రభుత్వం న్యాయం చేయకుంటే నేనే తేల్చేస్తా: ఈటల

ఈ ఘటనపై ఈటల మాట్లాడుతూ ఏకశిలానగర్‌లో సామాన్యులు ప్లాట్లు కొనుక్కోగా కొందరు కావాలని వారిని ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. పోలీసులు, రెవెన్యూ, జిల్లా కలెక్టర్, స్థానికసంస్థల అధికారులకు ఎన్ని ఫిర్యాదులిచ్చినా స్పందించకపోవడంతో తాను వచ్చానన్నారు. బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని.. లేకుంటే తాము స్వయంగా అన్ని పనులు చేసుకోగలమని ఈటల హెచ్చరించారు. కొద్దిరోజుల్లో న్యాయమేదో, అన్యాయమేదో తేల్చేస్తానని బాధితులకు హామీ ఇచ్చారు. సాయంత్రం వరకు ఈటల వెంచర్ వద్దే ఉన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆ భూములు మావే: శ్రీహర్ష కన్‌స్ట్రక్షన్స్

ఎంపీ ఈటల రాజేందర్ వాస్తవాలు తెలుసుకోకుండా తమ సంస్థ వ్యక్తులను రక్తం కారేలా కొట్టారని శ్రీహర్ష కన్‌స్ట్రక్షన్స్ మేనేజింగ్ పార్టనర్స్ ఆలూరి వెంకటేష్, ఆలూరి విజయభాస్కర్ ఆరోపించారు. ఈటలపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఏకశిలానగర్ భూములకు యజమానులం తామేనని పేర్కొన్నారు. ఈ వెంచర్‌కు సంబంధించిన పత్రాలన్నీ పక్కాగా ఉన్నాయని.. అన్ని కోర్టుల్లోనూ తీర్పు తమకు అనుకూలంగా వచ్చిందని వివరించారు. మరోవైపు ఈటల తనపై దాడి చేశారని నారపల్లికి చెందిన గ్యార ఉపేందర్ పోచారం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు.


జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా భూసంస్కరణలు

- రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిత్తల్

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ పరిపాలనలో జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం సమగ్ర భూసంస్కరణలు తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతోందని రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిత్తల్ తెలిపారు. మంగళవారం సచివాలయంలో తెలంగాణ భూ భారతి చట్టంపై ప్రజెంటేషన్ ఇచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ చట్టం సమర్థవంతమైన వ్యవసాయ భూ పరిపాలన విధానాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. మొత్తం 19 రాష్ట్రాల్లో అనుసరిస్తున్న రెవెన్యూ చట్టాలను అధ్యయనం చేసి, ప్రజాస్వామ్య స్ఫూర్తికి అనుగుణంగా 2024 జూలై 1న ముసాయిదా చట్టాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ, తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ, భూభారతి చట్టాన్ని వివరించేందుకే ఈ వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు సందీప్‌కుమార్ సుల్తానియా రామకృష్ణారావు, రవిగుప్తా, వికాస్‌రాజ్, సబ్యసాచి ఘోష్, దానకిశోర్, రిజ్వీ, క్రిస్టినా చోంగ్తూ పాల్గొన్నారు.

జన్మతః పౌరసత్వం రద్దు

అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే ట్రంప్ సంచలన నిర్ణయాలు


సంతకం చేశాక ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వును చూపిస్తున్న ట్రంప్

వాషింగ్టన్: తాత్కాలిక వీసాలపైనైనా అమెరికాలో ఉద్యోగాలు చేయాలని, సంతానానికి జన్మనివ్వాలని, తద్వారా వారికి అమెరికా పౌరసత్వం దక్కాలని కోరుకొనే భారతీయులతోపాటు ప్రపంచ దేశాల పౌరులకు, అమెరికాలో ఉంటున్న అక్రమ వలసదారులకు నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెద్ద షాక్ ఇచ్చారు. జన్మతః పౌరసత్వం దక్కే విధానానికి మంగళం పాడేశారు. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ట్రంప్ సంచలన నిర్ణయాలకు తెరతీశారు. అంతా ఊహించినట్లుగానే తనకున్న అసాధారణ అధికారాలు ఉపయోగించుకొని పదుల సంఖ్యలో ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు జారీ చేశారు. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం 47వ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఆయన తన కార్యాచరణ ప్రారంభించడం గమనార్హం. గంటల వ్యవధిలోనే పలు కీలక నిర్ణయాలు వెలువడ్డాయి. తొలుత క్యాపిటల్ వన్ ఎరీనాలో మద్దతుదారుల సమక్షంలో, అనంతరం శ్వేతసౌధం ఓవల్ ఆఫీసులో ఆయన సంతకాలు చేయడం, మరోవైపు ఉత్తర్వులు వెలువడడం వెనువెంటనే జరిగిపోయాయి. వలసలు, వాతావరణ మార్పులు, క్షమాభిక్షలు, జన్మతః పౌరసత్వం రద్దు వంటి కీలక అంశాలపై ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు జారీ అయ్యాయి. పత్రాలపై తన సంతకాన్ని ట్రంప్ బహిరంగంగా ప్రజలకు చూపించారు. ఆ పెన్నులను ఉత్సాహంగా జనంపైకి విసిరేశారు. చరిత్రలోనే అత్యంత అధ్వాన పరిపాలన గత ప్రభుత్వ హయాంలో జరిగిందని ట్రంప్ ఆరోపించారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన 78 విధ్వంసకర విధానాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అమెరికాకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తూ ట్రంప్ విధానపరమైన నిర్ణయాలు తీసుకున్నారు. భారతీయులతోపాటు ప్రపంచదేశాల ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేయగల నిర్ణయాలు సైతం ఉన్నాయి. కానీ, ట్రంప్ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లకు చట్టపరమైన రక్షణ కొంతవరకే ఉంటుందని, ఆయన తర్వాత పగ్గాలు చేపట్టబోయే అధ్యక్షులు గానీ, కోర్టులు గానీ వాటిని తిరగదోడే అవకాశం ఉందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ట్రంప్ నిర్ణయాలకు కోర్టుల్లో సవాళ్లు ఎదురుకావడం ఖాయమని అంటున్నారు. నూతన అధ్యక్షుడు జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు ఏమిటంటే...

జన్మతః పౌరసత్వం లేనట్లే

అమెరికాలో నివసిస్తున్న అక్రమవలసదార్లకు, వలస వచ్చినవారికి, తాత్కాలిక వీసాలపై ఉంటున్నవారికి అమెరికా గడ్డపై సంతానం జన్మిస్తే.. ఇకపై జన్మతః అమెరికా పౌరసత్వం లభించదు. తల్లిదండ్రులు అమెరికా పౌరులు కాకపోయినా ఇక్కడ పుట్టిన వారి బిడ్డలకు జన్మతః పౌరసత్వం లభించే వెసులుబాటు గత శతాబ్ద కాలంగా అమలవుతోంది. ఈ మేరకు వందేళ్ల క్రితమే 14వ రాజ్యాంగ సవరణ చేశారు. 1868లో చట్టం తీసుకొచ్చారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని ట్రంప్ ఆదేశించారు. జన్మతః పౌరసత్వం లభించే అవకాశం ఉండొద్దని తేల్చిచెప్పారు. దీనివల్ల లక్షలాది మందికి ఇబ్బందులు ఎదురుకానున్నాయి. ప్రధానంగా అమెరికాలో ఉంటున్న విదేశీయులకు జన్మించే సంతానానికి ఇక్కడి పౌరసత్వం దక్కడం కష్టమే. అయితే, ఈ విషయంలో ట్రంప్ నిర్ణయాన్ని కొందరు ఫెడరల్ కోర్టులో సవాలు చేసినట్లు తెలిసింది. చట్టపరంగా ఇది చెల్లదని అంటున్నారు. ట్రంప్ జారీ చేసిన ఆర్డర్ ప్రకారం.. అమెరికా గడ్డపై పుట్టినవారికి పౌరసత్వం రావాలంటే తల్లిదండ్రుల్లో కనీసం ఒక్కరైనా అమెరికా పౌరులై ఉండాలి. లేదా చట్టపరమైన శాశ్వత నివాసిత హోదా(గ్రీన్ కార్డు హోల్డర్) ఉండాలి. ఒకవేళ వలసదార్లు అమెరికా సైన్యంలో పని చేస్తూ ఉంటే వారికి జన్మించే పిల్లలకు కూడా పౌరసత్వం లభిస్తోంది.

ట్రాన్స్‌జెండర్లకు చేదు వార్త

లింగ మార్పిడి చేయించుకున్నవారికి ట్రంప్ చేదువార్త చెప్పారు. అమెరికాలో ఇకపై పురుష, మహిళ అనే రెండు లింగాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని, మూడో లింగాన్ని గుర్తించడం లేదని స్పష్టంచేశారు. మహిళలు గానీ, పురుషులు గానీ లింగ మార్పిడి చేయించుకోవడానికి వీల్లేదని పేర్కొన్నారు. అయితే, ఈ నిర్ణయాన్ని అమలు చేయడంలో ఇక్కట్లు ఎదురయ్యే అవకాశాలున్నాయి.

మద్దతుదారులకు క్షమాభిక్ష

2021 జనవరి 6వ తేదీన క్యాపిటల్ భవనంపై దాడి కేసులో నిందితులైన తన మద్దతుదారులకు ట్రంప్ క్షమాభిక్ష ప్రసాదించేశారు. దోషులుగా తేలినవారికి విముక్తి కల్పించారు. జైలుశిక్షలు సైతం రద్దు చేశారు. మొత్తానికి ట్రంప్ దాతృత్వం వల్ల 1,500 మందికిపైగా నిందితులు/దోషులు కేసుల నుంచి బయటపడ్డారు. పోలీసులతో ఘర్షణకు దిగి బీభత్సం సృష్టించిన వారందరిపై ట్రంప్ కరుణ చూపారు. వారిపై నమోదైన కేసులన్నీ ఒక్క కలంపోటుతో రద్దయ్యాయి. ఇప్పటికే జైలుపాలైన వారంతా ఇక బయటకు రాబోతున్నారు.

అక్రమ వలసదారులంతా వెనక్కే

మొదటిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు తీసుకొచ్చిన 'రిమెయిన్ ఇన్ మెక్సికో' విధానాన్ని ట్రంప్ పునరుద్ధరించారు. ప్రస్తుతం సరిహద్దుల్లో వేచిచూస్తున్న 70 వేల మంది నాన్-మెక్సికన్ శరణార్థులను వెనక్కి పంపించబోతున్నారు. 'క్యాచ్ అండ్ రిలీజ్'కు శుభంకార్డు వేశారు. అమెరికాలో అక్రమంగా ఉంటున్నవారిని గుర్తించి వెనక్కి పంపబోతున్నారు. శరణార్థులుగా గుర్తించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నవారికి కూడా వదిలిపెట్టరు. అక్రమ వలసదార్లంతా అమెరికాను విడచిపెట్టి వెళ్లిపోవాల్సిందే. లేకపోతే బలవంతంగానైనా వెళ్లగొడతారు. ఈ విషయంలో ట్రంప్ నిర్ణయానికి చట్టపరమైన సవాళ్లు ఎదురుకాబోతున్నాయి.

జాతీయ అత్యవసర పరిస్థితి

అమెరికా సార్వభౌమత్వం ప్రమాదంలో పడిందని ట్రంప్ ఎప్పటినుంచో చెబుతున్నారు. అందుకే మెక్సికో సరిహద్దుల్లో జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తూ ఉత్తర్వుపై సంతకం చేశారు. దీంతో మెక్సికో సరిహద్దుల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయడానికి, గోడ నిర్మాణానికి స్వేచ్ఛగా నిధులు వాడుకొనే అవకాశం ట్రంప్‌కు లభించింది.

డ్రగ్స్ గ్యాంగ్‌లపై ఉగ్రవాద ముద్ర

అమెరికాలో చెలరేగిపోతున్న మాదక ద్రవ్య ముఠాలు, అంతర్జాతీయ డ్రగ్స్ గ్యాంగ్‌లను విదేశీ ఉగ్రవాద సంస్థలుగా పరిగణిస్తూ ట్రంప్ ఉత్తర్వు జారీ చేశారు. ఇస్లామిక్ స్టేట్(ఐసిస్) వంటి అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలున్న జాబితాలో ఇవి చేరబోతున్నాయి. అంటే డ్రగ్స్ గ్యాంగ్‌లపై ఇక కఠిన చర్యలు తీసుకోబోతున్నారు.

ఇంధన అత్యవసర పరిస్థితి

ట్రంప్ జాతీయ ఇంధన అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. చమురు నిల్వలు పెంచాలని ఆదేశించారు. శిలాజ ఇంధనాల ఉత్పత్తిని భారీ పెంచే దిశగా అడుగులు వేస్తున్నారు. అలాస్కా నుంచి చమురు, గ్యాస్, ఇతర సహజ వనరులను భారీగా సమీకరించాలని పేర్కొంటూ ఉత్తర్వుపై సంతకం చేశారు. హరిత ఉద్యోగాల(గ్రీన్ జాబ్స్) కల్పనకు జో బైడెన్ తీసుకొచ్చిన గ్రీన్ న్యూ డీల్‌ను నిలిపివేశారు.

వలస నేరగాళ్లకు మరణ శిక్ష

ఉద్యోగం, ఉపాధి కోసం అమెరికాకు వలస వచ్చి నేరాలకు పాల్పడివారికి మరణశిక్ష విధించబోతున్నారు. అమెరికాలో ఇటీవల మరణశిక్షలు విధించలేదు. ట్రంప్ వాటిని పునరుద్ధరిస్తున్నా రు. హత్యలు చేసినవారికి మరణశిక్ష విధి స్తారు. అలాగే యూఎస్ శరణార్థి సెటిల్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ట్రంప్ రద్దు చేశారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థకు గుడ్‌బై

ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ)కు ట్రంప్ గుడ్‌బై చెప్పేశారు. డబ్ల్యూహెచ్‌ఓ నుంచి అమెరికా తప్పుకొనే ప్రక్రియ ప్రారంభమైనట్లే. ఇది చాలా పెద్ద నిర్ణయమని ఆయన అభివర్ణించారు. 2020లో కోవిడ్-19 మహమ్మారి ఉధృతి సమయంలో డబ్ల్యూహెచ్‌ఓ వ్యవహార శైలి పట్ల ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అమెరికా పట్ల ఆ సంస్థ స్పందన సక్రమంగా లేదని విమర్శించారు. చైనా పట్ల పక్షపాతం చూపుతోందని మండిపడ్డారు. ట్రంప్ తాజా నిర్ణయంపై డబ్ల్యూహెచ్‌ఓ విచారం వ్యక్తంచేసింది.

టిక్‌టాక్ మరో 75 రోజులు

అమెరికాలో టిక్‌టాక్‌పై నిషేధం విధిస్తూ తీసుకొచ్చిన చట్టం అమలును ట్రంప్ 75 రోజులపాటు వాయిదా వేశారు. చైనాకు చెందిన టిక్‌టాక్‌కు ఇప్పటికిప్పుడు వచ్చిన ఇబ్బందేమీ లేదు. టిక్‌టాక్‌ను తొలుత వ్యతిరేకించిన ట్రంప్ తర్వాత సానుకూలంగా మారిపోయారు. ఎన్నికల ప్రచారంలో ఈ మాధ్యమాన్ని చక్కగా వాడుకున్నారు.

కొత్త నియామకాలకు చెల్లు!

అమెరికా సైన్యంతోపాటు కొన్ని ఇతర విభాగాల్లో తప్ప ప్రభుత్వంలో కొత్త నియామకాలు చేపట్టవద్దని ట్రంప్ తేల్చిచెప్పారు. ప్రభుత్వంపై ట్రంప్ పూర్తి పట్టుసాధించేదాకా నియామకాలు ఉండవు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులంతా ఆఫీసులకు కచ్చితంగా హాజరై విధులు నిర్వర్తించాల్సిందేనని, ఇంటి నుంచి పనిచేసే వెలుసుబాటు ఎవరికీ ఉండదని ట్రంప్ స్పష్టంచేశారు.

భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ పునరుద్ధరణ

దేశంలో భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ పునరుద్ధరిస్తూ, ప్రభుత్వ సెన్సార్‌షిప్‌ను నియంత్రిస్తూ ఉత్తర్వుపై ట్రంప్ సంతకం చేశారు. జో బైడెన్ హయాంలో డిపార్టుమెంట్ ఆఫ్ జస్టిస్, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్, ఫెడరల్ ట్రేడ్ కమిషన్ వంటి సంస్థల సాగించిన కార్యకలాపాలపై విచారణ జరపాలని అటార్నీ జనరల్‌ను ఆదేశించారు.

విదేశాలకు సాయం నిలిపివేత

విదేశాలకు ఆర్థిక సాయం తాత్కాలికంగా నిలిపివేస్తూ మరో నిర్ణయం తీసుకున్నారు. విదేశాలకు సహాయం అందించే కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో సమీక్షిస్తామని తెలిపారు. 'అమెరికా ఫస్ట్' విదేశాంగ విధానంలో భాగంగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. వెనెజువెలాపై ఆంక్షలు పునరుద్ధరించారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశాల జాబితాలో క్యూబాను మళ్లీ చేర్చారు.

పౌరుల జీవన వ్యయం తగ్గింపు

ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు పౌరుల జీవన వ్యయాన్ని గణనీయంగా తగ్గించాలని ట్రంప్ ఆదేశాలు జారీ చేశారు. ఇళ్లు, ఆరోగ్య సంరక్షణ, గృహోపకరణాలు, నిత్యావసరాలు, ఇంధనం ధరలు తగ్గించాలన్నారు. దీనిపై వెంటనే కార్యాచరణ ప్రారంభించాలని చెప్పారు. జీవన వ్యయం ఏ మేరకు తగ్గిందో 30 రోజుల్లోగా తనకు నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు.

ఇకపై గల్ఫ్ ఆఫ్ అమెరికా

గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మార్చాలని ట్రంప్ స్పష్టంచేశారు. అలాస్కాలోని మౌంట్ డెనాలీ పేరును మౌంట్ మెక్‌కిన్లీగా మార్చాలన్నారు. వాస్తవానికి మౌంట్ మెక్‌కిన్లీ పేరును బరాక్ ఒబామా హయాంలో మౌంట్ డెనాలీగా మార్చారు.

కెనడా, మెక్సికో ఉత్పత్తులపై పన్నుల మోత

కెనడా, మెక్సికో నుంచి దిగుమతి అయ్యే ఉత్పత్తులు, వస్తువులపై ఫిబ్రవరి 1వ తేదీ నుంచి పన్నులు పెంచాలని ట్రంప్ ఆదేశించారు. చైనా, కెనడా, మెక్సికో తదితర దేశాలతో వాణిజ్య సంబంధాల్లో అనైతిక పద్ధతులపై సమీక్ష నిర్వహించాలన్నారు.

పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి వెనక్కి

చరిత్రాత్మక పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి అమెరికా తప్పుకుంటోంది. తద్వారా వాతావరణ మార్పులను నియంత్రించడంతోపాటు పర్యావరణ పరిరక్షణ కోసం ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న కృషికి భారీ విఘాతం కలగబోతోంది. పారిస్ క్లైమేట్ అగ్రిమెంట్ నుంచి అమెరికా వైదొలగుతున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ తేల్చిచెప్పారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. 2017లో ఆయన ఇలాంటి నిర్ణయం తీసుకున్నారు. కానీ, మళ్లీ ఆ ఒప్పందంలో భాగస్వామిగా చేరారు.

భారతీయుల్లో భయం భయం

అమెరికాలో ప్రస్తుతం 1.40 కోట్ల మంది చట్టవిరుద్ధమైన వలసదార్లు ఉన్నట్లు అంచనా. వీరిలో 7.25 లక్షల మంది భారతీయులు ఉన్నారు. ట్రంప్ తాజా నిర్ణయంతో వీరి గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి. అక్రమ వలసదార్లను బయటకు పంపించాలని ట్రంప్ కంకణం కట్టుకున్నారు. ఈమేరకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. వలసదార్లను ఏరివేసే కార్యక్రమంలో త్వరలో ప్రారంభం కానుంది. 2024లో జో బైడెన్ ప్రభుత్వం 1,529 మంది భారతీయులను వెనక్కి పంపించింది. ఇండియా సహా మొత్తం 192 దేశాలకు చెందిన 2.70 లక్షల మంది వెనక్కి వెళ్లిపోయారు. 2014 తర్వాత ఈ స్థాయిలో అక్రమ వలసదార్లను వెనక్కి పంపడం ఇదే మొదటిసారి. అక్రమంగా వలస వచ్చినవారు ఫ్లోరిడా, టెక్సాస్, న్యూయార్క్, న్యూజెర్సీ తదితర రాష్ట్రాల్లో ఉంటున్నారు. చిన్నాచితక పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తక్కువ వేతనానికే కూలీలు లభిస్తుండడంతో గత ప్రభుత్వాలు వీరిని చూసీచూడనట్లు వదిలేశాయి. ట్రంప్ మాత్రం వీరిని బయటకు నెట్టేయాలని గట్టి పట్టుదలతో ఉన్నారు. అమెరికాలో 2.50 కోట్ల మంది అక్రమ వలసదార్లు ఉంటారని ట్రంప్ చెబుతున్నారు. నేర చరిత్ర ఉన్న 6.55 లక్షల మందితోపాటు 10.4 లక్షల మందికి ఇప్పటికే డిపోర్టేషన్ ఉత్తర్వులు అందాయి. త్వరలో వీరంతా వెనక్కి వెళ్లిపోవాల్సిందే. ట్రంప్ బారి నుంచి చట్టపరమైన రక్షణ కోసం అక్రమ వలసదార్లు ప్రయత్నిస్తున్నారు. న్యాయ సలహాలు తీసుకుంటున్నారు.

ఏమిటీ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్?

అమెరికా ప్రభుత్వాన్ని శీఘ్రగతిన సంస్కరించడానికి, పరిపాలనను పరుగులు పెట్టించడానికి డొనాల్డ్ ట్రంప్ ఎంచుకున్న మార్గం ఎగ్జిక్యూటివ్ ఆర్డర్. కాంగ్రెస్ అనుమతి లేకుండానే అధ్యక్షుడు కొన్ని నిర్ణయాలు తీసుకొనే అధికారం ఇలాంటి ఉత్తర్వుల ద్వారా లభిస్తుంది. అయితే, కొన్ని పరిమితులు ఉంటాయి. ప్రభుత్వం ఎలా వ్యవహరించాలని అధ్యక్షుడు కోరుకుంటాడో ఆ మేరకు కొన్ని స్టేట్‌మెంట్లపై సంతకాలు చేస్తాడు. ఆ స్టేట్‌మెంట్లను ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు ఉంటారు. ఇలాంటి ఆర్డర్లు ఒక రకంగా సలహాలు, విజ్ఞప్తుల్లాంటివే. కొన్ని ఆర్డర్లను సవాలు చేయడానికి వీల్లేదు. కొన్నింటిని కోర్టుల్లో సవాలు చేయొచ్చు. కాంగ్రెస్ లేదా కోర్టులు ఇలాంటి ఉత్తర్వులను నిలిపివేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

5న కుంభమేళాలో మోదీ పుణ్యస్నానం

న్యూఢిల్లీ: అశేష భక్త జనవాహిని తరలివస్తోన్న ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళాలో ప్రధాని నరేంద్ర మోదీ సైతం పాల్గొనబోతున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఫిబ్రవరి ఐదో తేదీన ప్రధాని మోదీ త్రివేణి సంగమ స్థలిలో పుణ్యస్నానం ఆచరిస్తారని ఆయా వర్గాలు మంగళవారం తెలిపాయి. మరోవైపు ఈనెల 27వ తేదీన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా త్రివేణి సంగమంలో పవిత్రస్నానం ఆచరించనున్నారు. గంగా హారతి కార్యక్రమంలోనూ పాల్గొంటారు. అధికారులతో భేటీ కానున్నారు. అమిత్ షా వారంరోజుల్లో వస్తుండటంతో కుంభమేళాలో భద్రతను మరోసారి సమీక్షించారు. ప్రధాన కూడళ్ల వద్ద మరోసారి తనిఖీలుచేశారు. ఫిబ్రవరి ఒకటో తేదీన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ఫిబ్రవరి 10వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రయాగ్‌రాజ్‌కు రానున్నారు. నగరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. దట్టంగా పొగమంచు కమ్ముకున్నాసరే భక్తులు మంగళవారం సైతం భారీస్థాయిలో పుణ్యస్నానాలు ఆచరించారు. జనవరి 13న మొదలైన కుంభమేళా ఫిబ్రవరి 26వ తేదీన పూర్తికానుంది. మౌని అమావాస్య (రెండో షాహీ స్నానం) వచ్చే జనవరి 29న , ఫిబ్రవరి మూడో తేదీన వసంత పంచమి రోజు (మూడో షాహీ స్నానం), ఫిబ్రవరి 12న (మాఘ పూర్ణిమ) అధిక సంఖ్యలో జనం రావచ్చు. ఫిబ్రవరి 26న మహాశివరాత్రితో కుంభమేళా ముగుస్తుంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర గణాంకాల ప్రకారం జనవరి 20నాటికి 8.81 కోట్ల మందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు చేశారు.


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది. (ఇన్‌సెట్‌లో)హోటల్ నుంచి ఎగసిపడుతున్న మంటలు

ఘోర విషాదం

తుర్కియే హోటల్‌లో అగ్ని ప్రమాదం ● 66 మంది మృతి.. 51 మందికి గాయాలు

అంకారా: తుర్కియేలో ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్కై రిసార్టు ప్రాంతంలోని హోటల్‌లో మంటలు చెలరేగిన ఘటనలో 66 మంది ప్రాణాలు కోల్పోగా, 51 మంది తీవ్రంగా గాయపడ్డారు. బోలు ప్రావిన్స్‌లో ఉన్న స్కై రిసార్టు ప్రాంతం కర్తల్కయాలోని 12 అంతస్తులున్న గ్రాండ్ కర్తల్ హోటల్‌లోని పై అంతస్తుల్లో తెల్లవారు జామున 3.30 గంటల సమయంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో హోటల్‌లోని 161 గదుల్లో 238 మంది అతిథులున్నట్లు సమాచారం. చుట్టూ పొగలు కమ్ముకోవడంతో ఎక్కడేముందో తెలియక తప్పించుకోవడం లోపలున్న వారికి కష్టమైందని గవర్నర్ అయిదిన్ చెప్పారు. కొరోగ్లు కొండ శిఖరం అంచున హోటల్ ఉండటంతో ఫైరింజన్లు అక్కడికి చేరుకునేందుకు గంట సమయం పట్టిందని చెప్పారు. హోటల్ లోపల అలంకరణ కోసం ఏర్పాటు చేసిన కలప తాపడమే ప్రమాద తీవ్రతను పెంచిందని చెబుతున్నారు. అగ్ని ప్రమాద నివారణకు హోటల్‌లో ఏర్పాటు చేసిన వ్యవస్థలు పనిచేయకపోవడంతో సిబ్బంది సకాలంలో స్పందించలేకపోయారు. మంటలను తప్పించుకునేందుకు ఇద్దరు వ్యక్తులు పైనుంచి దూకి ప్రాణాలు కోల్పోయారు. కిటికీల అద్దాలను పగులగొట్టి కొందరు బెడ్‌షీట్ల సాయంతో కిందికి దిగారని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. 30 ఫైరింజన్లు అతికష్టమ్మీద మంటలను అదుపులోకి తెచ్చాయి. క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని, ప్రాథమిక చికిత్స అనంతరం 17 మందిని ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారని అధికారులు తెలిపారు. హోటల్‌లోని రెస్టారెంట్ విభాగంలో మంటలు ప్రారంభమైనట్లు భావిస్తున్నారు. అయితే, ఇందుకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో కర్తల్కయాలోని హోటళ్లను ముందు జాగ్రత్తగా ఖాళీ చేసి, అతిథులందరినీ చుట్టుపక్కల ప్రాంతాల్లోని హోటళ్లకు తరలించామన్నారు. మరో ఘటన..సివస్ ప్రావిన్స్‌లోని ఇల్డిజ్ కొండల్లో ఉన్న వింటర్ స్పోర్ట్స్ సెంటర్‌లో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో నలుగురు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు.

మళ్లీ తెరపైకి ఏడాది బీఈడీ కోర్సు!

- దశాబ్దకాలం అనంతరం తిరిగి పునరుద్ధరించాలని ఎన్‌సీటీఈ పాలకమండలి భేటీలో నిర్ణయం
- నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్, రెండేళ్ల పీజీ విద్యార్థులకు సౌలభ్యం
- ఎన్‌సీటీఈ చైర్మన్ పంకజ్ అరోరా వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: దాదాపు దశాబ్ద కాలం తర్వాత ఏడాది బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ) విధానాన్ని తిరిగి పునరుద్ధరించాలని నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) నిర్ణయించింది. ఈ మేరకు ఇటీవల జరిగిన ఎన్‌సీటీఈ పాలకమండలి సమావేశంలో నిర్ణయం తీసుకుంది. తిరిగి ఏడాది బీఈడీ కోర్సును పునరుద్ధరిస్తే నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ) లేక రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) పూర్తి చేసిన విద్యార్థులకు ఇది వర్తించనుంది. పాఠశాలల్లో విద్యా నాణ్యతా ప్రమాణాలు పెంచాలన్న లక్ష్యంతో 2014 డిసెంబర్‌లో కేంద్రం ఏడాది బీఈడీ కోర్సును నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2015-16 నుంచి రెండేళ్ల బీఈడీ కోర్సును ప్రవేశపెట్టింది. అయితే ఈ నెల 11న ఎన్‌సీటీఈ టీచర్స్ ఎడ్యుకేషన్ రెగ్యులేటర్ గవర్నింగ్ బాడీ సమావేశంలో టీచర్ ట్రైనింగ్ కోర్సులకు సంబంధించిన పలు నిర్ణయాలను ఆమోదించింది. ఇందులో బీ ఈడీ కోర్సు ఏడాది కాల పరిమితికి సంబంధించి నిర్ణయం చేసింది. 'ఒక ఏడాది బీఈడీ ప్రోగ్రామ్ కేవలం నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు, రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. మూడేళ్ల యూజీ ప్రోగ్రామ్‌లు పూర్తి చేసిన వారికి ఇది అందించబడదు, అలాంటివారు రెండేళ్ల బీఈడీ ప్రోగ్రామ్‌లో నమోదు చేసుకోవాలి. రెండేళ్ల బీఈడీ ప్రోగ్రామ్‌ను అందించే సంస్థలు 2028 నాటికి మల్టీడిసిప్లినరీ ఇన్‌స్టిట్యూట్‌లుగా మారాలి' అని ఎన్‌సీటీఈ చైర్మన్ పంకజ్ అరోరా వెల్లడించారు. కమిషన్ కొన్ని నిర్ణయాలను కేంద్ర విద్యాశాఖతో చర్చిస్తోందని, పబ్లిక్ కన్సల్టేషన్ కోసం వాటిని ఎన్‌సీటీఈ నిబంధనలు- 2025 పేరుతో ముసాయిదాగా సమర్పించేందుకు కృషి చేస్తున్నామని అరోరా తెలిపారు. ఏడాది బీఈడీ ప్రోగ్రామ్‌తో సహా వివిధ కోర్సుల ఫ్రేమ్‌వర్క్‌ను ఖరారు చేయడానికి కమిషన్ సోమవారం ఎనిమిది మంది సభ్యుల ప్యానెల్‌ను సైతం ఏర్పాటు చేసింది. ఇక ఇప్పటికే ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ (ఐటీఈపీ) కింద చేపట్టిన నాలుగు సంవత్సరాల డ్యూయల్ డిగ్రీ గ్రాడ్యుయేట్ స్థాయి కోర్సును మరింత విస్తృతం చేయాలని పాలకమండలి భేటీలో నిర్ణయించారు. ప్రస్తుతం కోర్సు దేశ వ్యాప్తంగా 64 సంస్థల్లో బీఏ-బీఈడీ, బీకామ్-బీఈడీ, బీఎస్సీ-బీఈడీ కోర్సులను అందిస్తుండగా, దీనిని యోగా ఎడ్యుకేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్, సంస్కృతం, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ ఎడ్యుకేషన్‌కు విస్తరించాలని నిర్ణయించారు.

డోజ్ నుంచి వైదొలిగిన వివేక్ రామస్వామి

ఒహాయో గవర్నర్‌గా పోటీ చేయాలని యోచన

వాషింగ్టన్: డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు అమెరికాలో కొత్తగా ఏర్పాటైన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ(డోజ్) విభాగ సహసారథ్య బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు భారతీయ అమెరికన్ పారిశ్రామికవేత్త వివేక్ రామస్వామి ప్రకటించారు. డోజ్‌లో వివేక్ ఇకపై కొనసాగబోరని అమెరికా అధ్యక్షభవనం మంగళవారం ప్రకటించింది. ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్యను తగ్గిస్తూ, ప్రభుత్వ పనితీరు సామర్థ్యాన్ని పెంచడానికి ట్రంప్ ఏర్పాటు చేసిన ప్రభుత్వేతర సంస్థే ఈ డోజ్. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్, వివేక్ ఈ డోజ్‌కు సహసారథ్యం వహిస్తున్న సంగతి తెల్సిందే. వీళ్లను ఈ విభాగానికి నాయకత్వం వహించడానికి అధ్యక్షుడు ట్రంప్ నవంబర్‌లో ఎంపిక చేశారు. ''ఈ ఇద్దరు అద్భుతమైన అమెరికన్లు ప్రభుత్వంలో వృథా ఖర్చులను తగ్గించడానికి, ప్రభుత్వ సంస్థలను సంస్కరించడానికి నాకు మార్గం సుగమం చేస్తారు. సేవ్ అమెరికా ఉద్యమానికి ఇది అత్యవసరం'' అని గతంలో ట్రంప్ వ్యాఖ్యానించడం తెల్సిందే. వచ్చే ఏడాది జరగబోయే ఒహాయో గవర్నర్ ఎన్నికల్లో పోటీ చేసే యోచనలో ఉన్నట్లు 38 ఏళ్ల వివేక్ తాజాగా 'ఎక్స్' పోస్ట్ ద్వారా ప్రకటించారు. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన కొద్దిసేపటికే డోజ్‌ను విడిపోతున్నట్లు వివేక్ ప్రకటించడం గమనార్హం. డోజ్‌ను రూపొందించడంలో వివేక్ రామస్వామి కీలక పాత్ర పోషించారని ట్రంప్ బృంద అధికార ప్రతినిధి అన్నా కెల్లీ ఒక ప్రకటనలో తెలిపారు. ''గత 2 నెలలుగా ఆయన చేసిన కృషికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం. అమెరికాను గొప్పగా తీర్చిదిద్దడంలో ఆయన మళ్లీ కీలక పాత్ర పోషిస్తారని ఆశిస్తున్నాం'' అని కెల్లీ పేర్కొన్నారు.

మస్క్.. నాజీ సెల్యూట్

వెల్లువెత్తిన విమర్శలు



వాషింగ్టన్: ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణంచేశాక నిర్వహించిన ఒక ప్రైవేట్ కార్యక్రమంలో ప్రసంగిస్తూ ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ చేసిన ఒక సెల్యూట్ ఇప్పుడు వివాదమైంది. అధ్యక్ష ఎన్నికల్లో భారీ విరాళాలు, సొంత ఖర్చుతో ప్రచార కార్యక్రమాలతో చేసిన శ్రమ ఫలించి ట్రంప్ గెలిచాడన్న ఆనందంలో మస్క్.. హిట్లర్‌లాగా సెల్యూట్‌చేశారు. దీంతో 'హిట్లర్ సెల్యూట్'గా చరిత్ర చీకటి పుటల్లో గుర్తుండిపోయిన సెల్యూట్‌ను మస్క్ మళ్లీ అనవసరంగా స్మరణకు తెచ్చారని విమర్శలు వెల్లువెత్తాయి. ట్రంప్ అమెరికా నూతన అధ్యక్షుడిగా ప్రమాణంచేశాక సోమవారం వాషింగ్టన్ డీసీలోని క్యాపిటల్ వన్ ఎరీనా ప్రాంతంలో జరిగిన ఒక ఉత్సవవేడుకలో మస్క్ ఉత్సాహంగా మాట్లాడారు. తాను మద్దతిచ్చిన అభ్యర్థే ఇప్పుడు అమెరికా అధ్యక్ష పీఠంపై కూర్చున్నాడన్న సంతోషంతో అత్యుత్సాహంతో మాట్లాడారు. తాను మద్దతిచ్చిన నేతకే ఓటర్లు భారీ మెజారిటీ కట్టబెట్టారంటూ ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి తన హృదయంలో స్థానం ఉందని పేర్కొంటూ కుడి చేతిని తన గుండెపై పెట్టి తర్వాత దూరంగా పైకెత్తి చాపాడు. ఇలా రెండుసార్లు చేశారు. వాస్తవానికి ఇలాంటి సెల్యూట్‌ను గతంలో కేవలం జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్ చేసేవారు. ఆయన నిరంకుశ పాలనలో జర్మనీలోని నాజీ సైనికులూ, హిట్లర్ అభిమానులు సైతం ప్రతి రాజకీయ ర్యాలీలో, బహిరంగ సమావేశాల్లో ఇదే సెల్యూట్ చేసేవాళ్లు. దీంతో మస్క్ నియంతలా సెల్యూట్ చేశాడంటూ సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొత్త ప్రభుత్వం కొలువుతీరిన ఆనందమయ క్షణంలో మస్క్ అసంబద్ధ అభివాదం చేశాడని పలువురు విమర్శించారు. అమెరికా చరిత్రకారుడు క్లేయిర్ ఆబిన్, చరిత్ర అధ్యాపకులు రూత్‌బెన్ గియాట్, ఆరన్ ఏస్టర్ తదితరులూ మస్క్‌ను తప్పుబట్టారు. రెండో దఫా పాలనలో ట్రంప్ ఒంటెత్తు పోకడలను మస్క్ ఇలా పరోక్షంగా వ్యక్తంచేశారన్న వ్యాఖ్యానాలూ వినిపించాయి. విమర్శలపై మస్క్ తనదైన శైలిలో స్పందించారు. '' నా ప్రసంగంపై మీ విమర్శలు పేలవంగా ఉన్నాయి. ఇంకాస్త మెరుగ్గా, పదునైన విమర్శలు చేస్తే బాగుంటుంది. మీ విమర్శల్లో దమ్ములేదు'' అని వ్యాఖ్యానించారు.

ట్రంప్ మాటకు హిల్లరీ నవ్విన వేళ..

అమెరికాలో స్వర్ణయుగం తెస్తానని ట్రంప్ ప్రమాణస్వీకార ప్రసంగంలో పలు ప్రతిజ్ఞలు చేస్తున్నవేళ విపక్ష నాయకురాలు, అమెరికా మాజీ విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్ కిసుక్కున నవ్వారు. ఓవైపు ట్రంప్ సీరియస్‌గా మాట్లాడుతుంటే హిల్లరీ ఎందుకలా నవ్వారన్న అంశం ఇప్పుడు అమెరికాలో చర్చనీయాంశమైంది. హిల్లరీ నవ్విన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. అయితే ఇందుకు కారణం లేకపోలేదు. దశాబ్దాలుగా స్థిరపడిపోయిన ఒక భౌగోళిక స్వరూపం పేరును ఊరకే ఒక దేశాధ్యక్షుడు ఇష్టమొచ్చినట్లు మార్చితే ఇబ్బందులు రావా? అనేది ఇక్కడ అసలు ప్రశ్న. 'గల్ఫ్ ఆఫ్ మెక్సికో' అనే పేరు శతాబ్దాల క్రితమే స్థిరపడిపోయింది. ఇప్పుడు హఠాత్తుగా అమెరికాలాంటి ఏదో ఒక్క దేశం తాము ఈ ప్రాంతాన్ని మరోలా పిలుచుకుంటామంటే కుదరదు. కొత్త పేరును తగిలించడానికి అంతర్జాతీయంగా మ్యాప్‌లలో పేర్లు మార్చాలి. ఈ మార్గంలో వెళ్లే భారీనౌకల సాఫ్ట్‌వేర్‌లలో, సముద్ర సంబంధ ఉపగ్రహాల్లోల డేటాల్లో, చమురు, వాణిజ్య సంస్థల ఒప్పందాల్లో.. ఇలా ఎన్నింటిలోనూ ఈ ప్రాంతం పాత పేరును చెరిపేసి కొత్తపేరును రాయాల్సి ఉంటుంది. ఇదంతా ఎంతో శ్రమతో కూడిన వ్యవహారం. అన్ని దేశాల ఏకాభిప్రాయంతో జరగాల్సిన సుదీర్ఘ ప్రక్రియ ఇది.

- సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి హైదరాబాద్

బుధవారం । 22 । జనవరి । 2025



గంజాయిపై ఉక్కుపాదం

డ్రగ్స్ ఫ్రీ తెలంగాణలో భాగంగా రాష్ట్ర ఎక్సైజ్ శాఖ చేపట్టిన 'ఆపరేషన్ ధూల్‌పేట్' ఆరు నెలలుగా విజయవంతంగా కొనసాగుతోంది.

-8లో



రెక్కలు తొడిగిన ఆశలు..

నగరంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులు, పాఠశాలల భాగస్వామ్యంతో దోబారా అనే ఎన్జీఓ.. పేద వృద్ధుల కోసం ప్రత్యేక నుమాయిష్ సందర్శనను ఏర్పాటు చేసింది.

- సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం
31.0/14.0

వాతావరణం

నగరంలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళ పొగమంచు అలుముకుంటుంది. గరిష్ఠంగా 31, కనిష్ఠంగా 14 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



బైక్‌పై వెళ్తున్న దుండగులు.. సీసీ కెమెరా దృశ్యం (ఫైల్)

'కాల్పుల' వాహనం దొరికింది

ఎంజీబీఎస్ పార్కింగ్ నుంచి బైక్ రికవరీ

- ఆదిలాబాద్ మీదుగా మహారాష్ట్రకు దుండగుల పరారీ
- ఫలితంగా కష్టసాధ్యమవుతున్న గాలింపు
- అఫ్జల్‌గంజ్ ఘటనపై దర్యాప్తు ముమ్మరం

సాక్షి, సిటీబ్యూరో: కర్ణాటకతో పాటు నగరంలో తుపాకీతో కాల్పులకు తెగబడిన దుండగులు వినియోగించిన వాహనాన్ని హైదరాబాద్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అఫ్జల్‌గంజ్‌లోని మహాత్మా గాంధీ బస్టేషన్ (ఎంజీబీఎస్) పార్కింగ్ నుంచి ఈ వాహనాన్ని మంగళవారం రికవరీ చేశారు. నిందితుల ఆదిలాబాద్ మీదుగా మహారాష్ట్రలోకి ప్రవేశించినట్లు అనుమానిస్తున్న అధికారులు.. ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే 750 సీసీ కెమెరాల్లో నమోదైన ఫుటేజ్‌ను వడపోసిన సిటీ పోలీసులు మరిన్ని కెమెరాల ఫీడ్‌ను అధ్యయనం చేయడంపై దృష్టి పెట్టారు. నేరం జరిగిన తీరు, ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న దుండగులు.. హైదరాబాద్‌లోనే షెల్టర్ తీసుకుని, బీదర్‌లో నేరం చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. బీదర్‌లోని శివాజీ జంక్షన్ వద్ద ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రాల్లో డబ్బు నింపే సీఎంఎస్ ఏజెన్సీ వాహనాన్ని కొల్లగొట్టడానికి దుండగులు బైక్‌పై వెళ్లారు. ఈ వాహనానికి 'ఏపీ' రిజిస్ట్రేషన్‌తో కూడిన నకిలీ నంబర్ ప్లేట్ ఉంది. దీన్ని హైదరాబాద్ లేదా శివారు ప్రాంతాల్లో చోరీ చేసి ఉంటారని భావిస్తున్న అధికారులు.. ఆ కోణంలో ఆరా తీస్తున్నారు. బీదర్‌లో నేరం చేసిన తర్వాత రాయ్‌పూర్ వెళ్లడానికి అఫ్జల్‌గంజ్‌కు వచ్చిన దుండగులు.. రోషన్ ట్రావెల్స్ వద్దకు ఎంజీబీఎస్ వైపు నుంచి ఆటోలో వచ్చారు. దీని ఆధారంగా ముందుకు వెళ్లిన దర్యాప్తు అధికారులు మంగళవారం ఎంజీబీఎస్ పార్కింగ్‌లో ఉన్న అనుమానాస్పద వాహనాలను పరిశీలించారు. గురువారం పార్క్ చేసిన వాటి వివరాలు ఆరా తీసి నిందితులు వాడింది గుర్తించారు. నిందితులు సికింద్రాబాద్‌లోని అల్ఫా హోటల్ వద్ద ఎక్కిన ఆటోలో గజ్వేల్ వెళ్లాలని ప్రయత్నించి, తిరుమలగిరిలో దిగిపోయారు. అక్కడ నుంచి శుక్రవారం మధ్యాహ్నానికి ఆదిలాబాద్ చేరుకున్న దుండగులు సరిహద్దులు దాటించి మహారాష్ట్రలో ప్రవేశించినట్లు పోలీసులకు ఆధారాలు లభించినట్లు తెలిసింది. ఆద్యంతం అత్యంత అప్రమత్తంగా వ్యవహరించిన నిందితుల ఆచూకీ కనిపెట్టడానికి పోలీసు విభాగానికి చెందిన ప్రత్యేక బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి.

పెండింగ్ ఫైళ్లను తక్షణమే పరిష్కరించాలి

అనుదీప్ దురిశెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సాక్షి, సిటీబ్యూరో: ప్రజా సమస్యల ఫైళ్లు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్లను హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఫైళ్లు పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు. సీఎంఓ, ప్రజావాణి, మీ సేవ దరఖాస్తులన్నీ తక్షణమే పరిష్కరించాలని, మీ సేవ డాష్ బోర్డ్‌లో పెండెన్సీ లేకుండా చూడాలన్నారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భవనాలు, భూములను గుర్తించాలని, ప్రభుత్వ భూములు, ఖాళీగా ఉన్న భవనాలను గుర్తించి 100 శాతం రిజిస్టర్ రికార్డు చేసి నివేదిక సమర్పించాలన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తులను పరిష్కారం చేయాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ వెంకటాచారి, ఆర్డీవోలు రామకృష్ణ, సాయిరాం, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీరాం, ఈ– డీఎం రజిత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

గజ.. గజ

కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఇలా

ప్రాంతం	డిగ్రీలు
పటాన్‌చెరు	8.6
రాజేంద్రనగర్	10
దుండిగల్	13.8
హకీంపేట	14.1
హయత్‌నగర్	16

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. చలి గజగజ వణికిస్తోంది. తెల్లవారు జామున పొగమంచు రోడ్లను కమ్మేస్తోంది. మంగళవారం రాత్రి చలి తీవ్రత మరింత పెరిగింది. నగరంలో సగటున కనిష్ఠ ఉష్ణోగ్రత 13.8 డిగ్రీలుగా నమోదైంది. శివార్లలో మాత్రం అత్యల్పంగా రికార్డు స్థాయిలో 8.6 డిగ్రీలకు పడిపోయింది. సాధారణం కంటే 5.9 నుంచి 3.9 డిగ్రీల వరకు మైనస్‌లో పడిపోయింది. వారం రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది.

మేయర్‌పై అవిశ్వాసం



కేటీఆర్, తలసాని, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల భేటీ

- వీరి సంభాషణలో ప్రస్తావనకొచ్చిన ఈ అంశం
- టాక్ ఆఫ్ ది సిటీగా మారిన టాపిక్

సాక్షి, సిటీబ్యూరో: నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిపై అవిశ్వాస తీర్మాన అంశం మంగళవారం నగరంలో హాట్ టాపిక్‌గా మారింది. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ జూబ్లీహిల్స్ నివాసంలో జరిగిన విందుకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సంభాషణల్లో మేయర్‌పై అవిశ్వాసం అంశం కూడా ప్రస్తావనకొచ్చింది. మేయర్ పదవీ బాధ్యతలు స్వీకరించి వచ్చే నెల ఫిబ్రవరి 10వ తేదీకి నాలుగేళ్లు పూర్తి కానుండటం, ఆ తర్వాత అవిశ్వాస తీర్మానానికి అవకాశం ఉన్న నేపథ్యంలో మిగతా అంశాలతో పాటు దీనిపై కూడా కొద్దిసేపు మాట్లాడినట్లు తెలిసింది. విందుకు పలువురు నేతలు హాజరు కావడం.. మేయర్‌పై అవిశ్వాసానికి ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు కూడా అవకాశం ఉండటంతో ఇదే అంశంపై చర్చ జరిగిందనే ప్రచారం వైరల్‌గా మారింది. ముఖ్యంగా రాజకీయ వర్గాల్లో, జీహెచ్ఎంసీ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది.

పార్టీ మారినందునే..

జీహెచ్ఎంసీ ఎన్నికల సందర్భంగా మేయర్ పదవి కోసం ఎంతోమంది పోటీ పడినా.. గద్వాల్ విజయలక్ష్మికే బీఆర్ఎస్ అవకాశం కల్పించింది. కాగా.. ఆమె కనీస కృతజ్ఞత లేకుండా గులాబీ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారనే అభిప్రాయం ఆ పార్టీ నేతల్లో ఉంది. దీంతో అవిశ్వాసం అంశం కూడా చర్చకు వచ్చినట్లు తెలిసింది. కేవలం కుటుంబ కార్యక్రమంగా జరిగిన ఈ సమావేశంలో, తాము రాజకీయాల్లో ఉన్నందున రాజకీయ అంశాలు కూడా పిచ్చాపాటీగా చర్చకు వచ్చాయని పార్టీ నాయకుడొకరు తెలిపారు. వివిధ అంశాలతో పాటు మేయర్‌పై అవిశ్వాసం కూడా ప్రస్తావనకు వచ్చిందని, అంతకు మించి ఎక్కువ చర్చ జరగలేదని చెప్పారు. బహుశా వచ్చే శనివారం.. లేదంటే ఆదివారం నగరానికి చెందిన ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు తదితరులతో కేటీఆర్ సమావేశం నిర్వహించనున్నారని సమాచారం. ఆ రోజు రాజకీయ అంశాలతో పాటు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తదితరాలపై ఎజెండాకు అనుగుణంగా సమావేశం జరగనున్నట్లు తెలిసింది. అదే సమావేశంలో మేయర్‌పై అవిశ్వాసానికి సంబంధించి కూడా విస్తృతంగా చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటారని సమాచారం.

ఇంతకీ ఏం జరగనుంది?

మేయర్‌పై అవిశ్వాసం పెడితే ఏం జరగనుంది? గద్వాల్ విజయలక్ష్మి మేయర్ పదవిని కోల్పోక తప్పదా? అనే ప్రశ్నలు ప్రస్తుతం ఆసక్తికరంగా మారాయి. జీహెచ్ఎంసీ చట్టం, నిబంధనలు, ప్రస్తుతం జీహెచ్ఎంసీలో ఆయా పార్టీల బలాలు తదితరాలను పరిగణనలోకి తీసుకుంటే పదవి పోయేంత ప్రమాదమేమీ లేదని మున్సిపల్ వ్యవహారాల నిపుణులు చెబుతున్నారు. నిబంధనల మేరకు కార్పొరేటర్లు, ఎక్స్అఫీషియో సభ్యుల్లో (స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు) 50 శాతం మంది అవిశ్వాస తీర్మానాన్ని కోరుతూ.. నిర్ణీత ప్రొఫార్మా ద్వారా సంతకాలు చేసి హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు అందజేయాలి. ప్రస్తుతం జీహెచ్ఎంసీలో కార్పొరేటర్లు, ఎక్స్అఫీషియో సభ్యులు మొత్తం 196 మంది ఉండగా, అందులో 98 మంది సంతకాలు చేస్తేనే అది సాధ్యం, బీఆర్ఎస్‌కు కార్పొరేటర్లు, ఎక్స్అఫీషియోలు కలిసి 71 మంది సభ్యుల బలం ఉంది.



ప్రస్తుతం పార్టీల వారీగా బలం ఇలా..

పార్టీ	కార్పొరేటర్లు	ఎక్స్అఫీషియోలు	మొత్తం
కాంగ్రెస్	24	5	29
బీఆర్ఎస్	42	29	71
బీజేపీ	39	6	45
ఎంఐఎం	41	10	51
మొత్తం	146	50	196

ఆ పార్టీలు కలిసి వచ్చేనా?

అవిశ్వాసం పెట్టాలంటే మరోపార్టీ కలిసి రావాలి. ఎంఐఎం ప్రస్తుతం కాంగ్రెస్‌తో సఖ్యతగా ఉండటం తెలిసిందే. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్‌తో కలిసి నడుస్తుందని చెప్పలేం. ఇక మిగిలింది బీజేపీ. అది సైతం బీఆర్ఎస్‌తో కలిసే పరిస్థితి లేదు. ఒకవేళ అవిశ్వాసం కోసమే రెండింటిలో ఏదో ఒక పార్టీ సభ్యులు లోపాయికారీగా సంతకాలు చేసి.. అవిశ్వాసం కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినా అవిశ్వాసం నెగ్గే పరిస్థితి లేదు. జీహెచ్ఎంసీలోని సంబంధిత సెక్షన్ 91–ఎ మేరకు మొత్తం ఓటు హక్కున్న సభ్యుల్లో మూడొంతుల మెజారిటీ ఉంటేనే అవిశ్వాసానికి కోరం ఉన్నట్లు లెక్క. ఆ లెక్కన ప్రస్తుతమున్న కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియోలను పరిగణనలోకి తీసుకుంటే 131 మంది సభ్యుల బలం ఉండాలి. బీఆర్ఎస్‌తో బీజేపీ కలిసినా, లేక ఎంఐఎం కలిసినా అది సాధ్యం కాదు. బీఆర్ఎస్, బీజేపీ కలిస్తే మొత్తం బలం 116 అవుతుంది. బీఆర్ఎస్, ఎంఐఎం కలిసినా 122 అవుతుంది. కోరమే ఉండనప్పుడు అవిశ్వాసం ముందుకు వెళ్లే పరిస్థితే ఉండదని జీహెచ్ఎంసీ చట్టం, నిబంధనల గురించి తెలిసిన నిపుణులు చెబుతున్నారు.

అప్పుడు గ్రేట్.. ఇప్పుడు తుస్

బీఆర్ఎస్ పాలనలో నగరం వర్ధిల్లింది

- ఇప్పుడు సమస్యల్లో చిక్కుకుంది..
- కాంగ్రెస్ సర్కారుకు గుణపాఠం తప్పదు
- నగర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్రానికి గుండెకాయ అయిన హైదరాబాద్ ఏడాది కాలంగా సమస్యల సుడిగుండంలో చిక్కుకుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు పేర్కొన్నారు. సీఎంగా కేసీఆర్ సారథ్యంలో హైదరాబాద్ సంతోషానికి చిరునామాగా ఉంటే, నేడు రేవంత్ సర్కార్ పాలనా వైఫల్యంతో సవాలక్ష కష్టాలకు కేరాఫ్ గా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. జూబ్లీహిల్స్‌లోని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసంలో మంగళవారం విందు సందర్భంగా నగర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నగర ప్రజలెదుర్కొంటున్న సమస్యల్ని వారు కేటీఆర్ దృష్టికి తెచ్చారు. బీఆర్ఎస్ హయాంలో సేఫ్ సిటీకి బ్రాండ్‌గా ఉన్న నగరం నేడు క్రైమ్ సిటీగా మారడంతో ప్రజలు అభద్రతా భావంతో ఉన్నారన్నారు. భూకబ్జాలు పెరిగాయని వివరించారు. అందుకు స్పందిస్తూ కేటీఆర్, ప్రజలకు ఎప్పుడు ఏ ఆపద వచ్చినా వెంటనే రంగంలోకి దిగాలన్నారు.

బీఆర్ఎస్ పాలన నగరానికి స్వర్ణయుగం..

బీఆర్ఎస్ పాలన హైదరాబాద్ నగరానికి స్వర్ణయుగమన్నారు. ప్రస్తుత ప్రభుత్వానికి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని కాపాడాలన్న సోయి కూడా లేకపోవడం దురదృష్టకరమన్నారు. నియోజక వర్గంలో ఏ కార్యక్రమానికి వెళ్లినా కాంగ్రెస్ పాలనలోని దురవస్థల గురించే చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బస్తీ వాసులు సమస్యల సుడిగుండంలో చిక్కుకుని విలవిలలాడుతున్నారని, కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీ కూడా అమలు చేయడం లేదని కేటీఆర్ మండిపడ్డారు.

నిర్వహణ కూడా చేతకాని ప్రభుత్వం..

హైదరాబాద్ వాసుల విలువైన సమయాన్ని ఆదా చేసే విధంగా వందేళ్ల ముందు చూపుతో తాము పెద్ద ఎత్తున ఫ్లైఓవర్ల నిర్మాణం చేపట్టామని, త్వరితగతిన వాటిని అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రస్తుత ప్రభుత్వానికి వాటి నిర్వహణ కూడా చేతకావడం లేదని విమర్శించారు. ట్రాఫిక్ కష్టాలు నిత్యకృత్యమయ్యాయని మండిపడ్డారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలన చేతకాదనే నిజాన్ని హైదరాబాద్ వాసులు పూర్తిగా అర్థం చేసుకున్నారన్నారు. గత ఎన్నికల్లో కుల, మత, ప్రాంతాలకు అతీతంగా హైదరాబాదీలంతా పదేళ్ల అభివృద్ధికి పట్టం కట్టి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను భారీ మెజారిటీలతో గెలిపించారని, వారి నమ్మకానికి అనుగుణంగా వారి కష్టాలను తీర్చడమే ప్రథమ కర్తవ్యంగా పనిచేయాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సూచించారు.

విలవిలలాడుతున్న నగరం..

పదేళ్లపాటు దేశంలోనే మోస్ట్ లవబుల్, లివబుల్ సిటీగా అన్నింటా అగ్రభాగాన నిలిచిన హైదరాబాద్ గాడితప్పిన పాలన కారణంగా నేడు విలవిలలాడుతోందన్నారు. తెలంగాణ గ్రోత్ ఇంజన్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత బీఆర్ఎస్ పైనే ఉందని కేటీఆర్ దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలందరికీ రేషన్ కార్డులు, ఇళ్లు, పింఛన్లు ఇవ్వకపోతే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఊరుకునే ప్రసక్తే లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

తిరకాసు దరఖాస్తు!

కొత్త రేషన్ కార్డు కోసం అర్జీకి అవకాశం

24వ తేదీ వరకు వార్డుల వారీగా సభలు

- జాబితాలో పేరు లేని కుటుంబానికి వెసులుబాటు
- విచారణ పూర్తయినవారికి 26 నుంచి కార్డుల జారీ
- మరి ప్రజాపాలన దరఖాస్తుల విషయమేమిటో?

సాక్షి, సిటీబ్యూరో: కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు కలిగింది. సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా రూపొందించిన జాబితాలో పేర్లు లేని కుటుంబాలు ఈ నెల 24 వరకు జరిగే స్థానిక వార్డు సభల్లో దరఖాస్తులు సమర్పించవచ్చని మంత్రులు ప్రకటించారు. దీంతో మంగళవారం నుంచే వార్డు ఆఫీసులకు పేదలు క్యూ కట్టారు. పౌరసరఫరాల శాఖ కొత్త రేషన్ కార్డుల కోసం ఆన్‌లైన్‌లో ఈపీడీఎస్ ఎఫ్ఎస్సీ లాగిన్‌లో దరఖాస్తు చేసుకునే విధానం ఉండగా.. తాజాగా ఆఫ్‌లైన్‌లో జీహెచ్ఎంసీ వార్డు ఆఫీస్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇటీవల ఇంటింటికీ చేసిన సమగ్ర కుటుంబ సర్వేలో రేషన్ కార్డు లేని కుటుంబాలను గుర్తించి తాజాగా ఆ కుటుంబాలపై క్షేత్రస్థాయి విచారణ నిర్వహించారు. విచారణలో సుమారు 70 శాతం వరకు కుటుంబాలు అర్హత సాధించాయి. వీరికి ఈ నెల 26 నుంచి రేషన్ కార్డులు జారీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ కసరత్తు చేస్తోంది.



కొత్త రేషన్ కార్డు దరఖాస్తు ఇదే..

సర్వేలో గుర్తింపు అంతంతే..

సమగ్ర కుటుంబ సర్వేలో రేషన్ కార్డు లేని కుటుంబాల గుర్తింపు అంతంత మాత్రంగానే కొనసాగింది. సర్వే సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో, కొన్ని కుటుంబాలను వదిలివేశారనే ఆరోపణలు ఉన్నాయి. వాస్తవంగా ప్రజాపాలనలో కొత్త రేషన్‌ల కార్డు కోసం సుమారు 5,73,069 కుటుంబాలు దరఖాస్తులు చేసుకున్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అయినప్పటికీ.. వాటిని పరిగణనలోకి తీసుకోకుండా సమగ్ర కుటుంబ సర్వే పేరిట కేవలం 83,285 కుటుంబాలకు మాత్రమే రేషన్ కార్డులు లేనట్లు గుర్తించడం విస్మయానికి గురిచేస్తోంది. మిగతా కుటుంబాల పరిస్థితి ఏంటనే ప్రశ్న తలెత్తుతోంది. ప్రజాపాలనలో సైతం రేషన్ కార్డులు లేని ఎన్నో పేద కుటుంబాలు పాత అడ్రస్‌లతో కూడిన ఆధార్, ఇతరత్రా పత్రాలు లేని కారణంగా దరఖాస్తులు సమర్పించలేకపోయాయి.

ఆఫ్‌లైన్ దరఖాస్తులపై అనుమానమే..

కొత్త రేషన్ కార్డుల కోసం ఆఫ్‌లైన్ దరఖాస్తుల స్వీకరణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత పదేళ్లుగా పౌర సరఫరాల శాఖ ఆన్‌లైన్ ద్వారానే సేవలందిస్తోంది. గత నాలుగేళ్లుగా కొత్త రేషన్ కార్డుల లాగిన్ నిలిచిపోవడంతో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు లేకుండాపోయింది. ప్రజాపాలనాలో కేవలం ఆరు గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించగా రేషన్ కార్డులు లేని వారు సైతం దరఖాస్తులు సమర్పించారు. దీంతో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా వాటిని పరిగణనలోకి తీసుకోకపోవడంతో పేదలు గగ్గోలు పెడుతున్నారు. తాజాగా కూడా వార్డు ఆఫీసుల్లో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు మౌఖికంగా పేర్కొంటున్నప్పటికీ పౌరసరఫరాల శాఖా పరంగా కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల కోసం ప్రకటన విడుదల చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ప్రజాపాలన దరఖాస్తులు ప్రశ్నార్థకమే..

ప్రజాపాలనలో గంపెడు ఆశలతో కొత్త రేషన్ కార్డుల కోసం చేసుకున్న దరఖాస్తుల పరిస్థితి ప్రశ్నార్థకంగా తయారైంది. మరోవైపు ప్రతి సోమవారం కలెక్టరేట్‌లలో జరిగే ప్రజావాణి కార్యక్రమాల్లో సైతం కొత్త రేషన్ కార్డుల కోసం అందిన ఆఫ్‌లైన్ దరఖాస్తుల పరిస్థితి కూడా అదే తరహాగా మారింది. ఇటీవల కుల గణనలో భాగంగా నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో కొత్త రేషన్ కార్డుల కోసం గుర్తించిన కుటుంబాలపైనే తాజాగా క్షేత్రస్థాయి విచారణ జరిగింది. దీంతో కొత్త రేషన్ కార్డుల వ్యవహారం దుమారం రేపుతోంది. ఏళ్లుగా ఎదురు చూస్తున్న నిరుపేద దరఖాస్తు దారులకు నిరాశే కలిగిస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అంటూ పాత పాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో మాత్రం కనీసం పెండింగ్ దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోకపోవడం విస్మయపరుస్తోంది.

బుద్ధ భవన్ పక్కనే హైడ్రా ఠాణా

ముమ్మరంగా సాగుతున్న ఏర్పాట్లు

- పరిశీలించిన కమిషనర్ రంగనాథ్
- వచ్చే నెల నుంచి కార్యకలాపాలు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) పోలీసుస్టేషన్ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. దీనికి గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ప్రభుత్వం ఈ నెల 7న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఠాణాను హైడ్రా ప్రధాన కార్యాలయం ఉన్న బుద్ధ భవన్ పక్కనే ఏర్పాటు చేయనున్నారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) జీహెచ్ఎంసీ అధీనంలో ఉన్నప్పుడు బుద్ధ భవన్‌లో దీని కార్యాలయం ఉండేది. దాని పక్కనే ఉన్న భవనంలో విజిలెన్స్ విభాగం కొనసాగేది. ప్రస్తుతం డీఆర్ఎఫ్‌లో హైడ్రా ప్రధాన కార్యాలయం కొనసాగుతుండగా.. నాటి విజిలెన్స్ కార్యాలయాన్ని ఠాణాగా మారుస్తున్నారు. హైడ్రా పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలను మంగళవారం కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు.

శాంతి భద్రతల విభాగం తరహాలోనే..

శాంతిభద్రతల విభాగం పోలీసుస్టేషన్ తరహాలోనే ఈ ఠాణాలోనూ గదులు, క్యాబిన్లు ఉండాలని కమిషనర్ స్పష్టం చేశారు. అక్కడ పని చేసే అధికారులతో పాటు ఫిర్యాదు చేయడానికి వచ్చే వారికీ పూర్తి సౌకర్యాలు ఉండేలా ఆయన చర్యలు తీసుకుంటున్నారు. ఠాణా సైన్ బోర్డులు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయనున్నారు. అధికారులు, సిబ్బందితో పాటు ఫిర్యాదుదారుల వాహనాలు పార్క్ చేసుకోవడానికి ప్రత్యేక పార్కింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. రానున్న ఫిబ్రవరి మొదటి వారం నుంచి హైడ్రా ఠాణా కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా రంగనాథ్ కసరత్తు చేస్తున్నారు. ఈ ఠాణాకు ఏసీపీ స్థాయి అధికారి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా (ఎస్‌హెచ్ఓ) ఉండనున్నారు. ఓఆర్ఆర్ లోపలి భాగం, దానికి ఆనుకుని ఉన్న మున్సిపాలిటీలు దీని పరిధిలోకి వస్తాయి.

నేరుగా హైడ్రా ఠాణాలోనే..

చెరువులు, ప్రభుత్వ భూములు, పార్కుల తదితరాలను కబ్జా చేయడం, పూడ్చివేయడం తదితర అంశాలపై హైడ్రా కన్నేసి ఉంచుతోంది. జల వనరుల్లో కట్టడాలకు అడ్డగోలుగా అనుమతులు ఇవ్వడాన్నీ తీవ్రంగా పరిగణిస్తోంది. దీనిపై ప్రస్తుతం ఆయా పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయిస్తోంది. దైనందిన కార్యకలాపాల్లో ఉండే స్థానిక పోలీసులు ఈ అంశాలకు కీలక ప్రాధాన్యం ఇచ్చి దర్యాప్తు చేయలేకపోతున్నారు. ఇది కబ్జా కోరులు, అక్రమార్కులకు వరంగా మారుతోంది. ఇకపై ఇలాంటి కేసుల్ని నేరుగా హైడ్రా ఠాణాలోనే నమోదు చేసి, దర్యాప్తు చేస్తారు. ఈ ఠాణాలో పని చేయడానికి సిబ్బంది, అధికారులను డిప్యుటేషన్ ప్రాతిపదికపై తీసుకోనున్నారు.



హైడ్రా ఠాణాను పరిశీలిస్తున్న రంగనాథ్

‘క్రెటా’ ఎలక్ట్రిక్ మోడల్ ఆవిష్కరణ

సాక్షి,సిటీబ్యూరో: హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025 వేదికగా హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్ మోడల్‌ను ఆవిష్కరించింది. ఈ సందర్భంగా హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఉన్సూ కిమ్ మాట్లాడుతూ., క్రెటా ఎలక్ట్రిక్ మోడల్ సంస్థ ప్రయాణంలో నూతన అధ్యాయాన్ని సృష్టించిందన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు ‘మేక్ ఇన్ ఇండియా’ విజన్‌లో భాగంగా హ్యుందాయ్ దేశంలోనే మొదటి ఇండిజీనస్ ఈవీ ఎస్‌యూవీ మోడల్‌ను ఆవిష్కరించామన్నారు. 17,99,000 ప్రారంభ ధరతో ఈ మోడల్ అందుబాటులో ఉందన్నారు. ముఖ్యంగా 51.4కిలో వాట్స్, 42 కిలో వాట్స్‌ల సామర్థ్యమున్న రెండు బ్యాటరీల ప్యాకప్‌తో అధునాతనంగా రూపొందించామన్నారు. ఈ క్రెటా మోడల్‌లో 75 అధునాతన భద్రత సౌకర్యాలతో పాటు అధునాతన ఈవీ సౌలభ్యాలు ఉన్నాయన్నారు. ఈవీ ఎలక్ట్రిక్ కార్ల రంగంలో వినూత్న ఆవిష్కరణలతో హ్యుందాయ్ తన ప్రత్యేకతను నిలుపుకుందని కిమ్ పేర్కొన్నారు.

అట్టహాసంగా సైబరాబాద్ పోలీస్ డ్యూటీ మీట్



స్పోర్ట్స్‌మీట్-డ్యూటీమీట్‌ను ప్రారంభిస్తున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, తదితరులు

రాయదుర్గం: సైబరాబాద్ 7వ వార్షిక క్రీడలు–డ్యూటీమీట్–2024 అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి పావురాలు, బెలూన్లు ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరం ఆరోగ్యంగా ఉంటే మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. శారీరక శ్రమను దినచర్యలో భాగంగా చేసుకోవాలన్నారు. క్రీడా పోటీల్లో అందరూ చురుగ్గా పాల్గొనాలని సూచించారు.

4 రోజులపాటు క్రీడాపోటీలు

స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా నాలుగు రోజుల పాటు క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. 800,100 మీటర్ల పరుగు, కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, క్యారమ్స్, చదరంగం వంటి క్రీడా పోటీలను నిర్వహిస్తారు. సైబరాబాద్ పరిధిలోని పోలీసులను మాదాపూర్ జోన్‌గా, శంషాబాద్, బాలానగర్, రాజేంద్రనగర్, మేడ్చల్, ట్రాఫిక్ వింగ్, క్రైమ్స్ వింగ్, సీఏఆర్ ప్రధాన కార్యాలయం, మినిస్టీరియల్ స్టాఫ్ జట్లు ఇలా 9 జట్లుగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నారు. తొలిరోజు మంగళవారం నిర్వహించిన పురుషుల పరుగు పోటీల్లో పవన్, కుమార్ మొదటి, రెండు స్థానాల్లో నిలువగా అఖిలేష్ మూడో స్థానం దక్కించుకున్నారు.800 మీటర్ల పరుగులో రాజమణి, స్వాతి, తేజస్విని మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయల్‌డేవిస్, డీసీపీలు వినీత్, కోటిరెడ్డి, సురేష్‌కుమార్, శ్రీనివాస్, రాజేష్, కె నర్సింహ్మా, సృజన, శ్రీబాల, సాయిశ్రీ, ఎల్‌సీ నాయక్, శ్రీనివాస్, శోభన్‌కుమార్, సంజీవ, సాయి మనోహర్, గుణశేఖర్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం

- విజయవంతంగా ఆపరేషన్ ధూల్ పేట్
- డ్రగ్స్ ఫ్రీ తెలంగాణలో భాగంగా నిర్వహణ
- పోలీసు, ఎక్సైజ్ శాఖ ఉమ్మడి కార్యక్రమం
- ఆరు నెలల్లో 260 మంది అరెస్ట్



ఆపరేషన్ ధూల్‌పేటలో భాగంగా రాత్రి వేళల్లో పర్యటిస్తున్న ఎక్సైజ్ ఉన్నతాధికారులు (ఫైల్)

అబిడ్స్: డ్రగ్స్ ఫ్రీ తెలంగాణలో భాగంగా రాష్ట్ర ఎక్సైజ్ శాఖ చేపట్టిన ఆపరేషన్ ధూల్‌పేట్ ఆరు నెలలుగా విజయవంతంగా కొనసాగుతుంది. రాష్ట్రం నలుమూలలా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను పూర్తిగా నిరోధించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో రాష్ట్ర ఎక్సైజ్, పోలీస్ శాఖ సమష్టిగా ఆపరేషన్ ధూల్‌పేట్‌ను ప్రారంభించారు. ధూల్‌పేట్‌లో పదేళ్ల క్రితం ఎక్సైజ్ అధికారిగా పనిచేసి గుడుంబా నిషేధానికి విశేష కృషి చేసిన రాష్ట్ర ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ నంద్యాల అంజిరెడ్డిని ధూల్‌పేట ఆపరేషన్‌కు ఇన్‌ఛార్జ్ స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు. జులై 17న ఈ ఆపరేషన్‌ను ప్రారంభించిన రాష్ట్ర ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి గంజాయి అమ్మకాలు, కొనుగోళ్లను సమూలంగా నిర్మూలించాలని ఆదేశించారు. అధికారుల కృషి ఫలితంగా 180 రోజుల్లో ధూల్‌పేట ప్రాంతంలో గంజాయి అమ్మకాలు, కొనుగోళ్లు దాదాపు కనుమరుగయ్యాయి. ఇందులో భాగంగా ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారులు ధూల్‌పేట ప్రాంతంలోని గంజాయి విక్రయదారులు, స్థానికులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

180 రోజులు.. 78 కేసులు..

సిబ్బంది సహకారం, ఉన్నత స్థాయి ఎక్సైజ్ అధికారుల దిశా నిర్దేశంతో ధూల్‌పేట ఆపరేషన్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్నట్లు ధూల్‌పేట ఆపరేషన్ ఇన్‌ఛార్జ్ స్పెషల్ ఆఫీసర్, నంద్యాల అంజిరెడ్డి తెలిపారు. ధూల్‌పేట్‌లో గంజాయి అమ్మకాలు, కొనుగోళ్లు దాదాపు తగ్గిపోయాయన్నారు.



నంద్యాల అంజిరెడ్డి (ఎక్సైజ్ ఆపరేషన్స్ స్పెషల్ ఆఫీసర్)

మంగళవారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడుతూ 12 ఏళ్ల క్రితం ధూల్‌పేట్‌లో పనిచేసిన అనుభవంతో కింది స్థాయి సిబ్బంది, ఆపరేషన్‌కు కేటాయించిన సిబ్బంది, ధూల్‌పేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు మధుబాబు, గోపాల్ బృందాలు ప్రతిరోజు ధూల్‌పేట ప్రాంతంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టాయన్నారు. బృందాలుగా ఏర్పడి గంజాయి విక్రయదారుల ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించి గంజాయి విక్రయాలను కట్టడి చేశామన్నారు. 180 రోజుల్లో 78 గంజాయి కేసులు నమోదు చేసి 260 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. 6 నెలల వ్యవధిలో 350 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 4.2 కిలోల హాషిష్ ఆయిల్, 46 మోటర్ సైకిళ్లు, 2 కార్లు, 122 మొబైల్ ఫోన్లను సీజ్ చేసినట్లు ఆయన వివరించారు. 148 గంజాయి విక్రేతలను బైండోవర్ చేశామన్నారు.

గంజాయి డాన్ పై పీడీయాక్ట్

గంజాయి వ్యాపారంలో పేరుగాంచిన లేడీ గంజాయి డాన్ అంగూరిబాయిపై పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపినట్లు ఎక్సైజ్ స్పెషల్ ఆఫీసర్ నంద్యాల అంజిరెడ్డి తెలిపారు. ముందుగా గంజాయి వ్యాపారులను బైండోవర్ చేస్తున్నామన్నారు. మళ్లీ గంజాయి వ్యాపారాలు చేస్తే పీడీ యాక్ట్‌లు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో..

గంజాయి విక్రయాలపై కొందరు ఇచ్చిన సమాచారంతో పాటు సాంకేతిక పరిజ్ఞానంతో వారి ఫోన్ నెంబర్ల లావాదేవీల ఆధారంగా గంజాయి విక్రయదారులపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఫోన్‌నెంబర్ల ద్వారా ఆన్‌లైన్‌లో ఎవరైనా గంజాయి విక్రయాలు, కొనుగోళ్లు చేపడితే వారి ఫోన్‌నెంబర్ల ఆధారంగా పూర్తి డేటాను సేకరించి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎవరైనా ఒక గంజాయి వ్యాపారి ఆన్‌లైన్ ద్వారా ఇతరులకు విక్రయాలు చేస్తే అందరి వివరాలను సేకరించి వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. 100 శాతం గంజాయి నిర్మూలనే లక్ష్యంగా ‘ఆపరేషన్ ధూల్‌పేట్’ కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

అప్రమత్తతే రహదారి భద్రత



రహదారిభద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆర్టీఏ పశ్చిమ మండలం ప్రాంతీయ రవాణా కార్యాలయంలో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండడం వల్ల మాత్రమే ప్రమాదాలను నివారించవచ్చునని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్టీఓ జి.రవి, ఎంవీఐలు సింగం శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్‌రావు, వెంకటసురేష్, అఖిల,కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. – సాక్షి, సిటీబ్యూరో

చిలుకూరు బాలాజీ సన్నిధిలో ప్రియాంకా చోప్రా



మొయినాబాద్: ప్రముఖ సినీనటి ప్రియాంకా చోప్రా చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ దేవాలయానికి వచ్చిన ఆమె ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం గర్భగుడిలోకి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రంగరాజన్ ఆమెకు చిలుకూరు బాలాజీ విశిష్టతను తెలియజేశారు. స్వామివారి శేషవస్త్రాలను అందజేసి ఆశీర్వదించారు. చిలుకూరు బాలాజీని దర్శించుకున్న అనంతరం ఆమె ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. చిలుకూరుకు వెళ్లడం కొత్త ప్రయాణమంటూ పోస్టులో పేర్కొన్నారు.

సందడిగా మిస్ నుమాయిష్ పోటీలు



మిస్ నుమాయిష్ విజేతలు ఈశ్వరీ, వరుణ, ఖుషి

అబిడ్స్: ఎగ్జిబిషన్‌లో నిర్వహించిన ‘మిస్ నుమాయిష్’ పోటీలు సందడిగా సాగాయి. మంగళవారం సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పలు కళాశాలల విద్యార్థినిలు పాల్గొన్నారు. మిస్ నుమాయిష్ 2025 విజేతలుగా ఈశ్వరీ (కస్తూరిబాయి డిగ్రీ కళాశాల), వరుణ (కమల నెహ్రూ పాలిటెక్నిక్ కళాశాల), ఖుషి (కస్తూరిబా డిగ్రీ కళాశాల) నిలిచారు. ఎగ్జిబిషన్ సొసైటీ కల్చరల్ విభాగం జాయింట్ కన్వీనర్లు సుచరిత, నీత, ముఖ్య అతిథి ఐ డ్రీమ్ యాంకర్ అంజలి, కన్వీనర్ సంధ్య దీపాల, తీన్మార్ యాంకర్ పద్మ, కొరియోగ్రాఫర్ సుధా జైన్ విజేతలకు బహుమతులు అందజేశారు.

రైలు కిందపడి విద్యార్థిని ఆత్మహత్య

కాచిగూడ: బాయ్ ఫ్రెండ్‌తో చాటింగ్ చేస్తున్న విషయం అక్కకు తెలియడంతో తల్లిదండ్రులకు చెబుతుందనే భయాందోళనకు గురైన ఓ విద్యార్థిని మంగళవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా, గుడూరుకు చెందిన దర్శనం భార్గవి (17) ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ హాస్టల్‌లో ఉంటూ ఆంధ్ర మహిళా సభ కాలేజీలో ఇంటర్ 2వ సంవత్సరం చదువుతోంది. మంగళవారం ఆమె బాయ్ ఫ్రెండ్‌తో చాటింగ్ చేస్తున్న విషయం అక్కకు తెలియడంతో ఆందోళనకు గురైన భార్గవి జామై ఉస్మానియా రైల్వే స్టేషన్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించిన రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్రలు మీదపడి సెంట్రింగ్ కార్మికుడి మృతి



రాజు మృతదేహం

మేడిపల్లి: నిర్మాణంలో ఉన్న షట్టర్ల పైన ఉన్న సెంట్రింగ్‌ను తొలగిస్తుండగా కర్రలు మీదపడి ఓ కార్మికుడు మృతి చెందగా మరొకరు గాయపడిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రామంతపూర్ ప్రాంతానికి చెందిన రాజు(47)సెంట్రింగ్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. మంగళవారం అతను పీర్జాదిగూడ బండిగార్డెన్ సమీపంలో షట్టర్ల కోసం నిర్మించిన గోడలపై భాగంలో ఏర్పాటు చేసిన సెంట్రింగ్ కర్రలను తొలగిస్తుండగా ఒక్కసారిగా కర్రలు మీద పడడంతో తీవ్రంగా గాయపడిన రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో కార్మికుడికి స్వల్పగాయాలయ్యాయి. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైదాబాద్‌లో దారి దోపిడీ

సైదాబాద్: స్నేహితులను కలిసి వెళుతున్న యువకులను అడ్డగించిన అగంతకులు వారిలో ఒకరిని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బెదిరించి నగదు, సెల్‌ఫోన్లు లాక్కున్న సంఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... నల్గొండ జిల్లా, తుంగపాడ్ గ్రామానికి చెందిన పుల్కారం నరేష్ తన స్నేహితుడు మణికంఠతో కలిసి సోమవారం నగరానికి వచ్చాడు. అదే రోజు రాత్రి నగరంలో ఉంటున్న మరో స్నేహితుడు మహేష్‌తో కలిసి పిసల్‌బండలో పెళ్లికి వెళ్లాడు. అనంతరం ముగ్గురూ కలిసి సైదాబాద్‌లో ఉంటున్న స్నేహితురాలిని కలిసేందుకు వచ్చారు. ఆ తర్వాత కొంత సేపటికి వారు తిరిగి వెళుతుండగా రెండు బైక్‌లపై వచ్చిన నలుగురు యువకులు వారిని అడ్డుకుని ఇక్కడికి ఎందుకు వచ్చారంటూ దుర్భాషలాడుతూ దాడికి దిగారు. దీంతో మణికంఠ, రాజేష్ వారికి చిక్కకుండా తప్పించుకున్నారు. ఒంటరిగా ఉన్న నరేష్‌ను వారు సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అక్కడ మరికొందరితో కలిసి తీవ్రంగా కొట్టి అతడి వద్ద ఉన్న రూ.1500 నగదు, సెల్‌ఫోన్ లాక్కున్నారు. అంతటితో ఆగకుండా నరేష్ ఫోన్ నుంచి మణికంఠకు ఫోన్ చేసి మరిన్ని డబ్బులు ఇస్తేనే నరేష్‌ను విడిచిపెడతామని బెదిరించారు. అతను డబ్బులు లేవని చెప్పడంతో నరేష్‌ను వదిలేశారు. బాధితుడు నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సైదాబాద్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పైనుంచి పడి వృద్ధుడి మృతి

గౌలిపురా: ప్రమాదవశాత్తు భవనం మూడో అంతస్తు నుంచి కిందపడి ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన మంగళవారం మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చందులాల్ బేలా ప్రాంతానికి చెందిన దామోదర్ పరసాద్ సోని (92) మంగళవారం ఉదయం బ్రష్ చేసుకుంటూ మూడో అంతస్తుపైకి వెళ్లాడు. ఉమ్మి వేసేందుకు కిందకు వంగిన అతను ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని ఆస్రా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కాపురానికి రావడం లేదని..

మనస్తాపంతో భర్త ఆత్మహత్యాయత్నం

అమీర్‌పేట: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి లోనైన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండల కేంద్రానికి చెందిన కొమ్ముల చెన్నయ్య (36)కు కావ్య అనే మహిళతో 10 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. నగరానికి వలస వచ్చిన వారు రామాంతపూర్‌లో నివాసం ఉంటున్నారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. రెండేళ్ల క్రితం భార్యా,భర్తల మధ్య గొడవ జరగడంతో కావ్య పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి చెన్నయ్య ఒంటరిగా ఉంటున్నాడు. మంగళవారం ఉదయం బైక్‌పై ఎస్ఆర్‌నగర్ బాపూనగర్‌కు వచ్చిన చెన్నయ్య వెంకటేశ్వర బాయ్స్ హాస్టల్ వద్ద ఒంటిపై పెట్రోల్ చల్లుకుని నిప్పంటించుకున్నాడు. దీనిని గుర్తించిన హాస్టల్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అనంతరం 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితుడిని గాంధీ ఆసుపత్రికి తరలించి. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చెన్నయ్య తల్లి జానకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జేసీ ప్రభాకర్ రెడ్డిపై ఫిర్యాదు

- తనను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపణలు
- సైబరాబాద్ కమిషనర్‌కు మాధవీలత లేఖ

సాక్షి, సిటీబ్యూరో: తెలుగు దేశం పార్టీ నాయకుడు, తాడిపత్రి మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తనను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారంటూ నటి, బీజేపీ నాయకురాలు మాధవీ లత సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభాకర్ రెడ్డి ఇటీవల చేసిన అవమానకరమైన వ్యాఖ్యలు తనను తీవ్ర మానసిక క్షోభకు గురిచేశాయని ఆరోపిస్తూ మంగళవారం గచ్చిబౌలిలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ అవినాష్ మహంతికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ... నటీమణులు, మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారని, ఈ వ్యాఖ్యలు తనను ప్రభావితం చేయడమే కాకుండా తన కుటుంబ సభ్యుల్లో భయాన్ని, బాధను కలిగించాయన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా డిసెంబర్ 31న తాడిపత్రిలోని జేసీ పార్కులో ప్రభాకర్ రెడ్డి మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కార్యక్రమానికి ముందు జేసీ పార్క్ వద్ద తరచూ సంఘ వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నాయని, మహిళలు హాజరుకావద్దని మాధవీలత సోషల్ మీడియాలో వీడియోను పోస్ట్ చేశారు. దీనిపై స్పందించిన ప్రభాకర్ రెడ్డి ఆమెను కించపరిచే వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై ఇప్పటికే మాధవీలత నేషనల్ ఉమెన్ కమిషన్, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఆఫ్ ఇండియా, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్లలో కూడా ఫిర్యాదు చేశారు.

‘ఆ చరిత్ర కాంగ్రెస్ పార్టీదే’

మహేశ్వరం: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదే అని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నాగారంలో కుండె వెంకటేశ్ ఫామ్ హౌస్‌లో మంగళవారం సాయంత్రం బీజేపీ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రాజ్యాంగం చేతబట్టి బీఆర్ అంబేడ్కర్ వారసులమని చెప్పుకొనే పార్టీలను ప్రజలు విశ్వసించరని అన్నారు. సొంత ఇంటి వారికే భారతరత్న బిరుదులు ఇచ్చుకున్న చరిత్ర కాంగ్రెస్‌ది అని విమర్శించారు. వాజ్‌పేయ్ ప్రధాని అయ్యేంతవరకు పార్లమెంట్‌లో అంబేడ్కర్ చిత్రపటం కూడా పెట్టలేదని గుర్తు చేశారు. అంబేడ్కర్ ఆలోచనలు, సిద్ధాంతాలను పాటిస్తుంది బీజేపీ మాత్రమే అని తెలిపారు. గ్రామాల్లో పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, రాష్ట్ర నాయకులు అంజన్‌కుమార్ గౌడ్, ప్రేమ్ రాజ్, బస్వ పాపయ్య గౌడ్, బోసుపల్లి ప్రతాప్, దేశ్యా నాయక్, కుండె వెంకటేశ్, జిల్లా కార్యదర్శి అయిల్ల యాదయ్య గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మాధవాచారి, మండల అధ్యక్షుడు యాదిష్ తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ చేసిన కారులోని లగేజీ మాయం

రెండు పాస్‌పోర్టులతో సహా విలువైన వస్తువులు చోరీ

ఫిలింనగర్: దోహ (ఖతర్) నుంచి ఫ్లైదుబాయ్ ఎయిర్‌లైన్స్‌లో నగరానికి వచ్చిన ఇద్దరు వ్యక్తులు తమ కారును పార్కు చేసి రెస్టారెంట్‌కు వెళ్లి వచ్చేసరికి లగేజీని మాయం చేసిన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కామారెడ్డి జిల్లా బాన్సువాడ ఎన్జీఓకాలనీకి చెందిన ఎలక్ట్రికల్ ఇంజినీర్ సయ్యద్ మొహిసిన్ తన బావమరిది మహ్మద్ జుబైర్‌తో కలిసి ఈ నెల 21న తెల్లవారుజామున 2.06 గంటలకు దోహ నుంచి ఫ్లైదుబాయ్ ఎయిర్‌లైన్స్‌లో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. అప్పటికే మహమ్మద్ జుబైర్ సోదరుడు మహమ్మద్ ఉబైద్ డ్రైవర్ సమీర్ హుస్సేన్ ఇక్బాల్‌తో కలిసి కారులో వేచి ఉన్నారు. వీరు టోలిచౌకీలో ఉన్న సయ్యద్ మొహిసిన్ సోదరి ఇంటికి బయలుదేరారు. నేరుగా టోలిచౌకికి చేరుకున్న వారు అక్కడి ఆదిత్యనగర్ లేన్‌నెంబర్–2లోని ఓ రెస్టారెంట్ వద్ద కారు నిలిపి లోపలికి వెళ్లారు. తిరిగి 15 నిమిషాల తర్వాత కారు వద్దకు రాగా కారు వెనుక అద్దం పగిలిపోయి ఉండడంతో పాటు కారులో ఉంచిన ఐదు లగేజీ బ్యాగ్‌లు కనిపించలేదు. అందులో రెండు పాస్‌పోర్ట్‌లు, రూ.20 వేల నగదు, 8 గ్రాముల బంగారు ఉంగరం తదితర వస్తువులు ఉన్నాయని, గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించి ఉంటారని భావించి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఖైరతాబాద్: సైఫాబాద్ డివిజన్ పరిధిలోని ఏసీ గార్డ్స్, లుంబినీపార్క్, ఇందిరాపార్క్, విట్టల వాడి సబ్‌స్టేషన్ల పరిధిలో ట్రీ కట్టింగ్, విద్యుత్ మెయింటెనెన్స్ పనుల్లో భాగంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కేర్ హాస్పిటల్, విరించి, సాక్షి దినపత్రిక కార్యాలయం, వాటర్ వర్క్స్ కార్యాలయం, టీటీడీ మెయిన్ రోడ్డు, లిబర్టీ మెయిన్ రోడ్డు, హిమాయత్‌నగర్ మెయిన్ రోడ్డు, సత్య కిడ్నీ సెంటర్, అలహాబాద్ బ్యాంక్ ఏరియా, జమున ప్లాజా అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఇందిరాపార్క్, విఠలవాడి సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దోమలగూడ ఏరియా, హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెం–5, వాసు మెడికల్ షాప్, గెలాక్సీ హోటల్, లెజెండ్ అపార్ట్‌మెంట్ లేన్, ఇండియన్ బ్యాంక్, అబిడ్స్ అన్నపూర్ణ హోటల్, కామత్ హోటల్, నాంపల్లి స్టేషన్ రోడ్డు, ఏపీ ఫర్నిచర్ లేన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

వెంగళరావునగర్‌లో...

వెంగళరావునగర్: ప్రేమ్‌నగర్, శంకర్‌లాల్‌నగర్, శాంతిబాగ్ 11కేవీ ఫీడర్లు, జనప్రియ, బేగంపేట సబ్‌స్టేషన్ల పరిధిల్లో విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ మంగళవారం తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఎర్రగడ్డ మెయిన్‌రోడ్డు, ప్రేమ్‌నగర్, ఛత్రపతి శివాజీనగర్, బ్రహ్మశంకర్‌లాల్‌నగర్, వెంకటేశ్వరకాలనీ, నేతాజీనగర్, సాత్‌శంకర్‌లాల్‌నగర్, నాబార్డ్‌నగర్, శాంతిబాగ్, శివబాగ్, కెకె జోన్ హోటల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు. అదేవిధంగా డీకే రోడ్డు 11కేవీ ఫీడర్ బేగంపేట సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల వల్ల మధ్యాహ్నం 12గంటల నుంచి ఒంటిగంట వరకు డి.కె.రోడ్డు, రోశయ్యలైన్, శివబాగ్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

మానసిక రోగి అదృశ్యం



రహమత్‌నగర్: ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయం నుంచి ఓ రోగి అదృశ్యమైన సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం లింబూర్ గ్రామానికి చెందిన దత్తు(40)కు మానసిక స్థితి బాగలేకపోవడంతో అతని బంధువులు ఇటీవల ఎర్రగడ్డ మెంటల్ హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం చేర్పించారు. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం 10 గంటల నుంచి అతను కనిపించకుండాపోవడంతో దత్తు బంధువుల బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


శ్రీనగర్‌కాలనీ బీజేపీ ప్రెసిడెంట్‌గా అనంతలక్ష్మి



అనంతలక్ష్మిని సన్మానిస్తున్న లంకల దీపక్‌రెడ్డి, నేతలు

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గం శ్రీనగర్‌కాలనీ శాఖ బీజేపీ ప్రెసిడెంట్‌గా గారపాటి అనంతలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాగార్జునగర్‌కాలనీలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ ఇంచార్జ్ లంకల దీపక్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. శ్రీనగర్ కాలనీలో ప్రజా సమస్యలు, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అనంతలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు కుంబాల గంగరాజు, ప్రేమ్‌కుమార్, బాలకృష్ణ, అట్లూరి రామకృష్ణ, బంగారు ప్రశాంత్, శివప్రసాద్, శాంతికుమార్, శ్రీధర్, నరేందర్ యాదవ్, ఉమేష్, రాజేష్, శ్రీదేవి పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న పోలీసులు, అధికారులు



ఖైరతాబాద్: చింతలబస్తీ ప్రధాన రోడ్డులో ఫుట్‌పాతల ఆక్రమణలను ట్రాఫిక్ పోలీసులు మంగళవారం తొలగించారు. చింతలబస్తీ ప్రధాన రోడ్డులో ఫుట్‌పాత్ ఆక్రమణల వల్ల తరచూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. స్థానికులు పెద్ద ఎత్తున ఫిర్యాదు చేస్తున్నారు. దీంతో సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ ఎర్న ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కలిసి ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

స్వయం ఉపాధికి తోడ్పాటు

- మహిళల స్వయం ఉపాధికి ప్రభుత్వం రుణాలు
- ఇందిరా మహిళా శక్తి ద్వారా క్యాంటీన్లు, ఇతర వ్యాపారాల ఏర్పాటుకు ప్రోత్సాహం
- వ్యాపారాల్లో రాణిస్తున్న మహిళా గ్రూపు సభ్యులు



కొందరి మహిళల్లో ఎంత ప్రతిభ ఉన్నా సరైన ప్రోత్సాహం లేక ఆర్థికంగా ఎదగలేకపోతున్నారు. ఇలాంటి వారిని ప్రోత్సహించి, వారి కాళ్లమీద వారు నిలబడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా వారు వ్యాపారాలు చేసుకోవటానికి రుణాలు మంజూరు చేస్తూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతోంది. దీంతో మహిళలు ఈ పథకంపై ఆసక్తి కనబర్చుతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వ్యాపారులుగా మారుతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

బంజారాహిల్స్: మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా నిలదొక్కుకుని కుటుంబాన్ని పోషించే దిశలో ముందంజ వేయాలని తలపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సమాఖ్యల బృందాలకు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను తీసుకువచ్చింది. దీనిలో భాగంగానే జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలోని బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఎన్‌బీటీనగర్ బస్తీకి చెందిన గణేష్ స్వయం సహాయక బృందం సభ్యులు దేవి, జయ, సలోమి, శ్వేత, స్వాతి తదితరులు మహిళాశక్తి క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయంలో ఈ గ్రూపు ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ ఉచితంగా ఇచ్చిన గదిలో క్యాంటీన్ ఏర్పాటు చేశారు. వీరికి రూ.5 లక్షలు రుణం మంజూరైంది. వంట పని నుంచి అన్ని పనులు వీళ్లే చేసుకునే విధంగా ముందస్తు ప్రణాళికతో ముందుకొచ్చారు. టిఫిన్స్, మీల్స్, టీ ఇక్కడ వాళ్లే స్వయంగా తయారు చేసి నాణ్యతతో వడ్డించనున్నారు. ఇందులో వచ్చిన లాభాన్ని అంతా కలిసి పంచుకుంటారు. ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునే దిశలో మహిళలంతా చేయూచేయా కలుపుతున్నారు. ఇప్పటికే సర్కిల్–18 పరిధిలో భోళానగర్‌లో ఒక మహిళా గ్రూపు కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. తమ కాళ్లపై తాము నిలబడడానికి మహిళలకు ఈ పథకం ఒక వరంలా రాగా దీనిని సద్వినియోగం చేసుకునేందుకు అర్హులైన మహిళలంతా పోటీపడుతున్నారు. ప్రభుత్వమే స్థలాలను చూపిస్తూ ఉచితంగా వాటిని కేటాయిస్తూ రుణాలు కూడా మంజూరు చేయిస్తూ వీరిని ప్రోత్సహిస్తున్నది. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి స్వయం ఉపాధి పొందితే సమాజం బాగుపడుతుందన్న ఆలోచనతో ఈ పథకాన్ని తీసుకువచ్చారు. ఇప్పటికే ఈ పథకం పట్ల జీహెచ్‌ఎంసీ అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించారు. అన్ని సర్కిళ్లలోనూ క్యాంటీన్లతో పాటు ఇతరత్రా వ్యాపారాలు ఏర్పాటు చేసుకునేందుకు తగిన ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు.



తయారు చేసిన వంటకాలను వడ్డిస్తున్న ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ ప్రతినిధులు

ఇందిరా మహిళాశక్తి వ్యాపారవేత్తలను చేసింది



మేము ఎప్పటి నుంచో వ్యాపారం చేయాలని అనుకుంటున్నాం. దీని వల్ల అవకాశం వచ్చింది. తామంతా ఆలోచించుకుని వ్యాపారం మొదలుపెట్టాం. ఇందిరా మహిళా శక్తి పథకం మమ్ముల్ని వ్యాపారవేత్తలను చేసింది.

– దేవి, గణేష్ స్వయం సహాయక గ్రూపు లీడర్

వ్యాపార అవకాశం రావడం ఆనందంగా ఉంది



ఇంటి వద్దనే అన్ని తయారు చేసుకుని వస్తున్నాం. పన్నీర్, సాంబార్ తయారు చేయడం నాకు బాగా వచ్చు. గతంలో నేను వంట చేసేదాన్ని. ఈ అవకాశం రావడం ఆనందంగా ఉంది.

– శ్వేత, మెంబర్

అంతా సమష్టిగా పనిచేస్తాం




ఇప్పటి వరకు నేను హౌస్ వైఫ్‌గానే ఉన్నాను. బిర్యానీ బాగా వండుతా. ఇది మాకు మంచి అవకాశం. అంతా కలిసి పనిచేస్తాం. విజయవంతం కావాలని కోరుకుంటున్నా. ఈ పథకంతో అందరం లాభపడాలి.

– స్వాతి, మెంబర్

సీజ్ చేసినా మళ్లీ దర్జాగా వ్యాపారం

పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–92లోని తాజ్‌మహల్ హోటల్ పక్కన ఓ వ్యాపారి నివాసిత ప్లాట్‌లో జీహెచ్‌ఎంసీ అనుమతులు తీసుకోకుండా అక్రమంగా నిర్మించిన వాణిజ్య భవనాన్ని గత నెల 3వ తేదీన జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. అక్రమంగా కమర్షియల్ బిల్డింగ్ అనుమతులు తీసుకోకుండా నిర్మించినందుకు గాను రెండుసార్లు కూల్చివేసిన తర్వాత కూడా సదరు వ్యాపారి తనకున్న పలుకుబడితో దర్జాగా నిర్మించి 'పార్శస్' పేరుతో కేఫ్‌ను తెరిచాడు. ఈ క్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు గత నెల 3వ తేదీన అక్రమమంటూ సీజ్ చేశారు. అయితే సదరు వ్యాపారి మళ్లీ తన పలుకుబడిని ఉపయోగించి రెండు రోజుల క్రితం సీల్ తొలగించి దర్జాగా షాపు ఓపెన్ చేశాడు.



జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–92లో అక్రమ భవనాన్ని సీజ్ చేస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు (ఫైల్)

పోలీసులకు ఫిర్యాదు చేశాం : టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్

సీజ్ చేసిన తరువాత మళ్లీ షాపు ఓపెన్ చేయడం నేరమవుతుందని, దీనిపై నిర్మాణదారుడిపై కేసు నమోదు చేయాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశామని సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు. ఈ అక్రమ నిర్మాణాన్ని మళ్లీ సీజ్ చేస్తామని ఆయన వెల్లడించారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు




టీవీఎస్‌ఈ జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు

బంజారాహిల్స్: టీవీఎస్‌ఈ జేఏసీ ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని మింట్ కాంపౌండ్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండోరోజూ కొనసాగాయి. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని సర్కిళ్లలో దీక్షలు చేపట్టడం జరిగిందని హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ చైర్మన్ ధన్‌రాజ్, కన్వీనర్ శంకర్‌నాయక్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మీడియా ఇన్‌చార్జి రాజేశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లేష్, సౌత్ సెంట్రల్ సర్కిల్ చైర్మన్ రాము, కన్వీనర్ సురేష్ సుదగని తదితరులు పాల్గొన్నారు. కాగా జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఈశ్వరరావు, నాగరాజులు ఈ రిలే నిరాహార దీక్షకులకు పూలమాలలు వేసి కూర్చోబెట్టారు. ఆర్టిజన్ల కన్వర్షన్ కోసం ఈ పోరాటం మరింత ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

హక్కుల కోసం ఏకం కావాలి

మందకృష్ణ మాదిగ

పంజగుట్ట: దళితులు తమ హక్కుల కోసం ఏకం కావాలని అప్పుడే హక్కుల సాధన సాధ్యమవుతుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ అన్నారు. హక్కుల సాధనకు పోరాటం చేస్తుంటే కొందరు అడ్డుకోవడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ ఏ కులంలో అయినా ధనికులు, పేదలు ఉంటారని సమస్య ఎదురైనప్పుడు అన్ని పక్కనపెట్టి పేదలు, న్యాయం పక్షాన నిలబడాలని ఆయన సూచించారు. ఫిబ్రవరి 7వ తేదీన జరిగే లక్ష డప్పులు, వెయ్యి గొంతులు సాంస్కృతిక ఉద్యమం మరో చరిత్ర లిఖిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో రెడ్డి జాగృతి వ్యవస్థాపకులు పిట్ట శ్రీనివాస్ రెడ్డి, సహ వ్యవస్థాపకులు కొట్టం మధుసూదన్ రెడ్డి, ప్రొఫెసర్ ఆరుట్ల జానకి రెడ్డి, ఆర్యవైశ్య చైతన్య వేదిక ప్రతినిధి ప్రేమ్ గాంధీ, హైకోర్టు సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి, జర్నలిస్టు ఇస్మాయిల్, బుచ్చి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శిథిలావస్థ ఆలయాలను పునరుద్ధరించాలి

లిబర్టీ: పురాతన శిథిలావస్థలోని ఆలయాలను పునరుద్ధరించాలని సనాతన ధర్మ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు పుట్టి యాదగిరి ముదిరాజ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వందలాది ఆలయాలు శిథిలావస్థకు చేరుకుని కనీస సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బందిపడుతున్నారన్నారు. మంగళవారం సమితి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందలాది సంవత్సరాల చరిత్ర కలిగిన పురాతన ఆలయాలు ఉన్నాయని, నిత్యం ఆలయాలకు వందలాది మంది భక్తులు వచ్చి పూజలు నిర్వహిస్తుంటారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యాదాద్రి, సిరిసిల్ల జిల్లాలలోని ఆలయాలను అభివృద్ధి చేసిన తరహాలోనే మిగతా ఆలయాలను సైతం పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి, భక్తులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని కోరారు. అలాగే అర్చకులకు కనీస వేతనాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖలకు విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించొద్దు

లిబర్టీ: ఆర్టీసీ డిపోలను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలన్న ఆలోచనను ఆర్టీసీ యాజమాన్యం ఉపసంహరించుకోవాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూడి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రోడ్డు రవాణా సంస్థను బలోపేతం చేసి పేద, మధ్యతరగతి వర్గాలకు మరింత మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఎలక్ట్రికల్ బస్సులు సరఫరా చేస్తున్న సంస్థలకు తెలంగాణ రాష్ట్రంలోని ఆర్టీసీ బస్ డిపోలను దశలవారీగా అప్పగించేందుకు టీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ఆలోచిస్తుందని ఆ ఆలోచన విరమించుకోకపోతే సమాజంలోని అన్ని వర్గాలను కూడగట్టి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఇద్దరు యువకుల అరెస్టు

వెంగళరావునగర్: గంజాయి తాగుతున్న ఇద్దరు యువకులను మధురానగర్ పోలీసులు అరెస్టు చేసి, వారి వద్ద గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 20వ తేదీ రాత్రి మధురానగర్ పీఎస్ సిబ్బంది రహమత్‌నగర్ పరిసర ప్రాంతాల్లో పెట్రోలింగ్ చేస్తున్నారు. ఈ సమయంలో రహమత్‌నగర్‌లో ఇద్దరు యువకులు సిగరెట్ తాగుతూ కనిపించారు. వారిని సమీపించగా వారు పారిపోవడానికి ప్రయత్నించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని విచారించగా రహమత్‌నగర్‌కు చెందిన గోపీ, జవహర్‌నగర్ నివాసి సాయికుమార్‌లుగా తెలియజేశారు. వారిని మరింతగా విచారించడంతో వారి వద్ద గంజాయి ఉన్నట్లుగా అంగీకరించారు. దీంతో వారి వద్ద ఉన్న 1.5 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని, కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

బంజారాహిల్స్: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు–2025లో భాగంగా జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమంలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులు వారు ప్రయాణిస్తున్న వాహనాల భద్రతపై కూడా దృష్టి పెట్టాలన్నారు. కారులో వచ్చినప్పుడు నడిపించే వ్యక్తి తప్పనిసరిగా సీటు బెల్టు పెట్టుకునే విధంగా విద్యార్థులు చొరవ చూపాలన్నారు. రోడ్డు దాటే క్రమంలో రెండు వైపులా చూసిన తర్వాతనే పాఠశాలలోకి వెళ్లాలని పేర్కొన్నారు. భద్రతపై విద్యార్థులు అవగాహన కలిగి ఉంటేనే ఆ కుటుంబం మొత్తానికి అవగాహన ఉంటుందని వెల్లడించారు. ఈ సందర్భంగా అవగాహన బ్యానర్ ప్రదర్శించారు.



అవగాహన కలిగిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్

రూ.1.50 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–10లోని గౌరీశంకర్‌కాలనీకి చెందిన రంగనాథ్‌కు ప్రమాదంలో కాలు విరగడంతో పంజగుట్ట నిమ్స్ హాస్పిటల్‌లో చేర్పించారు. అయితే ఆపరేషన్‌కు అయ్యే ఖర్చు కోసం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.1,50,000 మంజూరైంది. దీంతో దీనికి సంబంధించిన ఆర్థిక సహాయ ఎల్‌ఓసీ చెక్కును టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ విజయారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో భీంరావుతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న విజయారెడ్డి

అక్రమంగా నిర్మించిన ప్రహరీ కూల్చివేత



ఆక్రమిత స్థలంలో ప్రహరీగోడను కూల్చివేస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–36లోని జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌ను ఆనుకుని ఉన్న జీహెచ్‌ఎంసీకి చెందిన ఖాళీ స్థలంలో ఓ ఇంటి యజమాని 1246 గజాల స్థలాన్ని కబ్జా చేసి ప్రహరీ గోడ నిర్మించి కూరగాయల పంట పండిస్తున్నాడు. దీంతో స్థానికుల నుంచి ఫిర్యాదు అందుకున్న జీహెచ్‌ఎంసీ అధికారులు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆదేశాలతో మంగళవారం జేసీబీతో ప్రహరీని పూర్తిగా కూల్చివేశారు. ఈ స్థలాన్ని ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగించాలని, జీహెచ్‌ఎంసీ స్థలమని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని మేయర్ ఆదేశించడంతో అధికారులు ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకుని గేటు నిర్మించతల పెట్టారు. సుమారుగా రూ.20 కోట్ల విలువ చేసే ఈ స్థలంలో జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ కోసం కేటాయిస్తే బాగుంటుందని అధికారులు భావిస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానంగా ఈ స్థలాన్ని కేటాయిస్తే ఇప్పుడున్న స్టేషన్ విస్తీర్ణం మరింతగా పెరుగుతుంది.

ఉద్యోగ విరమణ వయసు పెంచితే ఊరుకోం

కాచిగూడ: ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయస్సు 61 నుంచి 65 సంవత్సరాల వరకు పెంచితే ఊరుకునేది లేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్ అధ్యక్షతన మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య పాల్గొని ప్రసంగించారు. ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయసు పెంచాలని ప్రభుత్వాన్ని ఎవరు అడిగారని ఆయన ప్రశ్నించారు. ప్రజలు అడిగే వాటిని చేయకుండా ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడని, ప్రజలు అడగని వాటిని చేస్తూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డి ప్రజాపాలన గాడి తప్పుతోందన్నారు. ఏకపక్షంగా ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ సమావేశంలో వేముల రామకృష్ణ, తంగెళ్లముడి నందగోపాల్, జి.అంజి, రాందేవ్ మోదీ, రఘుపతి, ప్రవీణ్, మట్ట జయంతి, సుగుణ, ప్రీతం, రవియాదవ్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

బంజారాహిల్స్ రోడ్ నెం. 14 వేంకటేశ్వరస్వామి గుడి ఎదురుగా గుంతలు తేలిన రోడ్డు



నడ్డి విరగాల్సిందే..!

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లో ప్రధాన రోడ్డులో ప్రయాణించాలంటే నడ్డి విరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోడ్డు ప్రారంభం నుంచి చివరి వరకు మధ్య మధ్యలో ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచిపోయి రోడ్డు దెబ్బతినడంతో ఈ దారిగుండా పోయేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వెంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా రోడ్డుపై మురుగు పారుతూ రోడ్డంతా దెబ్బతిన్న జీహెచ్‌ఎంసీ అధికారులు కనీసం మరమ్మతులు చేయలేదు. దీంతో రాత్రి వేళల్లో గుంతలు చూడని ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రసాభాసగా రహమత్‌నగర్ అవగాహన సభ

- సభను అడ్డుకున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి
- ప్రోటోకాల్ పాటించలేదంటూ నిరసన



గ్రామ సభలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, సివిల్ సప్లై అధికారులు




నిరసన తెలుపుతున్న సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: రహమత్‌నగర్ రేషన్‌కార్డు అవగాహన సభ రసాభాస మారింది. ప్రోటోకాల్ పాటించకుండా, సీఎం, మంత్రి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా ప్రభుత్వ పథకాన్ని అవమానపర్చారంటూ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి సభను అడ్డుకున్నారు. ఇరు పార్టీల నాయకులు పరస్పరం నినాదాలు చేసుకున్నారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి సభ ముగిసే వరకు కార్పొరేటర్ బృందాన్ని నిలవరించడంతో వివాదం సద్దుమణిగింది. దీంతో అవగాహనకు వచ్చిన లబ్ధిదారులు అయోమయానికి గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. రహమత్‌నగర్ డివిజన్ అవగాహన సభ ఎస్పీఆర్ హిల్స్ క్వారీ మైదానంలో మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సభలో స్థానిక ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో పాటు సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు. సమాచారం అందుకున్న కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి తన అనుచరులతో కలిసి సభకు ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. అయితే అక్కడ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఫోటోలు లేకపోవడంతో ప్రోటోకాల్ పాటించకుండా సభను ఏలా నిర్వహిస్తారంటు అడ్డుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సభలో సీఎం రేవంత్‌రెడ్డి, హైద్రాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి ఫ్లెక్సీలు లేకుండా ఏలా కొనసాగిస్తారని ఆయన అధికారులను నిలదీశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సీఎన్ రెడ్డిని అతని అనుచరులను సభకు ప్రాంగణం నుంచి బయటికి తీసుకెళ్లారు. ఈ సదర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి జిందాబాద్ అంటు సీఎన్ రెడ్డి అనుచరులు, మాగంటి గోపీనాథ్ జిందాబాద్ అంటూ బీఆర్‌ఎస్ నాయకులు నినాదాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు, కాంగ్రెస్ నాయకులకు మధ్య కొద్దిసేపు తోపులాట జరిగింది. గ్రామసభ ముగియగానే ఎమ్మెల్యే, అధికారులు వెళ్లి పోగా, సీఎన్‌రెడ్డి హెచ్‌ఎఫ్‌నగర్ కమ్యూనిటీ హాల్లో రేషన్ కార్డుల పంపిణీ పై అవగాహన కార్యక్రమం కొనసాగించారు.

ఇంటింటికీ సహజ వాయువు!

తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో ఇంటింటికీ పైప్‌లైన్ ద్వారా సహజ వాయువు(పీఎన్జీ), వాహనాలకు కంప్రెసెడ్ గ్యాస్(సీఎన్జీ) అందించేందుకు భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్(బీజీఎల్) సంస్థ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రాజెక్టు పనులు వేగవంతం చేసేందుకు కార్యాచరణకు దిగింది. తూర్పుతీర ప్రాంతంలోని కృష్ణా–గోదావరి బేసిన్‌లో అపారమైన సహజవాయువు నిల్వలు ఉన్నప్పటికీ పైప్‌లైన్ల విస్తరణకు అనుమతులు లభించక పుష్కరకాలానికి పైగా అపసోపాలు పడుతున్న బీజీఎల్ సంస్థ తాజాగా అన్నింటినీ అధిగమించి పైప్‌లైన్ విస్తరణ పనుల వేగవంతానికి ఉపక్రమించింది. గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా(గెయిల్) హెచ్‌పీసీఎల్‌తో ఒప్పందం కుదుర్చుకొని సహజ వాయువును పైప్‌లైన్ ద్వారా సరఫరా చేసేందుకు సిద్ధమైంది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి మరో రెండు లక్షల వంట గ్యాస్ కనెక్షన్లు ఇవ్వడంతో పాటు అదనంగా పది సీఎన్జీ ఔట్‌లెట్లను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

–సాక్షి, సిటీబ్యూరో



- వేగంగా విస్తరణ దిశగా పైప్‌లైన్ గ్యాస్ పనులు
- గచ్చిబౌలి నుంచి ఎల్‌బీనగర్ వరకు పైప్‌లైన్
- ఈ ఏడాది భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ కార్యాచరణ

తెలుగు రాష్ట్రాల్లో ఇదీ పరిస్థితి

మూడు ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడ, కాకినాడలో బీజీఎల్ సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రాజెక్టును అమలు చేస్తోంది. ఇప్పటి వరకు మూడు ప్రాంతాల్లో కలిపి దాదాపు 2671.90 కిలో మీటర్ల వరకు పైప్‌లైన్లను విస్తరించింది. అందులో 184.02 కిలో మీటర్ల వరకు స్టీల్ పైప్‌లైన్, 2487.88 కి.మీ వరకు ఎండీపీఈ పైప్‌లైన్ పనులు పూర్తయినట్లు బీజీఎల్ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రధానంగా నాలుగు మదర్ స్టేషన్ల కింద 25 స్టేషన్లు, 109 డాటర్ బూస్టర్ స్టేషన్ల నెట్‌వర్క్ కలిగి ఉంది.

- మూడు నగరాల్లో పీఎన్జీ(వంట గ్యాస్) 3,94,046 కనెక్షన్లు ఉండగా అందులో 61 శాతంపైగా హైదరాబాద్‌లో ఉన్నాయి. మిగతా 18శాతం విజయవాడలో, మిగతా కనెక్షన్లు కాకినాడలో ఉన్నాయి. గతేడాది మొత్తం మీద కొత్త కనెక్షన్లు 15,683 మాత్రమే ఇచ్చినట్లు బీజీఎల్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.
- రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి వాణిజ్య పరమైన కనెక్షన్లు 535 ఉండగా పారిశ్రామిక రంగానికి సంబంధించి కమర్షియల్ కనెక్షన్ల సంఖ్య 88కి మించలేదు. గతేడాది కొత్తగా 40 కమర్షియల్ కనెక్షన్లు, 8 పారిశ్రామిక కనెక్షన్లు మాత్రమే ఇచ్చినట్లు తెలుస్తోంది.



హైదరాబాద్‌లో పైప్‌లైన్ల విస్తరణ

విశ్వనగరంగా విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగరంలో గచ్చిబౌలి నుంచి అత్తాపూర్ – కాటేదాన్‌మీదుగా ఎల్‌బీనగర్ వరకు సుమారు 37 కిలో మీటర్ల వరకు పైప్‌లైన్ విస్తరించాలని బీజీఎల్ నిర్ణయించింది. ఆ మార్గంలో సుమారు రెండు లక్షల వంట గ్యాస్ కనెక్షన్లను ఇవ్వొచ్చని భావిస్తోంది. వాస్తవంగా పుష్కర కాలం క్రితం బీజీఎల్ సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రాజెక్టుకు హైదరాబాద్‌లో శ్రీకారం చుట్టింది. అప్పట్లో తొలి ఐదేళ్ల కోసం రూపొందించిన పీఎన్జీ, సీఎన్జీ విస్తరణ ప్రణాళిక పూర్తి చేసేందుకు వివిధ అడ్డంకుల కారణంగా దాదాపు 13 ఏళ్లు పట్టింది. నగర శివారులోని రంగారెడ్డి జిల్లా శామీర్‌పేట్ మదర్ స్టేషన్ కేంద్రంగా ప్రాజెక్టు ఏర్పాటు చేసి తొలుత సమీపంలోని నల్సార్ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని గృహ సముదాయాలకు పైప్‌లైన్ ద్వారా గ్యాస్ కనెక్షన్లు అందించింది.

- మేడ్చల్, సుచిత్ర, కొంపల్లి, జీడిమెట్ల, మణికొండ, గచ్చిబౌలి తదితర ప్రాంతాలకు తర్వాత విస్తరించింది. అవుటర్ రింగ్ రోడ్డు పరిధిలో పలు గేటెడ్ కమ్యూనిటీలకు సైతం పైప్‌లైన్ల ద్వారా వంట గ్యాస్ అందిస్తోంది. తాజాగా మరో రెండు మదర్ స్టేషన్ల ఏర్పాటుకు సిద్ధం కాగా, ఇప్పటికే హఫీజ్‌పేటలో మదర్ స్టేషన్ ప్రారంభించి దినసరి 45,000 కిలోలు గ్యాస్ సరఫరా చేస్తోంది. మరోవైపు మహానగరాన్ని పూర్తిస్థాయిలో సీఎన్జీ ప్రక్రియకు సిద్ధమైంది. మేడ్చల్, హకీంపేట, కంటోన్మెంట్, బాలానగర్ తదితర సీఎన్జీ ఔట్‌లెట్లను ఏర్పాటు చేసింది. ప్రైవేటు వాహనాల కోసం నగరంలో సుమారు 90 సీఎన్జీ స్టేషన్లు ఉండగా, మరో ఐదు నుంచి పది స్టేషన్ల వరకు కొత్తగా ఏర్పాటు చేసేందుకు చర్యలకు ఉపక్రమించింది. నగరంలో దినసరి 1.87 లక్షల కిలోల సీఎన్జీ గ్యాస్‌ను సరఫరా చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ ప్రాజెక్టు

పీఎన్జీ కనెక్షన్లు	పెప్‌లైన్	విస్తరణ(కి.మి)
హైదరాబాద్	2,60,762	1047.83
విజయవాడ	66,608	553.47
కాకినాడ	66,676	1069.60



రూ.3,166 కోట్ల అంచనాతో..

సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కోసం మొత్తం మీద రూ.733 కోట్ల మేరకు పెట్టుబడి వెచ్చించేందుకు సిద్ధమైనట్లు బీజీఎల్ తమ వార్షిక నివేదికలో స్పష్టం చేసింది. మొత్తం మీద మూడు దశాబ్దాల కాలపరిమితిలో సిటీగ్యాస్ డిస్ట్రిబ్యూషన్ పైప్‌లైన్ విస్తరణ పనులు పూర్తి చేయాలని నిర్ణయించింది. పైప్‌లైన్ పనులు పూర్తయితే బీజీఎల్‌కు ప్రస్తుతం కేటాయిస్తున్న కోటాకు అదనంగా గ్యాస్ కోటాను కేటాయించాల్సి ఉంటుంది.

నగరంలో నేడు

- నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది. నిరుపేద వృద్ధుల కోసం.. నుమాయిష్ ప్రత్యేకం.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఇన్నోవేటివ్ హ్యాండ్స్ పేరిట ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం భారీగా దరఖాస్తులు

లక్డీకాపూల్: ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు వెల్లువగా వచ్చాయి. మొత్తం 5,736 దరఖాస్తులు అందాయి. అందులో ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం 5,332 దరఖాస్తులు వచ్చాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 132, విద్యుత్ శాఖకు 131, రెవెన్యూ పరమైన సమస్యలకు 43, ప్రవాసి ప్రజావాణికి 01 అర్జీలు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 97 దరఖాస్తులు అందినట్లు ప్రజావాణి కో ఆర్డినేటర్ రాకేష్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

సాక్షి, సిటీబ్యూరో: పోటీ పరీక్షలైన ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ ఫౌండేషన్ కోర్సుకు ఉచిత కోచింగ్ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జి.ఆశన్న ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను వచ్చేనెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. వివరాలకు ఫోన్: 040–24071178.

మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాలు

సాక్షి, సిటీబ్యూరో: మైనార్టీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని హైదరాబాద్ మైనార్టీ సంక్షేమ అధికారి మొహమ్మద్ ఇలియాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025– 26 విద్యా సంవత్సరానికి హైదరాబాద్ పరిధిలోని 40 పాఠశాలల్లో ఐదో తరగతి, బ్యాక్‌లాగ్ ఖాళీలు గల 6, 7, 8 తరగతుల్లో ప్రవేశాల కోసం అదేవిధంగా 40 జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం(జనరల్, ఒకేషనల్)లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు సమీపంలోని మైనార్టీ గురుకులాల్లో సంప్రదించాలని సూచించారు.

ఆలయ నిర్వాహకులకు ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: ఆలయ ఆర్థిక వ్యవస్థ, కార్యకలాపాల పురోగతి కోసం నిర్వహిస్తున్న అంతర్జాతీయ దేవాలయాల సదస్సు– ఎక్స్‌పో(ఐటీసీఎక్స్) ఆంధ్రప్రదేశ్‌లోని ఆలయ నగరమైన తిరుపతిలో ఇది జరగనుంది. ఈ విషయాన్ని నిర్వాహక సంస్థ టెంపుల్ కనెక్ట్(ఇండియా) వ్యవస్థాపకులు గిరీష్ కులకర్ణి ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 17 నుంచి 19 వరకు జరిగే ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలనుకునే నగరానికి చెందిన ఆలయ నిర్వాహకులు, ప్రతినిధులు ఈ నెల 31వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని, ప్రతి ఆలయం నుంచి ఇద్దరు ప్రతినిధులు ఎటువంటి రిజిస్ట్రేషన్ ఖర్చు లేకుండా హాజరు కావొచ్చని వివరించారు.

నగరంలో సుందరీకరణకు పెద్దపీట

- నారాయణగూడలో రూ.87.60 లక్షలతో పనులు
- ప్రారంభించిన మేయర్ గద్వాల విజయలక్ష్మి



నారాయణగూడలో సుందరీకరణ పనులను ప్రారంభిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

కాచిగూడ: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సుందరీకరణకు పెద్దపీట వేస్తున్నట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. నారాయణగూడ చౌరస్తా, వైఎంసీఏ చౌరస్తా వరకు మొత్తం రూ.87.60 లక్షలతో చేపట్టిన సుందరీకరణ పనులను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి స్థానిక హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి రామన్‌గౌడ్‌తో కలిసి మంగళవారం రాత్రి ప్రారంభించారు. నారాయణగూడ జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ కింద రూ.40 లక్షలతో చేపట్టిన వాటర్ ఫౌంటెయిన్, అక్కడే రూ.10.60 లక్షలతో చేపట్టిన ఫ్లైఓవర్ రూఫ్ ఓవర్ లైటింగ్ పనులు, వైఎంసీఏ చౌరస్తా వద్ద రూ.37 లక్షలతో చేపట్టిన డెకరేషన్ విద్యుత్ దీపాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రభుత్వ హయాంలో నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో సుందరీకరణ పనులు ముమ్మరంగా చేపట్టినట్లు తెలిపారు. సుందర నగరంగా తీర్చిదిద్దే క్రమంలో 6 జోన్లకు మొత్తం రూ.149 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, డీసీ మారుతి దివాకర్, ఎస్ఈ రత్నాకర్, విద్యుత్ ఈఈ సంతోష్, ఈఈ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సీపీఆర్ ఉచిత శిక్షణ శిబిరం



సీపీఆర్ శిబిరంలో వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

గాంధీఆస్పత్రి: గాంధీ అలుమ్నీ, గ్లోబల్ అలియన్స్, జనహితసేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గాంధీ అలుమ్నీ ఎడ్యుకేషన్ సెంటర్‌లో నిర్వహించిన సీపీఆర్ ఉచిత శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. మూడు రోజుల పాటు కొనసాగిన శిబిరంలో సుమారు ఆరు వేల మంది వైద్యవిద్యార్థులు, నర్సింగ్, ఎన్‌సీసీ కేడెట్లు, సామాజిక కార్యకర్తలు, పారిశుద్ధ్య కార్మికులు, ఆశా వర్కర్లు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ కేడెట్లు, కళాశాల విద్యార్థులు, అంబులెన్స్ డ్రైవర్లు, పోలీస్, ట్రాఫిక్ సిబ్బంది. వలంటీర్లు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు సీపీఆర్ ఉచిత శిక్షణ అందించినట్లు అలుమ్నీ అధ్యక్షుడు డాక్టర్ జీఆర్ లింగమూర్తి తెలిపారు. 25 ఏళ్ల నుంచి గాంధీ అలుమ్నీ నేతృత్వంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్డియాక్ పల్మనరీ రెసిసిటేషన్(సీపీఆర్), బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్ఎస్)లపై ఇప్పటి వరకు 36 వేల మందికి ఉచిత శిక్షణ అందించినట్లు తెలిపారు. శిక్షణ పొందిన వారితోపాటు వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో గాంధీ అలుమ్నీ, గ్లోబల్ అలియన్స్ ప్రతినిధులు డాక్టర్ రాజశేఖర్ కొల్లిపర, రవీందర్ సురకంటి, మహేశ్వర్‌పర్వత్ రెడ్డి, అమెరిక హార్ట్ అసోషియేషన్ ప్రతినిధి డెన్నీస్ మెకాలే, జనహిత సేవాట్రస్ట్ ప్రతినిధి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇస్త్రీ వ్యాపారులకు ఎల్‌పీజీ ఐరన్ బాక్సుల వితరణ



సాక్షి, సిటీబ్యూరో: రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్ ఆధ్వర్యంలో నగరంలోని దాదాపు 10వేల మంది ఇస్త్రీ వ్యాపారులకు (వీధుల్లో ఇస్త్రీ చేసేవారు) ప్రయోజనం చేకూర్చేందుకు రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ 3150 కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ చొరవలో భాగంగా అంబర్‌పేట్‌లోని మున్సిపల్ పార్క్ వేదికగా ఎల్‌పీజీ–ఆధారిత ఐరన్ బాక్స్‌లను ఇస్త్రీ వ్యాపారులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ చిరంజీవ్ సలుజా మాట్లాడుతూ.. నగరంలోని ఇస్త్రీ వ్యాపారుల సంఘానికి రూ.60 కోట్ల వార్షిక ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. అంతేగాకుండా ఎల్‌పీజీతో పనిచేసే ఐరన్ బాక్స్‌లకు మారడం వల్ల ప్రతి సంవత్సరం 72 లక్షల కిలో గ్రాముల బొగ్గును కాల్చడాన్ని తగ్గించడమే కాకుండా కార్బన్ ఉద్గారాలను గణనీయంగా అరికట్టవచ్చన్నారు. ఈ కుటుంబాలకు హానికరమైన బొగ్గు పొగ నుంచి విముక్తి లభిస్తుందన్నారు. ఇది మెరుగైన ఆరోగ్య ఫలితాలను అందిస్తుందని జిల్లా గవర్నర్ నామినీ ఉదయ్ పిలానీ పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్ కార్యదర్శి రొటేరియన్ డింపుల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఉద్యమకారులకు నిధులు కేటాయించాలి

– జేఏసీ ఛైర్మన్ ఎస్.యాదగిరి



ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నాయకులు

అడ్డగుట్ట: వచ్చే బడ్జెట్‌లో తెలంగాణ ఉద్యమకారులకు నిధులు కేటాయించాలని టీయూజేఏసీ ఛైర్మన్ ఎస్.యాదగిరి కోరారు. ఈ మేరకు ఎమ్మెల్సీ కోదండరాంను తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నాయకులు మంగళవారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఎస్.యాదగిరి మాట్లాడుతూ మార్చి నెలలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ఉద్యమకారులకు ప్రత్యేక నిధులు కేటాయించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. బీఆర్ఎస్ ఉద్యమకారులను పట్టించుకోకుండా అణిచివేసిందన్నారు. దీంతో అమరులు, కళాకారులు, ఉద్యమకారుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని వివరించారు. ఉద్యమకారులకు ప్రభుత్వం తరఫున సహకారం అందించేందుకు ప్రయత్నం చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ప్రఫుల్ రాంరెడ్డి, చంద్రన్న ప్రసాద్, అంజలి, సుజి, లావణ్య, స్వరూపరాణి, మల్లేశం, యాదగిరి, రవీందర్, రాజయ్య తదతరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్ ఆర్టీఏకి నాగచైతన్య

సాక్షి, సిటీబ్యూరో: సినీహీరో అక్కినేని నాగచైతన్య మంగళవారం ఖైరతాబాద్ ఆర్టీఏకు వచ్చారు. డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ కోసం ఆయన స్వయంగా వచ్చి ఫొటో దిగారు. డిజిటల్ సంతకం చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సి.రమేష్, ప్రాంతీయ రవాణా అధికారి పురుషోత్తమ్‌రెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. నిబంధనల మేరకు డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ ప్రక్రియను పూర్తిచేశారు. ఆయన రాకతో ఆర్టీఏ కార్యాలయంలో సందడి నెలకొంది. పలువురు అభిమానులు నాగచైతన్యతో సెల్ఫీలు తీసుకున్నారు.



కోల్‌కతా వైద్యురాలి హత్యాచార కేసులో నిందితుడికి ఉరిశిక్ష వేయాలి

సుల్తాన్‌బజార్: కోల్‌కత్తాలోని ఆర్జీకర్ మెడికల్ కాలేజ్ పీజీ వైద్యురాలిపై లైంగికదాడి, హత్య చేసిన నిందితుడికి కోర్టు జీవిత ఖైదు కాకుండా ఉరిశిక్ష వేయాలని నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేంద్రబాబు డిమాండ్ చేశారు. కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ట్రైనీ డాక్టర్ హత్య కేసు తీర్పు నేపథ్యంలో స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పించి మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ డాక్టర్ జి.సురేంద్రబాబు మాట్లాడుతూ.. నిందితుడు సంజయ్‌రాయ్‌కి ఉరిశిక్ష వేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేసులో అనుమానాలు ఉన్నందున సీబీఐకి బదిలీ చేయడం జరిగిందన్నారు. దర్యాప్తులో ఆర్జీకర్ మెడికల్ కాలేజ్, హాస్పిటల్ల అవినీతి, అక్రమ ట్రాన్స్‌ఫర్లు, ఔషధ రాకెట్ల గురించి కీలక సమాచారం బయట పడిందన్నారు. ఈ అక్రమాలను బాధితురాలు ఎత్తిచూపడం వల్లే ఇలాంటి దారుణానికి ఒడిగట్టారని తాము అనుమానిస్తున్నట్లు చెప్పారు. ఈ కేసు రేర్ ఆఫ్ రేర్ కేటగిరికి చెందిందని కోర్టు పేర్కొని జీవిత ఖైదు విధించిందని తెలిపారు. ఈ కేసులో పోలీసులు సాక్ష్యాలు తారుమారు చేశారని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితుడికి ఉరిశిక్ష పడేలా తీర్పు ఉండాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం ప్రెసిడెంట్ డాక్టర్ శంకర్, ఆర్గనైజింగ్ సెక్రెటరి డాక్టర్ గుండు శ్రీనివాస్, డాక్టర్ విజయేందర్, డాక్టర్ సుశీల్ శ్రీకాంత్, వర్ష, తాన్వి, క్రాంతి, యశ్వంత్, సచిన్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.



కోఠి ఉస్మానియా మెడికల్ కళాశాలలో నిరసన తెలుపుతున్న మెడికోలు


ప్రవాసి ప్రజావాణిని సందర్శించిన కుంతియా



ప్రవాసి ప్రజావాణి కేంద్రాన్ని సందర్శించిన ఏఐసీసీ నేత కుంతియా

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో జరుగుతున్న ప్రవాసి ప్రజావాణిని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల పూర్వ ఇన్‌చార్జి రామచంద్ర కుంతియా సందర్శించారు. ఒడిశా రాష్ట్రం నుంచి నగరానికి వచ్చిన ఆయన ప్రజా భవన్‌కు మంగళవారం వచ్చారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జిగా ఉన్న కాలంలో గల్ఫ్ కార్మికులు, ప్రవాసి తెలంగాణ పాలసీ కోసం చేసిన కృషిని తెలుసుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజావాణిలో ప్రత్యేకంగా ప్రవాసి విభాగాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలుసుకున్న కుంతియ ప్రవాసి ప్రజావాణి కేంద్రాన్ని పరిశీలించారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రవాసి విభాగాన్ని ఏర్పాటు చేయడం పట్ల కుంతియా సంతోషం వ్యక్తం చేశారు. గల్ఫ్ కార్మికుల కోసం పలు కార్యక్రమాలను చేపట్టడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం పాటుపడుతున్న ప్రముఖులు వినోద్ కుమార్, మంద భీమ్‌రెడ్డి, నంగి దేవేందర్‌రెడ్డి, చెన్నమనేని శ్రీనివాస్‌రావు, సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, చేపూర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు దేశవ్యాప్త సైకిల్ యాత్ర



మొక్కలు నాటుతున్న సైకిలిస్ట్ పుష్పరామ్ చౌదరి

సుల్తాన్‌బజార్: రాజస్థాన్‌లోని నాగోర్‌కు చెందిన సైకిలిస్ట్ పప్పురామ్ చౌదరి దేశవ్యాప్త సైకిల్ యాత్రలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు లక్ష మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా మంగళవారం కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ సూర్య ధనుంజయ్ సమక్షంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత పర్యావరణ పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా సైకిల్ యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో లక్ష మొక్కలు నాటి గిన్నీస్ రికార్డు కోసం ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. 2026లో మిషన్ ఎవరెస్ట్‌పై రోటరి క్లబ్ జెండా ఎగరవేస్తామని తెలిపారు.

హాసం పత్రిక అంటే ఎంతో ఇష్టం

- కిమ్స్–సన్‌షైన్ ఎండీ డాక్టర్ గురవారెడ్డి
- 'ఆపాత మధురం' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో గురవారెడ్డి, ఆర్పీ పట్నాయక్, డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి

సనత్‌నగర్: ప్రముఖ పాత్రికేయుడు, మ్యూజికాలజిస్ట్, హాసం సంపాదకులు దివంగత రాజా రాసిన 'ఆపాత మధురం–2' పుస్తకాన్ని ఆయన కుమార్తెలు శ్రేష్ఠ, కీర్తన ప్రచురించారు. ఈ పుస్తకావిష్కరణ సభ మంగళవారం బేగంపేటలోని కిమ్స్–సన్‌షైన్ హాస్పిటల్‌లోని భవనం శ్రీనివాస్‌రెడ్డి ఆడిటోరియంలో జరిగింది. 'ఆపాత మధురం–2' పుస్తకాన్ని డాక్టర్ గురవారెడ్డి ఆవిష్కరించి తొలి ప్రతిని ప్రముఖ సంగీతాభిమాని, విశ్లేషకులు జె.మధుసూదనశర్మకు అందజేశారు. అనంతరం డాక్టర్ గురవారెడ్డి మాట్లాడుతూ రాజా ఆధ్వర్యంలో వచ్చిన హాసం పత్రిక అంటే తనకెంతో ఇష్టమన్నారు. ఆయన నిర్వహించిన వెబ్‌సైట్ అంటే కూడా తనకెంతో మక్కువ అని తెలిపారు. దాన్ని పునరుద్ధరించాల్సిందిగా వారి పిల్లలను కోరుతున్నట్లు చెప్పారు. ఆయన రాసిన ఆపాత మధురం తొలి భాగాన్ని తాను, తన స్నేహితురాలు డాక్టర్ భార్గవితో కలిసి ప్రచురించినట్లు వివరించారు. ఆత్మీయ అతిథి మృణాళిని మాట్లాడుతూ రాజా పాటను సంగీతపరంగా, సాహిత్యపరంగా లోతైన విశ్లేషణ చేసేవారన్నారు. మ్యూజికాలజిస్ట్ రాజాతో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని పుస్తక ప్రచురణకర్త డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి తెలిపారు. సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, గీత రచయిత భాస్కరభట్ల రవికుమార్ పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లోని చెత్త నిర్వహణ కేంద్రం పనితీరుపై ఆరా

నగరంలో పలు అంశాలను పరిశీలించిన రూపామిశ్రా

సాక్షి, సిటీబ్యూరో: స్వచ్ఛభారత్ మిషన్ అర్బన్ డైరెక్టర్ రూపామిశ్రా నగరంలో పారిశుద్ధ్యం తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేబీఆర్ పార్కు వద్ద లూకేఫ్ నిర్వహణ తీరును అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జవహర్‌నగర్‌లోని చెత్త నిర్వహణ కేంద్రం పనితీరును పవర్ పాయింట్ ద్వారా వివరించిన రాంకీ ప్రతినిధులు.. చెత్త సమగ్ర నిర్వహణలో జీహెచ్ఎంసీకి, రాంకీకి ఎదురైన ఇబ్బందుల్ని ప్రస్తావించారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తూ సర్క్యులర్ ఎకానమీకి చేస్తున్న కృషి గురించి రాంకీ గ్రూప్ డైరెక్టర్ గౌతమ్‌రెడ్డి వివరించారు. జవహర్‌నగర్ ప్లాంట్ సామర్థ్యం పెంచుకునేందుకు రూపామిశ్రా కొన్ని సూచనలు చేశారు. తొలుత జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఆమెకు స్వాగతం పలికారు. ఆమె వెంట అడిషనల్ కమిషనర్ సీఎన్.రఘుప్రసాద్, ఈఈ ఆర్.శ్రీనివాసరెడ్డి తదితరులున్నారు.



ఢిల్లీ గణతంత్ర వేడుకలకు మరోసారి ఆకర్షణ



సనత్‌నగర్: న్యూఢిల్లీలో ఈనెల 26న జరిగే గణతంత్ర వేడుకలకు హాజరుకావాల్సిందిగా 13 ఏళ్ల చిన్నారి ఆకర్షణసతీష్‌కు వరుసగా రెండోసారి ఆహ్వానం అందింది. అక్షరాస్యతను పెంపొందించడమే ప్రధానంగా ఇప్పటి వరకు విభిన్న ప్రాంతాల్లో 18 లైబ్రరీలను ఏర్పాటు చేసి ఆమె అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా చిన్నారి ఆకర్షణకు మరోసారి అరుదైన గౌరవం లభించింది. న్యూఢిల్లీలోని ఇండియా గేట్ సమీపంలోని కర్తవ్య మార్గంలో నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరుకావాల్సిందిగా సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆకర్షణను ఆహ్వానించింది. ప్రధానమంత్రి కార్యాలయం ప్రత్యేకంగా ఆకర్షణ పేరును సిఫారసు చేసింది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి హాజరుకావడానికి ఆకర్షణతోపాటు తల్లిదండ్రులకు టికెట్లనుఅందించారు.

గవర్నర్ కార్యాలయం నుంచి ఆహ్వానం..

మరోవైపు నగరంలో జరిగే గణతంత్ర వేడుకల సందర్భంగా రాజ్‌భవన్‌లో జరిగే రిసెప్షన్‌లో పాల్గొనాల్సిందిగా గవర్నర్ నుంచి ఆకర్షణకు ఆహ్వానం అందింది. లైబ్రరీల ఏర్పాటు ద్వారా సామాజిక మార్పునకు కృషిచేస్తున్నందుకు గవర్నర్ నుంచి ఆహ్వానం అందింది. గతేడాది రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవం ఎట్–హోమ్ రిసెప్షన్‌కు హాజరుకావాలని రాష్ట్రపతి ఆ చిన్నారిని ఆహ్వానించిన విషయం విదితమే. అలాగే ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మన్‌కీ బాత్ కార్యక్రమంలోని 105వ ఎపిసోడ్‌లో ఆమె లైబ్రరీ కార్యక్రమాల పట్ల ప్రశంసించారు.

నుమాయిష్‌కి వెళదాం అంటూ ఫ్యామిలీ అంతా రెడీ అయిపోతారు. ఆ సమయంలో అదే ఇంట్లో ఓ మూలగా కూర్చున్న తాతయ్యో, అమ్మమ్మో.. ఉంటే వారికి కాపలాగా ఎవరు ఉండాలి? అనేది తరచూ సమస్య అవుతుంటుంది. అంతే తప్ప ఆ పండుటాకుల్ని కాసేపు తమతో పాటు తీసుకెళదాం అనే ఆలోచన మాత్రం అరుదుగా తక్కువ కుటుంబాలకే వస్తుంది. కుటుంబంతో పాటూ ఉంటున్న వృద్ధులకే ఆ పరిస్థితి ఉంటే ఇక వృద్ధాశ్రమాల్లో, అనాధాశ్రమాల్లో.. ఇతరుల దయాదాక్షిణ్యాల మీద బతికే నిరుపేద వృద్ధులకు అలాంటి ఆలోచన కూడా రాదేమో.. - సాక్షి, సిటీబ్యూరో



ఫ్యాషన్ ఇమేజ్ రంగంలో..
ఏఐ భాగస్వామ్యం

- అధునాతన ఫ్యాషన్‌పై నేటి తరం దృష్టి : మాస్టర్ బిబో
- మన గుర్తింపును మనమే సృష్టించుకోవాలి : నటి పూనమ్ కౌర్

సాక్షి, సిటీబ్యూరో : వ్యక్తిగత ప్రతిష్ఠ, ఫ్యాషనబుల్ ఇమేజ్ పెంచుకోవం పై నేటి తరం మక్కువ చూపిస్తుందని.. ఈ ఇమేజ్ కన్సల్టింగ్ రంగంలో కృత్రిమ మేధస్సు భాగం కావడం శుభపరిణామం అని అంతర్జాతీయ మోడల్స్ కోచ్, ప్రతిష్టాత్మక వైస్ అకాడమీ గ్లోబల్ ఆర్ట్ డైరెక్టర్ మాస్టర్ బిబో తెలిపారు. నగరంలోని హైటెక్స్ వేదికగా 'కాటలిస్ట్' ఆధ్వర్యంలో ప్రపంచంలోనే మొట్టమొదటి ఏఐ–ఆధారిత వ్యక్తిగత స్టైలింగ్, ఇమేజ్ డెవలప్‌మెంట్ సేవలను ఆవిష్కరించింది. ఇందులో భాగంగా కాటలిస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఉషా యనమండ్ర, మాస్టర్ బిబోతో భాగ్యస్వామ్యాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉషా మాట్లాడుతూ.. 45 సంవత్సరాలుగా భారత్‌లో ఇమేజ్ కన్సల్టింగ్ అనేది కేవలం మాన్యువల్ ప్రక్రియగా మిగిలిపోయింది. ఈ నేపథ్యంలో స్టైలింగ్‌లో వ్యక్తిగత, వృత్తిపరమైన వృద్ధిని పెంచడానికి ఏఐతో సాంకేతికత – సృజనాత్మకత సమ్మిళిత ఆవిష్కరణను కాటలిస్ట్ ప్రవేశపెట్టిందని అన్నారు. అంతేకాకుండా వోగ్ వంటి దిగ్గజ వేదికలపై మోడల్స్‌కు శిక్షణ అందించిన మాస్టర్ బిబోతో ఔత్సాహిక ఫ్యాషన్ నిపుణులకు అంతర్జాతీయ సర్టిఫికెట్లతో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ప్రముఖ నటి, న్యాయవాది పూనం కౌర్ నేతృత్వంలో వ్యక్తిగత స్టైలింగ్, ఇమేజ్ డెవలప్‌మెంట్ పై స్ఫూర్తినిచ్చే అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో భారత్, సార్క్ దేశాల ఛైర్మన్, వివిధ సామాజిక అంశాలకు ప్రత్యేక అధ్యక్ష రాయబారి నవాబ్ సయ్యద్ అల్లాజీ, ప్రముఖ స్టార్టప్ ఇంక్యుబేటర్ 'టి–హబ్' వ్యవస్థాపకులు శ్రీనివాస్ కొల్లిపార, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

మన ఇమేజ్ మన సొంతం..

ప్రస్తుత అధునాతన జీవన శైలిలో మన వ్యక్తిగత ప్రత్యేకతే మన గుర్తింపు. మనల్ని.. మనం ఎలా ప్రదర్శించుకుంటామో.. అదే మన వ్యక్తిగత విశిష్టతను తెలియజేస్తుంది. స్టైలింగ్‌లో ఈ తరం వినూత్నత్వాన్ని ఆహ్వానిస్తోంది. ఈ తరుణంలో కాటలిస్ట్ ఆధ్వర్యంలోని నూతన ఆవిష్కరణ, విధానాలతో ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే కాకుండా సామాజికంగా, వ్యక్తిగత ఇమేజ్‌ను రూపొందిస్తుంది.

- పూనమ్ కౌర్

- నిరుపేద వృద్ధుల కోసం నుమాయిష్ ప్రత్యేకం
- నగరంలోని వృద్ధాశ్రమాలు, హోమ్స్‌లోని వారికి చోటు
- స్కూల్స్, వాలంటీర్లు, నుమాయిష్ నిర్వాహకుల సహకారం
- నగరానికి చెందిన దోబారా ఎన్జీవో సేవా కార్యక్రమం





రెక్కలు తొడిగిన ఆశలు..

అవ్వా, తాతలకు ప్రత్యేక ప్రదర్శన

వృద్ధులు చంటి పిల్లలతో సమానం అంటారు.. చంటి పిల్లలకు ఎలా అయితే అన్నీ చూడాలని ఆశ ఉంటుందో వయస్సు పెద్దపడిన వారికి కూడా ప్రతిదానిపై ఆసక్తి ఉంటుంది. సరిగ్గా ఇదే ఆలోచన చేసిన నగరానికి చెందిన దోబారా అనే ఎన్జీవో.. వారి కోసం అద్భుతమైన సేవా కార్యక్రమాన్ని నిర్వహించింది. నగరంలోని అపోలో హోంకేర్, గ్లెన్‌ఫీల్డ్ మల్లారెడ్డి తదితర ప్రైవేటు ఆస్పత్రులు, స్కూల్స్‌ను భాగం చేస్తూ నిరుపేద వృద్ధుల కోసం ప్రత్యేక నుమాయిష్ సందర్శనను ఏర్పాటు చేసింది. నాంపల్లి ఎగ్జిబిషన్ నిర్వాహకులు సైతం పూర్తి సహాయ సహకారాలు అందించడానికి సై అన్నారు. అయితే రోజువారీ వేళల్లో అయితే పెద్ద వయసు వారికి రద్దీలో, జనం మధ్యన ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని.. మంగళవారం మధ్యాహ్నం ప్రత్యేకంగా 2గంటల నుంచీ సాయంత్రం రద్దీ మొదలయ్యే లోగా దీనిని పూర్తి అయేలా కార్యక్రమాన్ని డిజైన్ చేశారు.

ఫుడ్ ప్యాక్స్..

పిస్తా హౌజ్, షాజ్ మహమ్మూద్ అనే వాలంటీర్‌ల సహకారంతో ఫుడ్ ప్యాక్స్ అందించారు. అలాగే కొందరు దాతలు ఇచ్చిన సహకారంతో వృద్ధులకు ఉపయోగపడే టవల్స్ వంటివి కొనుగోలు చేసి అందించారు.

అనాధాశ్రమాల నుంచి..

నగరవ్యాప్తంగా 89 మంది వీల్‌చైర్స్ ఉప్పల్, చిక్కడపల్లి.. ఇలా నగరంలోని 12 ఓల్డేజ్ హోమ్స్, సీనియర్ సిటీజన్ అసోసియేషన్‌లకు చెందిన సభ్యులను సైతం ఈ కార్యక్రమంలో భాగస్వాముల్ని చేశారు. పెద్దలు అందరినీ కార్లలో గౌరవంగా తోడ్కొని వచ్చారు. అక్కడ నుంచి నడవలేని వారి కోసం దాదాపుగా 80కి పైగా వీల్‌ఛైర్లను సిద్ధం చేశారు. అంతేకాకుండా నర్సింగ్ స్కూల్స్‌కు సంబంధించిన విద్యార్థులను కూడా ఉంచారు. వీరి కోసం ప్రత్యేకంగా ఉచిత ట్రైన్ రైడ్స్‌ను నుమాయిష్ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. అదే విధంగా వాహనాల కోసం ఉచిత పార్కింగ్‌ను కూడా కల్పించారు.





పెద్దలకు ప్రత్యేకంగా..

ఏడాదికో సారి నుమాయిష్ లాంటి ప్రదర్శనను తిలకించాలని అందరూ అనుకున్నట్టే సీనియర్ సిటిజన్స్ కూడా ఆశిస్తారు. అయితే ఆశించినట్టుగా చాలా మందికి జరగకపోవచ్చు. కొందరికైనా దీన్ని సాకారం చేద్దామనే ఆలోచనతో ఈ 'సీనియర్ సిటిజన్స్ ఎట్ నుమాయిష్' కార్యక్రమాన్ని నిర్వహించాం. ఒక సీనియర్ సిటిజన్‌గా పెద్దలకు సంబంధించిన జెరంటాలజీ సబ్జెక్ట్‌లో మాస్టర్స్ చేసిన వ్యక్తిగా ఇలాంటి కార్యక్రమాలు పెద్దవాళ్ల మనసుకు ఎంత సంతోషాన్ని అందిస్తాయనేది నాకు తెలుసు.

- మతీన్ అన్సారీ, వ్యవస్థాపకులు, దోబారా స్వచ్ఛంద సంస్థ











డెస్టినేషన్ టూరిజం..

- హెలీ, సీ టూరిజం అభివృద్ధి చేస్తున్న కేరళ
- నగరంలో ప్రత్యేక పర్యాటక కార్యక్రమం

సాక్షి, సిటీబ్యూరో : దేశవ్యాప్తంగానే కాకుండా విదేశీ పర్యాటకులను సైతం ఆకర్షించడానికి వినూత్నంగా హెలీ–టూరిజం, సీ టూరిజం అభివృద్ధి చేశామని కేరళ టూరిస్ట్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ సజీవ్ కే.ఆర్ తెలిపారు. కేరళ ప్రభుత్వ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని తాజ్ డెక్కన్ వేదికగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా సజీవ్ కేరళ పర్యాటక విశేషాలను వెల్లడిస్తూ.. ఇప్పటికే మంచి ఆదరణ ఉన్న పర్యాటక ప్రాంతాలతో పాటు బేకల్, వయనాడ్, కోజికోడ్ వంటి ప్రసిద్ధ ప్రాంతాలను పరిచయం చేయడం పై దృష్టి సారించామని అన్నారు. నూతన ప్రాజెక్టులతో పాటు బీచ్, హిల్ స్టేషన్స్, హౌస్‌బోట్లు, బ్యాక్‌వాటర్ విభాగం వంటి అంశాలు సందర్శకులకు హాట్‌స్పాట్‌లుగా మారాయన్నారు. కేరళలో పర్యాటకుల సంఖ్య 2022లో పెరిగిందని, 2023 నుంచి ఈ ఆదరణ రికార్డు స్థాయిలో పెరిగిందన్నారు. గతేడాది మొదటి ఆరు నెలల్లో 1,08,57,181 దేశీయ పర్యాటకులు రావడం విశేషమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేరళ కళాకారులు మోహినియాట్టం, కథక్, కత్తిసాము వంటి సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ఈ వేదికగా బెంగళూరు, అహ్మదాబాద్, చండీగఢ్, ఢిల్లీ, జైపూర్, చెన్నై, కోల్‌కతా తదితర ప్రాంతాలకు చెందిన పర్యాటక రంగ సంస్థలు, ప్రముఖులు బీ టు బీ సమావేశాల్లో పాల్గొన్నారు.



ఈ ఏడాది ప్రత్యేకం..

ఈ ఏడాది ఫిబ్రవరి 15 నుంచి 21 వరకూ కనకక్కున్ను ప్యాలెస్‌లో నిషాగంధి నృత్యోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో దేశవ్యాప్తంగా ప్రఖ్యాత నృత్యకారులు మోహినియాట్టం, కథక్, కూచిపూడి, భరతనాట్యం, మణిపురి వంటి శాస్త్రీయ నృత్య రూపాలను ప్రదర్శిస్తారు. జనవరి 23–26 వరకూ కోజికోడ్ బీచ్‌లో ప్రసిద్ధ కేరళ సాహిత్య ఉత్సవం నిర్వహించనున్నారు. ఇందులో 12కి పైగా దేశాల నుంచి 400 మంది ప్రముఖులు పాల్గొనున్నారు. అంతేకాకుండా సుమారుగా 200 సదస్సులు జరగనున్నాయి. వీటిలో విలాసం, విశ్రాంతిని, కేరళ డెస్టినేషన్ వెడ్డింగ్స్ వంటి అంశాలు ప్రధానంగా నిలువనున్నాయి.



- ఆకట్టుకుంటున్న పురాతన వస్తువుల మ్యూజియం
- వైకే యాంటిక్ హోమ్‌లో 1400 ఏళ్ల నాటి వస్తువులు
- నాటి మధుర జ్ఞాపకాలను సందర్శకుల కళ్లకు కడుతూ

గతమెంతో ఘనం.. నేడు జీవనమే గగనం.. అనే నానుడి అందరికీ తెలిసిందే.. నగరంలోని వైకే యాంటిక్ హోంలో ఏర్పాటు చేసిన మ్యూజియం చూస్తే ఇదే అక్షర సత్యం అని అనిపించక మానదు.. మన పూర్వీకులైన తల్లిదండ్రులు, తాత ముత్తాతల జీవన శైలి మనకు అబ్బురంగానూ.. అద్భుతంగానూ అనిపిస్తుంది.. నేటి ఆదునిక పోకడలు అనారోగ్యాలు తెచ్చిపెడుతోంటే.. నాటి జీవన శైలివైపుకే మరలా అడుగులు పడుతున్నాయి.. వంట పాత్రల నుంచి ఆహార పదార్థాల వరకూ కొత్త ఒక వింత.. పాత ఒక రోత అనే నానుడి నుంచి.. ఆ పాత మధురం.. అనే రీతిలో నేటి తరం జీవన శైలి మారుతోంది.. ఇత్తడి, రాగి, మట్టి పాత్రలకు ఇటీవలి కాలంలో పెరుగుతున్న డిమాండే ఇందుకు నిదర్శనం.. - సాక్షి, సిటీబ్యూరో

అబ్బురం.. అద్భుతం..

మన పూర్వీకులు వంట చేసుకోవడం మొదలుకుని తినడానికి వాడే గిన్నెలు, ప్లేట్లు, పాత్రలు, సంగీత పరికరాలు, పెద్ద పెద్ద శబ్దాలు చేసే పరికరాలు.. ఇలా అన్నీ ఒకే చోట కనువిందు చేస్తే.. ఆ ప్రాంతం నుంచి వెనిక్కి రావడానికి మనసు ఒప్పుకోదు. అలాంటి ప్రదేశాల్లో ఒకటి సికింద్రాబాద్‌లోని వైకే యాంటిక్ హోం మ్యూజియం. పిల్లలకు మన పండుగలు, సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేయడం, పూర్వీకుల జీవన విధానంపై అవగాహన కల్పించడానికి ఇలాంటి ప్రదేశాలు ఎంతో తోడ్పడతాయి. దాదాపు 1400 సంవత్సరాల నాటి కాలంలో వినియోగంలో ఉన్న వస్తువుల నుంచి 20వ శతాబ్దం వరకూ అప్పటి జీవన విధానంలో వినియోగించిన అనేక పరికరాలు, వస్తువుల, ఆయుధాలు ఈ మ్యూజియంలో దర్శనమిస్తున్నాయి. మన పూర్వీకులకు చెందినవే కాకుండా ఇతర దేశాలకు చెందిన పలు రకాల చారిత్రక, సాంస్కృతిక వస్తువులు ఇక్కడ సందర్శనకు అందుబాటులో ఉంటాయి. సందర్శకులకు ప్రవేశం ఉచితం. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ మ్యూజియంలోకి అనుమతిస్తారు. 9963822339 లో ముందుగా స్లాట్ బుక్ చేసుకోవచ్చు.





తొలుత పది వస్తువులతో

మాది కాకినాడకు సమీపంలోని సోమేశ్వరం. కుటుంబాన్ని చెన్నైకి తరలించే క్రమంలో మా అమ్మ పురాతన వస్తువులను వెంట తెచ్చుకుంది. వాటిని చూసినవారు చాలా బాగున్నాయని ప్రశంసించేవారు. దీంతో ఇలా అందరికీ మధురజ్ఞాపకాలను అందించే వస్తువులను సేకరించాలని నిర్ణయించుకున్నా. 50 ఏళ్ల నుంచి సికింద్రాబాద్‌లోని లోతుకుంటలో ఇంటినే మ్యూజియంగా మార్చాను. తొలుత 10 వస్తువులతో ప్రారంభమైన ప్రస్థానం ప్రస్తుతం వెయ్యికిపైగా వస్తువులకు చేరింది.

- వై.కృష్ణమూర్తి, మ్యూజియం నిర్వాహకులు





అమ్మ గుర్తుకొచ్చింది..

మేం చిన్నప్పటి నుంచి వినియోగించే చాలా రకాల వస్తువులు ఇక్కడ కనిపిస్తున్నాయి. స్నానాలకు నీరు వేడిచేసే పాత్ర, పచ్చడి పెట్టుకునే పింగాణీ కుండలు, కంచు, ఇత్తడి సామాగ్రిని చూసిన వెంటనే అమ్మ గుర్తుకొచ్చింది. కాలంతో పాటు పాత్రలు మారిపోతున్నాయి.

- సుభాషిణి, బేగంపేట్







గ్రామ సభలు ఓ దగా

ఏడాది పాలన
పెద్ద ఫెయిల్యూర్: హరీశ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ సభలు ఓ దగా అని, ఆరు గ్యారంటీల అమలూ దగానే అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ప్రజాపాలన కాదని, ఇది ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక పాల న అని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఊరూరా తిరగబడుతున్న జనాన్ని చూస్తే ఏడాది పాలన పెద్ద ఫెయిల్యూర్ అని అర్థమవుతోందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి విదేశాల్లో, మంత్రులందరూ పక్క రాష్ట్రాల్లో బిజీగా ఉంటే ప్రజలను ఎవరు పట్టించుకోవాలో చెప్పాలన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో పోలీసు పహారా నడుమ గ్రామ సభలు నిర్వహించాల్సిన దుస్థితి రావడం దారుణమని చెప్పారు. పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ఒకవైపు గ్రామ సభలు నిర్వహిస్తుంటే, మరోవైపు కార్యకర్తలకే పథకాలు ఇస్తా మని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు చెప్పడం సిగ్గుచేటని తెలిపారు. కృష్ణా జలాల వాటాపై సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెబుతున్నదంతా పచ్చి అబద్ధమని నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ తేల్చేశారని హరీశ్‌రావు తెలిపారు. నీటి వాటాలు తేల్చేంత వరకు 50-50 నిష్పత్తిలో కేటాయించాలని 2015న తెలంగాణ ప్రభుత్వం కోరినట్లు కృష్ణా బోర్డు తేల్చడం దాగని సత్యాలని గుర్తు చేశారు.

స్పౌజ్ బదిలీల హామీని నిలబెట్టుకోవడంపై హర్షం



మీడియాతో మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ స్పౌజ్ బదిలీలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం గొప్ప నిర్ణయం తీసుకుందని పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. స్పౌజ్ బదిలీలు చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఈ మేరకు తెలంగాణ సచివాలయం మీడియా పాయింట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం హర్షవర్ధన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చీకటి 317 జీవోను తీసుకొచ్చి భార్యాభర్తలైన ఉద్యోగ, ఉపాధ్యాయులను వే ర్వేరు జిల్లాలకు అలాట్ చేశారని ఆగ్రహం వ్య క్తం చేశారు. దీంతో అనేక కుటుంబాల్లో పిల్లల కు తల్లిదండ్రులు, వృద్ధులైన తల్లిదండ్రులకు పిల్లలను దూరం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు.

ఆన్‌లైన్‌లో పీఆర్ ఉద్యోగుల ఫిర్యాదుల పరిశీలన

సాక్షి, హైదరాబాద్: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో తొలిసారిగా ఉద్యోగులు, సిబ్బంది విజ్ఞప్తులు, ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో పరిశీలించే విధానం అమల్లోకి రానుంది. ప్రతి నెలలో రెండో, నాలుగో శుక్రవారాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల మధ్య అప్పటికే ఆన్‌లైన్‌లో అందిన ఫిర్యాదులను పరిశీలించే అవకాశం ఉందని సమాచారం. ఈ ప్రక్రియ ఈ నెల 24తో ప్రారంభం కానుంది. సర్వీస్, ఇతరత్రా సమస్యలను పరిష్కరించాలంటూ పంచాయతీరాజ్ మంత్రి సీతక్క, కార్యదర్శి వద్దకు ఉద్యోగులు, సిబ్బంది వస్తుండటంతో సమయం వృథాను నివారించేందుకు ఆన్‌లైన్‌లోనే వాటిని పరిశీలించి పరిష్కారం చూపాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం 'రిడ్రెసెల్ సెల్'ను ఏర్పాటు చేసింది.

నాగచైతన్యపై వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నా

- బహిరంగ క్షమాపణలు చెప్పిన జ్యోతిష్యుడు వేణుస్వామి

సాక్షి, హైదరాబాద్: హీరో నాగచైతన్య, శోభిత దంపతులు కూడా ఎక్కువకాలం కలిసి ఉండరంటూ ఇటీవల జోస్యం చెప్పి వివాదం రాజేసిన ప్రముఖ జ్యోతిష్యుడు వేణుస్వామి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారు. అలాగే ఈ వ్యవహారంపై తెలంగాణ మహిళా కమిషన్ ముందు హాజరై బహిరంగంగా క్షమాపణ చెప్పారు. మంగళవారం తెలంగాణ ఉమెన్ కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారదను కలిసి తన వ్యాఖ్యలపై ఈ మేరకు వివరణ ఇచ్చారు. వేణుస్వామి వ్యాఖ్యలపై అభ్యంతరం తెలు పుతూ ఫిలిం జర్నలిస్ట్స్ యూనియన్ అసోసియేషన్ సభ్యులు మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో వేణుస్వామికి కమిషన్ నోటీసులు జారీ చేయడం తెలిసిందే. ఈ నోటీసులను సవాల్ చేస్తూ వేణుస్వామి హైకోర్టును ఆశ్ర యించగా మహిళా కమిషన్ ఎదుట హాజరు కావాల్సిందేనని హైకోర్టు తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో ఆయనకు కమిషన్ మళ్లీ నోటీసులివ్వగా మంగళవారం కమిషన్ ఎదుట హాజరయ్యారు. ఇలాంటి వ్యాఖ్యలను పునరావృతం కానీయొద్దని వేణుస్వామిని కమిషన్ హెచ్చరించింది.

డిస్కంలకు రూ.2వేల కోట్ల సహాయం

సాక్షి హైదరాబాద్: రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా ఆర్థిక సహాయం విడుదల చేసింది. వేసవిలో డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా కోసం విద్యుత్ కొనుగోలుకు రూ.2వేల కోట్లను మంజూరు చేసింది.

మీ కాళ్లు మొక్కుతా సారు.. ఇల్లు ఇప్పించండి



ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలంటూ అధికారి కాళ్లకు దండం పెడుతున్న లావణ్య

సారు.. మీ కాళ్లు మొక్కుతా. మీరు చదివిన లిస్ట్‌లో నా పేరు లేదు. నాకు ఇద్దరు పిల్లగాళ్లు. మా ఆయన పనికిపోయి మమ్మల్ని సాదుతున్నాడు. నా కడుపులో గడ్డలు అయ్యాయి.. పనికి పోలేకపోతున్నా. మాకు వ్యవసాయ భూమి లేదు. రేషన్‌కార్డు లేదు. చిన్న రేకుల షెడ్డు మాత్రమే ఉంది. జోరుగా వర్షం పడితే తడుస్తుండటంతో ఫంక్షన్ హాలులో తలదాచుకోవాల్సిన పరిస్థితి. ఎన్నో ఆఫీస్‌ల చుట్టూ తిరిగినా. దరఖాస్తు చేసినా. మొన్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే అని అధికారులు ఫొటో తీసుకున్నారు. తీరా చూస్తే లిస్ట్‌లో నా పేరు లేదంటూ పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం పెంచికలపేటకు చెందిన గోల్లన లావణ్య గ్రామసభలో అధికారి కాళ్లకు దండం పెట్టుకుంటూ మొరపెట్టుకుంది.

మా పేర్లు ఎందుకు లేవు?

తొలిరోజు గ్రామసభల్లో అధికారులను ప్రశ్నించిన ప్రజలు

- అనర్హులకే పథకాలు దక్కుతున్నాయంటూ ఆవేదన
- జాబితాలో పేర్లు లేకుంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవాలన్న అధికారులు
- క్యూ కట్టిన దరఖాస్తుదారులు



ఖమ్మం 3వ డివిజన్‌లో జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో అధికారులను నిలదీస్తున్న జనం

సాక్షి నెట్‌వర్క్: లబ్ధిదారుల జాబితాలో మా పేరు లేదంటూ ఆయా జిల్లాల్లో ప్రజలు అధికారులను ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, తెల్లరేషన్‌కార్డుల పథకాల అమలుకు ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాలను ప్రకటించింది. వీటిపై అభ్యంతరాల స్వీకరణకు మూడు రోజులపాటు నిర్వహించే గ్రామసభలు మంగళవారం మొదలుకాగా మొదటి రోజు అభ్యంతరాలు వెల్లువెత్తాయి. అర్హులను కాదని అనర్హులను ప్రకటించారంటూ జిల్లాల్లో నిరసన వ్యక్తం చేశారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో తమ పేర్లు లేవంటూ ఆందోళన చేసిన వారే ఎక్కువగా ఉన్నారు. అయితే జాబితాలో పేర్లు లేనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో ప్రజలు క్యూ కట్టారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా:

హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేస్తున్న వారిని ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో చేర్చారని ఖమ్మం జిల్లా వెంకట్యాతండాలో ఎంపీడీఓను నిలదీశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పాండురంగాపురం తండాలో అనర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారంటూ ప్రత్యేకాధికారి దేవరాజు తదితరులను స్థానికులు నిర్బంధించారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లా :

అర్హుల జాబితా అంతా తప్పుల తడకగా ఉందని, తమకు గ్రామసభ వద్దని గట్టుప్పల్ మండల కేంద్రంలో ప్రజలు ఆందోళనకు దిగారు. మూడు గంటల పాటు సభను అడ్డుకున్నారు. ఆత్మకూర్ (ఎం) మండలంలోని రహీంఖాన్‌పేటలో నిర్వహించిన గ్రామ సభ రసాభాసగా మారింది.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా :

చాలా చోట్ల తమ పేర్లు లేవని అధికారులను ప్రజలు నిలదీశారు. బెల్లంపల్లి పట్టణం కన్నాలబస్తీ ఒకటో వార్డులో రేషన్‌కార్డులకు అర్హులను ఎంపిక చేయడం లేదంటూ ఆందోళన చేపట్టారు. ఆర్డీవో హరికృష్ణను నిలదీశారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా :

ధర్మారం మండలం కమ్మరిఖాన్‌పేట గ్రామసభను బహిష్కరించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద గ్రామంలో కేవలం 52మంది లబ్ధిదారులనే ఎంపిక చేశారని, అందులో సగం మందికి వ్యవసాయ భూములున్నాయని, అసలు గుంట భూమి లేని వారికి మాత్రం జాబితాలో చోటు కల్పించలేదంటూ పలువురు గ్రామసభను బహిష్కరించారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీ కాలేదని బోయినపల్లి మండలం రత్నంపేట ప్రజాపాలన గ్రామసభలో పలువురు రైతులు అధికారులను నిలదీశారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా:

నందిపేట మండలం కుద్వాన్‌పూర్ గ్రామంలో మహిళలు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డిని నిలదీశారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే తమ గ్రామానికి 10 ఇళ్లు కట్టిస్తానని హామీ ఇచ్చి నెరవేర్చలేదంటూ ఎమ్మెల్యేను అడిగారు. డిచ్‌పల్లి, ఇందల్వాయి, మోపాల్, ధర్పల్లి, నిజామాబాద్ రూరల్, జక్రాన్‌పల్లి, సిరికొండ తదితర మండలాల్లో రసాభాసగా సభలు జరిగాయి.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా :

ఆమనగల్లు మండలం కోనాపూర్ కార్యదర్శి గ్రామసభ నిర్వహిస్తున్న సమయంలో దరఖాస్తులు తీసుకోకుండా, ఓ పార్టీకి చెందిన నాయకులతో దాబాకు వెళ్లి విందు చేసుకున్నారని స్థానికులు ఆరోపించారు. ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌లో నిర్వహించిన వార్డు సభలు రసాభాసగా మారాయి.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా:

నవాబుపేట మండలం కొల్లూరు గ్రామసభలో జాబితాలో అర్హుల పేర్లు రాలేదని అధికారులను నిలదీశారు.మరికల్ మండలం రాకొండలో గ్రామ సభ రసాభాసగా మారింది. ఒకే ఇంట్లో ఇద్దరు, ముగ్గురికి ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేర్లు రావడంతో గ్రామస్తులు ఆందోళన చేశారు. దీంతో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకోగా.. పహారా మధ్య గ్రామసభను కొనసాగించాల్సి వచ్చింది.

ఉమ్మడి వరంగల్ జిల్లా

గీసుకొండ మండలం మచ్చాపూర్ గ్రామసభ జరుగుతుండగా, అర్షం మనోజ్ వచ్చి... ఇందిరమ్మ ఆత్మీయ భరోసా స్కీంలో తాను లబ్ధిదారుల జాబితాలో ఉన్నానని, ఆ స్కీం తనకు వద్దంటూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.జనగామ మండలం శామీర్‌పేటలో నిర్వహించిన గ్రామసభకు వచ్చిన కలెక్టర్ రిజ్వాన్ బాషాను పలువురు ప్రశ్నించారు. రేషన్ కార్డులు, ఇతర పథకాలు వచ్చినోళ్లకే వస్తున్నాయి... మా సంగతేంటని ఓ వ్యక్తి కలెక్టర్‌ను నిలదీయగా, మరోసారి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.



ఛత్తీస్‌గఢ్- ఒడిశా సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల మృతదేహాలు

దండకారణ్యం.. నెత్తురోడింది

▶ మొదటి పేజీ తరువాయి

ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందగా ఒక జవాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఇరు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో అదనపు బలగాలను రంగంలోకి దింపి.. సోమవారం మధ్యాహ్నం నుంచి కూంబింగ్ ఆపరేషన్ ముమ్మరం చేశారు. మంగళవారం తెల్లవారుజామున మళ్లీ మావోయిస్టులు తారసపడటంతో ఎదురుకాల్పులు మొదలయ్యాయి. కొన్ని గంటల పాటు హోరాహోరీగా సాగిన ఈ ఎన్‌కౌంటర్‌లో 14 మంది మృతి చెందారు. రెండు రోజుల్లో కలిపి మృతి చెందిన మావోయిస్టుల సంఖ్య 16కు పెరిగింది.

మృతుల్లో మావోయిస్టు కీలక నేతలు

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఆంధ్రా- ఒడిశా బోర్డర్ (ఏఓబీ) స్పెషల్ జోనల్ కమిటీ మిలిటరీ కమిషన్ చీఫ్ చలపతి అలియాస్ ప్రతాపరెడ్డి రామచంద్రారెడ్డి అలియాస్ జయరాం ఈ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందినట్టు పోలీసులు ప్రకటించారు. ఆయనతోపాటు మరికొందరు కీలక నేతలు కూడా మృతుల్లో ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే చలపతి మృతిపై స్పష్టత ఇచ్చిన పోలీసులు మిగతా వారి వివరాలను వెల్లడించలేదు. మృతుల సంఖ్య 25 - 30 మంది వరకు పెరగవచ్చని భావిస్తున్నారు.

1,500 మంది.. 15 కిలోమీటర్ల సర్కిల్‌గా..

ఛత్తీస్‌గఢ్, ఒడిశాలకు చెందిన సుమారు 1,500 మంది పోలీసు బలగాలు కులారీఘాట్ అడవిని చుట్టుముట్టాయి. సుమారు 15-20 కిలోమీటర్ల సర్కిల్‌గా ఏర్పడి... కూంబింగ్ చేపడుతూ దగ్గరికి వచ్చాయి. సుమారు ఐదు కిలోమీటర్ల సర్కిల్‌లోకి రాగానే మావోయిస్టులు తారసపడినట్టు తెలిసింది. ఎన్‌కౌంటర్‌లో మరణించిన చలపతి సెంట్రల్ కమిటీ సభ్యుడు కావడంతో ఆయనకు మూడంచెల భద్రతా వ్యవస్థ ఉంటుంది. ముందు వరుసలో సెంట్రీలు కాపలాగా ఉంటే చివరి వరుసలో ఫీల్డ్ పెట్రోలింగ్ టీమ్ రక్షణగా ఉంటుంది. ఈ రెండింటి మధ్య బాంబులు అమర్చి ఉంటాయి. అయితే అగ్రనేతలు ఉన్నారనే పక్కా సమాచారంతోనే భద్రతా వలయాన్ని ఛేదించుకుని బలగాలు దాడి చేసినట్టు తెలిసింది. ఘటనాస్థలంలో ఇప్పటివరకు పది వరకు ఐఈడీలను గుర్తించి తొలగించినట్టు సమాచారం.

సరిహద్దుల్లో హైఅలర్ట్!

కులారీఘాట్ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఏవోబీ వ్యాప్తంగా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఘటన జరిగిన ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల సరిహద్దులకు సమీపంలో ఉన్న ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో పోలీస్ స్టేషన్లు, ఔట్‌పోస్టుల పరిధిలో రెడ్ అలర్ట్ అమలు చేస్తున్నారు. సరిహద్దుల్లో అదనపు బలగాలను రంగంలోకి దింపి కూంబింగ్ చేపడుతున్నారు. డ్రోన్ కెమెరాలతోనూ నిఘా పెట్టారు.

నక్సలిజం కొన ఊపిరితో ఉంది: అమిత్ షా



ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 14 మంది నక్సలైట్లు మృతిచెందడం మావోయిస్టులకు పెద్ద ఎదురుదెబ్బ అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ''నక్సలిజానికి మరో పెద్ద ఎదురుదెబ్బ. దేశాన్ని నక్సల్ రహితం చేయాలన్న లక్ష్యం దిశగా భద్రతాబలగాలు పెద్ద విజయం సాధించాయి. సీఆర్పీఎఫ్, ఒడిశా స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్, ఛత్తీస్‌గఢ్ పోలీసు బలగాలు చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో 14 మంది నక్సలైట్లు మృతి చెందారు. నక్సల్స్ లేని భారత్ దిశగా ఇదొక ముందడుగు. దేశంలో నక్సలిజం కొన ఊపిరితో ఉంది..''అని అమిత్ షా పేర్కొన్నారు.



2026 నాటికి అంతం చేస్తాం: ఛత్తీస్‌గఢ్ సీఎం

కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉన్న డబుల్ ఇంజన్ సర్కారు నక్సలిజం అణచివేతను విజయవంతంగా కొనసాగిస్తోందని ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ పేర్కొన్నారు. ''2026 మార్చి నాటికి నక్సలిజం నుంచి దేశానికి విముక్తి కలిగించాలన్న లక్ష్యంతో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పనిచేస్తున్నారు. ఆ లక్ష్యాన్ని సాధించే దిశగా భద్రతా దళాలు ముందుకెళుతున్నాయి. ఆ గడువులోగా రాష్ట్రంలో నక్సలిజాన్ని అంతం చేస్తాం..''అని తెలిపారు.



జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, పొన్నం, ఉత్తమ్, జూపల్లి, సీఎస్ శాంతికుమారి..

గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోండి

- అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు
- రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ
- కలెక్టర్లతో సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి, ఇతర మంత్రుల వెల్లడి
- ఈనెల 24 వరకు గ్రామ సభల నిర్వహణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో సహా పలువురు మంత్రులు స్పష్టం చేశారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు అనేది నిరంతర ప్రక్రియ అని, ఈ పథకాలకు ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోనివారు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈనెల 24 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న గ్రామ సభలు, వాటిలో నాలుగు పథకాలకు సంబంధించి ప్రజల స్పందన తదితర అంశాలపై కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

4 పథకాలకు రూ.40 వేల కోట్లు

ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలుకు దాదాపు రూ.40 వేల కోట్ల వ్యయం అవుతుందని మంత్రులు వెల్లడించారు. పదేళ్ల తర్వాత రాష్ట్రంలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నందున ఈ రెండు పథకాలకు అధికంగా దరఖాస్తులు వస్తున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఇప్పటికే వచ్చిన దరఖాస్తుల్లో ఇల్లు లేని వారు, ఇళ్ల స్థలం ఉండి ఇల్లు లేని వారి జాబితాను గ్రామ సభల్లో వెల్లడించాలన్నారు. ఇప్పటివరకు రేషన్ కార్డుల జారీకి సంబంధించి అర్హుల జాబితాను ప్రకటించలేదని, అన్ని దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే అర్హులను ప్రకటిస్తామని తెలిపారు. దరఖాస్తుల్లో పేరు, ఆధార్ కార్డు నంబర్, చిరునామా తదితర వివరాలు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలు విజయవంతంగా జరిగాయంటూ జిల్లా కలెక్టర్లను మంత్రులు అభినందించారు. రాష్ట్రంలో 4,098 గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించినట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వెల్లడించారు.

బిల్లులిచ్చాకే ఎన్నికలు జరపాలి

తెలంగాణ సర్పంచుల సంఘం
జేఏసీ వినతి

సాక్షి, హైదరాబాద్: తమ పెండింగ్ బిల్లులు చెల్లించాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ఎన్నికలు నిర్వహిస్తే.. బిల్లులు అందుకోని మాజీ సర్పంచులు వాటిని అడ్డుకుంటారని స్పష్టం చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా తమ పెండింగ్ బిల్లులు చెల్లించకుండా జాప్యం చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి రాసిన బహిరంగ లేఖలో జేఏసీ పేర్కొంది. 2019 నుంచి 2024 మధ్యకాలంలో గ్రామాల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేసినా.. తమ బిల్లులు పెండింగ్‌లో పెట్టారని జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం తమపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని ఆయన ఆరోపించారు.

గెరిల్లా సేనాని చలపతి

- ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన తొలి కేంద్ర కమిటీ సభ్యుడు
- ఏపీలోని చిత్తూరు జిల్లా మత్యం పైపల్లె స్వగ్రామం
- 1990 సమయంలో పీపుల్స్‌వార్‌లో చేరి అజ్ఞాతంలోకి..
- మిలిటరీ వ్యూహాలు, గెరిల్లా వార్‌ఫేర్‌లో దిట్టగా గుర్తింపు



అడవిలో చలపతి మృతదేహం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/చిత్తూరు అర్బన్/ మల్కన్‌గిరి: వరుస ఎన్‌కౌంటర్లతో కుదేలవుతున్న మావోయిస్టులకు ఊహించని షాక్ తగిలింది. ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి అలియాస్ రామచంద్రారెడ్డి అలియాస్ ప్రతాప్‌రెడ్డి అలియాస్ అప్పారావు మరణించారు. కేంద్ర కమిటీ సభ్యుడు ఇలా ఎన్‌కౌంటర్‌లో మృతిచెందడం మావోయిస్టు పార్టీ చరిత్రలోనే ఇది తొలిసారి కావడం గమనార్హం. చలపతిపై రూ.కోటి రివార్డు ఉన్నట్టు పోలీసు అధికారులు చెబుతున్నారు.

ఏపీలోని చిత్తూరు జిల్లాలో జన్మించి...

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలం మత్యం పైపల్లెకు చెందిన శివలింగారెడ్డి, లక్ష్మమ్మ దంపతుల మూడో కుమారుడు చలపతి. ఆయన తండ్రి సాధారణ రైతు. వారికి మత్యం పైపల్లెలో ఇప్పటికీ సొంతిల్లు ఉంది. ప్రస్తుతం ఆ ఇంట్లో చలపతి అన్న కుమారుడి కుటుంబం నివసిస్తోంది. ప్రాథమిక విద్యను మత్యంలోనే అభ్యసించిన చలపతి.. పదో తరగతి వరకు బంగారుపాళెం, డిగ్రీ ఒకేషనల్ కోర్సును చిత్తూరులో పూర్తిచేశారు. పీపుల్స్‌వార్ పార్టీకి ఆకర్షితుడై 1990-91లో అజ్ఞాతంలోకి వెళ్లారు. పోలీసు రికార్డుల ప్రకారం... శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో మావోయిస్టు పార్టీ విస్తరణకు కృషి చేశారు. శ్రీకాకుళం-కోరాపుట్ డివిజన్ ఇన్‌చార్జిగా పనిచేసిన ఆయన.. గెరిల్లా వార్‌ఫేర్‌లో చూపిన ప్రతిభతో అనతి కాలంలోనే డివిజనల్ కమిటీ సభ్యుడిగా ఎదిగారు. 2000 నాటికి ఆంధ్రా- ఒడిశా బోర్డర్ (ఏఓబీ) స్పెషల్ జోనల్ కమిటీ, ఏవోబీ స్టేట్ మిలిటరీ కమిషన్లలో సభ్యుడి హోదా పొందారు. 2010లో తోటి మావోయిస్టు అరుణ అలియాస్ చైతన్యను వివాహం చేసుకున్నారు. 2012లో జరిగిన ఒక దాడిలో చలపతి పొరపాటు కారణంగా ఒక కామ్రేడ్ చనిపోవడంతో పార్టీ ఆయనను కొంతకాలం డీమోట్ చేసింది. చలపతి భార్య అరుణ 2019 మార్చిలో జరిగిన ఓ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు.

మహేంద్ర కర్మపై దాడితో మళ్లీ తెరపైకి...

సల్వాజుడుం వ్యవస్థాపకుడు మహేంద్ర కర్మపై 2015లో చేసిన దాడితో చలపతి మరోసారి వెలుగులోకి వచ్చారు. తర్వాత మావోయిస్టు రీజనల్ కమిటీ చీఫ్ కుడుముల వెంకట రమణ అలియాస్ రవి ఎదురుకాల్పుల్లో మృతి చెందడం, గెమ్మెలి నారాయణరావు అలియాస్ జాంబ్రి 2017లో చనిపోవడంతో.. చలపతికి ప్రాధాన్యత దక్కింది. తర్వాతి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ కేంద్ర కమిటీ సభ్యుడి స్థాయికి చేరుకున్నారు. 2003లో దమన్‌జోడి మైన్స్ కంపెనీపై దాడి, మాచ్‌ఖండ్ పోలీసుస్టేషన్‌పై దాడి, చిత్రకొండ సమితిలో సెల్ టవర్ల పేల్చివేత, 2009లో ఏపీ గ్రేహౌండ్స్‌పై చిత్రకొండ జలాశయంలో దాడి, 2018లో జరిగిన అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోముల హత్యను ప్లాన్ చేసినది చలపతేనని చెబుతారు. 2011లో చలపతి ఒడిశా రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్న సమయంలో కలెక్టర్ వినీల్‌కృష్ణను మావోయిస్టులు కిడ్నాప్ చేశారు.

ఆర్కే సన్నిహితుడిగా.. హిడ్మాకు గురువుగా..

మావోయిస్టు పార్టీ మాస్టర్ మైండ్స్‌లో ఒకరిగా చలపతికి గుర్తింపు ఉంది. మావోయిస్టు అగ్రనేత ఆర్కేకు అత్యంత సన్నిహితంగా చలపతి మెలిగారు. ప్రస్తుతం పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ బెటాలియన్ వన్ కమాండర్‌గా ఉన్న మడావి హిడ్మాకు చలపతిని గురువుగా పేర్కొంటారు. ఆయన ఎలా ఉంటారనేది చాలా కాలం పాటు పోలీసులకు తెలియలేదు. 2016లో ఓ మావోయిస్టు చనిపోగా.. అతడి ల్యాప్‌టాప్‌లో చలపతి, ఆయన సహచరి అరుణ సెల్ఫీ వీడియో లభించింది.

టీడీపీలో సీనియర్లకు పొగ!

- పార్టీపై పూర్తి పట్టు కోసం లోకేశ్ ఎత్తులు
- సీనియర్లు పార్టీకి భారమని ముద్ర
- పొలిట్ బ్యూరో, కేంద్ర, రాష్ట్ర కమిటీల్లో మార్పులు
- లోకేశ్ చెప్పిన వారికే పదవులు
- సానా సతీష్, రామ్మోహన్ నాయుడు, కేశినేని చిన్ని వంటి వారికి ప్రాధాన్యం!
- యనమల, సోమిరెడ్డి, బుచ్చయ్య తదితరుల శకం ముగిసినట్టే

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీపై పూర్తి పట్టు సాధించేందుకు చంద్రబాబు కుమారుడు, మంత్రి నారా లోకేశ్ పార్టీలోని సీనియర్లకు పొగ పెడుతున్నట్లు పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. పార్టీలోని సీనియర్లను బయటకు పంపేసి, పూర్తిగా తన మనుషులతో నింపేందుకు లోకేశ్ ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకు పార్టీ అధినేత చంద్రబాబు కూడా తలొగ్గడంతో ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పార్టీలో సుదీర్ఘ కాలం పనిచేసిన సీనియర్ నేతలకు గడ్డుకాలం వచ్చింది. సీనియర్ల వల్ల ఎటువంటి ఉపయోగంలేదని, పార్టీకి భారమన్న ముద్ర వేసి వారిని బయటకు పంపే ప్రయత్నాలు జరుగుతున్నట్లు పార్టీవర్గాలు చెబుతున్నాయి. ఇందులో భాగంగా పొలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీల్లో ఉన్న పలువురు సీనియర్ నేతలకు త్వరలోనే ఉద్వాసన పలుకుతారని పార్టీలోనే ప్రచారం జరుగుతోంది. రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), గంటి హరీష్ మాథుర్, దీపక్‌రెడ్డి వంటి వారికి లోకేశ్ టీంగా పార్టీలో కీలక పదవులు ఇచ్చేందుకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. పార్టీపై లోకేశ్ పట్టు బిగిస్తుండటంతో చాలా కాలం నుంచి సీనియర్ల హవా తగ్గిపోయింది. లోకేశ్ అండదండలున్న నేతలు, ఆయనకు నచ్చిన వారికే పార్టీలో అవకాశాలు దక్కుతున్నాయి. చంద్రబాబు కూడా కుమారుడి మాట కాదనలేని పరిస్థితులు ఏర్పడ్డాయని సీనియర్ నాయకులు ఎప్పటి నుంచో అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికల్లో సీట్ల కేటాయింపు కూడా చాలావరకు లోకేశ్ అభీష్టం మేరకే జరిగినట్లు నేతలు చెబుతున్నారు. కాసులిచ్చిన వారికే సీట్లు దక్కాయని అప్పట్లో అనేక మంది నేతలు గగ్గోలు పెట్టారు. ఆ తర్వాత కూటమి ఆధ్వర్యంలో ఏర్పడిన మంత్రివర్గంలోనూ లోకేశ్ చెప్పిన వారికే చోటు దక్కింది. మంత్రి పదవులు ఖాయమనుకున్న అనేక మంది సీనియర్లను పక్కన పెట్టి తనకు నచ్చిన వారికి, తనతో లావాదేవీలు జరిపిన వారికే లోకేశ్ మంత్రి పదవులు ఇప్పించారనే ఆరోపణలు వచ్చాయి.

లోకేశ్ చేతిలోకి పొలిట్‌బ్యూరో!

ఇప్పుడు పార్టీలోనూ అదే తరహా నియామకాలకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. పార్టీలో అత్యంత కీలకమైన పొలిట్‌బ్యూరోను చేతుల్లోకి తీసుకోవడానికి లోకేశ్ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం పొలిట్‌బ్యూరో మొత్తాన్ని తన మనుషులతో నింపాలని ఆయన పట్టుబడుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం పొలిట్‌బ్యూరోలో సీనియర్ నాయకులైన యనమల రామకృష్ణుడు, అశోక్ గజపతిరాజు, చింతకాయల అయ్యన్నపాత్రుడు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కళా వెంకట్రావు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి వంటి అత్యంత సీనియర్లు ఉన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో వీరెవరికీ సరైన ప్రాధాన్యం దక్కలేదు. చంద్రబాబు తర్వాత ఆ స్థాయి నేతగా ఉన్న యనమల రామకృష్ణుడికి ఇటీవల పార్టీలో చెప్పుకోలేని అవమానాలు ఎదురయ్యాయి. కళా వెంకట్రావుకి ఎమ్మెల్యే సీటు నిరాకరించి, చివరికి వేరే చోట సర్దుబాటు చేశారు. గోరంట్ల బుచ్చయ్య చౌదరి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వంటి వారిని పక్కన పెట్టేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన కింజరాపు అచ్చెన్నాయుడికి ఇప్పుడు పార్టీలో సరైన స్థానం లేదు. పేరుకి మంత్రిగా ఉన్నా ఆయనకున్న ప్రాధాన్యత ఏమిటో అందరికీ తెలిసిందే. అన్ని జిల్లాల్లోనూ సీనియర్ నాయకులను కాదని కొత్తగా లోకేశ్‌కు దగ్గరైన వారికే పెత్తనం అప్పగించారు. గంటా శ్రీనివాసరావు, పితాని సత్యనారాయణ, నిమ్మకాయల చినరాజప్ప వంటి వారిని సైతం నియోజకవర్గాలకే పరిమితం చేశారు. వీరంతా గతంలో పార్టీలో చక్రం తిప్పినవారే. అలాంటి వారందరినీ పూర్తిగా పక్కకు తప్పించి పొలిట్‌బ్యూరోలో, ఇతర కమిటీల్లోనూ తనకు అనుకూలంగా ఉండే వారిని నియమించుకోవడానికి లోకేశ్ కసరత్తు పూర్తి చేసినట్లు సమాచారం. చంద్రబాబు కూడా అందుకు సానుకూలంగా ఉన్నట్లు టీడీపీ నేతలు చెబుతున్నారు.

పేరెంటింగ్



'కౌమార వయసులో ఉండే పిల్లలు చదవడానికి పుస్తకాలు లేవు. వారి కోసం ప్రపంచ దేశాలు పుస్తకాలు అచ్చు వేసే పనిలో పడ్డాయి' అన్నారు 'చెన్నై ఇంటర్నేషనల్ బుక్‌ఫెయిర్'కు హాజరైన ప్రసిద్ధ పబ్లిషర్లు. ప్రతి సంవత్సరం ఇటలీలో, షాంఘైలో 'ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ బుక్‌ఫెయిర్'లు భారీగా జరుగుతాయి. కాని మన దేశంలో కోట్ల మంది బాలలున్నా బాల సాహిత్యం ఊసే ఉండదు. బాల సాహిత్యమే కేంద్రంగా సాగిన చెన్నై ఇంటర్నేషనల్ బుక్‌ఫెయిర్ నుంచి తల్లిదండ్రులు తెలుసుకోవాల్సిన సంగతులు చాలా ఉన్నాయి.

పుస్తకాలతో పెంచుదాం

'కాలేజీ చదువుల తర్వాత కూడా అందరూ అవే క్లాసు పుస్తకాలు చదవక తప్పని పరిస్థితి ఉంటే బతుకు ఎంత నరకంగా ఉంటుందో... స్కూలు పుస్తకాలు మాత్రమే చదవమంటే పిల్లలకూ అంతే నరకంగా ఉంటుంది. విద్య అనేది అందరికీ దొరికే అవకాశం. కాని వినోదం, ఆహ్లాదం, విజ్ఞానం కలిగించే బాలల సాహిత్యం చదవడమే పిల్లలకు జీవితం అంటే ఏమిటో తెలియచేస్తాయి. మనం మాత్రం కాల్పనిక సాహిత్యం చదువుతూ పిల్లలను స్కూలు పుస్తకాలకు వదిలిపెట్టడంలో ఔచిత్యం ఏమిటో మీరే ఆలోచించండి' అన్నారు సైమన్ జాకస్.

కెనడాలో పిల్లల పుస్తకాల పబ్లిషర్‌గా ప్రసిద్ధి పొందిన జాకస్ ప్రస్తుతం ఆ దేశంలో బాలల వికాసం కోసం పుస్తకాలు అందుబాటులోకి తేవడానికి చేస్తున్న ప్రయత్నాలను చెప్పారు– 'చెన్నై ఇంటర్నేషనల్ బుక్ ఫెయిర్' (సి.ఐ.బి.ఎఫ్)లో. ఈ ఉత్సవం జనవరి 16–18 తేదీల్లో జరిగింది. తమిళ సాహిత్యాన్ని ఇతర భాషల్లోకి, ఇతర భాషల సాహిత్యాన్ని తమిళంలోకి తీసుకురావడానికి పబ్లిషర్ల మధ్య ఒడంబడికలు చేసే ప్రత్యేక పుస్తక ఉత్సవం ఇది.

'కెనడాలో ఇప్పుడు ప్రతి క్లాస్‌లో లైబ్రరీలు ఏర్పాటు చేస్తున్నారు. స్కూలు పుస్తకాలు కాకుండా పిల్లలు ఈ సాహిత్య పుస్తకాలను ఖాళీ ఉన్నప్పుడు చదువుకోవచ్చు. బాల సాహిత్యం కోసం వారికి తెలియాల్సిన అన్ని విషయాలను కథలుగా రాయించి అందుబాటులోకి తెస్తున్నాం. ఉదాహరణకు ఊహ తెలిశాక దత్తతకు వచ్చిన పిల్లవాడు తన అంతర్మథనాన్ని అర్థం చేసుకునే పుస్తకం కూడా సాహిత్యరూపంలో పెడుతున్నాం' అన్నారాయన.



చెన్నై ఇంటర్నేషనల్ బుక్ ఫెయిర్‌లో మాట్లాడుతున్న వక్తలు

అంతర్జాతీయ ఉత్సవాలు

'భారతదేశంలో కోట్లమంది బాలలు ఉన్నారు. కాని బాల సాహిత్యం తగినంత అందుబాటులో లేదు. పిల్లలను సినిమాకు తీసుకెళతారు గాని వారికి పుస్తకాలు కొనివ్వరు తల్లిదండ్రులు. కాని ప్రపంచ దేశాలు ఇప్పుడు కేవలం పిల్లలకు సాహిత్యం అందించే ప్రయత్నంలో ఉన్నాయ'ని అన్నారు సి.ఐ.బి.ఎఫ్‌లో పాల్గొన్న పబ్లిషర్లు. ఇటలీలోని బొలొనియా నగరంలో రాబోయే మార్చిలో 'బొలొనియా అంతర్జాతీయ పిల్లల పుస్తక ప్రదర్శన' జరుగుతుంది. దీని నిర్వాహకురాలు జాక్స్ థామస్ కూడా ఈ వేదిక మీద పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ 'బొలొనియా చిల్డ్రన్స్ బుక్‌ఫెయిర్‌లో ప్రపంచ దేశాల బాలల రచయితలు, పబ్లిషర్లు, చిత్రకారులు పాల్గొంటారు. ఒక దేశ రచయితలు మరో దేశ పబ్లిషర్లతో ఒడంబడికలు చేసుకుంటారు. ఇటలీ రచయిత, జపాన్ పబ్లిషర్, రష్యన్ చిత్రకారుడు కలిసి ఒక పుస్తకం తయారు చేసే ఆలోచన చేయడం ఇక్కడ కనిపిస్తుంది. అదొక పిల్లల ప్రపంచం. తమిళనాడు ప్రభుత్వం ఇక్కడ తమ పుస్తకాలు ప్రదర్శనకు పెడుతోంది. ఇలా ప్రతి భారతీయ భాష నుంచి జరగాలి' అని అన్నారు. బొలొనియా బాలల బుక్ ఫెయిర్ జరిగినంత ఘనంగా షాంఘైలో ప్రతి నవంబర్‌లో పిల్లల బుక్‌ఫెయిర్ జరుగుతుంది. ఎక్కడ చూసినా బాల సాహిత్యమే కనపడుతుంది అక్కడ. కాని మన దేశంలో 'అడవిలో దూరంగా పులి గాండ్రింపు వినిపించింది' అనే వాక్యం చదివి దానికి తగ్గ బొమ్మను చూస్తే పిల్లల్లో కలిగే ఊహను మనవాళ్లు ఏమాత్రం అనుమతించడం లేదు. మార్కులు కావాలి మన తల్లిదండ్రులకు.

లైంగిక చైతన్యం

'నేనొక కథ రాశాను. ఆ కథను చాలా స్కూళ్లలో లైంగిక చైతన్యంలో భాగంగా చదివి వినిపిస్తున్నారు. స్కూల్లో ఆ పాఠం విన్న ఒక పిల్లవాడు నాకు ఫోన్ చేశాడు. అంకుల్... నన్ను ఒకతను అబ్యూజ్ చేశాడు. ఆ రోజు నుంచి ఆ తప్పు చేసింది నేనే అనే భావనతో నలిగిపోతున్నాను. కాని మీ కథ చదివాక తప్పు చేసింది ఆ వ్యక్తి అని, నేను బాధితుణ్ణి అని తెలుసుకున్నాను. నా బాధపోయింది. నన్ను బాధ పెట్టినవాడి గురించి ఇప్పుడు మా ఇంట్లో చెప్పగలను– అని చెప్పాడు. నాకు చాలా సంతోషం వేసింది. బాల సాహిత్యం ఏం చేస్తుందంటే ఇదంతా చేస్తుంది' అన్నారు మరో రచయిత బాల భారతి.

టీనేజ్ పిల్లలకు పుస్తకాలు లేవు

చెన్నై బుక్ ఫెయిర్‌లో ప్రసిద్ధ బాలసాహిత్య ప్రచురణ సంస్థ 'తులిక బుక్స్' ఎడిటర్ ప్రియ కృష్ణన్ పాల్గొన్నారు. 'పది పన్నెండేళ్ల వయసున్న పిల్లలు చదవదగ్గ పుస్తకాలు ఇప్పుడు లేవు. ఈ విషయంలో చాలా కొరత ఉంది. పిల్లలు పుస్తకాలు చదవడానికి సిద్ధంగా ఉన్నారు. కాని మనకు బాలల రచయితలు, ప్రచురణ కర్తలు, బాల సాహిత్యానికి బొమ్మలు వేసే చిత్రకారులు చాలా తక్కువగా ఉన్నారు. అందరం పూనుకొని శ్రద్ధపెట్టకపోతే పిల్లలు సెల్‌ఫోన్‌లలో కనిపించే డిజిటల్ ప్రపంచంలో తప్పిపోతారు' అని ఆవేదన వ్యక్తం చేశారు.

పిల్లలకు మనోవికాసం, సమాజాన్ని ఎదుర్కొనే దిలాసా కలగాలంటే సాహిత్యం వల్ల కలుగుతుంది. చిన్న విషయాలకే పిల్లలు ఎందుకు కలత పడుతున్నారో అర్థం చేసుకుంటే ప్రతి తల్లిదండ్రులు వారి చేతుల్లో ఇవాళే పుస్తకాలు పెట్టగలరు.

– సాక్షి ప్రతినిధి

తల్లిదండ్రులతో వెళ్లొద్దు

'మన దేశంలో కొన్ని నగరాల్లో బుక్‌ఫెయిర్‌లు జరుగుతుంటాయి. పిల్లల్ని తల్లిదండ్రులు ఆ బుక్‌ఫెయిర్‌లకు తీసుకువెళతారు. కాని పిల్లలు ఇలాంటి వాటికి తల్లిదండ్రులతో వెళ్లకూడదు. ఎందుకంటే తల్లిదండ్రులు నేరుగా వారిని తీసుకెళ్లి కలెక్టర్ కావడం ఎలా వంటి పుస్తకాలు కొనిపెడతారు. దయచేసి వాళ్లకు డబ్బు ఇచ్చి వదిలిపెట్టండి. ఏం కావాలో అది కొనుక్కోనివ్వండి. అదొక్కటే కాదు... పిల్లల పుస్తకాలు అత్యంత తక్కువ ధరకు దొరికే ఏర్పాటు చేయాలి. ఆ పుస్తకాన్ని ఆశించిన ఏ ఒక్క పిల్లవాడు కూడా అది దక్కలేదని నిరాశపడకూడదు' అన్నారు రచయిత నటరాజన్. ఆయన బాలల కోసం 120కి పైగా పుస్తకాలు రాశారు.



లక్ష్య సాధన

కలల ముందు అలలు చిన్నవే!

ఇంగ్లిష్ ఛానెల్‌ను ఈదిన తొలి తెలుగు మహిళగా గంధం క్వీని విక్టోరియా గుర్తింపు పొందారు. హైదరాబాద్ వాసి అయిన విక్టోరియా ఈ నెల 19న 'సేవ్ అవర్ ఓషన్స్' అనే కాన్సెప్ట్‌లో భాగంగా నవతరాన్ని ప్రోత్సహించడం కోసం ముంబయి సమీపంలోని మండ్వాజెట్ నుంచి గేట్‌వే ఆఫ్ ఇండియా వరకు తన కుమారుడు స్టీఫెన్ కుమార్‌తో కలిసి ఓపెన్ వాటర్ స్విమ్మింగ్ చేశారు. తల్లీ కుమారుడు కలిసి ఓపెన్ స్విమ్మింగ్‌లో పాల్గొనడం దేశంలోనే మొదటిసారి. సప్తసముద్రాలను పిల్లలతో కలిసి ఈదుతా అంటూ తన కలల అలలను 'సాక్షి'తో పంచుకున్నారు.

హైదరాబాద్ బర్కత్‌పురలో ఉంటున్న గంధం క్వీని విక్టోరియా గృహిణిగా, తల్లిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ తన కలల సాధన కోసం కృషి చేస్తోంది. ఈ క్రమంలో ''నా పిల్లల కలలకు ఓ మార్గం వేయాలనుకున్నాను. పిల్లలు చురుగ్గా ఉండాలంటే వారికి స్పోర్ట్స్ అవసరం చాలా ఉంది. దీంట్లో భాగంగా వారిని స్కూల్ ఏజ్‌లో స్విమ్మింగ్‌లో చేర్చాను. నేనూ వారితోపాటు స్విమ్మింగ్‌లో చేరాను. పిల్లల కోసం నేర్చుకున్న స్విమ్మింగ్ నేను ఇంగ్లిష్ ఛానెల్ ఈదేంత వరకు వెళ్లింది. గుర్తింపు వచ్చింది.


ఓపెన్ స్విమ్మింగ్ తర్వాత కుమారుడు స్టీఫెన్ కుమార్‌తో విక్టోరియా

విమర్శలను పక్కన పెట్టి..

చాలా మంది విమర్శించారు. ఈ వయసులో స్విమ్మింగ్ అవసరమా? అన్నవాళ్లు ఉన్నారు. గుర్తింపు కోసం చేస్తున్న తపన అని, డబ్బులు ఎక్కువయ్యాయి అని.. ఒక్కొక్కరు ఒక్కో మాట. మాది మధ్య తరగతి కుటుంబం. పెళ్లితో ఆగిపోయిన ఇంటర్మీడియెట్ చదువును కొనసాగించాను. పిల్లలు పుట్టిన తర్వాత డిగ్రీతో పాటు బీఎడ్ చేశాను. మావారు అనిల్ కుమార్ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగి. ఇద్దరు పిల్లల పెంపకంలో ఆర్థిక ఇబ్బందులు వచ్చాయి. దీంతో నాకు వచ్చిన కుట్టుపనితో టైలర్‌గా మారాను. మా వారి సంపాదనకు తోడుగా బొటిక్‌లో వచ్చిన ఆదాయంతో నిలదొక్కుకున్నాం.

పిల్లలు మాట విన్నారు...

పిల్లలతో పాటు స్విమ్మింగ్‌లో చేస్తున్నప్పుడు నీటి కాలుష్యం గురించి అనేక ఆలోచనలు వచ్చేవి. స్విమ్మింగ్ పూల్స్ నుంచి నదుల్లో ఈత వరకు నా ప్రయాణం, అటునుంచి సముద్రాలను ఈదాలనే తపనను పెంచింది. దాంట్లో భాగంగా ఇంగ్లిష్ చానెల్‌ను ఈదిన మొదటి భారతీయ మహిళగా గుర్తింపు వచ్చింది. సముద్రాలలో ఉండే శక్తి అర్థమైంది. ఆ ఆనందంలో ఉండగా నా పిల్లల గురించి ఆలోచన చేశాను. నేను నా ప్రయాణంలో ముందుకు వెళుతున్నాను. కానీ, నా పిల్లలు వెనకబడి పోతున్నారా.. అని ఆలోచించాను. మా అమ్మాయి ఎలిజబెత్ క్వీన్, అబ్బాయి స్టీఫెన్ కుమార్‌లను కూర్చోబెట్టి వారితో చర్చించాను. 'సప్తసముద్రాలను మీతో కలిసి ఈదాలని ఉంది' అన్నాను. ఇద్దరూ నా మాటలతో ఏకీభవించారు. అయితే, ఆర్థిక సమస్యలతో ఎదురయ్యే ఇబ్బందుల గురించి మా అమ్మాయి ప్రస్తావించింది. 'సముద్రాలను ఈదాలంటే ఖర్చుతో కూడిన పని. ముగ్గురం పాల్గొంటే డబ్బు సమస్యలను ఎదుర్కోవాలి. ముందు మీ ఇద్దరు పాల్గొనండి. తర్వాత నేనూ జాయిన్ అవుతాను' అంది. దీంతో 'సేవ్ అవర్ ఓషన్స్' కాన్సెప్ట్‌తో స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, మహారాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మా అబ్బాయి స్టీఫెన్ కుమార్‌తో కలిసి, ఈ నెల 19న అరేబియా సముద్రంలోని మాండ్వా జెట్ నుంచి ముంబై గేట్ వే ఆఫ్ ఇండియా వరకు 17.1/2 కి.మీ ఓపెన్ వాటర్ స్విమ్మింగ్ చేసి, రికార్డు నెలకొల్పాం.

తల్లిదండ్రులకు అవగాహన

ఉదయం 7 గంటల 36 నిమిషాలకు స్విమ్మింగ్ చేయడం ప్రారంభిస్తే మధ్యాహ్నం 2 గంటల 37 నిమిషాలకు ముంబైలోని గేట్ వే ఆఫ్ ఇండియా చేరుకున్నాం. చివరి 800 మీటర్ల స్విమ్మింగ్ మాత్రం గంటకు పైగా సమయం పట్టింది. తల్లిదండ్రులు స్పోర్ట్స్ నుంచి వారి పిల్లలను యాక్టివిటీస్‌కు దూరం పెడుతున్నారు. వీటివల్ల ఏం లాభం అనుకుంటున్నారు. కానీ, పిల్లల మానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడలు ఎలా తోడ్పడతాయో గుర్తించడం లేదు. ఆ ఆలోచన కూడా కలిగించాలనేది మరో ఉద్దేశ్యం.

డిజిటల్ ప్రపంచం నుంచి బయటకు

సోషల్ మీడియా నుంచి, ఒత్తిడితో కూడుకున్న చదువుల నుంచి నా పిల్లలను బయటకు తీసుకు రావాలనుకున్నాను. అది క్రీడల వల్ల సాధ్యం అవుతుందని నమ్మాను. పిల్లలతో తల్లిదండ్రులు టైమ్ గడపాలంటే ఏదో ఒకటి ఇలాంటి యాక్టివిటీ పెట్టుకోవాలి అనుకున్నాను. ముందు పిల్లల ప్రపంచంలోకి నేను వెళ్లాను. ఇప్పుడు మా ప్రపంచం ఒకటే అయ్యింది. సాధారణంగా ప్రతి రోజూ ఉదయం 4 గంటలు స్విమ్మింగ్‌కి కేటాయిస్తాం. పోటీ ఉంటే మాత్రం మరో రెండు గంటల సమయం కేటాయిస్తాం. శరీరానికి కావల్సిన శక్తి కోసం పోషకాహారాన్ని ఇంట్లోనే తయారు చేస్తాను. టైలరింగ్ చేస్తాను. పిల్లలిద్దరూ డిగ్రీ చేస్తున్నారు. వాళ్లతో కలిసి ప్రపంచంలోని ఏడు మహా సముద్రాలను ఈదాలనే లక్ష్యంతో సాధన చేస్తున్నాం. ప్రతిరోజూ నాకు వచ్చే ఆదాయంలో కొంత ఈ ఇవెంట్స్ కోసం పొదుపు చేస్తుంటాను. చివరి నిమిషంలో అమౌంట్ తక్కువ పడితే మా వారి సాయం, లోన్, స్పాన్సర్స్ కోసం ట్రై చేస్తుంటాం. మొన్న జరిగిన ఈవెంట్‌కు సిటీ పోలీస్ డిపార్ట్‌మెంట్, డ్రీమాక్సిజ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ, నా దగ్గర బట్టలు కుట్టించుకునేవారు సాయం అందించారు. రాబోయే ఏప్రిల్‌లో సౌత్ ఆఫ్రికాలోని రాబిన్ ఐలాండ్‌లో స్విమ్ చేయడానికి సాధన చేస్తున్నాం. కొందరు ఈ వయసులో అవసరమా.. అని కామెంట్ చేస్తుంటారు. సముద్రాల్లో ఈదుతూ ఉంటే ఇంటిని వదిలేసినట్టేగా అని సెటైర్లు వేస్తుంటారు. ఏ స్త్రీ అయినా వారి వయసుకు సంబంధం లేకుండా సాహసాలు చేస్తోందంటే దాని వెనక ఎన్నో కలలు, లక్ష్యాలు ఉంటాయి. భవిష్యత్తులో ఎవరైనా క్వీని విక్టోరియా అనగానే తన ఇద్దరు పిల్లలతో కలిసి సప్త సముద్రాలను ఈదింది అనే గుర్తింపు, తల్లిగా తన విజయంలో పిల్లలను ఎలా భాగస్వామ్యం చేసింది.. అనే విషయాలు అందరికీ గుర్తుకు రావాలి. తల్లిదండ్రులు చేసే కృషిని పిల్లలు ఎంత బాగా అర్థం చేసుకుంటారో కూడా మా ఈ ప్రయత్నం ద్వారా తెలియజేయాలనుకుంటున్నాను' అని వివరించారు విక్టోరియా.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

లీగల్

ఆ కేసు చెల్లకపోవచ్చు!

నేను ఒక వ్యక్తి దగ్గర 2019 జనవరి లో కొంత డబ్బు అప్పుగా తీసుకున్నాను. కానీ కోవిడ్ వేవ్ రావడం వల్ల ఉద్యోగం పోయి అనుకున్న సమయానికి తిరిగి ఇవ్వలేకపోయాను. డబ్బు తీసుకునేటప్పుడు ష్యూరిటీ కింద ప్రామిసరీ నోటు, డేట్ వేయని రెండు చెక్కులు ఇచ్చాను. పోయిన నెలలో ఆ చెక్కులు నాకు చెప్పకుండా బ్యాంకులో వేసి బౌన్స్ చేశారు. చెక్ బౌన్స్ కేసు వేస్తాము అంటూ లీగల్ నోటీస్ కూడా పంపించారు. నేను డబ్బు కట్టేస్తాను అని వారికి తెలియజేయగా, 'ఇప్పుడు తీసుకున్న దానికి మూడింతలు ఇవ్వాలి, లేకుంటే నీ మీద చీటింగ్ కేసు పెడతాము, జైలుకు వెళతావు' అని బెదిరిస్తూ ఎక్కువ డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. తగిన పరిష్కారం చూపగలరు.

– మానవేందర్, విజయవాడ

అవతలి వాళ్లు మీ మీద చీటింగ్ కేసు పెడతామని అనగానే భయపడవలసిన అవసరం లేదు. కోర్టు వాయిదాల వల్ల కొంత ఇబ్బంది ఎదుర్కొన్నప్పటికీ సరైన న్యాయసలహా పొందితే తప్పుడు కేసుల నుంచి తప్పించుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. సివిల్ కేసులను క్రిమినల్ కేసులుగా వర్ణించి, క్రిమినల్ చట్టాల కింద కేసులు పెట్టడం ఒక అలవాటుగా మారిపోయింది. చాలా సందర్భాలలో హైకోర్టులు, సుప్రీంకోర్టు సైతం అలాంటి కేసులను కొట్టివేశాయి. మీ కేసులో కూడా సివిల్ కేసును క్రిమినల్ పరిధిలోకి తీసుకురావడానికి చట్టాన్ని దుర్వినియోగం చేశారు అని రుజువైతే కేసు కొట్టివేస్తారు.

ఇకపోతే... చెక్కు బౌన్స్ కేసులో వచ్చిన నోటీసుకు సరైన గడువులోపు సమాధానం ఇవ్వవలసి ఉంటుంది. ఆ సమాధానంలోనే చెక్కు మీద రాసినంత నగదు చెల్లిస్తాము అని అంగీకరిస్తూ కూడా మీరు నోటీసుకు రిప్లై ఇవ్వవచ్చు. ఒకవేళ నోటీసులో తప్పులు ఉన్నట్లయితే వాటన్నింటినీ తిరస్కరిస్తూ మీరు ప్రపోజల్ చేయవచ్చు. ఒకవేళ వాళ్లు అప్పటికీ కేసు వేస్తే, కోర్టుకు కూడా మీ వాదనలు తెలియపరుస్తూ, నగదు అప్పు చెల్లిస్తాము అని చెప్తే, కోర్టు మీ అభ్యర్థనను పరిగణించి అందుకు అనుగుణంగా తీర్పు చెబుతుంది. అప్పుడు మీకు జైలు శిక్ష పడకపోవచ్చు. అయితే చెక్‌బౌన్స్ కేసులలో నిందారోపితులు డబ్బులు కట్టేస్తాము అన్నంత మాత్రాన నేరం లేకుండా పోదు. ఇటీవలే సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కూడా అదే చెప్తుంది. కాబట్టి చెక్ బౌన్స్ కేసును మాత్రం కొంత సీరియస్‌గానే పరిగణించండి. మీ లాయర్ గారి సలహా మేరకు కేసు నడపాలా లేక రాజీ కుదుర్చుకోవాలా అనే నిర్ణయాన్ని తీసుకోవడం మంచిది. మీరు డబ్బులు ఇవ్వాలి అనేది నిజమే అని చెప్తున్నారు కాబట్టి, లాయర్ గారి ద్వారా లేదా కోర్టు అనుమతి ద్వారా కూడా మధ్యవర్తిత్వం చేసి రాజీ కుదుర్చుకోవచ్చు.



– శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

ఎంపవర్‌మెంట్

ఆకాంక్ష ఫలించింది

కాలక్షేపం కోసం, అందరూ కలిసి ఒకచోట టీ తాగుతూ కబుర్లు చెప్పుకోవడానికి లక్నోలోని ఐఏఎస్ అధికారుల భార్యలు ఒకచోట చేరేవారు. ఆ తరువాత ఐఏఎస్ ఆఫీసర్స్ వైఫ్స్ (ఐఏఎస్ ఓడబ్ల్యు) ఏర్పాటు చేశారు. కాలక్రమంలో ఈ సంస్థ సామాజిక సేవ వైపు తన పరిధిని విస్తరించింది. స్వయం –సహాయక సంఘం 'ఆకాంక్ష'తో ఎంతోమంది సామాన్య మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.

తాజా విషయానికి వస్తే... 'ఆకాంక్ష'లోని మహిళా సభ్యులు కుంభమేళాలో 20 స్టాల్స్ ఏర్పాటు చేశారు..

'ఆకాంక్ష' అనేది 'ఐఏఎస్‌వోడబ్ల్యు'కు స్వయం సహాయక సంఘం. కుంభమేళాలో భక్తుల సందడే కాదు లక్నోలోని 'ఆకాంక్ష'లో భాగమైన 'మసాల మాత్రి కేంద్ర' మహిళల సందడి, సంతోషాలు కూడా కనిపిస్తాయి. నిన్న మొన్నటి వరకు వారు సాధారణ గృహిణులు. ఎప్పుడో తప్ప కొత్త ఊరికి వెళ్లని వారు. 'ఆకాంక్ష' పుణ్యమా అని వ్యాపారవేత్తలుగా మారారు. దేశంలోని ఎన్నో ప్రాంతాలకు వెళుతున్నారు.


'ఆకాంక్ష' సభ్యులతో రష్మీసింగ్

ఉత్తరప్రదేశ్‌లోని ఐఏఎస్ ఆఫీసర్స్ వైఫ్స్ అసోసియేషన్ (ఐఏఎస్ వోడబ్ల్యు)కు కేవలం ఐఏఎస్ అధికారుల భార్యలు మాత్రమే నేతృత్వం వహించడం లేదు. గత సంవత్సరం జులైలో ఐఏఎస్ ఆఫీసర్ రష్మీసింగ్ అధ్యక్షురాలు అయింది. 'ఐఏఎస్ వోడబ్ల్యు'కు ప్రెసిడెంట్ అయిన తొలి ఐఏఎస్ ఆఫీసర్‌గా నిలిచింది.

జమ్మూకశ్మీర్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అయిన రష్మీ యూపీ చీఫ్ సెక్రటరీ మనోజ్ కుమార్‌సింగ్ భార్య.

మసాల, మాత్రి (ఉప్పగా ఉండే స్నాక్స్) తయారీకి ప్రసిద్ధి చెందిన 'మసాల మాత్రి కేంద్ర'లో గతంతో పోల్చితే ఇప్పుడు ప్రొఫెషనలిజం పెరిగింది. లడ్డూలు, చిక్కీలు, బ్యాగుల తయారీ, హస్తకళలలో విస్తరించింది. లక్నోకు చెందిన ఈ సంస్థ కార్యకలాపాలను నోయిడాకు విస్తరించనున్నారు. కొన్ని నెలల క్రితం తమ ఉత్పత్తులతో భారీఎత్తున ఎగ్జిబిషన్ నిర్వహించారు. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

'ఈ ఎగ్జిబిషన్ ఆకాంక్ష సభ్యులకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది. ముఖ్యమంత్రిని తొలిసారి చూసినవాళ్లు ఎంతోమంది ఉన్నారు. ఎగ్జిబిషన్ అనేది వారికి కేవలం డబ్బు సంపాదన మాత్రమే కాదు. కొత్తప్రాంతానికి రావడం, కొత్త వ్యక్తులతో మాట్లాడడం... ఇలా ఎన్నో అనుభవాలను సొంతం చేసుకున్నారు' అంటుంది రష్మీసింగ్.

'మొదటిరోజు స్వయం సహాయక బృందానికి చెందిన మహిళ ఒకరు రెండు వేలే సంపాదించానని అసంతృప్తిగా మాట్లాడింది. అయితే ఈవెంట్ ముగిసే సమయానికి రూ.30,000 సంపాదించింది. ఆ సంతోషాన్ని అందరితో పంచుకుంది' అంటుంది ఐఏఎస్‌వోడబ్ల్యు – ఉత్తర్‌ప్రదేశ్ కార్యదర్శి ప్రతిభ.

యాభై నాలుగు సంవత్సరాల హలీమా గత దశాబ్దకాలంగా 'ఆకాంక్ష'తో కలిసి పని చేస్తోంది. ఈ కార్యక్రమం వల్ల ఆమెకు కశ్మీర్ నుంచి వచ్చిన మహిళలతో మాట్లాడే అవకాశం వచ్చింది. వ్యాపారం నుంచి తమ ప్రాంత ప్రత్యేకతల వరకు ఎన్నో విషయాలపై మాట్లాడుకున్నారు. వీరు మరోసారి కుంభమేళాలో కలవనున్నారు.

'ఆకాంక్ష అనేది మా అందరి ప్రాజెక్ట్. మొదట్లో స్వయం సహాయక బృందం సభ్యుల మైండ్‌సెట్‌లో మార్పు తీసుకురావడానికి కృషి చేశాం. వారిని పాత పద్ధతుల నుంచి కొత్త దారిలోకి తీసుకువచ్చాం' అంటుంది రష్మీసింగ్.

'మా సంస్థ ఒకప్పుడు ఐఏఎస్ అధికారుల భార్యలు టీ తాగడానికి, ముచ్చటించడానికి, యోగా కార్యక్రమాలను నిర్వహించడానికి వేదికగా ఉండేది. ఇప్పుడు దాని పరిధి ఎంతో విస్తరించింది. సామాజిక సేవదారిలో ప్రయాణిస్తుంది' అంటుంది శైలజ చంద్ర.

'నాకు మార్నింగ్ టీ కప్‌తోపాటు ఆకాంక్ష స్నాక్స్ తప్పకుండా ఉండాల్సిందే' అంటున్నాడు ఒక కస్టమర్. 'ఆకాంక్ష' సాధించిన అద్భుత విజయానికి ఈ ఒక్క మాట చాలు కదా!





నలుగురికి ఉపయోగపడేలా...

'ఐఏఎస్ వోడబ్ల్యు'లో మునపటి క్లబ్-స్టైల్ మీటింగ్స్, దాండియా నైట్స్, హెయిర్ స్టైల్స్, కాస్మెటిక్ సర్జరీకి సంబంధించిన వర్క్‌షాప్‌లు దాదాపుగా కనుమరుగు అయ్యాయి. అణగారిన మహిళలకు జీవనోపాధి చూపడంలో సంస్థ చురుగ్గా ఉంది. 'నలుగురు ఒక చోట కలిస్తే పది మంచి పనులు చేయవచ్చు' అని నిరూపించిన 'ఐఏఎస్ వోడబ్ల్యు' దేశవ్యాప్తంగా ఎంతోమందికి స్ఫూర్తిని ఇస్తోంది.

బ్యూటిప్

నాచురల్ రింకిల్ క్రీమ్



నగం కీరకాయ, ఒక కోడిగుడ్డు, రెండు టేబుల్ స్పూన్ల పాల మీగడ, పావు కప్పు ఆయిల్ (వీట్ జెర్మ్, ఆలివ్, అవొకాడోలలో ఏదో ఒకటి) తీసుకోవాలి. కీరకాయను శుభ్రంగా కడిగి చెక్కు తీయకుండా ముక్కలు చేయాలి. ఈ ముక్కలను, మిగిలిన అన్నింటితో కలిపి బ్లెండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లయ్ చేసి పది నిమిషాల తర్వాత టిష్యూతో కాని కాటన్‌తో కాని తుడిచేయాలి. ఇలా ఉదయం, రాత్రి చేస్తుంటే మంచి ఫలితం ఉంటుంది. ఈ మిశ్రమాన్నిఒకసారి తయారు చేసుకుని ఫ్రిజ్‌లో పెట్టి మూడు రోజుల వరకు వాడవచ్చు.

ఇంటిప్స్

యాలకులతో ఆరోగ్యం



- ఆస్తమా, దగ్గు, జలుబును తగ్గించడంలో యాలకులు మెరుగ్గా పని చేస్తాయి. రోజు మూడు నాలుగుసార్లు యాలకులను బాగా నమిలి ఆ రసాన్ని మింగుతుంటే ఈ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.
- యాలకులను రోజు తింటుంటే గుండె సమస్యలు తొలగిపోతాయి. రక్త సరఫరా మెరుగుపడుతుంది.
- రక్త హీనత సమస్య ఉన్నవారు రోజు యాలకులను తినడం వల్ల శరీరంలో రక్తశాతం పెరుగుతుంది.
- శరీరంలో ఉన్న విష, వ్యర్థ పదార్థాలు బయటకు వెళ్ళిపోతాయి శరీరం అంతర్గతంగా శుభ్ర పడుతుంది.

స్పోర్ట్స్

24 భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య ఇప్పటి వరకు 24 టి20 మ్యాచ్‌లు జరిగాయి. 13 మ్యాచ్‌ల్లో భారత్ నెగ్గగా... 11 మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్ విజయం సాధించింది. భారత్ వేదికగా రెండు జట్లు 11 మ్యాచ్‌ల్లో తలపడ్డాయి. 6 మ్యాచ్‌ల్లో టీమిండియా గెలుపొందగా... 5 మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్‌కు విజయం దక్కింది.

7 ఈడెన్ గార్డెన్స్ మైదానంలో భారత్ ఆడిన టి20 మ్యాచ్‌లు. ఇందులో ఆరింటిలో భారత్ నెగ్గగా... ఎదురైన ఒక పరాజయం ఇంగ్లండ్ చేతిలోనే (2011లో) కావడం గమనార్హం.

“హార్దిక్ పాండ్యాతో నాకు మంచి సాన్నిహిత్యం ఉంది. అతను మా నాయకత్వ బృందంలో కీలక భాగమే. భారత జట్టును ఎలా నడిపించాలో మాకందరికీ బాగా తెలుసు. మైదానంలోకి దిగాక జట్టు కోసం అందరం చర్చించే నిర్ణయం తీసుకుంటాం. సరిగ్గా చెప్పాలంటే మా టీమ్‌లో ఒకరి కంటే ఎక్కువ మంది కెప్టెన్లు ఉన్నారు. కోచ్ గంభీర్‌తో కూడా గతంలో కలిసి పని చేశాను. ఆయన ఆటగాళ్లకు మంచి స్వేచ్ఛనిస్తారు. కోచ్ పర్యవేక్షణలో ప్రస్తుతం మా జట్టు సరైన దిశలోనే వెళుతోంది. కీపర్‌గా సామ్సన్ బాగా ఆడుతున్నాడు కాబట్టి మరో ప్లేయర్ గురించి ఆలోచన లేదు. టి20 వరల్డ్ కప్‌కు ఇంకా చాలా సమయం ఉంది. ఆలోగా దాదాపు ఒకే జట్టుతో ఎక్కువ మ్యాచ్‌లు ఆడి టీమ్‌ను సిద్ధం చేయడం ముఖ్యం. చాంపియన్స్ ట్రోఫీ జట్టులో చోటు దక్కకపోవడం కంటే నేను వన్డేల్లో బాగా ఆడలేకపోవడమే నన్ను ఎక్కువ నిరాశకు గురి చేస్తోంది. నా ప్రదర్శన బాగా లేక ఎంపిక కాలేదు కాబట్టి సమస్య లేదు. –సూర్యకుమార్ యాదవ్, భారత కెప్టెన్

పరుగుల వరదకు సై

నేటి నుంచి భారత్, ఇంగ్లండ్ టి20 సిరీస్

ఈడెన్ గార్డెన్స్‌లో తొలి మ్యాచ్

ఇరు జట్లలోనూ దూకుడైన బ్యాటర్లు ● భారీ స్కోర్లకు అవకాశం

రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం


బట్లర్



సూర్యకుమార్

ఒకరిని మించి మరొకరు ధాటిగా ఆడే బ్యాటర్లు... భారీ స్కోర్లకు వేదికలైన చిన్న మైదానాలు... మంచు ప్రభావంతో బౌలర్లకు తిప్పలు... రాబోయే పక్షం రోజుల్లో టి20ల్లో క్రికెట్‌లో ఎన్ని కొత్త రికార్డులు నమోదు కానున్నాయో! వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన తర్వాత తొలుత బ్యాటింగ్ చేసిన 11 మ్యాచ్‌లలో 7 సార్లు 200 స్కోరు దాటించిన టీమిండియా తమ దూకుడును ప్రదర్శించగా... విధ్వంసానికి మారుపేరువంటి మెకల్లమ్ కోచింగ్‌లో ఇంగ్లండ్ కూడా ఓవర్‌కు పదికి పైగా రన్‌రేట్‌తో వరుసగా లక్ష్యాలను ఛేదిస్తూ తామూ తక్కువ కాదని నిరూపించింది. ఈ నేపథ్యంలో రాబోయే ఐదు టి20 సమరాలు అభిమానులకు పూర్తి స్థాయి వినోదాన్ని అందించనున్నాయి. గత వరల్డ్ కప్ సెమీస్‌లో భారత్ చేతిలో ఇంగ్లండ్ చిత్తయిన తర్వాత ఇరు జట్లు ఇప్పుడే తొలిసారి తలపడనుండగా... చివరకు పైచేయి ఎవరు సాధిస్తారనేది ఆసక్తికరం.

కోల్‌కతా: ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్ ముగిసిన రెండు వారాల తర్వాత భారత క్రికెట్ జట్టు మళ్లీ మైదానంలోకి దిగుతోంది. టెస్టులతో పోలిస్తే పూర్తిగా భిన్నమైన జట్టుతో ఇప్పుడు టీమిండియా టి20 ఫార్మాట్‌లో సత్తా చాటేందుకు సిద్ధమైంది. సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో జరిగే ఐదు మ్యాచ్‌ల టి20 పోరులో విశ్వ విజేత జట్టు తలపడుతుంది. ఇందులో భాగంగా ఈడెన్ గార్డెన్స్ మైదానంలో నేడు మొదటి మ్యాచ్ జరుగుతుంది. బలాబలాల దృష్ట్యా చూస్తే రెండు టీమ్‌లు దాదాపు సమానంగా కనిపిస్తున్నాయి. టి20 కోచ్‌గానూ పూర్తిస్థాయి బాధ్యతలు తీసుకున్న మెకల్లమ్ తనదైన శైలిలో కొత్తగా ఇంగ్లండ్ జట్టును సిద్ధం చేశాడు.

షమీపై అందరి దృష్టి...

గాయం నుంచి కోలుకొని దాదాపు 14 నెలల తర్వాత జాతీయ జట్టులోకి వచ్చిన సీనియర్ పేసర్ మొహమ్మద్ షమీ ఫిట్‌నెస్‌కు ఈ మ్యాచ్ పరీక్ష కానుంది. ఇప్పటికే చాంపియన్స్ ట్రోఫీ టీమ్‌లోకి కూడా ఎంపికైన షమీ టి20 ఫార్మాట్ ద్వారా తన అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలని పట్టుదలగా ఉన్నాడు. రెండు నెలల క్రితం భారత జట్టు దక్షిణాఫ్రికా గడ్డపై మెరుపు ప్రదర్శన కనబర్చి 3–1తో సిరీస్‌ను సొంతం చేసుకుంది. దక్షిణాఫ్రికాతో సిరీస్ చివరి మ్యాచ్‌తో పోలిస్తే దాదాపు అదే జట్టు బరిలోకి దిగవచ్చు. ఆ మ్యాచ్‌లో సెంచరీ సాధించిన సంజు సామ్సన్ అంతర్జాతీయ క్రికెట్‌లో తన జోరును ప్రదర్శించాలని భావిస్తుండగా, రెండో ఓపెనర్‌గా అభిషేక్ రాణించాల్సి ఉంది. వరుసగా రెండు అంతర్జాతీయ టి20 సెంచరీలు సాధించిన హైదరాబాదీ తిలక్ వర్మ కూడా అదే ఉత్సాహంతో సిద్ధం కాగా... మిడిలార్డర్‌లో సూర్యకుమార్, హార్దిక్, రింకూ సింగ్ భారీ స్కోరును అందించగలరు. నితీశ్ కుమార్ రెడ్డికి తుది జట్టులో చోటు దక్కుతుందా చూడాలి.

కీపర్‌గా సాల్ట్...

తొలి టి20 కోసం ఇంగ్లండ్ తుది జట్టును ముందు రోజే ప్రకటించింది. తొలిసారి వైస్ కెప్టెన్‌గా నియమితుడైన హ్యారీ బ్రూక్ మెరుపు బ్యాటింగ్‌తో సత్తా చాటగలడు. సాల్ట్ కీపర్‌గా వ్యవహరించనున్నాడు. చివరి స్థానం వరకు ఆటగాళ్లంతా బ్యాటింగ్ చేయగల సమర్థులు కావడం ఇంగ్లండ్ బలం.

తుది జట్ల వివరాలు

భారత్ (అంచనా): సూర్యకుమార్ (కెప్టెన్), సామ్సన్, అభిషేక్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్, అక్షర్, షమీ, అర్ష్‌దీప్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్/సుందర్. ఇంగ్లండ్: బట్లర్ (కెప్టెన్), సాల్ట్, డకెట్, హ్యారీ బ్రూక్, లివింగ్‌స్టోన్, బెతెల్, ఒవర్టన్, అట్కిన్‌సన్, జోఫ్రా ఆర్చర్, రషీద్, మార్క్ వుడ్.

పిచ్, వాతావరణం

ఈడెన్ మైదానం బ్యాటింగ్‌కు బాగా అనుకూలం. కాబట్టి భారీ స్కోర్లు ఖాయం. మంచు ప్రభావం ఉంది కాబట్టి టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్‌కు మొగ్గు చూపవచ్చు. వర్ష సూచన లేదు.

● ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీఫైనల్లో జొకోవిచ్, సబలెంకా
● సాత్విక్–చిరాగ్ జోడీ శుభారంభం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

వైష్ణవి ‘హ్యాట్రిక్’

5 పరుగులిచ్చి 5 వికెట్లు తీసిన యువ భారత్ స్పిన్నర్

మలేసియా 31 పరుగులకే ఆలౌట్ ● 17 బంతుల్లోనే గెలిచిన టీమిండియా
మెరిపించిన గొంగడి త్రిష ● మహిళల అండర్–19 టి20 ప్రపంచకప్ టోర్నీ

యువతుల ప్రపంచకప్ ఈసారి అందరి దృష్టిని తెగ ఆకర్షిస్తోంది. ఏముందిలే అండర్–19 అమ్మాయిల వరల్డ్‌కప్ అని తేలిగ్గా తీసుకునే క్రికెట్ అభిమానులు కూడా ఓ మారు స్కోర్లు, మ్యాచ్‌ల్లో వారి జోరుపై దృష్టి పెట్టేలా చేస్తున్నాయి. ఒకరోజు ముందు దక్షిణాఫ్రికా పదంటే 10 బంతుల్లోనే లక్ష్యాన్ని ఛేదించి మ్యాచ్‌ను ముగిస్తే... తాజాగా భారత అమ్మాయిల జట్టు మూడు ఓవర్లు కూడా పూర్తికాక ముందే 17 బంతుల్లోనే గెలుపు ముచ్చట తీర్చుకుంది. మధ్యప్రదేశ్‌కు చెందిన లెఫ్టార్మ్ స్పిన్నర్ వైష్ణవి శర్మ (4-1-5-5) ‘హ్యాట్రిక్’తో మలేసియాను కుదిపేస్తే... తెలుగమ్మాయి గొంగడి త్రిష (12 బంతుల్లో 27 నాటౌట్; 5 ఫోర్లు) మెరుపు ఇన్నింగ్స్‌తో అలరించింది.



వైష్ణవి


త్రిష

కౌలాలంపూర్: కుర్రాళ్లు, సీనియర్ పురుషుల క్రికెట్ మ్యాచ్‌లకు ఏమాత్రం తీసిపోని డ్రామా... హంగామాలతో యువతుల అండర్–19 ప్రపంచకప్ మ్యాచ్‌లు మెరుపు వేగంతో సాగిపోతున్నాయి. దక్షిణాఫ్రికాలాగే తాజాగా భారత అమ్మాయిల జట్టు కూడా ఈ వరల్డ్‌కప్‌కే వన్నె తెచ్చే ప్రదర్శనతో అదరగొట్టింది. గ్రూప్ ‘ఎ’లో మంగళవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో భారత్ 10 వికెట్ల తేడాతో మలేసియాపై 17 బంతుల్లోనే (2.5 ఓవర్లు) ఘన విజయం సాధించింది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ప్లేయర్ వేలంపాటలో నిరాదరణ (అన్ సోల్డ్)కు గురైన తెలుగమ్మాయి గొంగడి త్రిష మెరుపులు మెరిపించింది. అంతకుముందు మధ్యప్రదేశ్ బౌలర్ వైష్ణవి స్పిన్ మాయాజాలంలో మలేసియా జట్టు ఉక్కిరిబిక్కిరైంది.

వైష్ణవి 4–1–5–5

టి20 మ్యాచ్ అంటే 20–20 చొప్పున 40 ఓవర్లపాటు జరిగే మ్యాచ్. కానీ మొత్తం కలిపి కూడా 20 ఓవర్లలోపే ముగిస్తే... అది అసలు సిసలైన ‘ఏక’(20 ఓవర్లు)పక్షమైన మ్యాచ్ కదా! భారత యువతుల జట్టు సరిగ్గా ఇదే చేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన మలేసియాను 14.3 ఓవర్లలో 31 పరుగులకే కుప్పకూల్చింది. 14వ ఓవర్ వేసిన వైష్ణవి రెండో బంతికి నూర్ ఐన్ రొస్లాన్ (3), మూడో బంతికి నూర్ ఇస్మా దానియా (0), నాలుగో బంతికి సితి నజ్వా (0)లను వరుసగా పెవిలియన్ చేర్చి ఈ ప్రపంచకప్‌లో తొలి ‘హ్యాట్రిక్’తో పాటు చిరస్మరణీయ (5/5) బౌలింగ్ గణాంకాలను నమోదు చేసింది. మరో బౌలర్ ఆయుషి శుక్లా (3/8) కూడా స్పిన్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను కట్టేయడంతో మలేసియా ఇన్నింగ్స్‌లో ఏ ఒక్కరూ 5 పరుగులను మించి చేయలేకపోయారు. దీంతో మన వాళ్లు వేసిన ఎక్స్‌ట్రాలే (నోబాల్ 1, వైడ్లు 10) 11 పరుగులు ఇన్నింగ్స్ టాప్‌స్కోరు అయ్యింది. తర్వాత ఛేదన ప్రారంభమవగానే త్రిష బ్యాటింగ్ జోరు మొదలైంది. 12 బంతుల్లోనే 5 బౌండరీలతో అజేయంగా 27 పరుగులు చేయడంతో 2.5 ఓవర్లలోనే భారత్ వికెట్ కోల్పోకుండా 32 పరుగులు చేసి గెలిచింది. మరో ఓపెనర్ కమలిని (5 బంతుల్లో 4 నాటౌట్) ఓ ఫోర్ కొట్టింది. వరుసగా రెండు విజయాలు సాధించిన భారత్, శ్రీలంక జట్లు 4 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి ‘సూపర్ సిక్స్’ దశకు చేరుకున్నాయి. గురువారం జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో శ్రీలంకతో భారత్ ఆడుతుంది. ఇందులో గెలిచిన జట్టు గ్రూప్ ‘ఎ’ టాపర్‌గా నిలుస్తుంది.

సాక్షి సినిమా

పెద్ది షూటింగ్ షురూ


● రామ్‌చరణ్

రామ్‌చరణ్ హీరోగా ‘ఉప్పెన’ ఫేమ్ బుచ్చిబాబు సాన దర్శకత్వంలో పీరియాడికల్ స్పోర్ట్స్ డ్రామా ‘పెద్ది’ (ప్రచారంలో ఉన్న టైటిల్) రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా తాజా షెడ్యూల్ ఈ నెలాఖరున హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని తెలిసింది. హైదరాబాద్‌లో వేసిన ఓ సెట్‌లో రామ్‌చరణ్‌తో పాటు ఈ సినిమా ప్రధాన తారాగణం పాల్గొననుండగా కీలక సన్నివేశాల చిత్రీకరణను ప్లాన్ చేశారట. అంతేకాదు... ఈ సినిమాలో ఒకే ఒక్క క్రీడ కాకుండా రెండు మూడు రకాల క్రీడలకు సంబంధించిన ప్రస్తావన ఉంటుందట. ఈ చిత్రంలో రామ్‌చరణ్ డిఫరెంట్ గెటప్స్‌లో కనిపించనున్నారు. ‘తంగలాన్’ సినిమాకు వర్క్ చేసిన కాస్ట్యూమ్ డిజైనర్ ఏకాంబరంను ఈ సినిమాలో భాగం చేశారు. దీంతో రామ్‌చరణ్ లుక్స్ కొత్తగా ఉండనున్నాయని తెలుస్తోంది. సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్ పతాకాలపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదిలోనే రిలీజ్ కానుందని తెలిసింది.

ప్రేమ పెరుగుతోంది

“మా ప్రేమ మరో రెండు అడుగులు పెరుగుతోంది” అంటున్నారు కిరణ్ అబ్బవరం. తన భార్య రహస్య గోరఖ్ తల్లి కాబోతున్న విషయాన్ని షేర్ చేసుకున్నారు. ‘రాజావారు రాణిగారు’ (2019) సినిమా ద్వారా హీరో హీరోయిన్లుగా పరిచయమయ్యారు కిరణ్, రహస్య. ఆ చిత్రం షూటింగ్‌లో వీరి మధ్య ఏర్పడిన స్నేహం ఆ తర్వాత ప్రేమగా మారింది. వీరి ప్రేమకు ఇరు కుటుంబ సభ్యులు పచ్చజెండా ఊపడంతో 2024 ఆగస్టు 22న కర్నాటకలోని కూర్గ్‌లో పెళ్లి చేసుకున్నారు. కాగా తాము తల్లిదండ్రులం కాబోతున్నట్లు పేర్కొని, బేబీ బంప్‌తో ఉన్న రహస్య గోరఖ్‌తో దిగిన ఫొటోని షేర్ చేశారు కిరణ్ అబ్బవరం.


● రహస్య, కిరణ్

మహారాణి ఏసుబాయి



● రష్మికా మందన్నా


● అక్షయ్ ఖన్నా

విక్కీ కౌశల్ హీరోగా నటించిన హిస్టారికల్ మూవీ ‘ఛావా’. ఛత్రపతి శివాజీ మహారాజ్ తనయుడు శంభాజీ మహారాజ్ జీవితం ఆధారంగా దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ చిత్రంలో శంభాజీ మహారాజ్‌గా విక్కీ కౌశల్ నటించగా, శంభాజీ మహారాజ్ భార్య మహారాణి ఏసుబాయి పాత్రలో రష్మికా మందన్నా నటించారు. ఈ పాత్రలో రష్మికా మందన్నా, మొగల్ షెహన్షా ఔరంగజేబు పాత్ర చేసిన అక్షయ్ ఖన్నా లుక్స్‌ని చిత్రయూనిట్ మంగళవారం అధికారికంగా విడుదల చేసి, ‘ఛావా’ ట్రైలర్‌ను నేడు (బుధవారం) విడుదల చేయనున్నట్లుగా వెల్లడించింది. దినేష్ విజన్ నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 14న రిలీజ్ కానుంది. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్.

అద్భుతాలు చూపిస్తాం

\- జేమ్స్ కామెరూన్



“అవతార్, అవతార్ 2’ చిత్రాల తర్వాత ఈ ఫ్రాంచైజీలో రానున్న మూడో చిత్రంపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానుల్లో ఎన్నో అంచనాలుంటాయి. ఆ అంచనాలను మించి మా సినిమా ఉంటుంది” అని ప్రముఖ హాలీవుడ్ డైరెక్టర్ జేమ్స్ కామెరూన్ అన్నారు. ఆయన దర్శకత్వం వహించిన ‘అవతార్’ (2009), ‘అవతార్: ది వే ఆఫ్ వాటర్’ (2022) సినిమాలు ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకాదరణ పొందిన విషయం తెలిసిందే. ఈ ఫ్రాంచైజీలో రానున్న మూడో చిత్రం ‘అవతార్–ఫైర్ అండ్ యాష్’. ఈ చిత్రానికి కూడా జేమ్స్ కామెరూన్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ‘అవతార్–ఫైర్ అండ్ యాష్’ గురించి జేమ్స్ కామెరూన్ మాట్లాడుతూ– “వెండితెరపై ఈ విజువల్ వండర్‌ను చూసి ఆడియన్స్ ఆశ్చర్యపోతారు. తొలి, ద్వితీయ చిత్రాల్లో చూపినవి రిపీట్ కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ధైర్యం చేసి సరికొత్తవి తీసుకొస్తున్నాం. ఇలా ధైర్యం చేసి కొత్తవాటిని సృష్టించకపోతే ప్రేక్షకుల సమయాన్ని, డబ్బును వృథా చేసినవాడిని అవుతాను. ‘అవతార్, అవతార్: ది వే ఆఫ్ వాటర్’ చిత్రాల్లో లేని అద్భుతాలను ‘అవతార్–ఫైర్ అండ్ యాష్’లో చూస్తారు. అంచనాలకు మించిన లైవ్ యాక్షన్‌ని ప్రేక్షకులకు చూపించనున్నాం. ఓ కొత్త ప్రపంచంతో పాటు వైవిధ్యమైన కథ, పాత్రలు ఇందులో కనిపిస్తాయి” అని పేర్కొన్నారు. ఈ చిత్రం డిసెంబరు 19న విడుదల కానుంది.

అద్భుత సంఘటనతో...


● నందు గిడుతూరి, ఆది, సాయికిరణ్ బత్తుల

శ్రీ కృష్ణుడికి, కృష్ణ భక్తుడికి మధ్య జరిగిన ఒక అద్భుత సంఘటన ప్రేరణగా రూపొందిన చిత్రం ‘డియర్ కృష్ణ’. దినేష్‌బాబు దర్శకత్వంలో పీఎన్ బలరామ్ నిర్మించారు. అక్షయ్ హీరోగా మమిత బైజు, ఐశ్వర్య హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం ఈ 24న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హీరో ఆది సాయికుమార్‌తో ఈ చిత్రం బిగ్ టికెట్‌ను రిలీజ్ చేయించారు. పీఎన్ బలరామ్ మాట్లాడుతూ– “మొదటి 100 టికెట్ల బుకింగ్‌లో డిప్ ద్వారా ఒక టికెట్‌ను ఎంపిక చేసి, కొనుగోలుదారులకు రూ. 10000ని శ్రీ కృష్ణుడి గిఫ్ట్‌గా అందించనున్నాం. ఈ పద్ధతిని మొదటి వారం రోజులు కొనసాగిస్తాం” అన్నారు.

ఆస్పత్రి నుంచి ఇంటికి

● వారం రోజులు బెడ్ రెస్ట్


● సైఫ్ అలీఖాన్

బాలీవుడ్ ప్రముఖ నటుడు సైఫ్ అలీ ఖాన్ హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ముంబైలోని ఆయన స్వగృహంలో ఈ నెల 16న సైఫ్‌పై దుండగుడు దాడి చేసి, కత్తితో గాయపరచిన సంగతి తెలిసిందే. అదే రోజు అక్కడి లీలావతి హాస్పిటల్‌లో చేరిన సైఫ్ కోలుకోవడంతో వైద్యులు మంగళవారం డిశ్చార్జ్ చేశారు. వారం పాటు బెడ్ రెస్ట్ తీసుకోవాలని డాక్టర్స్ సూచించారు. ఇదిలా ఉంటే.. సైఫ్‌పై దాడి చేసిన బంగ్లాదేశ్‌కి చెందిన దుండగుడు మహ్మద్ షరీఫుల్ ఇస్లాం షెహజాద్ ప్రస్తుతం పోలీసు కస్టడీలో ఉన్నాడు.

సరికొత్త బార్బరిక్


● సత్యరాజ్

సత్యరాజ్, వశిష్ఠ ఎన్. సింహ, సాంచీ రాయ్, ఉదయ భాను, ‘సత్యం’ రాజేశ్, క్రాంతి కిరణ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘త్రిబాణధారి బార్బరిక్’. మోహన్ శ్రీవత్స దర్శకత్వంలో దర్శకుడు మారుతి సమర్పణలో వానర సెల్యూలాయిడ్ బ్యానర్ పై విజయపాల్ రెడ్డి నిర్మించారు. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ చివరి దశకు చేరుకున్నాయి. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ కానుంది. “ఓ సరికొత్త పాయింట్‌తో ‘త్రిబాణధారి బార్బరిక్’ ప్రేక్షకులను అలరిస్తుంది” అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: ఇన్‌ఫ్యూజన్ బ్యాండ్.

ఈ సినిమా నాకు ఊపిరినిస్తుంది

\- సాయిరామ్ శంకర్


● వినోద్ కుమార్, సాయిరామ్ శంకర్

సాయిరామ్ శంకర్ హీరోగా నటించిన చిత్రం ‘ఒక పథకం ప్రకారం’. విహాన్ ఫిల్మ్స్ బ్యానర్, గార్లపాటి రమేశ్ విహారి సినిమా హౌస్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లతో కలిసి ఈ చిత్రదర్శకుడు వినోద్ కుమార్ విజయన్ నిర్మించారు. ఫిబ్రవరి 7న ఈ మూవీ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హీరో సాయిరామ్ శంకర్ మాట్లాడుతూ– “ఈ సినిమాలో సిద్ధార్థ నీలకంఠ అనే లాయర్ పాత్ర చేశాను. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మరియు క్రిమినల్ లాయర్‌ని. క్రిమినల్ లాయరా? లేక క్రిమినలా? జరిగిన క్రైమ్‌తో ఈ లాయర్‌కు సంబంధం ఉందా? లేదా అనేది సినిమా చూసి తెలుసుకోవాలి. ఇలాంటి సస్పెన్స్ థ్రిల్లర్ మూవీని ఆడియన్స్ ఇప్పటివరకూ చూసి ఉండరని నా అభిప్రాయం. ఈ సినిమా కోసం నటనలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నాను. నాకు వచ్చిన గ్యాప్‌ని ఈ సినిమా ఫిల్ చేస్తుంది. ఈ సినిమా నాకు ఊపిరినిస్తుంది. ఈ సినిమాపై ఉన్న నమ్మకంతో ‘పట్టుకుంటే పది వేలు’ అనే కాంటెస్ట్ పెట్టబోతున్నాం. ఇంటర్వెల్ లోపు విలన్ ఎవరో కనిపెడితే మీకు (ఆడియన్స్) స్పాట్‌లో పది వేలు ఇస్తారు. ఒక కూపన్ ఇస్తారు. ఇంటర్వెల్ తర్వాత ఆ కూపన్‌లో విలన్ ఎవరో చెప్పి... సెకండాఫ్ చూసిన తర్వాత మీరు రాసింది కరెక్ట్ అయితే.. స్పాట్‌లో పది వేలు ఇస్తారు. ఇలా 50 సెంటర్స్‌లో ఇవ్వబోతున్నాం” అని అన్నారు. “ఈ సినిమాలో సాయిరామ్ శంకర్‌ను కొత్తగా చూస్తారు” అన్నారు వినోద్. “ప్రేక్షకులు మా సినిమాను ఆదరించాలి” అని కోరారు గార్లపాటి రమేశ్. “ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నాం. తెలుగు రాష్ట్రాల్లోనే 300 థియేటర్స్‌కు తగ్గకుండా ఈ చిత్రం ప్రదర్శితమయ్యేలా ఏర్పాట్లు పూర్తి చేశాం” అని తెలిపారు శ్రీ లక్ష్మీ పిక్చర్స్ బాపిరాజు.

ఫిబ్రవరిలో కాన్సర్ట్


● సిద్ శ్రీరామ్

ప్రముఖ గాయకుడు సిద్ శ్రీరామ్ హైదరాబాద్‌లో లైవ్ కాన్సర్ట్ నిర్వహించనున్నారు. ‘మూవ్ 78 లైవ్’ అనే సంస్థ ఫిబ్రవరి 15న ఈ లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్‌ను నిర్వహించనుంది. ఈ విశేషాల్ని తెలియజేసేందుకు ఏర్పాటు చేసిన సమావేశంలో సిద్ శ్రీరామ్ మాట్లాడుతూ– “మూడేళ్ల క్రితం హైదరాబాద్‌లో లైవ్ కాన్సర్ట్ చేశాను. మళ్లీ ఇప్పుడు చేయబోతున్నాం. ఈ కాన్సర్ట్‌లో నా పాటలతో పాటుగా 80, 90వ దశకంలో వచ్చిన మెలోడీ పాటల్ని కూడా పాడతాను” అన్నారు. ‘మూవ్ 78 లైవ్’ సంస్థ సీఈవో నితిన్ కనకరాజ్ పాల్గొన్నారు.

నిర్మాత మనో కన్నుమూత



నిర్మాత మనో అక్కినేని ఆదివారం (జనవరి 19) చెన్నైలో మృతి చెందారు. ఈ విషయాన్ని ‘గురు’ ఫేమ్ దర్శకురాలు సుధ కొంగర సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. శ్రీరామ్, విష్ణు విశాల్, పూనమ్ బజ్వా, పూర్ణ లీడ్ రోల్స్‌లో నటించిన ‘ద్రోహి’ (2010) సినిమా ద్వారా సుధ కొంగరని తమిళ పరిశ్రమకు డైరెక్టర్‌గా పరిచయం చేశారు మనో అక్కినేని. అజిత్ హీరోగా నటించిన ‘కిరీడం’ (2007)కి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, మాధవన్ హీరోగా నటించిన ‘13 బీ’ (2009) చిత్రానికి లైన్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు మనో. ఆమె సోలో నిర్మాతగా తీసిన ‘ద్రోహి’తో సుధని పరిచయం చేశారు. మనో కన్నుమూసిన సందర్భంగా సుధ కొంగర సోషల్ మీడియాలో... “నా తొలి చిత్ర నిర్మాత, నా ప్రాణ స్నేహితురాలు మనో ఆత్మకు శాంతి చేకూరాలి. నువ్వు నా మొదటి సినిమాకు పని చేయడం ఎప్పటికీ గుర్తుంటుంది. ‘ద్రోహి’ చిత్రాన్ని నీకు అంకితమిస్తున్నాను. ఎందుకంటే సినిమాలను ఎక్కువగా ఇష్టపడే వారిలో ఒకరిగా నువ్వు నా ప్రతి కదలికను గమనిస్తావని తెలుసు” అని పోస్ట్ చేశారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
1,235	320
75,838	23,025

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	19,693	▲	61
డోజోన్స్	43,900	▲	412
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,548	▲	28
డాక్స్	21,042	▲	51
షాంఘై	3,243	▽	2
నికాయ్	39,028	▲	125

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (24 క్యారెట్)	79,453	▲	108
బంగారం (22 క్యారెట్)	79,135	▲	108
వెండి (కిలో)	90,533	▲	333

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	85.90	86.92
£	బ్రిటన్ పౌండ్	[illegible]	104.90	107.76
€	యూరో	[illegible]	88.54	91.16
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	55.11	56.49
AU$	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	52.98	55.18
S$	సింగపూర్ డాలర్	[illegible]	60.95	65.62
SAR	సౌదీ రియాల్	[illegible]	22.13	23.69
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	22.19	23.74
¥	చైనా యువాన్	[illegible]	11.01	12.83



ట్రంప్ టారిఫ్ టెర్రర్

- అధిక వెయిటేజీ షేర్ల పతనం
- సెన్సెక్స్ 1235 పాయింట్లు క్రాష్
- 23,050 దిగువకు నిఫ్టీ
- 7 నెలల కనిష్టానికి సూచీలు

7.5 లక్షల కోట్లు ఆవిరి

మార్కెట్ భారీ పతనంతో సోమవారం ఒక్కరోజే రూ.7.52 లక్షల కోట్లు హరించుకుపోయాయి. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.424 లక్షల కోట్లకు దిగివచ్చింది. సెన్సెక్స్‌లోని మొత్తం 30 షేర్లలో అల్ట్రాటెక్(0.39%), హెచ్‌సీఎల్ టెక్(0.33%) మాత్రమే స్వల్ప లాభాలతో గట్టెక్కాయి.

ముంబై: అమెరికా కొత్త అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్య టారిఫ్ పెంపు భయాలకు తోడు అధిక వెయిటేజీ షేర్ల పతనంతో స్టాక్ సూచీలు మంగళవారం ఒకటిన్నరశాతానికి పైగా కుప్పకూలాయి. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు మరింత ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ 1,235 పాయింట్లు పతనమై 75,838 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 320 పాయింట్లు నష్టపోయి 23,025 వద్ద నిలిచింది. ఇరు సూచీలకిది ఏడు నెలల కనిష్టం. ఉదయం స్వల్ప నష్టాలతో మొదలైన సూచీలు రోజంతా అదే బాటలో నడిచాయి. ఒక దశలో సెన్సెక్స్ 1,432 పాయింట్లు క్షీణించి 75,642 వద్ద, నిఫ్టీ 369 పాయింట్లు పతనమై 22,976 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి. ప్రపంచ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి. డాలర్‌తో రూపాయి విలువ 13 పైసలు బలహీనపడి 86.58 వద్ద స్థిరపడింది.

- అన్ని రంగాల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. రియల్టీ ఇండెక్స్ 4.2% క్షీణించింది. కన్జూమర్ డ్యూరబుల్స్ 4%, సర్వీసెస్, విద్యుత్, టెలికం, యుటిలిటీ ఇండెక్సులు 2.5% పడ్డాయి.

నష్టాలకు 4 కారణాలు

- 'అమెరికా ఫస్ట్' నినాదంతో ట్రంప్ మెక్సికో, కెనడాలపై ఫిబ్రవరి 1 నుండి 25% వాణిజ్య సుంకాల విధింపునకు సిద్ధమయ్యారు. భారత్‌తో సహా ఇతర దేశాలపై సుంకాల విధింపు తప్పదని గతంలో వ్యాఖ్యానించారు. ట్రంప్ టారిఫ్ ఆందోళనలతో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తూ అమ్మకాలకు పాల్పడ్డారు.
- దేశీయ కార్పొరేట్ క్యూ3 ఆర్థిక ఫలితాలు నిరాశపరుస్తున్నాయి. ఇప్పటి వరకు ఫలితాలు వెల్లడించిన లిస్టెడ్ కంపెనీల సగటు నికరలాభ వృద్ధి కేవలం 4%గా మాత్రమే నమోదైంది. వార్షిక ప్రాతిపదిక డిసెంబర్ త్రైమాసికంలో నిఫ్టీ50 కంపెనీల ఈపీఎస్ (ఎర్నింగ్స్ పర్ షేర్) 3% మాత్రమే ఉంటుందని బ్లూమ్‌బర్గ్ అంచనా వేసింది.
- జొమాటో (-11%)తో సహా అధిక వెయిటేజీ షేర్లు ఐసీఐసీఐ బ్యాంకు (-3%), ఎస్‌బీఐ (-2.57%), రిలయన్స్ (-2.50%), ఎంఅండ్‌ఎం (-2.25%) షేర్లు భారీగా క్షీణించి సూచీల పతనానికి ప్రధాన కారణమయ్యాయి. సెన్సెక్స్ మొత్తం పతనంలో ఈ షేర్ల వాటాయే 640 పాయింట్లు. కాగా ఒక్క జొమాటో షేరు వాటా 150 పాయింట్లు కావడం గమనార్హం.
- విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు దలాల్ స్ట్రీట్‌పై మరింత ఒత్తిడి పెంచాయి. ఈ కొత్త ఏడాది జనవరి 20 నాటికి ఎఫ్‌ఐఐలు మొత్తం రూ.48,023 కోట్ల విలువైన భారత ఈక్విటీలు అమ్మేశారు.

మరో విమానయాన సంస్థ మాయం

గో ఫస్ట్ లిక్విడేషన్ టేకాఫ్..



ఎన్‌సీఎల్‌టీ ఆదేశాలు

న్యూఢిల్లీ: చౌక విమానయాన సర్వీసులను అందించిన గో ఫస్ట్ ఎయిర్‌లైన్స్ లిక్విడేషన్‌కు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆదేశాలు జారీ చేసింది. గో ఫస్ట్ దాదాపు మూడు సంవత్సరాల క్రితం ఆర్థిక సమస్యల కారణంగా విమాన సర్వీసులు నిలిపివేసింది. 2023 మేలో సంస్థ స్వయంగా తన ఆర్థిక సమస్యలను ప్రస్తావిస్తూ స్వచ్ఛందంగా చట్టపరమైన పరిష్కార ప్రక్రియ కోసం ఎన్‌సీఎల్‌టీలో దరఖాస్తు చేసుకుంది. ఈ నేపథ్యంలో 15 పేజీల తాజా ఉత్తర్వుల్లో ఎయిర్‌లైన్స్‌ను లిక్విడేట్ చేయాలని ఎన్‌సీఎల్‌టీ పేర్కొంది. సంస్థను లిక్విడేట్ చేయాలన్న క్రెడిటార్స్ కమిటీ (సీఓసీ) తీసుకున్న నిర్ణయాన్ని ఈ సందర్భంగా ఎన్‌సీఎల్‌టీ ప్రస్తావించింది.

17 సంవత్సరాల ప్రయాణం..

గో ఎయిర్ పేరుతో ప్రారంభమైన ఈ ఎయిర్‌లైన్ తర్వాత గో ఫస్ట్‌గా పేరు మార్చుకుంది. ఇది 17 సంవత్సరాల పాటు సర్వీసులు అందించింది. 2023 మే 3న సర్వీసులు నిలిపివేసింది. ఎయిర్‌లైన్ 2005లో ముంబై నుంచి అహ్మదాబాద్‌కు తన తొలి సర్వీసు ప్రారంభించి, 2018–19లో అంతర్జాతీయ సర్వీసులకు శ్రీకారం చుట్టింది. 2022–23లో దాదాపు రూ.1,800 కోట్ల నష్టాన్ని నమోదుచేసుకుంది.

దివాలా పరిష్కార ప్రక్రియ తీరిది...

ఇన్‌సాల్వెన్సీ పరిష్కార ప్రక్రియలో స్పైస్ జెట్ చీఫ్ అజయ్ సింగ్‌తో కలిసి బిజీ బీ ఎయిర్‌వేస్ బిడ్డింగ్ ప్రక్రియలో నిలిచింది. కాగా ఈ బిడ్డింగ్ సమయంలో డీజీసీఏ గో ఫస్ట్‌కు చెందిన 54 విమానాలను డీరిజిస్టర్ చేయడంతో రిజల్యూషన్ ప్రక్రియ అమలు కాలేదు. దీంతో తాజాగా ఎన్‌సీఎల్‌టీ లిక్విడేషన్ ఆదేశాలు జారీ అయ్యాయి.

లిక్విడేషన్ అంటే..

ఒక కంపెనీ లిక్విడేషన్ అనేది రుణ బకాయిల్లో ఉన్న కంపెనీ ఆస్తులను అమ్మి అప్పులు తీర్చడం. మిగిలిన ఆస్తులను షేర్‌హోల్డర్లకు పంపిణీ చేయడం. దీన్ని కంపెనీ మూసివేత (వైండింగ్ అప్) అని కూడా అంటారు.

హైదరాబాద్‌లో హెచ్‌సీఎల్‌టెక్ కొత్త కేంద్రం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెక్నాలజీ సంస్థ హెచ్‌సీఎల్‌టెక్ హైదరాబాద్‌లో నూతన కేంద్రం ఏర్పాటు చేసింది. హైటెక్‌సిటీ సమీపంలో 3,20,000 చదరపు అడుగుల విస్తీర్ణంలోకి ఈ సెంటర్‌లో 5,000 మంది ఉద్యోగులు కూర్చునే వీలుంది. ఈ కేంద్రం అత్యాధునిక క్లౌడ్, ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సొల్యూషన్స్‌ను హైటెక్, లైఫ్ సైన్సెస్, ఫైనాన్షియల్ సర్వీసెస్ వంటి రంగాల్లోని అంతర్జాతీయ క్లయింట్లకు అందిస్తుందని హెచ్‌సీఎల్‌టెక్ తెలిపింది. నూతన ఫెసిలిటీ చేరికతో హైదరాబాద్‌లో సంస్థ సెంటర్ల సంఖ్య 5కు చేరింది.



ట్రిలియనీర్లు వచ్చేస్తున్నారహో!

- వచ్చే పదేళ్లలోపే కనీసం ఐదుగురు ఆవిర్భావం
- 2024లో ప్రపంచ కుబేరుల సంపద 2 ట్రిలియన్ డాలర్లు జంప్
- క్రితం ఏడాదితో పోలిస్తే మూడింతల వేగంగా వృద్ధి
- 15 లక్షల కోట్ల డాలర్లకు పెరుగుదల

ఆక్స్‌ఫామ్ నివేదిక

దావోస్: ఇప్పటిదాకా మనం కుబేరులను చూసే అబ్బో అనుకుంటున్నాం.. ఇకపై ట్రిలియనీర్ల సంగతి విని నోరెళ్లబెట్టాల్సిందే! ప్రపంచవ్యాప్తంగా కుబేరుల సంపద కుప్పలుతెప్పలుగా పెరిగిపోతోంది మరి. వచ్చే దశాబ్ద కాలంలోనే కనీసం ఐదుగురు ట్రిలియనీర్లుగా (ట్రిలియన్ అంటే లక్ష కోట్ల డాలర్లు. మన కరెన్సీలో రూ.86 లక్షల కోట్లు) అవతరించనున్నారట!! స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సు సందర్భంగా 'టేకర్స్, నాట్ మేకర్స్' పేరుతో విడుదల చేసిన నివేదికలో ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ ఈ విషయాన్ని వెల్లడించింది. 2024లో ప్రపంచ బిలియనీర్ల సంపద ఏకంగా 2 ట్రిలియన్ డాలర్లు దూసుకెళ్లింది. 2023తో పోలిస్తే మూడింతల వేగంగా వృద్ధి చెంది 15 ట్రిలియన్ డాలర్లకు ఎగబాకడం విశేషం. ప్రస్తుతం 440 బిలియన్ డాలర్ల సంపదతో కుబేరుల కింగ్‌గా ప్రపంచాన్ని ఏలుతున్న ఎలాన్ మస్క్.. తొలి ట్రిలియనీర్ రేసులో స్పేస్‌ఎక్స్ రాకెట్లా దూసుకుపోతున్నారు. ఆయన తర్వాత రెండో స్థానంలో ఉన్న అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్ సంపద మస్క్‌తో పోలిస్తే దాదాపు సగమే (239 బిలియన్ డాలర్లు)!

కొత్త కుబేరులు రయ్

2024లో మొత్తం కుబేరుల సంఖ్య 2,769కి ఎగబాకింది. 2023లో ఉన్న 2,565 మంది బిలియనీర్లతో పోలిస్తే కొత్తగా 204 మంది ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. అంటే సగటున వారానికి నలుగురు బిలియనీర్లు ఆవిర్భవించినట్లు లెక్క. ఇక ఆసియా నుంచి కొత్తగా 41 మంది కొత్త బిలియనీర్లు అవతరించారు. ఆసియా బిలియనీర్ల మొత్తం సంపద గతేడాది 299 బిలియన్ డాలర్లు దూసుకెళ్లింది.

అసమానతలు పెరిగిపోతున్నాయ్

ప్రపంచ కుబేరుల సంపదలో 60 శాతం వారసత్వంగా, గుత్తాధిపత్య బలం, రాజకీయ సంబంధాల ద్వారానే సమకూరుతోందని, వాళ్ల స్వశక్తితో సంపాదించినది కాదని కూడా ఆక్స్‌ఫామ్ నివేదిక పేర్కొంది. 1990 నుంచి ఇప్పటిదాకా పేదల స్థితిగతులు ఏమాత్రం మారలేదని స్పష్టం చేసింది. విచ్చలవిడి సంపద వృద్ధికి అడ్డుకట్ట వేసి, సమాజంలో నెలకొన్న తీవ్ర ఆర్థిక అసమానతలను తగ్గించాలంటే బిలియనీర్లపై భారీగా పన్నులు విధించాల్సిన అవసరం ఉందని కూడా ప్రభుత్వాలను అభ్యర్థించింది. 'వలసవాదంతో వివిధ దేశాల నుంచి సంపదను కొల్లగొట్టిన కొన్ని అగ్ర రాజ్యాలు వాటికి తగిన మూల్యాన్ని చెల్లించాలి. ప్రపంచంలో కోట్లాది మంది ఆకలితో అలమటిస్తుంటే.. కుబేరుల సంపద మాత్రం ఆకాశమేహద్దుగా ఎగబాకుతుండటం ఆందోళనకర కలిగిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న సంపద సృష్టిలో అత్యధిక మొత్తం బహుళజాతి కార్పొరేట్ కంపెనీల చేతిలోకి వెళ్లిపోతోంది. ఈ ఆధునిక వలసవాదం మరింత ఆందోళనకరం. కోట్లకు పడగలెత్తిన కుబేరులపై పన్నుల మోత మోగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది' అని ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమితాబ్ బెహర్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడిగా బిలియనీర్ ట్రంప్ పగ్గాలు చేపడుతుండగా.. ఆయన సలహాదారుగా ప్రపంచ అపరకుబేరుడు మస్క్ ఉన్నారని, ప్రపంచానికి ఇదొక మేల్కొలుపుగా అభిప్రాయపడ్డారు. అమెరికా చరిత్రలోనే తొలిసారిగా ట్రంప్ కేబినెట్‌లో ఏకంగా 13 మంది బిలియనీర్లు కొలువుదీరిన విషయాన్ని బెహర్ ప్రస్తావించారు.

రిపోర్ట్ హైలైట్స్...

- ✔ ప్రపంచంలో టాప్–10 అపర కుబేరుల సంపద 2024లో రోజుకు 10 కోట్ల డాలర్ల చొప్పున ఎగబాకింది. వారి సంపద రాత్రికిరాత్రి 99 శాతం ఆవిరైపోయినా కూడా బిలియనీర్లుగానే కొనసాగుతారు.
- ✔ ప్రపంచంలోని మొత్తం బిలియనీర్ల సంపద సగటున రోజుకు 570 కోట్ల డాలర్ల చొప్పున పెరిగింది.
- ✔ అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ తదితర గ్లోబల్ నార్త్ దేశాల్లోని 1% అపర కుబేరులకు గ్లోబల్ సౌత్ దేశాల ఆర్థిక వ్యవస్థల నుంచి గంటకు 3 కోట్ల డాలర్ల సంపద బదిలీ అవుతోంది.
- ✔ ప్రపంచ జనాభాలో గ్లోబల్ నార్త్ దేశాల వాటా 21 శాతమే అయినప్పటికీ... ప్రపంచ సంపదలో 69 శాతం ఆ దేశాలదే!

299	బిలియన్ డాలర్లు: 2024లో పెరిగిన ఆసియా కుబేరుల సంపద విలువ
204	కొత్తగా అవతరించిన బిలియనీర్ల సంఖ్య. సగటున వారానికి నలుగురు కుబేరులుగా మారారు
41	ఆసియాలో కొత్తగా ఆవిర్భవించిన కుబేరులు
2,769	2024లో మొత్తం బిలియనీర్లు. 2023లో ఈ సంఖ్య 2,565
100	మిలియన్ డాలర్లు: ప్రపంచ టాప్–10 అపర కుబేరుల సగటు రోజువారీ సంపద పెరుగుదల
36%	బిలియనీర్ల సంపద వారసత్వంగా వచ్చిందే.
5.7	బిలియన్ డాలర్లు: సగటున ప్రపంచ కుబేరుల రోజువారీ సంపద వృద్ధి

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఐటీ బ్రాండ్స్‌లో మేటి టీసీఎస్, ఇన్ఫీ
ఐపీవోకు 6 కంపెనీలు రెడీ

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య



హెచ్‌పీసీఎల్, ముంబైలో 234 జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ముంబై(మహారాష్ట్ర)లోని హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్).. జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 234.
- » పోస్టుల వివరాలు: జూనియర్ ఎగ్జిక్యూటివ్ (మెకానికల్)–130, జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఎలక్ట్రికల్)–65, జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఇన్‌స్ట్రుమెంటేషన్)–37, జూనియర్ ఎగ్జిక్యూటివ్ (కెమికల్)–02.
- » అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60శాతం మార్కులతో డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం కలిగి ఉండాలి. వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- » వేతనం: నెలకు జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు రూ.30,000 నుంచి రూ.1,20,000.
- » ఎంపిక విధానం: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 14.02.2025
- » వెబ్‌సైట్: www.hindustanpetroleum.com

ఐఓసీఎల్‌లో 313 అప్రెంటిస్ ఖాళీలు

దేశంలోని ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్).. అప్రెంటిస్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. టెక్నికల్, నాన్ టెక్నికల్ విభాగాల్లో ఏడాది వ్యవధిలో శిక్షణకు దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం ఖాళీల సంఖ్య: 313, వ్యవధి: ఏడాది.
- » అప్రెంటిస్ వివరాలు: ట్రేడ్ అప్రెంటిస్–35, టెక్నీషియన్ అప్రెంటిస్–80, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్–198.
- » విభాగాలు: మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ తదితరాలు.
- » అర్హతలు: పదో తరగతి, ఐటీఐ, విభాగాన్ని అనుసరించి డిప్లొమా,డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- » వయసు: 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- » ఎంపిక విధానం: మెరిట్‌లిస్ట్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపిక చేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:07.02.2025
- » వెబ్‌సైట్: https://iocl.com

ఐఐటీ ఇండోర్‌లో 12 పోస్టులు

ఇండోర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » మొత్తం పోస్టుల సంఖ్య: 12.

- » పోస్టుల వివరాలు:ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(సివిల్)–01, మెడికల్ ఆఫీసర్–01,అసిస్టెంట్ రిజిస్ట్రార్–01,సీనియర్ ఇంజనీర్–01, అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్–01,జూనియర్ సూపరింటెండెంట్–02,జూనియర్ అసిస్టెంట్–05.
- » అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ/బీటెక్ (సివిల్)/ఎండీ /ఎంఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » వయసు: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(సివిల్), మెడికల్ ఆఫీసర్,అసిస్టెంట్ రిజిస్ట్రార్ పోస్టులకు 45 ఏళ్లు,సీనియర్ ఇంజనీర్, అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్,జూనియర్ సూపరింటెండెంట్‌కు 40 ఏళ్లు,జూనియర్ అసిస్టెంట్‌కు 35ఏళ్లు ఉండాలి.
- » వేతనం: నెలకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు రూ.67,700 నుంచి రూ.2,08,700; మెడికల్ ఆఫీసర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రూ.56,100 నుంచి రూ.1,77,500; సీనియర్ ఇంజనీర్, అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ రూ.44,900 నుంచి రూ.1,42,400; జూనియర్ సూపరింటెండెంట్‌కు రూ.35,400 నుంచి రూ.1,12,400; జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు రూ.25,500 నుంచి రూ.81,100.
- » ఎంపిక విధానం: రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » దరఖాస్తులకు చివరితేది: 30.01.2025
- » వెబ్‌సైట్: www.iiti.ac.in

రైల్వే కొలువుల కూత

భారత రైల్వే శాఖ.. ఉద్యోగార్థులకు స్వాగతం పలుకుతోంది! పదో తరగతి, ఐటీఐ అర్హతగా.. భారీ స్థాయిలో నియామకాలకు రంగం సిద్ధం చేసింది!! మొత్తం 32,438 గ్రూప్ డి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. రెండు దశల ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే.. రైల్వేలో శాశ్వత కొలువు సొంతమవుతుంది. ఆకర్షణీయ వేతనంతో పాటు ఇతర సదుపాయాలు కూడా పొందొచ్చు. ఈ నేపథ్యంలో.. ఆర్‌ఆర్‌బీ తాజా గ్రూప్-డి నోటిఫికేషన్, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు...

- » 32,438 గ్రూప్-డి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- » పదో తరగతి, ఐటీఐతో దరఖాస్తుకు అవకాశం
- » సీబీటీ, పీఈటీలో ప్రతిభ ఆధారంగా ఎంపిక

మొత్తం పోస్టులు 32,438

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ తాజా నోటిఫికేషన్ ద్వారా మొత్తం 32,438 పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిల్లో పాయింట్స్‌మెన్–బి–5,058 పోస్టులు, అసిస్టెంట్(ట్రాక్ మెషీన్)–799 పోస్టులు, అసిస్టెంట్(బ్రిడ్జ్)–301 పోస్టులు, ట్రాక్ మెయింటెనెర్ గ్రేడ్–4 ఇంజనీరింగ్–13,187 పోస్టులు, అసిస్టెంట్ పి–వే– 257 పోస్టులు, అసిస్టెంట్ (సీఅండ్ డబ్ల్యూ)–2,587 పోస్టులు, అసిస్టెంట్ టీ ఆర్ డీ ఎలక్ట్రికల్ –1,381 పోస్టులు, అసిస్టెంట్(ఎస్ అండ్ టీ) –2,012 పోస్టులు, అసిస్టెంట్ లోకోషెడ్ (డీజిల్)–420 పోస్టులు, అసిస్టెంట్ లోకోషెడ్(ఎలక్ట్రికల్)–950 పోస్టులు, అసిస్టెంట్ ఆపరేషన్స్ (ఎలక్ట్రికల్)–744 పోస్టులు, అసిస్టెంట్ టీఎల్ అండ్ ఏసీ–1,041 పోస్టులు, అసిస్టెంట్ టీఎల్ అండ్ ఏసీ (వర్క్ షాప్)–624 పోస్టులు, అసిస్టెంట్ (వర్క్‌షాప్) (మెషీన్) –3,077 పోస్టులు ఉన్నాయి.

ఎస్‌సీఆర్‌లో 1,642 పోస్టులు

తెలుగు రాష్ట్రాల పరిధిలోకి వచ్చే దక్షిణ మధ్య రైల్వేలో ఖాళీల సంఖ్య 1,642. వీటిల్లో అసిస్టెంట్(ఎస్ అండ్ టీ)–124, అసిస్టెంట్(వర్క్‌షాప్)–96, అసిస్టెంట్ (క్యారేజ్ అండ్ వ్యాగన్)–106, అసిస్టెంట్ లోకోషెడ్ (డీజిల్)–25, అసిస్టెంట్ లోకో షెడ్ (ఎలక్ట్రికల్)– 54, అసిస్టెంట్ ఆపరేషన్స్ (ఎలక్ట్రికల్)–20, అసిస్టెంట్ పి వే–76, అసిస్టెంట్ టీఎల్ అండ్ ఏసీ(వర్క్‌షాప్)–28, అసిస్టెంట్ టీఎల్ అండ్ ఏసీ–61, అసిస్టెంట్ ట్రాక్ మెషీన్–86, అసిస్టెంట్ టీఆర్‌డీ–66, పాయింట్స్‌మెన్ బి–209, ట్రాక్ మెయింటనెర్(4)–691 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

- ✦ పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
- ✦ వయసు: జూలై 1 నాటికి 18–36 సంవత్సరాలు ఉండాలి. ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున సడలింపు లభిస్తుంది.

వయో పరిమితి సడలింపు

సాధారణంగా గ్రూప్–డి పోస్ట్‌లకు వయో పరిమితి 18–33 ఏళ్లుగా ఉంటుంది. 2019 తర్వాత కోవిడ్ కారణంగా నియామకాలు చేపట్టకపోవడంతో తాజా నోటిఫికేషన్‌లో గరిష్ఠ వయో పరిమితిని మూడేళ్లు పెంచారు. దీంతో 18 నుంచి 36 ఏళ్ల వయసు మధ్యలో ఉన్నవారు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు లభిస్తోంది. ఈ అవకాశం ప్రస్తుత నోటిఫికేషన్‌కు మాత్రమే అని స్పష్టం చేశారు.

ఒక ఆర్‌ఆర్‌బీకే అవకాశం

దేశ వ్యాప్తంగా 16 ఆర్‌ఆర్‌బీల పరిధిలో పోస్ట్‌లను పేర్కొన్నారు. అయితే అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న ఆర్‌ఆర్‌బీకి మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అదే ఆర్‌ఆర్‌బీ పరిధిలో పలు పోస్ట్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరికి ఒకటే పరీక్ష నిర్వహిస్తారు. తదుపరి దశలో పీఈటీని కూడా సదరు ఆర్‌ఆర్‌బీ పరిధిలో పేర్కొన్న ప్రాంతంలోనే ఉంటుంది.

వేతనం నెలకు రూ.25 వేలు

ఆర్‌ఆర్‌బీ గ్రూప్–డి పోస్ట్‌లను పే లెవెల్–1 గా పేర్కొనడంతో.. నెలకు రూ.25 వేల వరకు వేతనం పొందొచ్చు. మూల వేతనం రూ.18 వేలుగా ఉంటుంది. దీంతోపాటు డీఏ, హెచ్‌ఆర్‌ఏ, టీఏ వంటి ఇతర భత్యాలు లభిస్తాయి.



వంద మార్కులకు రాత పరీక్ష

ఎంపిక ప్రక్రియలో భాగంగా తొలుత కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో నాలుగు విభాగాల నుంచి 100 ప్రశ్నలు అడుగుతారు. జనరల్ సైన్స్ (25 ప్రశ్నలు), మ్యాథమెటిక్స్(25 ప్రశ్నలు), జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ (30 ప్రశ్నలు), జనరల్ అవేర్‌నెస్ అండ్ కరెంట్ అఫైర్స్ (20 ప్రశ్నలు) విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం 100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష వ్యవధి గంటన్నర. ప్రతి తప్పు సమాధానానికి 1/3వ వంతు చొప్పున నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది.

రెండో దశ పీఈటీ

- ✦ తొలిదశ రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా రెండో దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ (పీఈటీ) నిర్వహిస్తారు. పురుష అభ్యర్థులు 35 కిలోల బరువు కలిగిన వస్తువును పట్టుకుని రెండు నిమిషాల్లో 100మీటర్లు దూరం చేరుకోవాలి. అదే విధంగా 4 నిమిషాల 15 సెకన్ల వ్యవధిలో 1,000 మీటర్లు (ఒక కిలోమీటరు) దూరం చేరుకోవాలి.
- ✦ మహిళా అభ్యర్థులు 20 కిలోల బరువు కలిగిన వస్తువును పట్టుకుని రెండు నిమిషాల్లో 100 మీటర్లు దూరం చేరుకోవాలి. అదే విధంగా 5 నిమిషాల 40 సెకన్ల వ్యవధిలో 1,000 మీటర్లు (ఒక కిలోమీటరు) దూరం చేరుకోవాలి.

డాక్యుమెంట్ వెరిఫికేషన్

సీబీటీ, పీఈటీ రెండు దశల్లోనూ ప్రతిభ చూపి.. నిర్దిష్ట కటాఫ్ మేరకు తుది జాబితాలో నిలిచిన వారికి.. డాక్యుమెంట్ వెరిఫికేషన్‌కు పిలుస్తారు. అర్హత సర్టిఫికెట్లు, ఇతర పత్రాలను పరిశీలిస్తారు. ఈ ప్రక్రియను కూడా విజయవంతంగా పూర్తి చేసుకుంటే నియామకం ఖాయమవుతుంది.

క్షేత్ర స్థాయి నిర్వహణ

గ్రూప్–డి పోస్ట్‌లకు ఎంపికైన వారు తమ విభాగాల్లో క్షేత్ర స్థాయి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ట్రాక్ మెయింటనెన్స్, రైళ్లలో ఎలక్ట్రికల్ పరికరాల నిర్వహణ తదితర బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుంది.

సూపరింటెండెంట్ స్థాయికి

గ్రూప్–డి పోస్ట్‌లకు ఎంపికైన అభ్యర్థులు భవిష్యత్తులో సెక్షన్ ఇంజనీర్ లేదా సూపరింటెండెంట్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. ప్రతి మూడేళ్ల తర్వాత డిపార్ట్‌మెంట్ పరీక్షలకు అర్హత లభిస్తుంది. వాటిలో ఉత్తీర్ణత సాధిస్తే త్వరగా పదోన్నతి పొందొచ్చు.

ముఖ్య సమాచారం

- ✦ దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ✦ ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం:2025,జనవరి 23
- ✦ ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 2025, ఫిబ్రవరి 22 వరకు
- ✦ పరీక్ష తేదీ: జూన్‌లో నిర్వహించే అవకాశం.
- ✦ పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.rrbsecunderabad.gov.in

రాత పరీక్షలో రాణించేలా

జనరల్ సైన్స్

యూనిట్స్, ఫోర్స్, ప్రెజర్, మెకానిక్స్, సౌండ్, హీట్, లైట్, ఎలక్ట్రిసిటీ, మ్యాగ్నటిజం, మోడర్న్ ఫిజిక్స్ తదితర అంశాల్లోని బేసిక్ కాన్సెప్టులు, సూత్రాలపై అవగాహన పెంచుకోవాలి. కెమిస్ట్రీలో ఆటమ్స్, మాలిక్యూల్స్, యాసిడ్స్, బేసెస్, మెటల్స్, నాన్ మెటల్స్, కార్బన్ కాంపౌండ్స్, మెటలర్జీ తదితర అంశాల గురించి తెలుసుకోవాలి. అదే విధంగా లైఫ్ సైన్సెస్‌కు సంబంధించి హ్యూమన్ బాడీ, విటమిన్లు, న్యూట్రిషన్, నెర్వస్ సిస్టమ్, హార్మోన్లు, ఎంజైమ్‌లు, సూక్ష్మజీవులు, వ్యాధులు, టీకాలు,పర్యావరణం వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

మ్యాథమెటిక్స్

నంబర్ సిస్టమ్, బాడ్‌మాస్, డెసిమల్స్, ఫ్రాక్షన్స్, ఎల్‌సీఎం, హెచ్‌సీఎఫ్, రేషియో అండ్ ప్రపోర్షన్, పర్సంటేజెస్, మెన్సురేషన్, టైం అండ్ వర్క్, టైం అండ్ డిస్టెన్స్, ఇంట్రస్ట్, ప్రాఫిట్ అండ్ లాస్, ఆల్జీబ్రా, ట్రిగనోమెట్రీ, జామెట్రీ, కేలండర్ అండ్ క్లాక్ అంశాలపై దృష్టిపెట్టాలి. వీటికోసం తొలుత ప్రాథమిక భావనలపై అవగాహన పెంచుకోవాలి. ఆయా చాప్టర్‌లలోని సమస్యలను ప్రాక్టీస్ చేయాలి. అదే విధంగా బ్యాంకు, ఎస్ఎస్‌సీ, రైల్వే పరీక్షలకు సంబంధించిన పాత ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయడం లాభిస్తుంది.

జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్

అనాలజీస్, ఆల్ఫాబెటికల్, నంబర్ సిరీస్, కోడింగ్–డీకోడింగ్, మ్యాథమెటికల్ ఆపరేషన్స్, రిలేషన్‌షిప్స్, జంబ్లింగ్, వెన్ డయాగ్రమ్, డేటా ఇంటర్‌ప్రెటేషన్, డేటా సఫిషియెన్సీ, కన్‌క్లూజన్ అండ్ డెసిషన్ మేకింగ్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, అనలిటికల్ రీజనింగ్, క్లాసిఫికేషన్, డైరెక్షన్స్ తదితర అంశాలపై దృష్టి సారించాలి.

జనరల్ అవేర్‌నెస్, కరెంట్ అఫైర్స్

- ✦ జాతీయ, అంతర్జాతీయ ప్రాముఖ్య కలిగిన కరెంట్ అఫైర్స్, క్రీడలు, భారత సంస్కృతి, కళలు, సాహిత్యం, నిర్మాణాలు-కట్టడాలు, జనరల్ సైన్స్–లైఫ్ సైన్స్ (పదో తరగతి స్థాయి), భారత చరిత్ర, స్వాతంత్ర్య ఉద్యమం, భారత–ప్రపంచ భూగోళశాస్త్రం, ఇండియన్ పాలిటీ అండ్ గవర్నెన్స్, రాజ్యాంగం, రాజకీయ వ్యవస్థ, శాస్త్రసాంకేతిక రంగాలు, అంతరిక్ష విభాగం, భారత అణు కార్యక్రమం, ఐక్యరాజ్యసమితి, ఇతర ముఖ్యమైన అంతర్జాతీయ సంస్థలు, పర్యావరణ అంశాలు, కంప్యూటర్ ప్రాథమిక అంశాలు, దేశంలో రవాణా వ్యవస్థ, భారత ఆర్థిక వ్యవస్థ, ప్రభుత్వ పథకాలు వంటి వాటిపై దృష్టి పెట్టాలి.
- ✦ మెంటల్ ఎబిలిటీలో.. అనాలజీస్, నంబర్ సిరీస్, కోడింగ్, డీ కోడింగ్, రిలేషన్‌షిప్స్, సిలాజిజమ్, జంబ్లింగ్, వెన్ డయాగ్రమ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, క్లాసిఫికేషన్, డైరెక్షన్స్, స్టేట్‌మెంట్స్–ఆర్గ్యుమెంట్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- జాగ్రఫీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- ఇంగ్లిష్

భారతీయుల 10 వేల జన్యువుల చరిత్ర రికార్డు

జీనోమ్ ఇండియా ప్రాజెక్టులో భాగంగా క్రోడీకరణ

83 జనాభా సమూహాల జన్యువుల వివరాల సేకరణ

2.7 కోట్ల జన్యు వేరియెంట్లపై అధ్యయనం

భారతీయులకే సొంతమైన 70 లక్షల వేరియెంట్లు

దేశంలో మొత్తం 4,600 జనాభా సమూహాలు

డేటాబేస్‌తో కొత్త ఔషధాల తయారీ సులువు

మన జీనోమ్ డేటా రెడీ



సాక్షి, హైదరాబాద్: ఒకప్పుడు వైద్యుడి వద్దకు వెళ్తే మణికట్టు పట్టుకొని నాడీ కొట్టుకునే తీరును చూసి మన శరీరంలో అనారోగ్య సమస్య ఏమిటో చెప్పేవారు. ఇప్పుడు కాలం మారింది. కొత్త వ్యాధులు మనుషులపై దండెత్తుతున్నాయి. వాటికి విరుగుడుగా కొత్త మందులనూ శాస్త్రవేత్తలు కనిపెడుతూనే ఉన్నారు. మనకు భవిష్యత్తులో రాబోయే వ్యాధులేమిటో కూడా ముందుగానే చెప్పేసే టెక్నాలజీ వచ్చింది. అందుకు పునాది జీనోమ్ సీక్వెన్స్. జన్యు క్రమాన్ని విశ్లేషించటం ద్వారా మనిషిలో రాబోయే దీర్ఘకాలిక అనారోగ్యాల గురించి తెలుసుకోవచ్చు. అందుకే జన్యు క్రమ విశ్లేషణ ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యత పెరిగింది. అనేక దేశాలు తమ పౌరుల జన్యుక్రమాలను విశ్లేషించి డేటాను భద్రపరుస్తున్నాయి. అదే కోవలో భారత ప్రభుత్వం కూడా మనదేశంలోని జనాభా సమూహాల (పాపులేషన్ గ్రూప్స్) జన్యు క్రమాలను విశ్లేషించేందుకు 'జీనోమ్ ఇండియా' ప్రాజెక్టును చేపట్టింది. మొదటి దశలో భాగంగా 83 జనాభా సమూహాల జన్యువుల వివరాలు సేకరించి, ఆ డేటా ను హరియాణాలోని ఫరీదాబాద్‌లో ఉన్న 'ఇండియన్ బయలాజికల్ డేటా సెంటర్'లో భద్రపరిచారు. మనదేశంలో దాదాపు 4,600 జనాభా సమూహాలున్నాయి. వీటిల్లో 83 అంటే 2% గ్రూపుల జన్యు వివరాల సేకరణ పూర్తయింది. ఈ డేటాను భారతీయ శాస్త్రవేత్తలతోపాటు ప్రపంచంలో ఏ పరిశోధకులైనా తమ పరిశోధన కోసం వాడుకొనేందుకు అందుబాటులో ఉంచారు. వ్యాధుల చికిత్సలో భారతీయులకు సరిపడే మందుల తయారీకి, కొత్త చికిత్సల రూపకల్పనకు ఈ డేటాబేస్ ఉపయోగపడుతుంది.

భిన్నమైన జన్యు వేరియెంట్లు

కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ పరిధిలోని బయోటెక్నాలజీ విభాగం మద్దతుతో చేపట్టిన జీనోమ్ ఇండియా ప్రాజెక్టులో భాగంగా పరిశోధకులు 10 వేల మానవ జన్యువులను క్రోడీకరించారు. వీటిలో 2.7 కోట్ల అత్యంత అరుదైన వేరియెంట్స్‌ను గుర్తించి వివరాలు రికార్డు చేశారు. పైగా వాటిల్లోనూ 70 లక్షల వేరియెంట్స్ వివరాలు ప్రపంచంలో మరెక్కడా లేనివి. తాజా డేటాను విశ్లేషించి జన్యుపరంగా భారతీయులకే ప్రత్యేకంగా ఉన్న కొన్ని మొండి వ్యాధుల మూలాలను తెలుసుకోవచ్చు. అలాగే జన్యు ప్రత్యేకతల కారణంగా ఒక్కొక్కరిలో ఒక్కోలా వ్యక్తమయ్యే వ్యాధులకు చికిత్స కోసం ప్రత్యేక వ్యక్తిగత మందులను తయారుచేయవచ్చు. 'ఈ జ్ఞానసంపద కేవలం వైజ్ఞానిక పరిశోధనలకే కాకుండా, ఇతరత్రా రంగాల్లో అత్యున్నత పరిశోధనలకూ, ప్రజలందరి ఆరోగ్య సంరక్షణకూ ఉపయోగపడుతుంది' అని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ సహాయ మంత్రి జితేంద్రసింగ్ పేర్కొన్నారు.

నంబరింగ్‌తో రికార్డు

మనదేశంలో భిన్న జాతులు, వర్గాలు, కులాల జనాభా జీవిస్తున్నారు. ఇది చాలా సున్నితమైన సామాజిక నిర్మాణం. అందుకే ఈ ప్రాజెక్టులో డేటాను జాతులు, కులాల పేర్లతో కాకుండా కొన్ని సాంకేతిక పదజాలాలు, అంకెలతో సూచించేలా ఏర్పాట్లు చేశారు. విస్తారంగా ఉన్న జనాభాలో ఇప్పటికి ఈ డేటాబేస్ కొద్ది గ్రూపుల తాలూకు వివరాలకే పరిమితమైనప్పటికీ, భవిష్యత్తులో సేకరించాల్సిన అనేక గ్రూపుల వివరాలకోసం ఓ ముందడుగు పడినట్లు అయ్యిందని నిపుణులు అంటున్నారు. దీన్ని జీనోమ్ డేటాబేస్ సేకరణలో మొదటి దశగా చెప్పవచ్చని, తర్వాత దేశం రెండో దశలో అడుగుపెట్టినట్లుగా భావించాలని పేర్కొంటున్నారు. గ్లోబల్ జీనోమ్ డేటాబేస్‌లో భారతీయుల వివరాలు అరకొరగానే ఉండటంతో కొత్తగా సేకరించిన ఈ వివరాలు మనకు చాలా కీలకంగా మారనున్నాయి.

అందరూ వాడుకోవచ్చు

జీనోమ్ ఇండియా ప్రాజెక్టు 'డేటాబేస్'ను అందరికీ అందుబాటులో ఉంచారు. దీనిని ఉపయోగించుకోవాలని భావించే శాస్త్రవేత్తలు తమ పరిశోధన వివరాలను తెలుపుతూ ప్రతిపాదనలను పంపించాల్సి ఉంటుంది. ఆ దరఖాస్తులను పరిశీలించేందుకు ఒక నిపుణుల పానెల్‌ను ఏర్పాటుచేశారు. ఆ ప్యానెల్ దరఖాస్తులను పరిశీలించి డేటాను వాడుకొనేందుకు అనుమతి ఇస్తుంది.

ఇది మన బయోటెక్ సంపద..

జీనోమ్ ఇండియా ప్రాజెక్టులో భాగంగా సేకరించిన డేటా మన బయోటెక్ సంపద. ఇలాంటి డేటాబేస్ ఏర్పాటు చేసుకోవడం ఓ చారిత్రక పరిణామం. బయోటెక్నాలజీ ఆధారంగా రూపొందించే అనేక నూతన సాంకేతిక ఉపకరణాల తయారీకి, ఉత్పత్తులకు ఇది తోడ్పడుతుంది.

– నరేంద్రమోదీ, ప్రధానమంత్రి.

సుదీర్ఘ ప్రక్రియ..

➤ 'జీనోమ్ ఇండియా' ప్రాజెక్టుకు అవసరమైన వనరులను కేంద్ర ప్రభుత్వం సమకూర్చింది. ఈ ప్రాజెక్టు మొదటి దశను 2020లో ప్రారంభించారు. మొదటి దశ పూర్తి కావడంతో, ఇక ప్రాజెక్టు రెండో దశను మొదలుపెట్టాల్సి ఉంది. మొదటి దశలో పది వేల మంది వివరాలు సేకరించారు. రెండో దశలో పది లక్షల మంది జన్యువులను సేకరిస్తారు. ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం వ్యాధులకు మెరుగైన ఔషధాలు తయారుచేయటమేనని అధికారులు తెలిపారు. రెండో దశ వివరాల సహాయంతో ప్రమాదకర క్యాన్సర్లకు చికిత్సలను కనిపెట్టడం, నాడీ సంబంధ వ్యాధులకు పరిష్కారాలు వెదకటం, అత్యంత అరుదుగా వచ్చే వ్యాధులకు చికిత్స వంటి అనేక అంశాలను చేపడుతారని సమాచారం.

స్క్రామ్‌జెట్ ఇంజిన్ గ్రౌండ్ టెస్ట్ సక్సెస్

డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలను అభినందించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్




సాక్షి, హైదరాబాద్: రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ)కు చెందిన డీఆర్‌డీఎల్ (రక్షణ పరిశోధన, అభివృద్ధి లేబొరేటరీ)–హైదరాబాద్ స్క్రామ్‌జెట్ ఇంజిన్ గ్రౌండ్ టెస్ట్‌ను మంగళవారం విజయవంతంగా పూర్తి చేసింది. డీఆర్‌డీఎల్ ఇటీవలే రూపొందించిన ఈ స్క్రామ్‌జెట్‌ను దేశంలోనే తొలిసారిగా 120 సెకన్లపాటు పరీక్షించారు. భవిష్యత్ తరం హైపర్‌సోనిక్ మిస్సైల్స్ తయారీలో ఈ విజయం కీలక మైలురాయిగా నిలుస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రయోగం విజయవంతం కావడంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ శాస్త్రవేత్తలను ప్రత్యేకంగా అభినందించారు.

ప్రత్యేకతలు ఇవీ..

హైపర్‌సోనిక్ క్షిపణులు మాక్ 5 అంటే ధ్వని వేగం కంటే ఐదు రెట్లు లేదా గంటకు 5,400 కి.మీ. వేగంతో ప్రయాణించే అధునాతన ఆయుధాల తరగతికి చెందినవి. అధిక ప్రభావవంతమైన దాడులను చేయగలిగే సామర్థ్యాన్ని ఇవి కలిగి ఉంటాయి. భారత్, అమెరికా, రష్యా వంటి దేశాలు హైపర్ సోనిక్ టెక్నాలజీని వినియోగిస్తున్నాయి.

రెండు వారాల్లో కౌంటర్ వేయండి

మహిళల రక్షణపై దాఖలైన పిటిషన్‌లో కేంద్రానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: మహిళల రక్షణపై దాఖలైన పిటిషన్‌లో రెండు వారాల్లోగా కౌంటర్ వేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. నాలుగు నెలలైనా ఇంతవరకు కౌంటర్ ఎందుకు వేయలేదని ప్రశ్నించింది. కౌంటర్ దాఖలుకు ఇదే చివరి అవకాశమని స్పష్టం చేసింది. తదుపరి విచారణ ఫిబ్రవరి 4కు వాయిదా వేసింది. అత్యాచారం కేసుల్లో దోషిగా తేలిన వ్యక్తి ఆస్తిలో 50% శిక్ష పడిన 3 నెలల్లోగా బాధితురాలికి పరిహారం కేటాయించేలా కేంద్రాన్ని.. తక్షణ ఎఫ్ఐఆర్ నమోదు, నెలలో చార్జిషీట్ దాఖలు, 3 నెలల్లో శిక్ష ఖరారు చేసేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. అలాగే పెండింగ్‌లోని రేప్ కేసుల సంఖ్య, వాటి పరిష్కారాన్ని వేగవంతం చేయడానికి తీసుకున్న చర్యలపై నివేదికను సమర్పించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. తెలంగాణలో మహిళలపై నేరాలు పెరగడానికి దారితీసిన వైఫల్యాలపై దర్యాప్తు నిర్వహించాలని, అవసరమైన సంస్కరణలను సిఫార్సు చేసేలా జాతీయ మహిళా కమిషన్‌ను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. బాధితులకు ప్రభుత్వ ఆధ్వర్యంలో సురక్షితమైన వసతి సదుపాయం లేకుంటే సంగారెడ్డి సమీపంలోని తన చారిటీ సిటీలో ఏర్పాటు చేస్తామన్నారు. బాధితుల గుర్తింపును గోప్యంగా ఉంచేలా మీడియాకు ఆదేశాలివ్వాలని కోరారు. దీనిపై జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ జి.రాధారాణి ధర్మాసనం మంగళవారం మళ్లీ విచారణ చేపట్టింది.

హడలెత్తించిన పులి సంచారం

తాంసి(కె) శివారులో గమనించిన వాహనాల డ్రైవర్లు



తాంసి: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం తాంసి(కె) శివారులో పులి సంచారం స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది. ఇటీవల మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి వచ్చిన పులులు.. కొద్ది రోజుల పాటు గొల్లఘాట్, తాంసి(కె), హత్తిఘాట్ ప్రాంతాల్లో సంచరించ డం తెలిసిందే. తాజాగా తాంసి(కె) సమీపంలోని పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్మాణ ప్రదేశంలో.. సోమ వారం రాత్రి అక్కడి లారీ డ్రైవర్లకు పులి కనిపించింది. ఒక్కసారిగా వాహ నం ఎదుట తారసపడటంతో డ్రైవర్లు సెల్‌ఫోన్లతో వీడియో తీశారు. ఇది వైరల్ కావడంతో అటవీశాఖ అధికారులు స్పందించారు. అర్లి(టి) సెక్షన్ అధికారి మోపత్‌రావ్ సిబ్బందితో కలిసి.. అటవీ ప్రాంతంతో పాటు రిజర్వాయర్ నిర్మాణ సమీపంలో పులి కదలికలను మంగళవారం పరిశీలించా రు. అయితే ఎక్కడా పులి పాదముద్రలు కనిపించలేదని అధికారులు స్పష్టం చేశారు. పెన్‌గంగ పరీవాహక ప్రాంతాల్లోనూ గాలింపు చేపట్టారు. బేస్ క్యాంప్‌తో పాటు పలుచోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అప్రమత్తంగా ఉండాలని సమీప గ్రామాల ప్రజలను హెచ్చరించారు. పులి కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. వారివెంట బీట్ అధికారులు సాయికుమార్, శ్రీనివాస్, రామేశ్వర్, యానిమల్ ట్రాకర్స్ సోనేరావు, కృష్ణ ఉన్నారు.

మీ కొడుకు రేప్ కేసులో దొరికాడు

రూ.50 వేలు ఫోన్‌పే చేస్తే వదిలేస్తామంటూ సైబర్ నేరగాళ్ల బెదిరింపులు



సైబర్ నేరగాడు చేసిన వాట్సాప్‌కాల్ వివరాలు



సైబర్ నేరస్తుడితో ఫోన్‌లో మాట్లాడుతున్న శ్యామలయ్యగౌడ్

బొంరాస్‌పేట: 'హలో..ఆప్‌కా బేటా రేప్ కేస్ మే మిల్ గయా. ఛోడ్‌దేనా బోలేతో పచాస్ హజార్ అర్జెంట్ పే కరో.. నైతో జైల్‌మే దాల్ దేతే'.. (నీ కొడుకు అత్యాచార ఘటనలో దొరికాడు. అతడిని విడిచిపెట్టాలంటే వెంటనే రూ.50 వేలు ఫోన్ పే చేయండి. లేదంటే జైలులో వేస్తాం) అంటూ వచ్చిన ఫోన్‌కాల్‌తో ఓ తండ్రి భయాందోళనకు గురయ్యాడు. ఏం చేయాలో తోచక పక్కనున్న తన సన్నిహితుడికి ఫోన్ ఇచ్చి మాట్లాడించాడు. ఇది సైబర్ నేరగాళ్ల పని అని తెలుసుకొని ఫోన్ కట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా రేగడిమైలారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు శ్యామలయ్యగౌడ్ స్థానికంగా కిరాణదుకాణం నడిపిస్తున్నాడు. ఇతని చిన్న కొడుకు సత్యనారాయణగౌడ్ భార్యాపిల్లలతో హైదరాబాద్‌లో ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం ఉదయం 10.38 గంటలకు శ్యామలయ్యగౌడ్‌కు ఓ నంబరు నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి హిందీలో మాట్లాడుతూ.. నీ కొడుకు ఓ బాలికపై అత్యాచారం చేసిన ఘటనలో దొరికాడని చెప్పాడు.ఫోన్‌లో పోలీస్ వాహనాల సైరన్ వినిపిస్తూ సత్యనారాయణను అరెస్టు చేస్తున్నామని నమ్మించే ప్రయత్నం చేశాడు. హడలిపోయిన శ్యామలయ్యగౌడ్ వెంటనే పక్కనున్న వ్యక్తికి ఫోన్ ఇచ్చాడు. సైబర్ నేరగాళ్లుగా అనుమానించిన ఆయన పోలీస్‌స్టేషన్ వివరాలు అడగగా అవతలి వ్యక్తి పరుషపదజాలంతో తిట్టాడు. దీంతో ఫేక్ అని భావించి ఫోన్ కట్ చేశాడు. ఆ వెంటనే సత్యనారాయణకు ఫోన్ చేయగా, తాను ఆఫీసులో ఉన్నానని తండ్రికి చెప్పాడు. కొడుకుతో వీడియోకాల్ మాట్లాడిన తర్వాత తండ్రి ఊపిరి పీల్చుకున్నాడు. అనంతరం ఈ ఘటనపై నేషనల్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫోన్ చేసి, ఫిర్యాదు చేశాడు. ఇలాంటి ఫోన్‌కాల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.




మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న నటుడు ఆకాష్ పూరి, నటి సంయుక్తా మీనన్, గాయని మంగ్లీ






నీరెండ.. కూనలకు అండ

సూర్యరశ్మి ద్వారా శరీరానికి విటమిన్ 'డి'అందుతుంది. అందుకోసం రోజూ ఉదయం 7.30 గంటల నుంచి 8.30 గంటల వరకు పసికందులతో తల్లులు, కుటుంబ సభ్యులు కూర్చుంటున్నారు. నిజామాబాద్ జనరల్ ఆస్పత్రి ఆవరణలో ఉదయపుటెండలో పసికందులను ఎత్తుకొని మహిళలు కూర్చున్న దృశ్యమిది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

అక్కడ ఎన్‌కౌంటర్.. ఇక్కడ కలకలం



ఎక్కడ కాల్పులు జరిగినా పల్లెల్లో అలజడి

- ఏటూరు నాగారం అడవుల నుంచి అబూజ్‌మడ్ వరకు...
- దండకారణ్యంలో కీలకంగా తెలంగాణ మావోయిస్టులు
- ఉమ్మడి వరంగల్ నుంచి 23 మంది.. దండకారణ్యంలోనే అత్యధికం..
- వరుస ఎన్‌కౌంటర్లు.. పెరుగుతున్న మృతులు
- ఆందోళనలో మావోయిస్టుల కుటుంబాలు...



■ ఛత్తీస్‌గఢ్ దక్షిణ బస్తర్ కాంకేర్, మారేడుబాక అడవుల్లో ఆరు రోజుల కిందట జరిగిన ఎన్‌కౌంటర్‌లో 18 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు పోలీసులు ప్రకటించగా.. మృతుల్లో కీలక నేత బడే చొక్కారావు అలియాస్ దామోదర్ ఉన్నట్టు సౌత్ బస్తర్ డివిజనల్ కమిటీ కార్యదర్శి గంగానది పేరిట వెలువడిన ప్రకటనతో గందరగోళం ఏర్పడింది. ఈ విషయమై దామోదర్ కుటుంబసభ్యులకు పోలీసుల నుంచి ఎలాంటి సమాచారమూ లేకపోగా, మూడు రోజుల ఆందోళన తర్వాత దామోదర్ క్షేమంగానే ఉన్నాడన్న వార్త కుటుంబసభ్యులు, శ్రేయోభిలాషులకు ఊరట కలిగించింది.

■ ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల సరిహద్దు నౌపాడ, గరియాబాద్ ఏరియాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, ఛత్తీస్‌గఢ్ ఇన్‌చార్జ్ రాంచంద్రారెడ్డి అలియాస్ చలపతితోపాటు 20 మంది వరకు మృతి చెందినట్టు పోలీసులు మంగళవారం ప్రకటించారు. వరంగల్, కాజీపేట ప్రాంతాలకు చెందిన మోడెం బాలకృష్ణ, ఎం.సాంబయ్యలు కూడా మృతుల్లో ఉన్నట్టు మీడియా ద్వారా ప్రచారం జరిగింది. ఆ ఇద్దరి కుటుంబసభ్యులు, బంధువులు ఫోన్‌ల ద్వారా పలువురిని ఉదయం నుంచి సాయంత్రం వరకు సంప్రదించి చివరకు లేరని తెలుసుకొని ఊపిరి పీల్చుకున్నారు.

- సెంట్రల్ కమిటీ మెంబర్లుగా ఉమ్మడి వరంగల్, కరీంనగర్‌లకు చెందిన తక్కళ్లపెల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న సెంట్రల్ మిలటరీ కమిషన్ చీఫ్‌గా ఉండగా, పుల్లూరు ప్రసాదరావు అలియాస్ చంద్రన్న సెంట్రల్ రీజనల్ బ్యూరో (సీఆర్‌బీ)గా ఉన్నారు. మోడెం బాలకృష్ణ అలియాస్ మహేశ్, గాజర్ల రవి అలియాస్ గణేశ్, మల్లోజుల వేణుగోపాల్, తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కోసా, చదువు రాంచంద్రారెడ్డి అలియాస్ వికల్ప్ (హుస్నాబాద్ ప్రాంతం), మల్లా రాజిరెడ్డిలు కేంద్ర కమిటీ సభ్యులుగా, వివిధ రాష్ట్రాల ఇన్‌చార్జ్‌లు, అనుబంధ సంఘాల బాధ్యులుగా ఉన్నారు.
- నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంలకు చెందిన పాక హన్మంతు అలియాస్ ఉయికే గణేశ్, అలియాస్ రాజేశ్ తివారి కూడా కేంద్ర కమిటీ సభ్యుడిగా కీలక బాధ్యతల్లో ఉన్నట్లు తెలిసింది. కాగా వీరితోపాటు మావోయిస్టు పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న కొందరు సీనియర్ నాయకులు, రాష్ట్ర కమిటీల కార్యదర్శులు ప్రత్యామ్నాయ కేంద్ర కమిటీ సభ్యులుగా ఉన్నట్టు సమాచారం.

సాక్షిప్రతినిధి, వరంగల్ : ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రా, ఒడిశా సరిహద్దు.. అబూజ్‌మడ్ దండకారణ్యం.. ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా తెలంగాణ పల్లెల్లో కలకలం రేపుతున్నాయి. సీపీఐ (మావోయిస్టు) పార్టీ దండకారణ్య కమిటీల్లో ఇప్పటికీ ఈ ప్రాంతానికి చెందిన వారే కీలకంగా వ్యవహరిస్తుండగా, ప్రతీ ఎదురుకాల్పుల సంఘటనలో ఒక్కరిద్దరు ఉంటున్నారు. దీంతో ఇటీవలి కాలంలో జరుగుతున్న వరుస ఎదురుకాల్పుల సంఘటనలు మావోయిస్టుల కుటుంబాలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇదే సమయంలో పోలీసులు అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టుల కుటుంబాలను కలిసి జనజీవన స్రవంతిలో కలిసేలా చూడాలని కౌన్సెలింగ్ చేస్తుండగా, మావోయిస్టులు మాత్రం పోరుబాటలోనే సాగుతున్నారు.

మోస్ట్ వాంటెడ్‌ల్లో వరంగల్ వారే 23 మంది

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, జార్ఖండ్ తదితర 11 రాష్ట్రాల్లో పని చేస్తున్న మావోయిస్టు పార్టీ అగ్రనేతల వివరాలపై కేంద్ర హోంశాఖ గతేడాది మార్చిలో ఆరా తీసింది. తెలంగాణలోని పాత 10 జిల్లాల నుంచి 64 మంది ఇతర రాష్ట్రాలు, ప్రాంతా



లలో పనిచేస్తున్నట్టు తేలిందని వెల్లడించింది. ఇందులో అత్యధికంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 23 మంది అజ్ఞాతంలో ఉన్నట్టు ప్రకటించింది. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టుల నేతల వివరాలను జిల్లాలు, పోలీస్‌స్టేషన్ల వారీగా ఇటీవల ఎన్ఐఏ కూడా ఆరా తీసింది. హనుమకొండ, జేఎస్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్, ములుగు జిల్లాల నుంచి అజ్ఞాతంలో ఉన్న నేతల వివరాలను మోస్ట్‌వాంటెడ్ జాబితాలో చేర్చారు. ఇందులో కేంద్ర కమిటీతోపాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, దండకారణ్యం కమిటీల్లో కీలకంగా ఉన్న మోడం బాలకృష్ణ అలియాస్ మహేశ్, బాబన్న, గాజర్ల రవి అలియాస్ గణేష్, బడే దామోదర్ అలియాస్ చొక్కారావు, గాదె రాజు, సుంకరి రాజ్, గీరెడ్డి పవనానందరెడ్డి అలియాస్ అర్జున్, ఉల్లెంగుల యాకయ్య అలియాస్ అంజన్న, పసునూరి నరహరి అలియాస్ సంతోష్, ముప్పిడి సాంబయ్య అలియాస్ బాబన్న, అంకేశ్వరపు సారయ్య అలియాస్ ఎల్లన్నలతోపాటు మొత్తం 23 మంది పేర్లను వెల్లడించారు.



కేంద్ర కమిటీల్లో కీలకంగా తెలంగాణ నేతలు

సీపీఐ (మావోయిస్టు) పార్టీలో కేంద్ర కమిటీ సభ్యుల తోపాటు వివిధ బాధ్యతల్లో తెలంగాణకు చెందిన పలువురు కీలకంగా వ్యవహరిస్తున్నారు. మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ (ఎంసీసీ) విలీనం సమయంలో 32 మందితో ఉన్న కేంద్ర కమిటీ ఆ తర్వాత అనేక కారణాల వల్ల 24 మందికి చేరినట్టు ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం. సెంట్రల్ రీజినల్ బ్యూరోగా ఉన్న కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ మరణం తర్వాత కమిటీ పునరుద్ధరణ జరిగినట్టు చెబుతున్నారు. కాగా, ఈ 24 మందిలో తొమ్మిది మంది జార్ఖండ్, బిహార్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా తదితర రాష్ట్రాలకు చెందినవారు కాగా, 15 మందిలో 12 మంది తెలంగాణ వారే. కేంద్ర కమిటీ కార్యదర్శిగా నంబళ్ల కేశవరావు నియామకం తర్వాత, అప్పటివరకు కేంద్రకమిటీ కార్యదర్శిగా ఉన్న ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి.. ప్రస్తుతం సీసీ మెంబర్‌గా, అంతర్జాతీయ విప్లవపార్టీల సమాఖ్యకు ఇన్‌చార్జ్‌గా ఉన్నట్టు సమాచారం.

జైళ్ల సంస్కరణకు 'శిక్షణ'

- సికా ఆధ్వర్యంలో సిబ్బందికి ప్రత్యేక ట్రైనింగ్
- ఇతర రాష్ట్రాల సిబ్బందికి కూడా తరగతులు
- ఖైదీలను సంస్కరించటంపై ప్రత్యేక ఫోకస్



సికా ఆధ్వర్యంలో 2024లో కొనసాగిన శిక్షణ...

శిక్షణ	హాజరైనవారి సంఖ్య
బీపీఆర్అండ్‌డీ ట్రైనింగ్	71
తెలంగాణ జైలు వార్డర్స్‌కు ఇండక్షన్ ట్రైనింగ్	93
తిహార్ జైలు సిబ్బందికి	141
అండమాన్ నికోబార్	08
రిఫ్రెషర్ ట్రైనింగ్‌లు	95
క్రిమినల్ చట్టాలపై శిక్షణ	402

సాక్షి, హైదరాబాద్: జైళ్లలోని శిక్ష పడిన ఖైదీలు, అండర్ ట్రయల్ ఖైదీల పట్ల ఎలా వ్యవహరించాలి? జైలు మాన్యువల్, జైళ్ల నిర్వహణలో ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశాలపై జైళ్లశాఖ సిబ్బందికి నిరంతరం శిక్షణలు కొనసాగుతున్నాయి. ఈ శిక్షణలో సికా (స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కరక్షనల్ అడ్మినిస్ట్రేషన్– ఎస్ఐసీఏ) కీలక పాత్ర పోషిస్తోంది. సికాలో ఇతర రాష్ట్రాల సిబ్బందికి సైతం శిక్షణ కొనసాగుతోందని జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా తెలిపారు. బీపీఆర్అండ్‌డీ (బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్) వంటి జాతీయ సంస్థలు సైతం సికాలో శిక్షణ ఇప్పించేందుకు ముందుకు వస్తున్నట్టు చెప్పారు. దీంతో సికాను మరింత బలోపేతం చేయడంలో భాగంగా బోధనా సిబ్బందిని ప్రత్యేకంగా నియమించుకోనున్నట్లు వెల్లడించారు. సోషియాలజీ, సైకాలజీ, క్రిమినాలజీ, లీగల్ స్టడీస్ అంశాల్లో పాఠ్యాంశాలు బోధించేందుకు సిబ్బందిని నియమించుకోవడంపై అధికారులు దృష్టి పెట్టారు. ఎవరైనా ఈ శిక్షణ ఇచ్చేందుకు ఆసక్తిగా ఉంటే ఉన్నతాధికారులను సంప్రదించవచ్చని సౌమ్యామిశ్రా ఇటీవల సూచించారు. థంబ్ ఇన్..సైన్ ఔట్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు జైళ్లలో 12,650 మంది ఖైదీలను అక్షరాస్యులుగా మార్చారు. చర్లపల్లి కేంద్ర కారాగారంలో డా.బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్లు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఇప్పటివరకు 750 మంది ఖైదీలు గ్రాడ్యుయేషన్, 225 మంది ఖైదీలు పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు.

కబ్జాలను అరికట్టి బాధితులకు అండగా నిలవాలి

బీజేపీ నేత ప్రేమేందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భూ కబ్జాలను అరికట్టి, బాధిత ప్రజలకు అండగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో భూదందాలు, భూకబ్జాలు పెరిగిపోయాయని మండిపడ్డారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ధరణి పోర్టల్‌ను తీసివేసి భూమాతను తీసుకొస్తామని చెప్పిన రేవంత్ ప్రభుత్వంలో...ఈరోజు కొందరు విచ్చలవిడిగా భూకబ్జాలు చేస్తూ బెదిరింపులు, దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని భూ అక్రమార్కుల ఆగడాలకు, వేధింపులకు గురైన బాధితులు.. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ వద్ద తమ గోడును వెళ్లబోసుకున్నారని తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా బాధితులకు ఎలాంటి భరోసా కల్పించలేదన్నారు. బాధితుల పక్షాన ఘటనా స్థలికి ఈటల వెళ్లి పరిస్థితిని పర్యవేక్షిస్తున్న సమయంలో కబ్జాదారుల తాబేదార్లు దురుసుగా ప్రవర్తించడంతో వారిని ఆయన నిలువరించారని తెలిపారు.

మీలాగా మేం పీకలేం... మిమ్మల్నే ప్రజలు పీకేశారు

కేటీఆర్‌కు భువనగిరి ఎంపీ చామల కౌంటర్



సాక్షి, హైదరాబాద్: ఏం పీకావని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. 'కళ్లున్నా చూడలేని మీ అజ్ఞానం మీరేంటో చెబుతోంది. మీలాగా మేం పీకలేం. కానీ మీరు పదేళ్లలో రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసి అందినకాడికి అన్నీ పీకేశారు. అది చూసిన ప్రజలు మిమ్మల్ని పీకేశారు'అని ఎక్స్ వేదికగా ఆయన మంగళవారం ట్వీట్ చేశారు. కూలిపోయిన కమీషన్ల కాళేశ్వరం, రేస్‌స్కాం బట్టబయలు, సైకిల్ ట్రాక్‌కి పగుళ్లు, లిక్కర్‌స్కాంలు, ధరణి పేరుతో భూదందాలు... ఇలా చెప్పుకుంటేపోతే కేసీఆర్ కుటుంబ పాలన పెద్ద అవినీతి చరిత్ర అని ఆ ట్వీట్‌లో ఎంపీ చామల పేర్కొన్నారు.

'ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి'

సాక్షి, హైదరాబాద్: ఇటీవల ఎన్నికైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గిరి శ్రీనివాస్‌రెడ్డి, ప్రేమ్ (దేవేందర్)లను తెలంగాణ సెక్రటేరియట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కట్ట రమేశ్, అనిత, ఉపాధ్యక్షుడు బి.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ నగరవ్యాప్తంగా ఫ్లైఓవర్ల సుందరీకరణలో భాగంగా తెలుగు తల్లి ఫ్లైఓవర్ పిల్లర్లపై వేసిన ఆకర్షణీయమైన చిత్రాలు



హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ పార్కు వద్ద పావురాల కోసం వేసిన గింజలను తినేందుకు వచ్చిన నెమళ్లు ఇవి. పార్కులో వాకింగ్ కోసం వచ్చినవారిని ఈ దృశ్యం బాగా ఆకట్టుకుంది.

రిపబ్లిక్ రిహార్సల్స్



విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో జనవరి 26న రిపబ్లిక్ డే సందర్భంగా నిర్వహించనున్న వేడుకుల్లో భాగంగా పెరేడ్‌ను రిహార్సల్ చేస్తున్న పోలీసులు
– కిషోర్, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సాహసం శ్వాసగా సాగిపో...



విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో జనవరి 26న రిపబ్లిక్ డే సందర్భంగా నిర్వహించనున్న వేడుకుల్లో భాగంగా పెరేడ్‌ను రిహార్సల్ చేస్తున్న పోలీసులు
– పి.ఎల్. మోహన్, సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం


వేటకు వేళాయె



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని మైపాడు బీచ్ లో వేటకు వెళ్లేందుకు మత్స్యకారులు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా వేటకు వలలను ఇలా సిద్ధం చేసుకుంటున్నారు.
– ఎం.ప్రసాద్, సాక్షి ఫొటోగ్రాఫర్, ఒంగోలు

పక్షులకూ ఓ మ్యూజియం

పక్షుల జీవ వైవిధ్యం తెలిపే విధంగా ఆకృతులు ● పర్యాటకులను ఆకర్షిస్తున్న 'బర్డ్ ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్'



తేలినీలాపురం పక్షుల కేంద్రంలో చెట్లపై పెలికాన్ పక్షులు

టెక్కలి: ఏటా శీతాకాలం ఆరంభంలో కొన్ని వేల కిలోమీటర్ల దూరంలో గల సైబీరియా ప్రాంతం నుంచి పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ వలస పక్షులు శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం తేలినీలాపురం విదేశీ పక్షుల కేంద్రానికి చేరుకుని సంతానోత్పత్తి చేసుకుంటాయి. తేలినీలాపురం విదేశీ పక్షుల కేంద్రంలో గల చింత, రావి, తుమ్మ, గంగ్ర, జూము, వెదురు తదితర చెట్లపై ఆవాసాలు చేసుకుని సమీపంలో చిత్తడి నేలల్లో వేట కొనసాగిస్తాయి. సమీపంలో గల చిత్తడి నేలలో 120 రకాల పక్షులు ఉన్నట్లు అంచనా. దూరం నుంచి పక్షులు చూడడం ఆనందించడం సహజం. పక్షులను దగ్గరగా చూస్తే ఎలా ఉంటుందనే ఆలోచనతో ఇక్కడ పక్షుల మ్యూజియం ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడ పక్షుల విన్యాసాలను తిలకించడానికి జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తుంటారు. విదేశీ పక్షులైన పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ పక్షుల విన్యాసాలతో పాటు ఈ పక్షుల మ్యూజియం పర్యాటకులను ఆకర్షిస్తోంది.

మ్యూజియంలో నమూనాలు..

విదేశీ పక్షుల ప్రత్యేకతలు ఎంతగానో ఆశ్చర్యానికి గురి చేస్తాయి. ఆయా ప్రత్యేకతలు మ్యూజియంలో నమూనాలు పరిశీలిస్తే..

పెలికాన్: పెలికాన్ బాతు జాతికి చెందిన పక్షి. దీని బరువు 8 కిలోలు ఉంటుంది. దీని నోరు పొడవు 14 సెంటీమీటర్లు. దీని రెక్కల పొడవు 118 ఇంచీలు, రోజుకు 4 కిలోల చేపల్ని తింటుంది. ఒకేసారి 2 కిలోల బరువు కలిగిన చేపను సునాయాసంగా తినగలిగే సామర్థ్యం ఉంది. దీని గుడ్డు బరువు సుమారు 150 గ్రాములు. ప్రతి సీజన్‌కు 4 గుడ్లను మాత్రమే పెడుతుంది. దీని గుడ్డు 28 రోజుల్లో పిల్లగా పరిపక్వత చెందుతుంది. 3 నెలల్లో పిల్ల తల్లిగా మారుతుంది. దీని దవడ సంచి ఆకారంలో ఉంటుంది. రోజుకు 2 సార్లు ఆహారం కోసం బయటకు వెళ్తుంటాయి. గంటకు 100 కిలో మీటర్ల వేగంతో పయనిస్తాయి. రోజుకు సుమారు 4 సార్లు బయటకు వెళ్తూ ఆహారాన్ని తీసుకువస్తాయి. పెలికాన్ దవడ సంచి ఆకారంలో ఉంటుంది. ఈ దవడలో సుమారు 4 కిలోల వరకు చేపల్ని నిల్వ చేయగలవు. పిల్లలకు ఆహారాన్ని నోటి ద్వారా అందజేస్తాయి. దీని జీవిత కాలం సుమారు 29 ఏళ్లు.

పెయింటెడ్ స్టార్క్: పెయింటెడ్ స్టార్క్ కొంగ జాతికి చెందిన పక్షి. దీని బరువు సుమారు 5 కిలోలు ఉంటుంది. దీని రెక్కల పొడవు 63 ఇంచీలు, ఇవి చిన్న చేపలు, పురుగులు, నత్తలు తింటాయి. కేవలం పావు కిలో వరకు మాత్రమే నోటిలో ఆహారాన్ని నిల్వ చేయగలుగుతాయి. తీసుకువచ్చిన ఆహారాన్ని గూడు మీద వేస్తే పిల్లలు తింటాయి. దీని నోటి పొడవు సుమారు 16 సెంటీ మీటర్లు. ఆహారం కోసం రోజుకు 2 సార్లు బయటకు వెళ్తుంటాయి. దీనికి సాధారణ దవడ మాత్రమే ఉంటుంది. దీని గుడ్డు సుమారు 75 గ్రాములు. ఇవి ఒక సీజన్‌లో 4 గుడ్లు మాత్రమే పెడతాయి. 28 రోజుల్లో గుడ్డును పిల్లగా పరిపక్వత చేస్తుంది. పిల్ల తల్లిగా మారాలంటే సుమారు 3 ఏళ్ల కాలం పడుతుంది. దీని జీవిత కాలం సుమారు 29 ఏళ్లు.



మ్యూజియంలో ఆకృతులను చూసి ఆనందిస్తున్న చిన్నారులు



తేలినీలాపురం మ్యూజియంలో పక్షుల ఆకృతి నమూనాలు



మ్యూజియంలో వివిధ రకాల పక్షుల ప్రత్యేకతల నమూనాలు

120 రకాల పక్షుల్లో కొన్ని పక్షుల ప్రత్యేకతలు..

పొడుగు ముక్కు ఉల్లంకి: ఈ పక్షి మట్టిలో ఆహార అన్వేషణకు బురద మట్టి ఇసుక నేలలో అనేక రకాలైన చిన్న పురుగులను కొక్కెం వంటి ముక్కుతో వేట కొనసాగిస్తుంది. ఈ పక్షి నమూనా మ్యూజియంలో ఏర్పాటు చేశారు.

తెడ్డు మూతి కొంగ: ఈ పక్షి మూతి చెంచా ఆకారంలో ఉంటుంది. నీటి అడుగున ఉన్న చిన్న జీవులను వేటాడుతుంది. అర్ధ చంద్రాకారంలో గల మూతితో వేట కొనసాగిస్తుంది.

పాము బాతు : బల్లెం వంటి ముక్కు ఆకారంతో ఈ పక్షి వేట కొనసాగిస్తుంది. మట్టి, నీటిలో పొడుచుకుంటూ ఆహారాన్ని సేకరిస్తుంది.

రాజహంస: జల్లెడ మాదిరిగా ఉన్న ముక్కు కలిగిన ఈ రాజహంస సూక్ష్మ జీవులను సునాయాసంగా వేటాడుతుంది. ఈ పక్షి ముక్కులో ఒక రకమైన వడపోత పరికరం బిగించి ఉన్నట్లు ఉంటుంది.

నత్తగుల్ల కొంగ: నత్తలను వేటాడడంలో ఈ పక్షి ముక్కు ఎంతో షార్ప్‌గా ఉంటుంది. నత్తలను గట్టిగా పట్టుకోవడంతో ఆహారాన్ని సంపాదించుకుంటాయి.

క్లుప్తంగా...

'పల్నాడు'లో దేవాలయం కూల్చివేత



నరసరావుపేట: పల్నాడు జిల్లా నరసరావుపేట 8వార్డు వెంగళరెడ్డినగర్ కాలనీలో రమావత్ కాళీబాయ్ అనే మహిళ నిర్వహిస్తున్న త్రికోటేశ్వరస్వామి, కనకదుర్గమ్మ ఆలయాన్ని పురపాలకసంఘ అధికారులు కూల్చివేశారు. గత శనివారం పోలీసులతో మున్సిపల్ ప్రణాళికా అధికారి సాంబయ్య వచ్చి జేసీబీ సహాయంతో తన ఇంటి ముందు నిర్వహిస్తున్న ఆలయాన్ని కూల్చివేశారని కాళీబాయ్ మంగళవారం ‘సాక్షి’కి చెప్పారు. తన ఇంటిపక్కనే ఉన్న జ్ఞానోజీ అనే వ్యక్తి ఇంటి విలువ పెరిగేందుకు తాను15 ఏళ్లుగా నిర్వహిస్తున్న దేవాలయాన్ని కూల్చారని ఆరోపించారు. తాను 2007లో ఇల్లు కొనుక్కున్నానని, అప్పటికే అందులో పుట్ట ఉందన్నారు. దాన్ని సంరక్షిస్తూ చుట్టూ గోడ నిర్మించానన్నారు. ఇంటిముందు ఉన్న చెట్టు కింద త్రికోటేశ్వర స్వామి, కనకదుర్గమ్మ ఫొటోలు పెట్టి రోజూ పూజిస్తుండగా చుట్టుపక్కల వారు ఇచ్చిన చందాలతో భక్తుల కోసం చిన్నషెడ్డు ఏర్పాటు చేశామన్నారు. కొంతమంది వ్యక్తులు ఇది జీర్ణించుకోలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ముందుగానే తనకు చెప్పి ఉంటే రోడ్డుపైకి వచ్చిన వాటిని తొలగించేవారమని తెలిపారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావును వివరణ కోరగా.. ఆ వీధిలోని వారు రోడ్డును ఆక్రమిస్తూ చేసిన దేవాలయ నిర్మాణాలు, అందులో జరుగుతున్న పూజలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని తమకు వచ్చిన ఆదేశాల మేరకే ఆలయాన్ని కూల్చివేశామని పేర్కొన్నారు.

'ఏపీపీసీసీ' వోఎస్డీగా కమలాకర్‌బాబు

సాక్షి, అమరావతి: ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్ ఎండీగా ఉన్న ఎం.కమలాకర్ బాబును ఆంధ్రప్రదేశ్ పవర్ కో-ఆర్డినేషన్ కమిటీ (ఏపీపీసీసీ) ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (వోఎస్డీ)గా నియమించారు. పునరుత్పాదక విద్యుత్ నిర్వహణ, సమన్వయం బాధ్యతలను అప్పగిస్తూ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కుటుంబ సంక్షేమ కమిషనర్ బాధ్యతల స్వీకరణ

సాక్షి, అమరావతి: ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్‌గా జి.వీరపాండియన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటివరకు సెర్ప్ సీఈవోగా పనిచేశారు. ఇప్పటివరకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్‌గా వ్యవహరించిన వాకాటి కరుణ సెర్ప్ సీఈవోగా బదిలీ అయిన విషయం తెలిసిందే.

ఏపీహెచ్ఆర్‌డీ జేడీజీగా ప్రద్యుమ్న

సాక్షి, అమరావతి: సీఎం కార్యదర్శి ప్రద్యుమ్నకు ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి సంస్థ జాయింట్ డైరెక్టర్ జనరల్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు గతేడాది జూన్ 19 నుంచి అమల్లోకి వచ్చినట్లు పేర్కొనడం గమనార్హం.

సీఎం డ్యాష్ బోర్డు నిర్వహణకు సచివాలయాల నిధులు

సాక్షి, అమరావతి: సీఎం డ్యాష్ బోర్డు నిర్వహణకు 10 మంది సాఫ్ట్‌వేర్ నిపుణులను, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు అందించే సేవలను పర్యవేక్షించేందుకు మరో 50 మంది సాఫ్ట్‌వేర్ నిపుణులను వినియోగించుకునేందుకు గాను గ్రామ వార్డు సచివాలయాలశాఖ నుంచి నెలకు రూ. 1.27 కోట్లు చెల్లించేందుకు అనుమతి ఇస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థకు చెందిన ఈ 60 మంది నిపుణుల సేవలు ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటి నుంచి వచ్చే ఏడాది జనవరి నెలాఖరు వరకు వినియోగించుకుంటారు. సీఎం డ్యాష్ బోర్డు నిర్వహణకు, గ్రామ వార్డు సచివాలయాల శాఖకు సంబంధం లేదు. సీఎం డ్యాష్ బోర్డు రియల్‌టైం గవర్నెన్స్ సొసైటీ పరిధిలో కొనసాగుతుంది.

కాణిపాకం పాఠశాలకు జాతీయ అవార్డు

క్లీన్ అండ్ గ్రీన్ ప్రోగ్రామ్‌లో...

ఐరాల: క్లీన్ అండ్ గ్రీన్ స్కూల్ ప్రోగ్రామ్‌లో భాగంగా జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన చిత్తూరు జిల్లా, పూతలపట్టు నియోజకవర్గం, కాణిపాకం జెడ్పీ హైస్కూల్‌కు జాతీయ స్థాయి అవార్డు దక్కిందని మంగళవారం ఆ పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. హెచ్ఎం మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరానికి తమ పాఠశాలకు జాతీయస్థాయిలో సీఎస్ఈ (సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్) న్యూ ఢిల్లీ వారిచే నిర్వహిస్తున్న జాతీయస్థాయి క్లీన్ అండ్ గ్రీన్ స్కూల్ అవార్డు పోటీలకు రాష్ట్రం నలుమూలాల నుంచి 12 పాఠశాలలు ఎంపిక చేశారని తెలిపారు. ఇందులో తమ పాఠశాల ఒకటిగా నిలిచిందని చెప్పారు. ఈ అవార్డును ఫిబ్రవరి 4న న్యూఢిల్లీలో అందుకోనున్నట్లు వివరించారు. ఈ అవార్డు రావడానికి కృషి చేసిన పాఠశాల ఎన్‌జీసీ కో ఆర్డినేటర్, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు సురేంద్రబాబును, సైన్స్ ఉపాధ్యాయులను, వీరికి తోడ్పాటును అందించిన ఉపాధ్యాయులు సోమశేఖర్‌నాయుడు, బాలయ్య, బాలసుబ్రమణ్యం, మాధవరెడ్డి, నరేష్‌బాబులను అభినందించారు. వరుసుగా మూడోవ సారి తమ పాఠశాల ఎంపిక కావడం పాఠశాల చరిత్రలో ఇది మొదటి సారి అని పేర్కొన్నారు.

పోలీసు ఉద్యోగ పరీక్షలో దొడ్డిదారి యత్నం!



కర్నూలు: పోలీసు ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో కొంతకాలంగా సాధన చేసిన ఓ అభ్యర్థి ఛాతీ, ఎత్తు కొలతల్లో ఫెయిల్ కావడంతో దొడ్డిదారి యత్నానికి పాల్పడి అడ్డంగా దొరికిపోయాడు. పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కర్నూలు ఏపీఎస్పీ బెటాలియన్‌లో దేహదారుడ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం కొసిగి మండలం దొడ్డి బెళగల్ గ్రామానికి చెందిన పి.నరసింహుడు కుమారుడు పబిత తిరుమల బయోమెట్రిక్‌కు హాజరయ్యాడు. అయితే అతను ఎత్తు, ఛాతి కొలతల్లో ఫెయిల్ కావడంతో వె నక్కి పంపారు. అయితే క్వాలిఫై అయినట్లుగా హాల్ టికెట్‌ను కలర్ జిరాక్స్ తీసుకొని.. క్వాలిఫై అయినట్లు టిక్ మార్క్ వేసుకొని 1600 మీటర్ల పరుగులో పాల్గొనేందుకు వరుసక్రమంలో నిలబడి మోసగించేందుకు ప్రయత్నించగా...స్టార్టింగ్ పాయింట్ బందోబస్తు డ్యూటీలో రిజర్వు ఇన్స్‌పెక్టర్ నాగభూషణం గుర్తించి అభ్యర్థి మోసాన్ని వెలుగులోకి తెచ్చారు. ఇదే విషయాన్ని ఎస్పీ బింధుమాదవ్ దృష్టికి తీసుకెళ్లగా.. 4వ పట్టణ పోలీసులకు అప్పగించాలని ఆదేశించారు.

ప్రభుత్వంలో బీజేపీకి తగిన ప్రాధాన్యత లేదు

బీజేపీ సీనియర్ నేత అంబికా కృష్ణ



మాట్లాడుతున్న అంబికా కృష్ణ

ఏలూరు (టూటౌన్): కూటమి ప్రభుత్వం పనితీరు పట్ల బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి ఆహ్వానాలు, సమాచారాలు అందించకపోవడం బాధాకరమని అంబికా కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఏలూరు అశోక్ నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా అధ్యక్ష ఎన్నిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ సమష్టి కృషి వల్లే అధికారం చేతికొచ్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న బీజేపీ నాయకులకు తగినంత ప్రాధాన్యత ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. కనీసం తమ నాయకుడు అమిత్ షా విజయవాడ పర్యటనకు విచ్చేసిన సమయంలోనూ బీజేపీ కార్యకర్తలను, నాయకులను విస్మరించడం ఎంతో కలచివేసిందని చెప్పారు. కనీస మిత్ర ధర్మాన్ని పాటించకపోవడం విడ్డూరమన్నారు. దీనిపై పార్టీ అధినాయకత్వం దృష్టిసారించాలని కోరారు. తాను ప్రభుత్వాన్ని విమర్శించడం లేదంటూనే మిత్ర ధర్మాన్ని కాపాడే విధంగా బీజేపీ అధిష్టానం చర్యలు చేపట్టాలంటూ కోరారు.

గంజాయి రహిత రాష్ట్రంగా మార్చుదాం

డీజీపీ ద్వారక తిరుమలరావు



పుట్టపర్తి టౌన్: గంజాయి రహిత రాష్ట్రంగా మార్చుదామని రాష్ట్ర డీజీపీ ద్వారక తిరుమలరావు అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం వంద ఎకరాల్లో మాత్రమే గంజాయి సాగులో ఉందన్నారు. అది కూడా తొలగిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే గంజాయి సాగు, అక్రమ రవాణాపై దృష్టి సారించి.. ఐదుగురు మంత్రులతో ప్రత్యేక కమిటీ వేసి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేసిందన్నారు. మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా పర్యటనలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన ఆయన స్థానిక ప్రశాంతినిలయంలో సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో డీఐజీ షిమోషి, ఎస్పీ రత్నతో కలసి పోలీసులతో సమీక్షించారు. తర్వాత మీడియాతో మాట్లాడుతూ మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని రాష్ట్ర వ్యాప్తంగా నేరాల నియంత్రణకు గట్టిగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వాటిపై ఆడియోలు, వీడియోలు, విద్యాసంస్థల్లో సదస్సుల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాకూ ఒక సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించామన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

తిరుపతి లీగల్ : హత్య కేసులో తిరుపతి లక్ష్మీపురానికి చెందిన కనిక శంకర్ అనే నిందితుడికి జీవిత ఖైదు, రూ.5వేల జరిమానా విధిస్తూ తిరుపతి ఐదో అదనపు జిల్లా జడ్జి రామ్‌గోపాల్ మంగళవారం తీర్పు చెప్పారు. తిరుపతి లక్ష్మీపురానికి చెందిన ఏ. రాజా ఓ టింబర్ డిపోలో పని చేసేవాడు. అతడికి ఇద్దరు పిల్లలు. వారిలో కుమారుడు భరత్ ఇంటర్మీడియట్ చదివాడు. 2020 నవంబర్ 29వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో నిందితుడు శంకర్ మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై రాజా ఇంటి వద్దకు వచ్చాడు. భరత్‌ను బైక్‌పై ఎక్కించుకుని తీసుకెళ్లారు. కాసేపటి తర్వాత భరత్ ఇంటికి వచ్చి పడుకున్నాడు. ఇంతలో భోజనానికి రావాలంటూ రాజా బెడ్ రూమ్ లోకి వెళ్లి భరత్‌ను పిలిచాడు. ఆ సమయంలో భరత్ పెదవి వద్ద రక్త గాయాన్ని రాజా గుర్తించాడు. అనంతరం రాజా తన భార్యతో కలిసి భరత్‌ను తీసుకుని శంకర్ ఇంటికి వెళ్లి ప్రశ్నించారు. దీంతో ఆగ్రహించిన శంకర్ కత్తితో భరత్‌పై దాడి చేసి పరారయ్యాడు. స్థానికుల సాయంతో కుమారుడు భరత్‌ను రాజా ఆటోలో రుయాకి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. రాజా ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీస్‌స్టేషన్ అప్పటి సీఐ శివప్రసాద్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ మేరకే నేరం రుజువు కావడంతో నిందితుడు శంకర్‌కు జీవిత ఖైదు, జరిమానా విధించారు.

ఆధ్యాత్మిక సమాచారం

వైభవంగా అమ్మవారి శోభాయాత్ర


భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీ ఆదిలక్ష్మి రాజ్యలక్ష్మి పోలేరమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారి ప్రభ మహోత్సవ శోభా యాత్రను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం బొక్కవారిపాలెం నుంచి ఈ యాత్ర ప్రారంభించారు. 23న మహా జాతర, 26న అఖండ అన్నసమారాధన నిర్వహించనున్నారు.

ఘనంగా.. దానేశ్వరి అమ్మ సంబరం



ఆకివీడు : పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులోని గుమ్ములూరు రోడ్డులో దానేశ్వరి అమ్మవారి వార్షికోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం అమ్మవారి ఆలయం నుంచి సంబరం బయలుదేరి పురవీధుల గుండా సాగింది. సంబరంలో ప్రదర్శించిన శక్తి వేషాలు, కర్నాటక డప్పు ప్రదర్శనలు, గరగ నృత్యాలు అలరించాయి. ఆలయ కమిటీ చైర్మన్ బండారు జలదుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిలో పోటెత్తిన భక్తులు



జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రభాతసేవ, నిత్యార్చన పూజలు చేశారు. అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తమలపాకులతో విశేష పూజలు జరిగాయి. దేవస్థానానికి రూ.1,30,019 ఆదాయం సమకూరినట్టు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. సుమారు 1200 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని చెప్పారు.

విద్యా సమాచారం

ద్రవిడ వర్సిటీలో నేటి నుంచి న్యాక్ పీర్ టీమ్ పర్యటన

కుప్పం: కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయంలో న్యాక్ పీర్ టీమ్ బుధవారం నుంచి మూడు రోజుల పాటు పర్యటించనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.కిరణ్‌కుమార్ తెలిపారు. ఐదేళ్లకొకసారి న్యాక్ గుర్తింపులో భాగంగా న్యాక్ టీమ్ వర్సిటీలో పర్యటించి, నూతన గ్రేడింగ్‌ను ప్రకటించనుందన్నారు. వర్సిటీకి 'ఏ' గ్రేడు వస్తే అభివృద్ధి చెందుతుందని ఉద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

మెరుగైన వసతుల కల్పనకు ఆదేశాలు జారీ



విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని హాస్టల్ విద్యార్థులకు వసతులు మెరుగుపరచాలని వైస్ ఛాన్స్‌లర్ జి. శశిభూషణరావు సూచించారు. వర్సిటీ కాలేజీ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై విద్యార్థులు నిరసన గళం ఎక్కుపెట్టి, వీసీ భవనం ముందు ఆందోళన చేసిన నేపథ్యంలో అధికారుల్లో చలనం వచ్చింది. వర్సిటీ కాలేజీల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులతో మంగళవారం ఎకడమిక్ సెనేట్ హాల్లో వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ సమావేశమై పలు అంశాలపై సమీక్షించారు.

ఫార్మసిస్టుల ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు కారార్యలయం పరిధిలో కాంట్రాక్టు పద్ధతిలో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పది గ్రేడ్-2 ఫార్మసిస్టు పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆర్డీ డాక్టర్ జి.సుచిత్ర తెలిపారు. సదరు నోఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఫైనల్ మెరిట్ లిస్టును మంగళవారం విడుదల చేశామన్నారు. ఫైనల్ మెరిట్ లిస్టును, సెలక్షన్ లిస్టును సీఎఫ్‌డబ్ల్యూ.ఏపీ.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఉద్యోగాలకు ఎంపికైనవారు ఈనెల 27న గుంటూరు ఆర్డీ కార్యాలయంలో జరిగే కౌన్సిలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.



బోరు నీరా... క్రీక్ నీరా? రొయ్యలకు ఏది మేలు?

ఉత్తరాషాఢ కార్తె :
జనవరి 24 వరకు
శ్రవణ కార్తె :
జనవరి 25 నుంచి

హనీబీ నెట్‌వర్క్ వ్యవస్థాపకుడు, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ అనిల్. కె. గుప్తాతో 'సాక్షి సాగుబడి' ముచ్చటించింది.. కొన్ని ముఖ్యాంశాలు...

గ్రామీణుల విజ్ఞానం ఎంతో గొప్పది!

ప్రొ. అనిల్. కె. గుప్తా

● మన దేశంలో గ్రామీణుల సంప్రదాయ విజ్ఞానానికి సముచిత గుర్తింపునిచ్చి, ప్రోత్సహించే లక్ష్యంతో గత రెండు దశాబ్దాలుగా విశేష కృషి చేస్తున్న మీకు 'సాక్షి' తరఫున అభినందనలు. హనీబీ నెట్‌వర్క్ గురించి చెప్పండి..?

పెద్దగా చదువు లేని గ్రామీణుల విజ్ఞానం ఎంతో గొప్పది. అయితే, పేదరికం కొద్దీ వారి అద్భుత జ్ఞానం మరుగునపడిపోయింది. వీరి సృజనాత్మకతను నమోదు చేసి, గుర్తింపునిచ్చి,



మెరుగుపరచి, ప్రాచుర్యంలోకి తేవడానికే హనీబీ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేశాం. ఇది స్వచ్ఛంద కార్యకర్తల ద్వారా నడిచే వ్యవస్థ. మన దేశంతోపాటు 75 దేశాల్లో విస్తరించింది. పర్యావరణహితమైన గ్రామీణుల ఆవిష్కరణలను వెలుగులోకి తేవాలన్న సంకల్పం ఉన్న విద్యార్థినీ విద్యార్థులు, యువతీ యువకులు, గ్రామీణ సృజనశీలురు, వృత్తినిపుణులు, గృహిణులు.. ఎవరైనా హనీబీ నెట్‌వర్క్‌లో చేరవచ్చు. తెలుగు రాష్ట్రాల్లో 'పల్లెసృజన' ఈ నెట్‌వర్క్‌లో భాగంగా ఉంది. గ్రామీణ ఆవిష్కరణలపై పనిచేసే విద్యార్థులకు, పరిశోధకులకు అవార్డులు, స్కాలర్‌షిప్‌లను నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖకు అనుబంధంగా స్వయం ప్రతిపత్తి గల సంస్థ) ద్వారా అందిస్తున్నాం.



● హనీబీ నెట్‌వర్క్ ద్వారా దేశవ్యాప్తంగా శోధాయాత్రలు నిర్వహిస్తూ గ్రామీణుల సృజనాత్మకతను వెలికి తీస్తున్నారు కదా.. వ్యవసాయానికి సంబంధించి మీకు బాగా నచ్చిన ఆవిష్కరణ ఏది?

హెచ్.ఎం.టి. సన్నరకం వరి వంగడం. 3వ తరగతిలోనే చదువు మానేసిన అతి చిన్న పేద రైతు దాదాజీ రామ్‌జీ కోబ్రగడే (నాందేడ్ జిల్లా, మహారాష్ట్ర) ఇరవయ్యేళ్ల క్రితం ఈ అద్భుత వంగడాన్ని ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా 8 రాష్ట్రాల్లో ఇప్పటికీ ఇది లక్షలాది ఎకరాల్లో సాగులో ఉంది. ఎన్.ఐ.ఎఫ్. 2005లో జాతీయ అవార్డుతో ఖోబ్రగడేని సత్కరించింది.

● గ్రామీణ రైతు శాస్త్రవేత్తలు ఆవిష్కరించిన వ్యవసాయ యంత్రపరికరాలు చాలా ఉన్నాయి. కానీ, ఇవి రైతులకు విస్తృతంగా ఎందుకని అందుబాటులోకి రావడంలేదు..?

కొన్ని ఇన్నోవేషన్లను మెరుగుపరచి పారిశ్రామిక వేత్తల ద్వారా రైతులకు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం. మీడియా, పత్రికల ద్వారా ప్రాచుర్యం లభించడంతో రైతు శాస్త్రవేత్తలు నేరుగా రైతులకు తమ ఆవిష్కరణలను విక్రయిస్తూ ఉన్నారు. ఇన్నోవేటర్లు తమ ఆవిష్కరణలనే కాకుండా తోటి రైతు శాస్త్రవేత్తల ఆవిష్కరణలకు కూడా పంపిణీదారులుగా మారి ప్రజలకు అందుబాటులోకి తేవాలి. ప్రభుత్వ రంగ ఆవిష్కర్తలతో సమానంగా గ్రామీణ ఆవిష్కర్తలను కూడా ప్రోత్సహించేలా ప్రభుత్వానికి నచ్చజెపుతున్నాం.

● మహిళా ఆవిష్కర్తల సంఖ్య తక్కువగా ఉంది..?

అవును. ప్రస్తుతం మహిళా ఆవిష్కర్తల సంఖ్య 7% మాత్రమే. గ్రామీణ మహిళల్లో సంప్రదాయ జ్ఞానం, ఆవిష్కర్తణాభిలాషకు కొదవ లేదు. హనీబీ, పల్లెసృజన నెట్‌వర్క్‌లో మహిళలను, ముఖ్యంగా గృహిణులను ఎక్కువ మందిని వలంటీర్లుగా చేర్చాలి.

● మీరు దృష్టి సారిస్తున్న మరేదైనా ముఖ్య కోణం ఉందా?

పిల్లల ఆలోచనలపై దృష్టి సారించాలి. ప్రైవేటు బడుల్లో చదివే వారు సేవ చేయించుకునే దృష్టితో పెరుగుతున్నారు. ఇది దేశానికి పెనుముప్పు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులే సేవ చేసే దృష్టితో ఉన్నారు. వీరికి చేతనైనన్ని వనరులు సమకూర్చడం ద్వారా దేశానికి మేలు జరుగుతుంది.

నీటి నాణ్యత అనేది ఆక్వా సాగులో చాలా కీలకాంశం. రొయ్యల ఆరోగ్యం, పెరుగుదల, వేసిన పిల్లల్లో బతికే శాతాన్ని ప్రభావితం చేసే కీలకమైన అంశం ఇది. నీటి నాణ్యత సాధారణంగా భౌతిక, రసాయన, జీవసంబంధమైన అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఉదజని సూచిక (పిహెచ్), ఉష్ణోగ్రత, నీట కరిగిన ఆక్సిజన్ వంటి అంశాలలో కొద్దిపాటి హెచ్చుతగ్గులు వచ్చినా జల జీవుల్లో ఒత్తిడిని ప్రేరేపిస్తాయి. ఆక్వా సాగులో ఎదురయ్యే సమస్యలను తగ్గించడానికి, లాభదాయకతకు, పర్యావరణ స్థిరత్వం కోసం నీటి వనరులను సరైన రీతిలో ఉపయోగించాలి. ఇందుకోసం ఆక్వా రైతులు నీటి నాణ్యత నిర్వహణకు సంబంధించిన అంశాలను అర్థం చేసుకోవాలి. నీటి నాణ్యత లోపిస్తే వ్యాధికారక క్రిములకు అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది. రొయ్యల రోగ నిరోధక శక్తి బలహీనపడి, వ్యాధులకు గురిచేస్తుంది. అందువల్ల చెరువు నీటి నిర్వహణ చాలా ముఖ్యం.

నీటి యాజమాన్యంలో మెళకువలు పాటిస్తే అనేక సమస్యలను పరిష్కరించడం సులభం అవుతుంది:

● నీటి గుణాలను తరచుగా తనిఖీలు చేయడం వలన కొన్ని సమస్యలను ముందుగానే గుర్తించవచ్చు ● తగినంత ప్రాణవాయువు స్థాయిలను నిర్వహించడం వలన ఒత్తిడి తగ్గుతుంది. హానికరమైన సూక్ష్మజీవుల పెరుగుదలను పరిమితం చేస్తుంది ● వ్యర్థాలను తొలగించి స్థిరమైన అమ్మోనియా, నైట్రేట్ స్థాయిలను నిర్వహించవచ్చు ● కాలానుగుణంగా కొత్త నీటిని చెరువులో నింపుకోవటం ద్వారా చెరువు నీటిలో హానికరమైన పదార్థాలను తగ్గించవచ్చు ● సేంద్రియ పదార్థం ఏర్పడకుండా నిరోధిస్తే వ్యాధికారక క్రిముల వ్యాప్తిని తగ్గిస్తుంది ● సాధారణంగా రైతులు క్రీక్/ కాలువ/ సరస్సు/ రిజర్వాయర్/ నది/ సముద్ర జలాలను తమ చెరువుల్లోకి తోడుకుంటున్నారు. అప్పుడప్పుడు భూగర్భ జలాలను చెరువుల్లో వినియోగిస్తున్నారు. బోరు నీరు (భూగర్భ జలం), క్రీక్ వాటర్ (ఉపరితల నీరు).. ఈ రెండూ రొయ్యల పెంపకానికి ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి.

బోరు నీరు: భూగర్భ జలాలు క్రింది విధంగా కొన్ని ప్రత్యేక లక్షణాలను కలిగి ఉన్నాయి:

● భూగర్భ జలాలు స్థిరమైన ఉష్ణోగ్రతను కలిగి ఉంటాయి. ఉపరితల నీటి కంటే ఉష్ణోగ్రత మార్పుల ద్వారా తక్కువగా ప్రభావితమవుతాయి ● భూగర్భ జలం ఇంచుమించుగా స్థిరమైన రసాయన కూర్పును కలిగి ఉంటుంది ● భూగర్భ జలాలు సాధారణంగా 7.0 పిహెచ్ విలువతో తటస్థంగా ఉంటాయి (కొన్నిసార్లు కొద్దిగా ఆమ్ల గుణం లేదా కొద్దిగా క్షార గుణం కలిగి ఉంటుంది) ● భూగర్భ జలాల్లో ఆక్సిజన్ దాదాపు ఉండదు లేదా చాలా తక్కువగా ఉంటుంది ● భూగర్భ జలాలు తరచుగా బ్యాక్టీరియా వంటి సూక్ష్మజీవులు లేకుండా చాలా స్వచ్ఛంగా ఉంటాయి ● భూగర్భ జలాలు, నదులు, సరస్సులు, ప్రవాహాల వంటి ఉపరితల నీటి స్థాయిని తిరిగి నింపడానికి, నిర్వహించడానికి సహాయపడతాయి ● బోరు నీటిని సాధారణంగా భూగర్భం నుంచి తీసుకుంటూ ఉంటాం. భూగర్భ జలాలకుండే ప్రత్యేక ప్రయోజనాల కారణంగా రొయ్యల పెంపకానికి బాగాఉపయోగపడుతుంది.

రొయ్యల సాగులో బోరు నీటి ప్రయోజనాలు:

● బోరు నీటి ఉష్ణోగ్రత, నాణ్యతపరంగా ఉపరితల నీటితో పోలిస్తే మరింత స్థిరంగా ఉంటుంది. రొయ్యలను ప్రతికూలంగా ప్రభావితం చేసే ఎరువులు, పురుగుమందులు చుట్టుపక్కల వ్యవసాయ కార్యకలాపాల నుండి ప్రవహించే బాహ్య కాలుష్యాల ప్రభావం లేకుండా ఉంటుంది ● బోరు నీరు భూగర్భ వనరుల నుంచి వస్తుంది కాబట్టి, రోగ కారకాలు పెద్దగా ఉండవు.

ఉపరితల నీటిలో కాలానుగుణ వైవిధ్యాలు:

కరువు ప్రాంతాల్లో బోరు నీటిపై రైతులు ఆధారపడతారు. ఉపరితల నీటి లభ్యత క్షీణించినప్పుడు, వేసవి సమయంలోనూ బోరు నీరే చాలా ముఖ్యమైనది.

● కొన్ని ప్రాంతాల్లో బోరు నీటిని ఫిల్టర్ చేసి, లవణీయత, పిహెచ్ వంటి కారకాలను సవరించవచ్చు ● బోరు నీరు సాధారణంగా ఉపరితల నీటికంటే తక్కువ సేంద్రియ పదార్థాలను కలిగి ఉంటుంది. అంటే తక్కువ సూక్ష్మజీవులు, ఆల్గే ఉంటాయి. ఇది వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. రొయ్యలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడానికి సహాయపడుతుంది.

రొయ్యల సాగులో బోర్ నీరు ఉపయోగించేటప్పుడు పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలు:

● ఖనిజాల ప్రభావం: బోరు నీటిలో ఇనుము, కాల్షియం లేదా సోడియం వంటి కొన్ని ఖనిజాలు అధిక సాంద్రతలో ఉండవచ్చు, ఇవి రొయ్యల పెరుగుదల లేదా చెరువు నీటిలోని రసాయన అంశాలను ప్రభావితం చేస్తాయి. ప్రతికూల ప్రభావాలను నివారించడానికి, ఈ ఖనిజాల స్థాయిలను పర్యవేక్షించడం, సర్దుబాటు చేయడం అవసరం ● లవణీయత నిర్వహణ: ప్రదేశాన్ని బట్టి, బోరు నీరు లవణీయత స్థాయి హెచ్చు తగ్గులు ఉండవచ్చు, దీన్ని వనామీ వంటి జాతులకు కావలసిన రీతిలో సర్దుబాటు చేసుకోవాలి ● అమ్మోనియా సమస్య: సహజంగా లభించే సేంద్రియ పదార్థం విచ్ఛిన్నం కారణంగా బోరు నీటిలో సాధారణంగా ఎక్కువ అమ్మోనియా ఉంటుంది ● సహజ పరిస్థితుల కారణంగా లేదా ఆ ప్రాంతంలోని వ్యవసాయం/ పరిశ్రమల ఫలితంగా నీటి వనరులలో అమ్మోనియా ఎక్కువగా ఉంటుంది ● బోరు నీటిని అధికంగా తోడేస్తూ ఉంటే భూగర్భ జలాలు క్షీణిస్తాయి. ఇది దీర్ఘకాలిక సమస్యలకు దారి తీస్తుంది. సుస్థిరమైన పద్ధతులు లేకుండా పెద్దఎత్తున రొయ్యల పెంపకం కోసం బోరు నీటిపై అతిగా ఆధారపడటం వలన భూగర్భ జలాల లభ్యత తగ్గడం వంటి పర్యావరణ సమస్యలకు దారితీయవచ్చు. మార్గదర్శకాల ప్రకారం, సాగు నీటి లవణీయతను తగ్గించడానికి భూగర్భ జలాలను ఉపయోగించడం మానేయాలి. చెరువులోని రొయ్యలు అధిక సెలినిటి మార్పులను తట్టుకొని పెరగ గలిగినప్పటికీ, సాగు చేసే రొయ్యల చెరువులలో ఒత్తిడిని నివారించడానికి అధిక లవణీయత మార్పులను నివారించడం మంచిది. లేకపోతే వ్యాధుల బారినపడే అవకాశం ఉంది.

క్రీక్ నీరు (ఉపరితల నీరు)

సముద్రం, నదులు, ప్రవాహాలు, సరస్సులు లేదా కాలువల నుంచి సేకరించిన క్రీక్ నీరు కూడా రొయ్యల పెంపకానికి కీలకమైన నీటి వనరే. అయితే, బోరు నీటితో పోలిస్తే దీనికి కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి.

రొయ్యల సాగులో క్రీక్ నీటి ప్రయోజనాలు:

● క్రీక్ నీరు సాధారణంగా సేంద్రియ పదార్థం, సహజ పోషకాలతో సమృద్ధిగా ఉంటుంది. రొయ్యల పెరుగుదలకు మద్దతు ఇస్తుంది. చెరువులో రొయ్యల పెరుగుదలకు ప్రయోజనం చేకూర్చే సమతుల్య ఆహార గొలుసును ప్రోత్సహిస్తుంది ● మంచినీటి కొరత ఉన్న ప్రాంతాల్లో, క్రీక్ నీరు చెరువులను నింపడానికి, నీటి స్థాయిని నిర్వహించడానికి ఉపకరిస్తుంది ● సరిగ్గా నిర్వహించబడిన క్రీక్ నీరు చెరువుల్లో వ్యర్థాలను తొలగించడం, హానికరమైన పదార్థాలను తగ్గించడం ద్వారా బయోసెక్యూరిటీని మెరుగుపరుస్తుంది. సరైన వాతావరణాన్ని నెలకొల్పుతుంది ● క్రీక్ నీరు సాధారణంగా సహజ ప్రవాహాన్ని కలిగి ఉంటుంది, ఇది నీటిలోని ఆక్సిజన్ స్థాయి పెరగడానికి సహాయపడుతుంది, ఇది రొయ్యల ఆరోగ్యానికి కీలకం. నీట కరిగి వున్న ఆక్సిజన్ వాటి మనుగడకు, పెరుగుదలకు చాలా ముఖ్యమైనది

● క్రీక్ నీటిని ఉపయోగించేటప్పుడు పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలు: ● నీటినాణ్యత: వర్షపాతం, వ్యవసాయ వ్యర్థ పదార్థాలు, ఇతర కాలుష్యం వంటి కారణాల వల్ల క్రీక్ నీటి నాణ్యత మారవచ్చు. హానికరమైన పదార్థాలు లేదా వ్యాధి కారకాలను ప్రవేశపెట్టవచ్చు. క్రీక్ నీటి నాణ్యతలో హెచ్చు తగ్గులు రొయ్యలను ఒత్తిడికి గురిచేస్తాయి. వాటి రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తాయి. వ్యాధులు ప్రబలి, మరణాలకు దారితీస్తాయి. రొయ్యల కోసం సరైన నీటి పరిస్థితులను (ఉదా., లవణీయత, పిహెచ్, కరిగిన ఆక్సిజన్) నిర్వహించడంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటారు. నీటి శుద్ధి, వడపోత వ్యవస్థల్లో అదనపు పెట్టుబడులు అవసరం. రొయ్యల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పిహెచ్, అమ్మోనియా, టర్బిడిటీ, కరిగిన ఆక్సిజన్ వంటి అంశాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించడం చాలా అవసరం. ● కాలుష్య ప్రమాదం: ఎరువులు, రసాయనాలు, వ్యర్థాలు, వ్యాధికారక క్రిములు వంటి వాటి వలన ఉపరితల నీరు కలుషితమయ్యే అవకాశం ఉంది. దీని నివారణకు సమర్థవంతమైన నీటిశుద్ధి, వడపోత వ్యవస్థలను అమలు చేయడం కీలకం. క్రీక్ నీటి లభ్యత, నాణ్యత సీజన్లను బట్టి మారుతూ ఉంటాయి. కరువు సమయంలో, నీటిప్రవాహం తగ్గి, రొయ్యల సాగులో నీటి కొరతకు దారితీయవచ్చు. అయితే, వర్షాకాలం నీటి ప్రవాహాన్ని పెంచుతుంది. రొయ్యల ఆరోగ్యానికి హానికలిగించే కాలుష్యం, వ్యాధికారక క్రిములు వృద్ధి చెందుతాయి. కలుషితమైన నీరు తెల్లమచ్చల వైరస్, విబ్రియో ఇన్ఫెక్షన్ల వంటి వ్యాధులకు కారణమవుతుంది. ఇది అధిక మరణాలు, ఆర్థిక నష్టాలకు దారి తీస్తుంది.

అధిక పోషకాలు పేరుకుపోయి క్రీక్ కలుషితమవుతుంది. హానికరమైన నాచు పెరిగిపోతుంది. ఇవి నీటి నాణ్యతను క్షీణింపజేసి వ్యాధులు కలుగచేస్తాయి. చివరికి రొయ్యల మరణాలకు దారితీస్తాయి ● గట్లు కోత, సేంద్రియ పదార్థాలు పేరుకుపోవడం: అధిక అవక్షేపణ కలిగిన సేంద్రియ పదార్థాలు క్రీక్ నీటిని బురదగా మారుస్తాయి. దీనివల్ల చెరువు నీటిలో కాంతి వ్యాప్తి తగ్గిపోతుంది. వృక్ష ప్లవకాలు, ఇతర నాచు పెరుగుదల తగ్గి పోతుంది. తద్వారా రొయ్యల పోషణకు ఆటంకం కలుగుతుంది.

బోరు, క్రీక్ నీరు.. రొయ్యల సాగుకు ఎలా దోహదపడతాయి?

● నీటి నాణ్యత నియంత్రణ: రొయ్యల సాగు అవసరాలను తీర్చడానికి బోరు నీరు, క్రీక్ నీరు రెండూ అవసరమే. బోరు నీటికి సాధారణంగా వ్యాధి కారక క్రిములకు సంబంధించిన చికిత్సలు తక్కువ అవసరమవుతాయి. అయితే, మినరల్ సర్దుబాట్లు ఎక్కువ అవసరమవుతాయి. అయితే క్రీక్ నీటికి వడపోత, వ్యాధికారక నిర్వహణ అవసరమవుతుంది. ఎందుకంటే, కాలుష్యం ఎక్కువగా ఉంటుంది. బోరు నీరు ఎల్లప్పుడూ రొయ్యల పెంపకానికి కావలసిన లవణీయత స్థాయిని కలిగి ఉండకపోవచ్చు. అది చాలా చప్పగా (0 పి.పి.టి) లేదా ఎక్కువ ఉప్పగా ఉంటే (30-35 పి.పి.టి కన్నా ఎక్కువ) వున్నప్పుడు తగిన సర్దుబాట్లు అవసరం. ఇక క్రీక్ నీటి సెలినిటి కాలానుగుణ మార్పులు, అలల ప్రభావం మీద ఆధారపడి ఉంటుంది. సాధారణంగా, రొయ్యలకు సరైన పెరుగుదలకు 10-25 పి.పి.టి వరకు సెలినిటి అవసరం ● చెరువు సుస్థిరత: బోరు నీటికి క్రీక్ నీటిని కలపడం వలన నీటి సరఫరాను స్థిరంగా అందించటం సాధ్యమవుతుంది. పర్యావరణ మార్పుల వలన ఏర్పడే హెచ్చుతగ్గుల సమయంలో బోరు నీరు క్రీక్ నీటికి కలిపి వాడుకోవటం ఉపయోగకరంగా ఉంటుంది. - వ్యాధి-ఒత్తిడి నిర్వహణ: బోరు నీరు, వ్యాధి ప్రమాదాలను తగ్గించడంలో సహాయ పడుతుంది. అయితే క్రీక్ నీరు, సరైన నిర్వహణతో, రొయ్యల ఆరోగ్యానికి తోడ్పడే సుసంపన్నమైన వాతావరణాన్ని సృష్టించవచ్చు.

ముగింపు: బోరు నీరు, క్రీక్ నీరు.. ఈ రెండూ రొయ్యల పెంపకంలో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రతి ఒక్కటీ ప్రత్యేక ప్రయోజనాలు, సవాళ్లతో కూడి ఉంటాయి. రొయ్యల బ్రతుకుదల, పెరుగుదలకు నీటి నాణ్యత, లవణీయత, పోషకాల సమర్థవంతమైన నిర్వహణ అవసరం. బోరు నీరు, క్రీక్ నీరు.. ఈ రెండు నీటి వనరులను తగిన విధంగా శుద్ధిచేసుకుని ఉపయోగించడం వలన వ్యాధులు తగ్గి, సుస్థిరమైన సాగుకు సహాయపడుతుంది. విజయవంతమైన రొయ్యల పెంపకానికి ఈ రెండు నీటి వనరుల భౌతిక రసాయన లక్షణాలను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. రైతులు స్వల్పకాలిక లాభాల కోసం బోరు నీటిని వాడుకుంటున్నారు. కానీ ఈ విచక్షణా రహిత వినియోగం దీర్ఘకాలిక తీవ్ర పరిణామాలకు దారి తీస్తుంది. ముఖ్యంగా ఆక్వా సాగులో నిలకడలేని పద్ధతుల కారణంగా, భూగర్భ జలాల నిల్వలు వేగంగా క్షీణించే ప్రమాదాన్ని రాబోయే తరం ఎదుర్కొంటుంది. బోరు నీటిపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాల్సిన సమయం వచ్చింది. దీనికి బదులుగా, అన్ని ప్రయోజనాల కోసం అధునాతన పద్ధతుల్లో క్రీక్ నీటిని సమర్థవంతంగా శుద్ధి చేయడంపై దృష్టి పెట్టాలి. భవిష్యత్తు తరాల కోసం మన నీటివనరులను కాపాడుకోవడం చాలా ముఖ్యం.

కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ మార్గదర్శకాలు:

భూగర్భ జలాల లవణీకరణ సమస్యలను నివారించడానికి, రొయ్యల సాగుకు భూగర్భ జలాలను తోడుకోవడం నిషిద్ధం. చెరువుల సెలినిటిలో అధిక మార్పులకు అనుగుణంగా రొయ్యలు పెరగగలిగినప్పటికీ, వాటిపై ఒత్తిడిని నివారించడానికి సెలినిటి మార్పులు ఎక్కువ లేకుండా చూసుకోవాలి. లేదంటే రొయ్యలు వ్యాధుల బారినపడే అవకాశం ఉంది. అందువలన ఎక్కువ బోరు నీటిని వినియోగించ కూడదు. సాగు నీటి లవణీయతను తగ్గించడానికి, సాగు సుస్థిరత కోసం భూగర్భ జలాలను ఉపయోగించరాదని ఆక్వా రైతులు గుర్తించాలి.



- డా. పి. రామమోహన్ రావు,
విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్, మత్స్య శాఖ,
కాకినాడ: ఫోన్: 98851 44557

పురుగులకు విరుగుడు
మిర్చి, వెల్లుల్లి, పొగాకు ద్రావణం

సేంద్రియ ఇంటిపంటల సాగులో కొన్నిసార్లు పురుగుల బెడద తీవ్రంగా ఉంటుంది. ముఖ్యంగా శీతాకాలంలో చీడపీడల సమస్యలు ఎక్కువగా ఉండొచ్చు. దీర్ఘకాలం పాటు పురుగులు విసిగిస్తుంటే.. పచ్చిమిర్చి, వెల్లుల్లి, పొగాకు ద్రావణం తయారు చేసుకొని పిచికారీ చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.





ద్రావణం తయారీకి కావాల్సిన దినుసులు: 400 ఎం.ఎల్. నీరు; 50 గ్రాములు వెల్లుల్లి రెబ్బలు; 200 ఎం.ఎల్. గోమూత్రం; 50 గ్రాముల పొగాకు చూర; చిటికెడు ఇంగువ; వంటి సబ్బు ముక్క చిన్నది.

తయారీ పద్ధతి: 200 ఎం.ఎల్. నీటిని తీసుకొని.. పచ్చి మిరప కాయలను మెత్తగా నూరి అందులో పల్చటి గుడ్డలో వేసి నానబెట్టాలి. 200 ఎంఎల్ గోమూత్రం తీసుకొని.. వెల్లుల్లి రెబ్బలను మెత్తగా నూరి పల్చటి గుడ్డలో వేసి అందులో నానబెట్టాలి. మరో 200 ఎం.ఎల్. నీటిని తీసుకొని పొగాకు చూరను అందులో నానబెట్టాలి. ఈ మూడిటినీ రాత్రి నానబెట్టాలి. తెల్లారిన తర్వాత పిండి, మూడు రసాలను కలిపి ఒక సీసాలో పొయ్యాలి.

చిటికెడు ఇంగువ, వంటి సబ్బు ముక్కను వేసి బాగా కలిసి పోయేలా కలియదిప్పాలి.

ఇలా వాడాలి: ఒక లీటరు నీటికి, 100 ఎం.ఎల్. ద్రావణాన్ని కలిపి పురుగు సోకిన పంట మొక్కలపై చల్లాలి. మొక్కలు పూర్తిగా తడిచేలా చల్లాలంటే స్ప్రేయర్‌ను వాడటం ఉత్తమం. మంచి ఫలితాలు రావాలంటే.. వరుసగా మూడు రోజులు వాడాలి.

ఉపయోగాలు: సేంద్రియ ఇంటిపంటల సాగుదారులను ఇబ్బంది పెట్టే మొండి పురుగులను సైతం పచ్చిమిర్చి, వెల్లుల్లి, పొగాకు ద్రావణాన్ని పిచికారీ చేసి అదుపు చేయవచ్చు.

బిజినెస్ రీల్

రెండంకెల స్థాయిలో వ్యాపార వృద్ధి..

- కీలకంగా తెలుగు రాష్ట్రాలు
- విప్రో కన్జ్యూమర్ కేర్, లైటింగ్ ఎస్‌వీపీ అనుజ్ ధీర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: విప్రో కన్జ్యూమర్ కేర్ అండ్ లైటింగ్ తాజాగా హైదరాబాద్‌లో తమ మైవిప్రోవర్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. తమ లైటింగ్ వ్యాపార విభాగం ఆదాయం ఏటా రెండంకెల స్థాయిలో వృద్ధి చెందుతోందని ఈ సందర్భంగా సంస్థ ఎస్‌వీపీ అనుజ్ ధీర్ చెప్పారు. ప్రస్తుతం తమ టర్నోవరు రూ. 1,000 కోట్లుగాను, మార్కెట్ వాటా సుమారు 11 శాతంగాను ఉందని ఆయన తెలిపారు. తమ ఆదాయాల్లో తెలుగు రాష్ట్రాలు సుమారు 12–15 శాతం వాటాతో కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. గృహాలు, పరిశ్రమలతో పాటు సౌర విద్యుత్ తదితర విభాగాల్లోను సేవలు విస్తరిస్తున్నట్లు పేర్కొన్నారు. తమకు మొత్తం మూడు తయారీ ప్లాంట్లు ఉన్నట్లు చెప్పారు. 2,000 చ.అ. విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన మైవిప్రోవర్స్‌లో వివిధ లైటింగ్, సీటింగ్ ఉత్పత్తులు ఉంటాయి.

ఎయిర్‌టెల్ థాంక్స్ యాప్‌లో బజాజ్ ఫైనాన్స్ ఉత్పత్తులు

న్యూఢిల్లీ: ఆర్థిక సేవల కోసం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను రూపొందించడానికి ఎన్‌బీఎఫ్‌సీ కంపెనీ బజాజ్ ఫైనాన్స్, టెలికం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ సోమవారం వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించాయి. ఇందులో భాగంగా బజాజ్ ఫైనాన్స్ రుణ సంబంధ ఉత్పత్తులను తొలుత ఎయిర్‌టెల్ థాంక్స్ యాప్‌లో అందజేస్తారు. ఆ తరువాత ఎయిర్‌టెల్ స్టోర్ల ద్వారా ఈ సేవలను విస్తరిస్తారు. ఆర్థిక సేవలు దేశవ్యాప్తంగా విస్తృతం అయ్యేందుకు తమకున్న బలం దోహదం చేస్తుందని ఇరు సంస్థలు భావిస్తున్నాయి. '10 లక్షల మందికిపైగా వినియోగదార్లు మమ్మల్ని విశ్వసిస్తున్నారు. కస్టమర్ల అన్ని ఆర్థిక అవసరాల కోసం ఎయిర్‌టెల్ ఫైనాన్స్‌ను వన్-స్టాప్ షాప్‌గా మార్చడమే లక్ష్యం' అని భారతీ ఎయిర్‌టెల్ వైస్ చైర్మన్, ఎండీ గోపాల్ విట్టల్ ఈ సందర్భంగా తెలిపారు. డేటా ఆధారిత రుణ పూచీకత్తు, అందరికీ ఆర్థిక సేవలు చేరేందుకు భారత డిజిటల్ పర్యావరణ వ్యవస్థ గుండెకాయగా ఉందని బజాజ్ ఫైనాన్స్ ఎండీ రాజీవ్ జైన్ చెప్పారు.

బోర్డు సమావేశాలు

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, హెచ్‌యూ ఎల్, హడ్కో, జీబీసీఎల్, పిడిలైట్ ఇండస్ట్రీస్, పాలీక్యాబ్, పెర్సిస్టెంట్ సిస్టమ్స్, సిగ్నిటీ టెక్నాలజీస్, కోఫోర్జ్, టాటా కమ్యూనికేషన్స్, జెన్సార్ టెక్, గ్రావిటా ఇండియా, వర్ధమాన్ టెక్స్‌టైల్స్, నువాకో విస్టాస్, పవర్ గ్రిడ్ ఇన్విట్, లక్ష్మీ ఆర్గానిక్స్, హెరిటేజ్ ఫుడ్స్, ట్రిడెంట్ లైఫ్‌లైన్

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-1-2025

విశాఖ	505–00
చిత్తూరు	503–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	505–00
విజయవాడ	510–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	480–00
వరంగల్	482–00
రిటైల్ ధర	5.40

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
APOLLOHOSP	6,925.00	2.13
TATACONSUM	972	1.22
BPCL	280.35	1.1
SHRIRAMFIN	520.05	0.65
JSWSTEEL	924.1	0.53

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	5,724.75	-6
NTPC	324.5	-3.44
ADANIPORTS	1,110.90	-3.29
ICICIBANK	1,197.95	-2.84
ADANIENT	2,375.00	-2.78

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	6,387
ఎన్‌ఎస్‌ఈ	99,502
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	2,31,690
ఎఫ్ఐఐ	- 5,920
డీఐఐ	+ 3,500

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	76.06 (రాత్రి 11.30కు)	$ 77.76 (క్రితం ముగింపు)
బ్రెంట్	79.35 (రాత్రి 11.30కు)	$ 80.15 (క్రితం ముగింపు)

ఐటీ బ్రాండ్స్‌లో మేటి టీసీఎస్, ఇన్ఫీ

- బ్రాండ్ ఫైనాన్స్ నివేదికలో టాప్ ర్యాంకులు
- లిస్టులో హెచ్‌సీఎల్ టెక్, విప్రో, టెక్ మహీంద్రా



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా దేశీ టెక్నాలజీ సంస్థలకు పెరుగుతున్న ప్రాధాన్యానికి నిదర్శనంగా దిగ్గజాలు టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో, టెక్ మహీంద్రా ప్రపంచంలోనే అత్యంత విలువైన ఐటీ సర్వీసుల బ్రాండ్ల జాబితాలో ప్రముఖంగా చోటు దక్కించుకున్నాయి. 2025కి గాను టాప్ 25 సంస్థలతో బ్రాండ్ వేల్యుయేషన్ కన్సల్టెన్సీ సంస్థ బ్రాండ్ ఫైనాన్స్ రూపొందించిన నివేదికలో వరుసగా నాలుగో సంవత్సరంలోనూ టీసీఎస్ రెండో స్థానంలో, ఇన్ఫోసిస్ మూడో స్థానంలో నిల్చాయి. ఇందులో యాక్సెంచర్ వరుసగా ఏడో ఏడాది అగ్రస్థానంలో కొనసాగింది.

టీసీఎస్ బ్రాండ్ విలువ 11 శాతం పెరిగి 21.3 బిలియన్ డాలర్లకు చేరగా, ఇన్ఫోసిస్ బ్రాండ్ విలువ 15 శాతం పెరిగి 16.3 బిలియన్ డాలర్లకు చేరింది. అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఐటీ సేవల బ్రాండుగా హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ నిల్చింది. కంపెనీ బ్రాండు విలువ 17 శాతం పెరిగి 8.9 బిలియన్ డాలర్లుగా ఉంది. అటు విప్రో, టెక్ మహీంద్రా, హెక్సావేర్ మొదలైనవి కూడా లిస్టులో చోటు దక్కించుకున్నాయి. దేశాలపరంగా చూస్తే మొత్తం బ్రాండ్ వేల్యూలో 40 శాతం వాటాతో అమెరికా అగ్రస్థానంలో 36 శాతం వాటాతో భారత్ రెండో స్థానంలో ఉన్నాయి.

కోలుకుంటున్న మార్కెట్ ..

ద్రవ్యోల్బణం, అధిక వడ్డీ రేట్ల కారణంగా 2023 ఆఖర్లో, 2024 తొలినాళ్లలో కార్పొరేట్లు వ్యయాలను తగ్గించుకున్నాయని, అదే సమయంలో కృత్రిమ మేథ సంబంధిత సర్వీసులకు డిమాండ్ పెరిగిందని బ్రాండ్ ఫైనాన్స్ తెలిపింది. అమెరికా మార్కెట్ క్రమంగా పుంజుకుంటున్న సంకేతాలు కనిపిస్తున్న నేపథ్యంలో భారతీయ ఐటీ సంస్థలకు ప్రయోజనాలు చేకూరగలవని పేర్కొంది. 2025లో వడ్డీ రేట్లు తగ్గి, కార్పొరేట్లు ఖర్చు చేయడం పెరగడంతో పాటు కొత్త టెక్నాలజీలకు డిమాండ్ నెలకొనడం వల్ల ఐటీ సంస్థలు లబ్ధి పొందవచ్చని బ్రాండ్ ఫైనాన్స్ తెలిపింది. అత్యంత విలువైన బ్రాండ్లన్నీ కూడా మారుతున్న పరిశ్రమ ట్రెండ్స్‌కి అనుగుణంగా కొత్త ఆవిష్కరణలు, వ్యూహాత్మక ప్రాజెక్టులపై దృష్టి పెడుతున్నాయని వివరించింది.

డీలిస్టింగ్ ప్రక్రియపై ఆర్‌క్యాప్ కసరత్తు



న్యూఢిల్లీ: దివాలా పరిష్కార ప్రక్రియలో భాగంగా షేర్లను డీలిస్ట్ చేసేందుకు ఎక్స్ఛేంజీలను సంప్రదించినట్లు రిలయన్స్ క్యాపిటల్ (ఆర్‌క్యాప్) తెలిపింది. బీఎస్‌ఈ, ఎన్ఎస్‌ఈలకు ఈ మేరకు దరఖాస్తు చేసినట్లు పేర్కొంది. అలాగే తమ నాన్-కన్వర్టబుల్ డిబెంచర్లను కూడా డీలిస్ట్ చేసేందుకు బీఎస్‌ఈకి దరఖాస్తు చేసినట్లు పేర్కొంది.

జియో ఫండ్స్‌పై రూ.117 కోట్లు

తాజా పెట్టుబడి ప్రణాళికలు



న్యూఢిల్లీ: జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, యూఎస్ కంపెనీ బ్లాక్ రాక్ తమ మ్యూచువల్ ఫండ్ వ్యాపారంపై రూ.117 కోట్లను తాజాగా ఇన్వెస్ట్ చేసినట్లు ప్రకటించాయి. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్లాక్ రాక్ చెరో 50 శాతం వాటాతో 'జియో బ్లాక్‌రాక్ అస్సెట్ మేనేజర్స్ ప్రైవేటు లిమిటెడ్'ను ఏర్పాటు చేయడం తెలిసిందే. జియో బ్లాక్ రాక్ అస్సెట్ మేనేజర్స్‌కు సంబంధించి రూ.117 కోట్ల విలువ చేసే ఈక్విటీ షేర్లను (రూ.10 ముఖ విలువ) జియో ఫైనాన్షియల్, బ్లాక్‌రాక్‌కు (చెరో 5.85 కోట్ల షేర్లు) కేటాయించినట్లు జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్లడించింది. ఇరు సంస్థలు ఇప్పటికే చెరో రూ.82.5 కోట్ల చొప్పున ఆరంభ పెట్టుబడి పెట్టడం గమనార్హం. అలాగే, ఇరు సంస్థలూ కలసి తమ జాయింట్ వెంచర్ కంపెనీ జియో బ్లాక్‌రాక్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్ ప్రైవేటు లిమిటెడ్ ద్వారా 'జియో బ్లాక్‌రాక్ బ్రోకింగ్ ప్రైవేటు లిమిటెడ్'ను ఏర్పాటు చేశాయి. ఈ కంపెనీ ద్వారా స్టాక్ బ్రోకింగ్ వ్యాపారం నిర్వహించనున్నాయి.

ఐపీవోకు 6 కంపెనీలు రెడీ

- సెబీ నుంచి తాజాగా గ్రీన్‌సిగ్నల్
- జాబితాలో ఆల్ టైమ్ ప్లాస్టిక్స్, హెక్సావేర్
- విక్రన్, అజాక్స్ ఇంజినీరింగ్, స్కోడా ట్యూబ్స్
- పీఎంఈఏ సోలార్ టెక్ సొల్యూషన్స్



న్యూఢిల్లీ: కొత్త క్యాలండర్ ఏడాదిలోనూ ప్రైమరీ మార్కెట్ల దూకుడు కొనసాగనుంది. తాజాగా 6 కంపెనీల పబ్లిక్ ఇష్యూలకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ పచ్చ జెండా ఊపింది. జాబితాలో ఐటీ సర్వీసుల కంపెనీ హెక్సావేర్ టెక్నాలజీస్‌తోపాటు.. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీలు విక్రన్ ఇంజినీరింగ్, అజాక్స్ ఇంజినీరింగ్, పీఎంఈఏ సోలార్ టెక్ సొల్యూషన్స్, ఆల్ టైమ్ ప్లాస్టిక్స్, స్కోడా ట్యూబ్స్ చేరాయి. ఈ 6 కంపెనీలు స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్ కోసం 2024 సెప్టెంబర్– డిసెంబర్ మధ్య ప్రాస్పెక్టస్‌లను దాఖలు చేశాయి. తద్వారా ఉమ్మడిగా రూ. 10,000 కోట్లు సమీకరించనున్నాయి. వివరాలు చూద్దాం..

కార్లయిల్ మద్దతుతో



డిజిటల్, ఐటీ సొల్యూషన్ల కంపెనీ హెక్సావేర్ టెక్నాలజీస్ ఐపీవోలో భాగంగా రూ. 9,950 కోట్ల విలువైన షేర్లను విక్రయానికి ఉంచనుంది. ప్రమోటర్ సంస్థ సీఏ మ్యాగ్నమ్ హోల్డింగ్స్ వీటిని ఆఫర్ చేయనుంది. హెక్సావేర్‌లో పీఈ దిగ్గజం కార్లయిల్ గ్రూప్ సంస్థ సీఏకు ప్రస్తుతం 95.03 శాతం వాటా ఉంది. కంపెనీ ఫైనాన్షియల్, హెల్త్‌కేర్, తయారీ, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ తదితర రంగాలకు ఐటీ సర్వీసులు సమకూర్చుతోంది. గత ప్రమోటర్ బేరింగ్ పీఈ ఏషియా 2020లో హెక్సావేర్‌ను స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి డీలిస్ట్ చేసిన సంగతి తెలిసిందే. తదుపరి ఏడాది కాలంలో బేరింగ్ వాటాను కార్లయిల్ గ్రూప్ కొనుగోలు చేసింది. గతేడాది(2023–24) హెక్సావేర్ రూ. 10,380 కోట్ల ఆదాయం, రూ. 997 కోట్ల నికర లాభం ఆర్జించింది.

ఈపీసీ కంపెనీ



మౌలిక రంగ ఈపీసీ సంస్థ విక్రన్ ఇంజినీరింగ్ ఐపీవోలో భాగంగా రూ. 900 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 100 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్ విక్రయానికి ఉంచనున్నారు. కంపెనీలో సుప్రసిద్ధ ఇన్వెస్టర్ ఆశిష్ కొచాలియాకు సైతం పెట్టుబడులున్నాయి. టర్న్‌కీ పద్ధతిలో డిజైన్, సప్లై, ఇన్‌స్టలేషన్, టెస్టింగ్, కమిషనింగ్ తదితర ఎండ్‌టు ఎండ్ ఈపీసీ సర్వీసులందిస్తోంది.

సోలార్ టెక్




ఐపీవోలో భాగంగా పీఎంఈఏ సోలార్ టెక్ సొల్యూషన్స్ రూ. 600 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 1.12 కోట్ల షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. 2006లో ఏర్పాటైన కంపెనీ ప్రధానంగా సోలార్ ట్రాకింగ్ మౌంటింగ్ సిస్టమ్స్, ఎక్విప్‌మెంట్ తయారీలో ఉంది. మాడ్యూల్ మౌంటింగ్ అసెంబ్లీలో 16 గిగావాట్ల వార్షిక స్థాపిత సామర్థ్యాన్ని కలిగి ఉంది.

కన్జ్యూమర్ ప్రొడక్ట్స్



కస్టమర్ల కోసం కన్జ్యూమర్‌వేర్ ప్రొడక్టులు తయారు చేసే ఆల్ టైమ్ ప్లాస్టిక్స్ ఐపీవోలో భాగంగా రూ. 350 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 52.5 లక్షల షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. వైట్‌లేబుల్ కన్జ్యూమర్‌వేర్ ప్రొడక్టుల తయారీ కంపెనీ క్లయింట్ల సొంత బ్రాండ్లను రూపొందించి అందిస్తోంది. కస్టమర్ల జాబితాలో గ్లోబల్ దిగ్గజాలు ఐకియా, ఏఎస్‌డీఏ స్టోర్స్, టెస్కో పీఎల్‌సీ, మైఖేల్స్ స్టోర్స్‌తోపాటు దేశీయంగా స్పెన్సర్స్ రిటైల్ తదితరాలున్నాయి.

స్టెయిన్‌లెస్ స్టీల్



గుజరాత్ కంపెనీ స్కోడా ట్యూబ్స్ ఐపీవోలో భాగంగా రూ. 275 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. సంస్థ ప్రధానంగా ఆయిల్, గ్యాస్, కెమికల్స్, ఫెర్టిలైజర్స్, విద్యుత్ తదితర రంగాలలో కార్యకలాపాలు నిర్వహించే ఈపీసీ, ఇండస్ట్రియల్ కంపెనీలకు స్టెయిన్‌లెస్ స్టీల్ ట్యూబ్స్, పైపులను తయారు చేసి అందిస్తోంది.

కాంక్రీట్ ఎక్విప్‌మెంట్



పీఈ దిగ్గజం కేదారా క్యాపిటల్‌కు పెట్టుబడులున్న అజాక్స్ ఇంజినీరింగ్ కాంక్రీట్ ఎక్విప్‌మెంట్ తయారీలో కార్యకలాపాలు విస్తరించింది. ఐపీవోలో భాగంగా 2.28 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. కేదారా క్యాపిటల్ 74.37 లక్షల షేర్లను ఆఫర్ చేయనుంది.

భారత్ క్రెడిట్ రేటింగ్‌కు సవాళ్లు

మూడీస్ రేటింగ్స్ నివేదిక



న్యూఢిల్లీ: భారత్ ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు 2025లో క్రెడిట్ రేటింగ్‌కు సవాళ్లను విసిరే అవకాశం ఉందని మూడీస్ తన తాజా నివేదికలో పేర్కొంది. అయితే అమెరికా–చైనా సంబంధాల్లో నెలకొన్న ఉద్రిక్తతలు భారత్ ఎకానమీకి కలిసి వచ్చే వీలుందని కూడా నివేదిక వివరించింది. ఆసియా పసిఫిక్ సావరిన్స్‌పై రేటింగ్స్ దిగ్గజం నివేదికలోని మరికొన్ని అంశాలను పరిశీలిస్తే..

- వృద్ధి – ద్రవ్యోల్బణం మధ్య సమతౌల్యం ఏర్పడుతోంది. ప్రపంచ, ప్రాంతీయ ఆర్థిక పరిస్థితుల్లో కొంత సరళతర పరిణామాలు నెలకొన్నాయి. భారత్ దేశీయ డిమాండ్‌కు ఆయా అంశాలు బలాన్ని చేకూర్చుతున్నాయి.
- అమెరికా ప్రతిపాదిత వాణిజ్య రక్షణాత్మక చర్యలు ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఎకానమీ ఉత్పత్తి విస్తృత స్థాయిలో బలహీనపరవచ్చు.
- భారత్‌లో ద్రవ్యలోటు సవాళ్లు క్రమంగా తగ్గుముఖం పడతాయని మేము విశ్వసిస్తున్నాం.
- మూడీస్ బీఏఏ- రేటింగ్‌లో ఉన్న తోటి దేశాలతో పోల్చితే భారత్ రుణ పరిస్థితులు అధికంగా ఉన్నాయి. ఇటీవలి సంవత్సరాల్లో రెవెన్యూ పెరిగినప్పటికీ సవాళ్లు కొనసాగుతున్నాయి.
- తైవాన్ జలసంధి లేదా కొరియన్ ద్వీపకల్పంలో సైనిక సంఘర్షణల ప్రభావం తక్కువగా ఉండే అవకాశం ఉన్నప్పటికీ, అమెరికా–చైనా మధ్య ఉద్రిక్తతలు ఆసియా పసిఫిక్ ప్రాంతంపై ప్రతికూలత చూపుతాయి.ఈ ఉద్రిక్తతలు వాణిజ్యం,పెట్టుబడిఅంశాలపైప్రభావ చూపిస్తాయి.
- వ్యూహాత్మక రంగాలలో పెట్టుబడులను అమెరికా కఠినతరం చేస్తే, చైనా ఆర్థిక వ్యవస్థ బలహీనపడవచ్చు. ఇది ప్రాంతీయ వృద్ధిని దెబ్బతీయవచ్చు. అయితే ఇది భారత్, కొన్ని ఆగ్నేయాసియా ఆర్థిక వ్యవస్థలకు ప్రయోజనం చేకూరుస్తుంది.
- భౌగోళిక, ప్రాంతీయ రాజకీయ సవాళ్లు పలు దేశాలు ఎదుర్కొంటున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలా లేక ద్రవ్య లోటు కట్టడికి తగిన చర్యలు తీసుకోవాలా? అన్న అంశాలపై ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది.

క్యూ3 ఫలితాలు

యుకో బ్యాంక్ లాభం అప్

- రూ. 639 కోట్లు
- రూ. 2,000 కోట్ల సమీకరణకు సై



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ యుకో బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 27 శాతం జంప్‌చేసి రూ. 639 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 503 కోట్లు మాత్రమే ఆర్జించింది. నిర్వహణ లాభం సైతం రూ. 1,119 కోట్ల నుంచి రూ. 1,586 కోట్లకు ఎగసింది. మొత్తం ఆదాయం సైతం రూ. 6,413 కోట్ల నుంచి రూ. 7,406 కోట్లకు బలపడింది. నికర వడ్డీ ఆదాయం 20 శాతం జంప్‌చేసి రూ. 2,378 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 2.84 శాతం నుంచి 3.17 శాతానికి మెరుగుపడ్డాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.85 శాతం నుంచి 2.91 శాతానికి దిగివచ్చాయి. నికర ఎన్‌పీఏలు 0.98 శాతం నుంచి 0.63 శాతానికి తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి 16.25 శాతానికి చేరింది.

క్విప్‌తో పబ్లిక్‌కు వాటా

ఈ ఏడాది చివరి త్రైమాసికం(జనవరి–మార్చి)లో అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ(క్విప్) ద్వారా రూ. 2,000 కోట్లు సమీకరించనున్నట్లు యుకో బ్యాంక్ తాజాగా వెల్లడించింది. తద్వారా పబ్లిక్‌కు కనీస వాటా నిబంధనల అమలుకు తెరతీయనున్నట్లు తెలియజేసింది. ఇందుకు ప్రభుత్వం ఇటీవలే ఆమోదముద్ర వేసినట్లు బ్యాంక్ ఎండీ, సీఈవో అశ్వనీ కుమార్ పేర్కొన్నారు. క్విప్ తదుపరి బ్యాంక్‌లో ప్రభుత్వ వాటా 3 శాతంమేర తగ్గనున్నట్లు వెల్లడించింది. బ్యాంక్‌లో ప్రస్తుతం ప్రభుత్వానికి 95.39 శాతం వాటా ఉంది. కాగా.. పబ్లిక్‌కు కనీస వాటా నిబంధనల అమలులో సీపీఎస్‌ఈలు, ఫైనాన్షియల్ పీఎస్‌యూలకు ప్రభుత్వం 2026 ఆగస్ట్‌వరకూ గడువు పొడిగించిన సంగతి తెలిసిందే. మొత్తం 12 ప్రభుత్వ రంగ బ్యాంకులలో 5 బ్యాంకులు నిబంధనలు అమలు చేయవలసి ఉంది. సెబీ నిబంధనల ప్రకారం లిస్టెడ్ సంస్థలు పబ్లిక్‌కు కనీసం 25 శాతం వాటాను కల్పించవలసి ఉన్న సంగతి తెలిసిందే.

యుకో బ్యాంక్ షేరు ఎన్ఎస్‌ఈలో 1.2 శాతం క్షీణించి రూ. 44 వద్ద ముగిసింది.

పీఎన్‌బీ హౌసింగ్.. పటిష్టం

లాభం రూ. 438 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్ ప్రమోట్ చేసిన పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 43 శాతం జంప్‌చేసి రూ. 483 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 338 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,756 కోట్ల నుంచి రూ. 1,943 కోట్లకు బలపడింది. వడ్డీ ఆదాయం రూ. 1,680 కోట్ల నుంచి రూ. 1,848 కోట్లకు ఎగసింది. మొత్తం వ్యయాలు రూ. 1,316 కోట్ల నుంచి రూ. 1,327 కోట్లకు స్వల్పంగా పెరిగాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 1.73% నుంచి 1.19 శాతానికి తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి 28.8 శాతానికి చేరింది. రైటాఫ్ చేసిన రిటైల్ ఖాతాల నుంచి రూ. 53 కోట్లు రికవరీ సాధించినట్లు సంస్థ తెలియజేసింది.

ఎన్ఎస్‌ఈలో పీఎన్‌బీ హౌసింగ్ షేరు 1.5 శాతం క్షీణించి రూ. 899 వద్ద ముగిసింది.

కరూర్ వైశ్యా బ్యాంక్ లాభం 20% అప్..



చెన్నై: ప్రైవేట్ రంగ కరూర్ వైశ్యా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ. 496 కోట్ల నికర లాభం ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో నమోదైన రూ. 412 కోట్లతో పోలిస్తే 20 శాతం వృద్ధి నమోదు చేసింది. సమీక్షా కాలంలో ఆదాయం రూ. 2,497 కోట్ల నుంచి రూ. 2,953 కోట్లకు పెరిగింది. మరోవైపు, డిసెంబర్‌తో ముగిసిన తొమ్మిది నెలల కాలంలో లాభం 24 శాతం పెరిగి రూ. 1,149 కోట్ల నుంచి రూ. 1,428 కోట్లకు చేరింది. వృద్ధి, లాభదాయకత, అసెట్ నాణ్యతపరంగా మెరుగైన పనితీరు సాధిస్తున్నట్లు బ్యాంక్ ఎండీ బి. రమేష్ బాబు తెలిపారు. రిటైల్, వ్యవసాయం, చిన్న సంస్థల వ్యాపార విభాగాల్లో పటిష్టమైన వృద్ధి నమోదు చేస్తున్నట్లు వివరించారు. డిసెంబర్ 31 నాటికి మొత్తం వ్యాపారం రూ. 1,58,357 కోట్ల నుంచి రూ. 1,81,993 కోట్లకు చేరిందని, నికర నిరర్థక ఆస్తులు 0.42 శాతం నుంచి 0.20 శాతానికి తగ్గాయని పేర్కొన్నారు.

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్... హైజంప్

రూ. 326 కోట్లకు లాభం



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 43 శాతం జంప్‌చేసి రూ. 326 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 227 కోట్లు ఆర్జించింది. నికర ప్రీమియం ఆదాయం సైతం రూ. 9,929 కోట్ల నుంచి రూ. 12,261 కోట్లకు ఎగసింది. నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) రూ. 2.86 లక్షల కోట్ల నుంచి రూ. 3.1 లక్షల కోట్లకు బలపడ్డాయి. ఈ కాలంలో మార్పిడిరహిత డిబెంచర్ల జారీ ద్వారా రూ. 1,400 కోట్ల అదనపు మూలధనాన్ని సమీకరించింది. దీంతో సాల్వెన్సీ రేషియో 212 శాతంగా నమోదైంది.

ఎన్ఎస్‌ఈలో ఐసీఐసీఐ ప్రు షేరు 1 శాతం క్షీణించి రూ. 636 వద్ద ముగిసింది.

లాభాల్లోకి ఇండియా సిమెంట్స్

రూ. 117 కోట్లుగా నమోదు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ ఇండియా సిమెంట్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నష్టాలను వీడి దాదాపు రూ. 117 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఈ కాలంలో పెట్టుబడుల విక్రయం ద్వారా రూ. 584 కోట్లకుపైగా ఆర్జించినట్లు కంపెనీ వెల్లడించింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 7 కోట్ల నికర నష్టం ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ఫలితాలివి. అయితే మొత్తం ఆదాయం మాత్రం రూ. 1,113 కోట్ల నుంచి రూ. 941 కోట్లకు క్షీణించింది.

ఎన్ఎస్‌ఈలో ఇండియా సిమెంట్స్ షేరు 8 శాతం పతనమై రూ. 348 వద్ద ముగిసింది.

వజ్రాల పరిశ్రమ పునరుజ్జీవం

సుంకాల్లేకుండా దిగుమతులకు అనుమతి • ఇందుకోసం పథకాన్ని ప్రకటించిన కేంద్రం



న్యూఢిల్లీ: కట్ చేసిన, సానబట్టిన వజ్రాలను సుంకాల్లేకుండా దిగుమతి చేసుకునేందుకు వీలు కల్పిస్తూ 'డైమండ్ ఇంప్రెస్ట్ ఆథరైజేషన్ స్కీమ్'ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఎగుమతులను పెంచడం, విలువను జోడించడం ఈ పథకం ఉద్దేశ్యాలుగా ఉన్నాయి. ఏప్రిల్ 1 నుంచి ఈ పథకం అమల్లోకి రానుంది. వజ్రాల పరిశ్రమ ఎగుమతులు క్షీణత, ఉపాధి నష్టాన్ని ఎదుర్కొంటోందని కేంద్ర వాణిజ్య శాఖ పేర్కొంది. తాజా పథకం ఈ ధోరణికి చెక్‌పెట్టి పరిశ్రమకు పునరుజ్జీవాన్ని కల్పిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. అంతర్జాతీయంగా భారత వజ్రాల పరిశ్రమ పోటీతత్వాన్ని పెంచుతుందని, ఎంఎస్ఎంఈలకు తగిన అవకాశాలను కల్పిస్తుందని తెలిపింది. మరిన్ని ఉపాధి అవకాశాలకు మార్గం కల్పిస్తుందని పేర్కొంది. రెండు స్టార్ల ఎగుమతి హోదా కలిగి, ఏడాదిలో 15 మిలియన్ డాలర్లు అంతకంటే అధిక విలువ మేర ఎగుమతులు చేస్తున్న సంస్థలు ఈ పథకం కింద ప్రయోజనానికి అర్హులని వెల్లడించింది. 25 క్యారట్ (25 సెంట్లు) అంతకంటే తక్కువ ఉన్న సహజ కట్, పాలిష్డ్ వజ్రాలను సుంకాల్లేకుండా దిగుమతి చేసుకునేందుకు పథకం అనుమతిస్తుందని స్పష్టం చేసింది. గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) అనే స్వతంత్ర సంస్థ గణాంకాల ప్రకారం.. 2021–22లో ముడి వజ్రాల దిగుమతులు 18.5 బిలియన్ డాలర్లుగా ఉంటే, 2023–24 నాటికి 14 బిలియన్ డాలర్లకు క్షీణించాయి. కట్, పాలిష్డ్ వజ్రాల ఎగుమతులు ఇదే కాలంలో 24.4 బిలియన్ డాలర్ల నుంచి 13.1 బిలియన్ డాలర్లకు తగ్గిపోవడం గమనార్హం.

తగ్గేదేలే...

సెమీఫైనల్లో జొకోవిచ్, సబలెంకా

క్వార్టర్ ఫైనల్లో అద్భుత విజయాలు ● మూడో సీడ్ కోకో గాఫ్ అవుట్
కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ సెమీఫైనల్లో బదోసా ● మూడోసారి సెమీస్ చేరిన జ్వెరెవ్

టెన్నిస్ చరిత్రలోనే అత్యధిక గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన ప్లేయర్‌గా రికార్డు సృష్టించేందుకు నొవాక్ జొకోవిచ్ రెండు విజయాల దూరంలో నిలిచాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఈ సెర్బియా దిగ్గజం 12వసారి సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. రికార్డుస్థాయిలో 10 సార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ సాధించిన జొకోవిచ్ కేవలం గత ఏడాది మాత్రమే తొలిసారి ఈ టోర్నీలో సెమీఫైనల్లో ఓడిపోయాడు. గత ఏడాది వింబుల్డన్ టోర్నీలో అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ రికార్డు నెలకొల్పేందుకు జొకోవిచ్‌కు అవకాశం లభించింది. కానీ తుదిపోరులో స్పెయిన్ యువతార కార్లోస్ అల్‌కరాజ్ అద్వితీయ ఆటతీరుతో జొకోవిచ్ ఆశలను వమ్ము చేశాడు. తనకెంతో కలిసొచ్చిన ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనే 'గ్రాండ్' రికార్డు అందుకోవాలనే లక్ష్యంతో జొకోవిచ్ ఈసారి పక్కా ప్రణాళికతో వచ్చాడు. గతంలో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఐదుసార్లు రన్నరప్‌గా నిలిచిన బ్రిటన్ స్టార్, తన చిరకాల ప్రత్యర్థి ఆండీ ముర్రేను కోచ్‌గా నియమించుకున్నాడు. ముర్రే నియామకం సరైనదేనని ఈసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో జొకోవిచ్ ఆటతీరును పరిశీలిస్తే తెలుస్తోంది. క్వార్టర్ ఫైనల్లో పెద్ద అడ్డంకి అల్‌కరాజ్‌ను నాలుగు సెట్‌ల పోరులో జొకోవిచ్ అధిగమించాడు. సెమీఫైనల్లో జొకోవిచ్ జర్మనీ స్టార్ అలెగ్జాండర్ జ్వెరెవ్ రూపంలో మరో కీలక పరీక్షకు సిద్ధంకానున్నాడు. అయితే గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో జ్వెరెవ్‌తో పోటీపడ్డ మూడుసార్లూ జొకోవిచే గెలుపొందడం గమనార్హం.

మరోవైపు మహిళల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ సబలెంకా వరుసగా మూడో ఏడాది సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. 2023, 2024లలో విజేతగా నిలిచిన సబలెంకాకు ఈ టోర్నీలో తొలిసారి క్వార్టర్ ఫైనల్లో గట్టిపోటీ ఎదురైంది. అయితే సబలెంకా తన ఆధిపత్యం చాటుకొని 'హ్యాట్రిక్' టైటిల్ దిశగా మరో అడుగు ముందుకు వేసింది.


సబలెంకా


జొకోవిచ్

50
ఓపెన్ శకంలో (1968 నుంచి) అత్యధికంగా 50 సార్లు గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో పురుష సింగిల్స్ సెమీఫైనల్ చేరిన తొలి క్రీడాకారుడిగా జొకోవిచ్ గుర్తింపు పొందాడు. ఆల్‌టైమ్ రికార్డు క్రిస్ ఎవర్ట్ (52 సార్లు: అమెరికా) పేరిట ఉంది.

మెల్‌బోర్న్: 'ఈసారి కాకపోతే మరెప్పుడూ కాదు' అన్న తరహాలో సెర్బియా టెన్నిస్ స్టార్ నొవాక్ జొకోవిచ్ తన శక్తినంతా ధారపోస్తూ, అపార అనుభవాన్ని రంగరిస్తూ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పోరాడుతున్నాడు. 37 ఏళ్ల వయస్సులో రికార్డుస్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ అందుకోవాలనే పట్టుదలతో మెల్‌బోర్న్‌లో అడుగు పెట్టిన జొకోవిచ్ ఎంతో ప్రమాదకరమైన అల్‌కరాజ్ అడ్డంకిని దాటేశాడు. కొత్త కోచ్ ఆండీ ముర్రే రచించిన వ్యూహాలను కోర్టులో అమలు చేసిన జొకోవిచ్... నాలుగు సెట్‌లలో స్పెయిన్ స్టార్ అల్‌కరాజ్ ఆట కట్టించేశాడు. 12వసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ఏడో సీడ్ జొకోవిచ్ 4-6, 6-4, 6-3, 6-4తో మూడో సీడ్ అల్‌కరాజ్‌ను ఓడించాడు. 3 గంటల 37 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ ఆట అబ్బురపరిచింది. జొకోవిచ్‌ను నిలువరించేందుకు 21 ఏళ్ల అల్‌కరాజ్ అన్ని అస్త్రాలను ప్రయోగించినా...సెర్బియా స్టార్ విజయాన్ని మాత్రం అడ్డుకోలేకపోయాడు. ర్యాలీ హోరాహోరీగా సాగుతుంటే హఠాత్తుగా దానిని డ్రాప్ షాట్‌గా మలిచి పాయింట్లు నెగ్గడం అల్‌కరాజ్‌కు అలవాటు. అయితే ఈసారి అల్‌కరాజ్ ఈ 'డ్రాప్ షాట్'ల వ్యూహానికి పక్కాగా సిద్ధమై వచ్చిన జొకోవిచ్ సమర్థంగా అడ్డుకున్నాడు. 54 నిమిషాలపాటు జరిగిన తొలి సెట్‌లో మూడో గేమ్‌లో, తొమ్మిదో గేమ్‌లో జొకోవిచ్ సర్వీస్‌లను అల్‌కరాజ్ బ్రేక్ చేశాడు. అదే జోరులో తొలి సెట్‌ను సొంతం చేసుకున్నాడు. తొలి సెట్ కోల్పోవడంతో జొకోవిచ్‌పై ఒత్తిడి పెరిగింది. అయితే ఒత్తిడిలోనే జొకోవిచ్‌లోని మేటి ఆటగాడు మేల్కొన్నాడు. అల్‌కరాజ్ కంటే అద్భుతంగా ఆడుతూ ముందుకు వెళ్లాడు. రెండో సెట్‌లోని రెండో గేమ్‌లోనే అల్‌కరాజ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన జొకోవిచ్ ఆ తర్వాత తన సర్వీస్‌ను కాపాడుకొని 3-0తో ఆధిక్యంలో వచ్చాడు. అయితే పట్టువదలకుండా పోరాడిన అల్‌కరాజ్ ఐదో గేమ్‌లోనే జొకోవిచ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి స్కోరును 3-3తో సమం చేశాడు. ఆ తర్వాత ఇద్దరూ తమ సర్వీస్‌లను కాపాడుకున్నారు. అయితే పదో గేమ్‌లో అల్‌కరాజ్ సర్వీస్‌లో ఒక్కసారిగా దూకుడు పెంచిన జొకోవిచ్


బదోసా

ఒక్క అవకాశం ఇవ్వకుండా సర్వీస్‌ను బ్రేక్ చేసి 50 నిమిషాల్లో రెండో సెట్‌ను నెగ్గాడు. మూడో సెట్‌లో కూడా ఇద్దరూ నువ్వా నేనా అన్నట్లు పోరాడారు. ఆరో గేమ్‌లో అల్‌కరాజ్ సర్వీస్‌ను జొకోవిచ్ బ్రేక్ చేయగా... ఏడో గేమ్‌లో జొకోవిచ్ సర్వీస్‌ను అల్‌కరాజ్ బ్రేక్ చేశాడు. ఎనిమిదో గేమ్‌లో మళ్లీ అల్‌కరాజ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన జొకోవిచ్ తొమ్మిదో గేమ్‌లో తన సర్వీస్‌ను కాపాడుకొని 50 నిమిషాల్లో సెట్‌ను 6-3తో దక్కించుకున్నాడు. నాలుగో సెట్‌లోని తొలి గేమ్‌లోనే అల్‌కరాజ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన జొకోవిచ్ ఆ తర్వాత తన అన్ని సర్వీస్‌లను కాపాడుకొని విజయాన్ని అందుకున్నాడు. మరో క్వార్టర్ ఫైనల్లో రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ 3 గంటల 28 నిమిషాల్లో 7-6 (7/1), 7-6 (7/0), 2-6, 6-1తో 12వ సీడ్ టామీ పాల్ (అమెరికా)పై గెలిచి మూడోసారి ఈ టోర్నీలో సెమీఫైనల్లోకి అడుగు పెట్టాడు. ఫైనల్లో చోటు కోసం జొకోవిచ్‌తో జ్వెరెవ్ తలపడతాడు. ముఖాముఖి రికార్డులో జొకోవిచ్ 8-4తో జ్వెరెవ్‌పై ఆధిక్యంలో ఉన్నాడు. గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో వీరిద్దరు మూడుసార్లు (2021 యూఎస్ ఓపెన్ సెమీఫైనల్; 2021 ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్; 2019 ఫ్రెంచ్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్) పోటీపడగా... మూడుసార్లూ జొకోవిచే గెలిచాడు.

వరుసగా 19వ విజయంతో...

మహిళల సింగిల్స్ విభాగంలో టాప్ సీడ్ సబలెంకా (బెలారస్), 11వ సీడ్ పౌలా బదోసా (స్పెయిన్)


కోకో గాఫ్


సెమీఫైనల్లోకి ప్రవేశించారు. క్వార్టర్ ఫైనల్స్‌లో వరల్డ్ నంబర్‌వన్ సబలెంకా 6-2, 2-6, 6-3తో 27వ సీడ్ అనస్తాసియా పావ్లీచెంకోవా (రష్యా)పై, బదోసా 7-5, 6-4తో మూడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా)పై గెలిచి సెమీఫైనల్ పోరుకు సిద్ధమయ్యారు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సబలెంకాకిది వరుసగా 19వ విజయం కావడం విశేషం. వరుసగా రెండేళ్లు (2023, 2024) ఈ టోర్నీలో విజేతగా నిలిచిన సబలెంకా ఈసారీ టైటిల్ సాధిస్తే మార్టినా హింగిస్ (స్విట్జర్లాండ్; 1997, 1998, 1999) తర్వాత 'హ్యాట్రిక్' నమోదు చేసిన ప్లేయర్‌గా గుర్తింపు పొందుతుంది. పావ్లీచెంకోవాతో ఒక గంట 53 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సబలెంకా 29 విన్నర్స్ కొట్టింది. తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. బదోసాతో ఒక గంట 43 నిమిషాలపాటు జరిగిన


జ్వెరెవ్

పోరులో కోకో గాఫ్ 41 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకుంది. కోకో గాఫ్ సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసిన బదోసా ఈ గెలుపుతో తన కెరీర్‌లో ఆడుతోన్న 20వ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో తొలిసారి సెమీఫైనల్ బెర్త్‌ను దక్కించుకుంది. నేడు జరిగే పురుషుల సింగిల్స్ రెండు క్వార్టర్ ఫైనల్స్‌లో లొరెంజో సొనెగో (ఇటలీ)తో బెన్ షెల్టన్ (అమెరికా); అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా)తో యానిక్ సినెర్; మహిళల సింగిల్స్ రెండు క్వార్టర్ ఫైనల్స్‌లో మాడిసన్ కీస్ (అమెరికా)తో స్వితోలినా (ఉక్రెయిన్); ఎమ్మా నవారో (అమెరికా)తో ఇగా స్వియాటెక్ (పోలాండ్) తలపడతారు.

బోపన్న జోడీ ఓటమి

మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న (భారత్)-షుయె జాంగ్ (చైనా) జోడీ పోరాటం ముగిసింది. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో


అల్‌కరాజ్

బోపన్న-షుయె జాంగ్ ద్వయం 6-2, 4-6, 9-11తో జాన్ పీర్స్-ఒలివియా గడెస్కీ (ఆస్ట్రేలియా) జంట చేతిలో ఓడిపోయింది.

మ్యాచ్ గణాంకాలు

జొకోవిచ్		అల్‌కరాజ్
5	ఏస్‌లు	10
3	డబుల్‌ఫాల్ట్‌లు	5
31	విన్నర్స్	50
27	అనవసర తప్పిదాలు	40
6/13	బ్రేక్ పాయింట్లు	4/11
22/34	నెట్ పాయింట్లు	18/28
135	మొత్తం పాయింట్లు	126

ఐఓసీ చీఫ్‌తో జై షా భేటీ

2028 తర్వాత కూడా ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను కొనసాగించే అంశంపై చర్చలు



లూసానే: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చైర్మన్ జై షా మంగళవారం అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) అధ్యక్షుడు థామస్ బాచ్‌తో భేటీ అయ్యారు. త్వరలో లూసానేలోనే ఐఓసీ ఉన్నతస్థాయి అధికారులు పాల్గొనే అసాధారణ సమావేశాలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో మేటి క్రీడా కమిటీల చీఫ్‌ల భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నెలాఖరున (30వ తేదీ) జరిగే ఈ కీలకమైన సమావేశంలో క్రికెట్‌ను ఒలింపిక్స్‌లో కొనసాగించే అంశంపై చర్చ జరుగనుంది. దీంతో ఈ చర్చ కంటే ముందుగా జై షా, థామస్ బాచ్‌లు అ అంశంపై అభిప్రాయాలను పంచుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు ఐసీసీ సోషల్ మీడియాలో ఇద్దరి ఫొటోను పోస్ట్ చేసింది. 'లాస్ ఏంజెలిస్-2028 ఒలింపిక్స్‌లో టి20 ఫార్మాట్‌లో క్రికెట్ ఈవెంట్ జరగనుంది. అయితే 2032 బ్రిస్బేన్ ఒలింపిక్స్‌లో క్రికెట్ ఉంటుందా లేదా అన్నది ఇంకా ఖరారు కాలేదు. దాంతో తదుపరి విశ్వక్రీడల్లోనూ క్రికెట్ క్రీడను కొనసాగించే విషయంపై ప్రాథమిక దశ సంప్రదింపులు మొదలయ్యాయి. ఐసీసీ చైర్మన్ జై షా ఈ అంశమై ఐఓసీ చీఫ్ బాచ్‌తో సమావేశమయ్యారు' అని ఐసీసీ 'ఎక్స్'లో ట్వీట్ చేసింది.

నార్వే చెస్ టోర్నీకి గుకేశ్, అర్జున్



స్టావెంజర్ (నార్వే): ఈ ఏడాది వేసవిలో జరగనున్న నార్వే చెస్ టోర్నమెంట్‌లో ప్రపంచ చాంపియన్, భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్, భారత నంబర్‌వన్ అర్జున్ ఇరిగేశి బరిలోకి దిగనున్నారు. మే 26 నుంచి జూన్ 6 వరకు జరగనున్న ఈ టోర్నీలో మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే), ఫాబియానో కరువానా (అమెరికా) , హికారు నకామురు (అమెరికా), వి యీ (చైనా) కూడా పాల్గొననున్నారు. వీరిలో నలుగురు ప్లేయర్లు ప్రస్తుతం ఎలో రేటింగ్‌లో 2800 పాయింట్లకు పైగా ఉండటం గమనార్హం. ఈ టోర్నీలో పాల్గొనేందుకు ఉత్సుకతతో ఎదురుచూస్తున్నట్లు నకామురు పేర్కొన్నాడు. 'నార్వే చెస్ టోర్నీలో ప్రధాన ఆటగాళ్లంతా పాల్గొంటున్నారు. చాన్నాళ్లుగా వాళ్లతో కలిసి ఆడుతున్న వారితో పాటు భవిష్యత్తు చదరంగ స్టార్‌లు గుకేశ్, అర్జున్ కూడా బరిలోకి దిగుతున్నారు' అని నకామురు అన్నాడు.

సాత్విక్-చిరాగ్ జోడీ శుభారంభం

క్వాలిఫయింగ్‌లోనే శ్రీకాంత్ అవుట్

జకార్తా: ఇండోనేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో సాత్విక్-చిరాగ్ ద్వయం 21-16, 21-15తో చెన్ జి రే-లిన్ యు చియె (చైనీస్ తైపీ) జంటను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. 30 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో భారత జోడీకి ప్రతిఘటన ఎదురైనా కీలకదశల్లో పాయింట్లు నెగ్గి విజయాన్ని ఖరారు చేసుకుంది. తొలి గేమ్‌లో స్కోరు 17-16 వద్ద సాత్విక్-చిరాగ్ వరుసగా నాలుగు పాయింట్లు సాధించింది. రెండో గేమ్‌లోనూ భారత ద్వయం దూకుడు కొనసాగించి ఆరంభంలోనే 12-5తో ఆధిక్యంలోకి వెళ్లి వెనుదిరిగి చూడలేదు. సాత్విక్-చిరాగ్ జంట ఆడిన గత మూడు టోర్నీలలో (చైనా మాస్టర్స్, మలేసియా ఓపెన్-1000, ఇండియా ఓపెన్-750) సెమీఫైనల్‌కు చేరింది. మహిళల డబుల్స్‌లో తనీషా క్రాస్టో-అశ్విని పొన్నప్ప (భారత్) జంట కూడా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. తొలి రౌండ్‌లో తనీషా-అశ్విని ద్వయం 21-6, 21-14తో ఒర్నిచా జోంగ్‌సతాపోర్న్‌పార్న్-సుకిత్త సువాచాయ్ (థాయ్‌లాండ్) జంటపై గెలిచింది.

సింగిల్స్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌ల్లో భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్, హైదరాబాద్ ప్లేయర్ కిడాంబి శ్రీకాంత్‌కు చుక్కెదురైంది. భారత్‌కే చెందిన ఆయుశ్ శెట్టితో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ మాజీ నంబర్ వన్ శ్రీకాంత్ 7-21, 15-21తో ఓడిపోవడం గమనార్హం. మహిళల క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో తాన్యా హేమంత్ 16-21, 21-17, 21-15తో టుంగ్ సియో టాంగ్ (చైనీస్ తైపీ)పై నెగ్గి మెయిన్ 'డ్రా'కు అర్హత పొందింది. మరో మ్యాచ్‌లో ఇషారాణి బారువా 18-21, 20-22తో చియారా మార్వెలా హండాయో (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయి మెయిన్ 'డ్రా'కు చేరుకోవడంలో విఫలమైంది.


చిరాగ్ సాత్విక్

ఫిబ్రవరి 5లోగా మైదానాలు రెడీ: పీసీబీ

కరాచీ: చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభానికి రెండు వారాల ముందే స్టేడియంలను సిద్ధం చేసేలా పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) పనులు వేగవంతం చేసింది. కరాచీ, లాహోర్ స్టేడియాలలో పునర్నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. అధునాతన కుర్చీలు, అదనపు సౌకర్యాలతో కూడిన భవనాలు, ఎల్‌ఈడీ ఫ్లడ్‌లైట్లు, డిజిటల్ స్కోరు బోర్డులు ఇలా సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్న మైదానాలను వచ్చే నెల 5 వరకు సిద్ధం చేయనున్నారు. చాంపియన్స్ ట్రోఫీ ఆరంభానికి ముందు పాకిస్తాన్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ ఆడనున్న ముక్కోణపు సిరీస్‌ను ఈ మైదానాల్లో నిర్వహించనున్నారు. ఈ రెండు మైదానాల పునర్నిర్మాణం కోసం పీసీబీ 12 బిలియన్ పాకిస్తానీ రూపాయలను ఖర్చు చేస్తోంది. కరాచీ స్టేడియం మేనేజర్ అర్షద్‌ఖాన్ మాట్లాడుతూ... 'నిర్మాణ పనులు చివరి దశకు వచ్చాయి. మిగిలి ఉన్న కొన్ని చిన్న చిన్న పనులు ఈ నెలాఖరులోగా ముగుస్తాయి. ఫిబ్రవరి 5లోగా అధునాతన మైదానాన్ని పీసీబీకి అందిస్తాం. లాహోర్ స్టేడియంలో కూడా పనులు దాదాపు ముగిశాయి. తాజా మార్పుల్లో అధునాతన సదుపాయాలు కల్పించాం' అని పేర్కొన్నాడు.

రెండో ర్యాంక్‌లో స్మృతి మంధాన

దుబాయ్: భారత జట్టు ఓపెనర్ స్మృతి మంధాన అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి ఎగబాకింది. ఇటీవల ఐర్లాండ్‌తో సొంతగడ్డపై జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో సత్తా చాటిన స్మృతి తాజా ర్యాంకింగ్స్‌లో ఒక స్థానం మెరుగుపర్చుకుంది. ఐర్లాండ్‌తో సిరీస్‌లో ఒక సెంచరీ, ఒక అర్ధసెంచరీ సాయంతో 249 పరుగులు చేసిన స్మృతి 738 ర్యాంకింగ్ పాయింట్లతో రెండో స్థానానికి చేరింది. ఈ సిరీస్‌లో స్మృతి కెప్టెన్‌గానూ ఆకట్టుకుంది. దక్షిణాఫ్రికా స్టార్ లౌరా వాల్వర్ట్ (773 పాయింట్లు) అగ్రస్థానంలో కొనసాగుతోంది. శ్రీలంక బ్యాటర్ చమరి ఆటపట్టు (733 పాయింట్లు) మూడో ర్యాంక్‌లో ఉంది. భారత జట్టు తరఫున స్మృతి మాత్రమే టాప్-10లో చోటు దక్కించుకుంది. ఐర్లాండ్‌తో సిరీస్‌కు దూరమైన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 15వ ర్యాంక్‌లో ఉండగా... కెరీర్‌లో తొలి సెంచరీ నమోదు చేసుకున్న జెమీమా రోడ్రిగ్స్ రెండు స్థానాలు మెరుగు పరుచుకొని 17వ ర్యాంక్‌కు చేరింది. ఐర్లాండ్‌తో సిరీస్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగిన ఓపెనర్ ప్రతీక రావల్ 12 స్థానాలు ఎగబాకి 53వ ర్యాంక్‌లో నిలిచింది. బౌలర్ల జాబితాలో దీప్తి శర్మ ఒక స్థానం మెరుగు పరుచుకొని నాలుగో ర్యాంక్‌లో నిలిచింది. ఆల్‌రౌండర్ల జాబితాలో దీప్తి 6వ స్థానంలో కొనసాగుతోంది.



ఆర్చర్ చికితకు అండగా...

హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు ఆర్థిక సాయం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వర్ధమాన ఆర్చర్ తానిపర్తి చికితకు హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు ఆర్థికంగా అండగా నిలిచేందుకు ముందుకు వచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్న చికిత ఆసియా జూనియర్ ఆర్చర్ కప్‌కు అర్హత సాధించింది. కోల్‌కతాలో జరిగిన సెలక్షన్ ట్రయల్స్‌లో ఆకట్టుకొని ఆమె క్వాలిఫై అయింది. ముమ్ముందు ఆమె శిక్షణ, ఇతర సన్నాహాల మొత్తం రూ.10 లక్షల స్పోర్ట్స్ స్కాలర్‌షిప్‌ను తన వ్యక్తిగత హోదాలో అందజేస్తానని జగన్‌మోహన్‌రావు ప్రకటించారు. రైతు కుటుంబం నుంచి వచ్చి క్రీడాకారిణిగా ఎదిగేందుకు ప్రయత్నిస్తున్న చికితకు అన్ని విధాలా సహకరిస్తామని ఆయన చెప్పారు. ముందుగా రూ.50 వేల చెక్‌ను అందించిన ఆయన ప్రతీ నెలా రూ.15 వేల చొప్పున తమ 'అక్షర' విద్యాసంస్థల తరఫున ఇస్తానని ప్రకటించారు.



తాలిబన్ల చెర నుంచి ఇద్దరు అమెరికన్లకు విముక్తి

బదులుగా తాలిబన్ ఖైదీని విడుదల చేసిన అమెరికా

ఇస్లామాబాద్: 2022 నుంచి తమ వద్ద బందీలుగా ఉన్న ఇద్దరు అమెరికన్లను అఫ్గాన్ తాలిబన్లు విడుదల చేశారు. బదులుగా అగ్రరాజ్యం అమెరికా డ్రగ్స్ స్మగ్లింగ్ ఆరోపణలపై 2008 నుంచి జీవిత ఖైదును అనుభవిస్తున్న ఖాన్ మహ్మద్‌ను విడిచిపెట్టింది. ఖతార్ మధ్యవర్తిత్వంతో అధ్యక్ష పదవి నుంచి దిగిపోయే ఆఖరి నిమిషంలో బైడెన్ ఇందుకు సంబంధించిన ఒప్పందంపై సంతకం చేశారని మంగళవారం అమెరికా అధికారులు వెల్లడించారు. తాలిబన్ల చెర నుంచి విముక్తి లభించిన రియాన్ కార్బెట్ కుటుంబంతోపాటు అఫ్గానిస్తాన్‌లో ఉండేవారు. అమెరికా సాయంతో నడిచే అక్కడి ప్రభుత్వం కూలిపోయాక తాలిబన్లు ఆయన్ను నిర్బంధంలోకి తీసుకున్నారు. కార్బెట్‌తోపాటు విముక్తి లభించిన మరో అమెరికన్ జార్జి గ్లెజ్‌మాన్. అట్లాంటాకు చెందిన ఈయన ఎయిర్‌లైన్ మెకానిక్. అఫ్గానిస్తాన్‌కు వెళ్లిన ఈయన 2022 నుంచి కనిపించకుండా పోయారు. గ్లెజ్‌మాన్ అదృశ్యంతో తమకు సంబంధం లేదని తాలిబన్లు కూడా పలుమార్లు ప్రకటించారు. అదేవిధంగా, గ్వాంటానమో బేలో అమెరికా నిర్బంధంలో ఉన్న మహ్మద్ రహీంకు బదులుగా తాలిబన్లు అఫ్గాన్–అమెరికన్ వ్యాపారవేత్త మహ్మద్ హబీబీని విడిచిపెట్టినట్లు సమాచారం. ఈ పరిణామంపై అమెరికా, తాలిబన్లతోపాటు సంప్రదింపులు జరిపిన ఖతార్ కూడా స్పందించలేదు.

'బేటీ బచావో.. బేటీ పఢావో'కు పదేళ్లు.. నేటి నుంచి వారోత్సవాలు షురూ

సాక్షి, న్యూఢిల్లీ: 2015 జనవరి 22న ప్రధాని మోదీ ప్రారంభించిన 'బేటీ బచావో–బేటీ పఢావో'ఉద్యమంతో పదేళ్లలో గణనీయమైన అభివృద్ధి సాధించామని కేంద్ర మహిళా శిశు అభివృద్ధి శాఖ మంగళవారం తెలిపింది. వివిధ కార్యక్రమాలను అమలు చేయడం ద్వారా లింగ అసమానతలను తగ్గించేందుకు ప్రయత్నాలు జరిగాయని వెల్లడించింది. ఫలితంగా, పాఠశాలల్లో సెకండరీ స్థాయిలో చదువుకునే బాలికల సంఖ్య 2014–15లో 75.51 శాతం కాగా 2023–24 వచ్చే సరికి 78 శాతానికి చేరుకుందని తెలిపింది. అదేవిధంగా, లింగ నిష్పత్తి 918 నుంచి 930కి పెరిగింది. నిపుణుల పర్యవేక్షణలో చేసే కాన్పుల సంఖ్య 61 శాతం నుంచి 97.3 శాతానికి చేరింది. గర్భం దాల్చిన మొదటి మూడు నెలల్లో ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించుకుని అవసరమైన వైద్య సాయం పొందే వారి సంఖ్య 61 శాతం నుంచి 80.5 శాతానికి చేరుకుందని వివరించింది. 'బేటీ బచావో–బేటీ పఢావో'ఉద్యమాన్ని ప్రారంభించి పదేళ్లవుతున్న సందర్భంగా వారం పాటు దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు మహిళా శిశు అభివృద్ధి శాఖ తెలిపింది. ఈ నెల 22 బుధవారం నుంచి మార్చి 8వ తేదీన జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవం వరకు ఇవి కొనసాగుతాయని వెల్లడించింది. ఢిల్లీలో జరిగే ప్రధాన కార్యక్రమంలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అన్నపూర్ణా దేవి, సావిత్రీ ఠాకూర్‌తోపాటు ఢిల్లీ పోలీసులు, సాయుధ దళాలకు చెందిన మహిళా సీనియర్ అధికారులు పాల్గొంటారని తెలిపింది. రాష్ట్రాలు, జిల్లా స్థాయిలోనూ ఇలాంటి కార్యక్రమాలు జరుగుతాయని వివరించింది. జనవరి 26, మార్చి 8న ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వేడుకలుంటాయంది.

బీఫ్ తినడం హక్కు అయితే, గోమూత్రం ఎందుకు కాదు?

ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ కామకోటికి మద్దతు పలికిన తమిళి సై

చెన్నై: గోమూత్రానికి ఔషధ విలువలున్నాయని తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్న ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ కామకోటికి బీజేపీ నేత తమిళి సై సౌందరరాజన్ మద్దతుగా నిలిచారు. గొడ్డు మాంసం తినడం తమ హక్కని కొందరు వాదిస్తున్నారంటూ ఆమె గోమూత్రం మాత్రం ఎందుకు హక్కు కాకూడదని ప్రశ్నించారు. 'బీఫ్ తినడం తమ హక్కని ఒక వర్గం వారు వాదిస్తున్నారు. వ్యాధులను నయం చేసే శక్తి గోమూత్రానికి ఉందని మరో వర్గం అంటోంది. దీనిపై వ్యాఖ్యలెందుకు చేస్తున్నారు? ఇది సరికాదు'అని ఆమె పేర్కొన్నారు.తమిళనాడు బీజేపీ చీఫ్ అన్నామలై కూడా కామకోటి వ్యాఖ్యలను సమర్థించారు. డీఎంకే, ఇంకా కొన్ని పార్టీల నేతలు ఈ విషయాన్ని రాజకీయ చేస్తున్నారని ఆరోపించారు. ప్రొఫెసర్ కామకోటి చెప్పిన విషయాలు ఆయన వ్యక్తిగతం, అది వైద్య సలహా కూడా కాదన్నారు.

రాష్ట్రపతి భవన్ అమృత్ ఉద్యాన్ సందర్శనకు 2 నుంచి అవకాశం

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌అమృత్ ఉద్యాన్‌ను ఫిబ్రవరి 2 నుంచి మార్చి 30వ తేదీ వరకు ప్రజల సందర్శనార్థం తెరవనున్నారు. ఈ సమయంలో సోమవారాలు మినహా మిగతా రోజుల్లో అమృత్ ఉద్యాన్‌ను ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య సందర్శించవచ్చని రాష్ట్రపతి భవన్ సచివాలయం తెలిపింది. కాగా, అమృత్ ఉద్యాన్ సందర్శనను మార్చి 26న వికలాంగుల కోసం, మార్చి 27న రక్షణ, పారామిలటరీ, పోలీసు బలగాల సిబ్బందికి, మార్చి 28న మహిళలు, గిరిజన మహిళల స్వయం సహాయక సంఘాల కోసం, మార్చి 29న సీనియర్ సిటిజన్ల కోసం ప్రత్యేకించారు. ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు, ఫిబ్రవరి 20, 21 తేదీల్లో రాష్ట్రపతి భవన్‌లో సందర్శకుల సమావేశం, మార్చి 14న హోలీ కారణంగా అమృత్ ఉద్యాన్ మూసి ఉంచుతారు. మార్చి 6 నుంచి 9 వరకు అమృత్ ఉద్యాన్‌లో భాగంగా దక్షిణ భారత సుసంపన్న సాంస్కృతిక వారసత్వ, విశిష్ట సంప్రదాయాలను ప్రదర్శిస్తారు. సందర్శకుల ప్రవేశం, నిష్క్రమణ రాష్ట్రపతి భవన్‌ను నార్త్ అవెన్యూ కలిపే చోటుకు దగ్గర్లోని ప్రెసిడెంట్ ఎస్టేట్ 35వ నంబర్ గేట్ నుంచి ఉంటుంది. సందర్శకులు అమృత్ ఉద్యాన్‌లోని బోన్సాయ్ గార్డెన్, మ్యూజికల్ ఫౌంటెయిన్, సెంట్రల్ లాన్, లాంగ్ గార్డెన్, సర్క్యులర్ గార్డెన్‌లను తిలకించవచ్చు.



గాజా..

గాజాలోని జబాలియాలో శిథిలాల మధ్య నుంచి సొంతిళ్లకు చేరుకుంటున్న పాలస్తీనియన్లు

చెదిరిన స్వప్నం!

శిథిలాల మధ్య తమ ఇళ్లు వెతుక్కుంటున్న స్థానికులు

- అంతటా రాజ్యమేలుతున్న శ్మశాన వైరాగ్యం
- గాయాల గాజాలో ముమ్మరంగా కొనసాగుతున్న సహాయక చర్యలు
- వందల లారీల కొద్దీ నిత్యావసరాలు, ఔషధాల తరలింపు

పదిహేను నెలల భీకర యుద్ధం ధాటికి అంధకారమయమైన గాజా స్ట్రిప్ వీధుల్లో ఎట్టకేలకు శాంతిరేఖలు ప్రసరించినా యుద్ధంలో జరిగిన విధ్వంసఛాయలు తొలగిపోలేదు. హమాస్, ఇజ్రాయెల్ మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందంతో ఎట్టకేలకు తుపాకుల మోత, క్షిపణుల దాడులు ఆగిపోయాయి. అయినాసరే అశాంతి నిశ్శబ్దం రాజ్యమేలుతూనే ఉంది. మిస్సైల్స్ దాడుల్లో ధ్వంసమైన తమ ఇళ్లను వెతుక్కుంటూ వస్తున్న పాలస్తీనియన్లకు ఏ వీధిలో చూసినా మృతదేహాలే స్వాగతం పలుకుతూ నాటి మారణహోమాన్ని గుర్తుకుతెస్తున్నాయి. గాజా స్ట్రిప్‌పై వేల టన్నుల పేలుడుపదార్థాలను కుమ్మరించిన ఇజ్రాయెల్ పాలస్తీనియన్ల జనవాసాలను దాదాపు శ్మశానాలుగా మార్చేసింది. స్వస్థలాలకు కాలినడకన, గుర్రపుబళ్లలో చేరుకుంటున్న స్థానికులకు ఎటు చూసినా వర్ణనాతీత వేదనా దృశ్యాలే కనిపిస్తున్నాయి. లక్షలాది మంది ప్రజల ఇళ్ల ధ్వంసమయ్యాయి. వాటికింద స్థానికుల జ్ఞాపకాలతో పాటు కలలు కూలిపోయాయి. కొందరు ఆత్మీయులను పోగొట్టుకుంటే.. మరికొందరు సర్వస్వాన్ని కోల్పోయారు. ప్రతి ముఖం మీదా విషాద చారికలే.

అణువణువునా విధ్వంసం

యుద్ధం దాదాపు 20 లక్షల మంది పాలస్తీనియన్లను నిరాశ్రయులను చేసింది. ఇజ్రాయెల్ దాడుల్లో దాదాపు 46,900 మంది ప్రాణాలు కోల్పోయారు. 1,10,700 మంది గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళలు, పిల్లలు ఉన్నారు. తమ సిబ్బందిలో 48 శాతం మంది ఇక ఈ ఘర్షణల బాధితులున్నారని, కొందరు మరణించగా, మరికొందరు గాయపడ్డారని, ఇంకొందరు నిర్బంధంలో ఉన్నారని గాజా సివిల్ డిఫెన్స్ ఏజెన్సీ తెలిపింది. గాజాలోని 85 శాతం వాహనాలు ధ్వంసమయ్యాయి. తమ 17 కార్యాలయాలు దెబ్బతిన్నాయని గాజా సివిల్ డిఫెన్స్ తెలిపింది. ఆదివారం కాల్పుల విరమణ ప్రారంభం కావడంతో స్థానికుల ముఖాల్లో ఆనందం వచ్చిచేరినా క్షేత్రస్థాయిలో పరిస్థితులను చూస్తే ఉన్న ఆ కాస్త ఆనందం కూరా ఆవిరయ్యే దుస్థితి దాపురించింది. గాజా అంతటా 60శాతం నిర్మాణాలు పూర్తిగా నేలమట్టమయ్యాయని ఐక్యరాజ్యసమితి గతంలో అంచనా వేసింది. చాలా ఆలస్యంగా కుదిరిన శాంతి ఒప్పందం అమలయ్యే నాటికి మరింతగా దాడులు జరగడంతో నేలమట్టమైన నిర్మాణాల సంఖ్య మరింత పెరిగింది. కూలిన ఇళ్ల కింద 10,000కు పైగా మృతదేహాలు ఉండొచ్చని ఏజెన్సీ అంచనావేస్తోంది.

తోంది. సొంతిళ్లు బాంబుదాడిలో ధ్వంసమయ్యాక శరణార్థి శిబిరాల్లో తలదాచుకున్నా సరే పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ వైమానిక బలగాలు వదిలేయలేదు. క్యాంప్‌లపై బాంబుల వర్షం కురిపించడంతో కళ్లముందే కుటుంబసభ్యులను కోల్పోయిన వారు ఇప్పుడు ఎంతో మానసిక వేదనను అనుభవిస్తున్నారు. యుద్ధభయం వారిని ఇంకా వెన్నాడుతోంది. మానసిక సమస్యలతో సతమతమవుతున్న వారిని పట్టించుకున్న నాథుడే లేడు. యుద్ధం ఆగాక సహాయక, అన్వేషణా బృందాలు అవిశ్రాంతంగా కష్టపడుతూ మరో గ్రామికయుద్ధం చేస్తున్నాయి. శిథిలాల కింద మృతదేహాల నుంచి వెలువడుతున్న దుర్వాసన మధ్యే వాళ్లు శిథిలా తొలగింపు పనులు చేస్తున్నారు. ''వీధిని చక్కదిద్దేందుకు ఏ వీధిలోకి వెళ్లినా మృతదేహాలే కనిపిస్తున్నాయి. కూలిపోయిన భవనాల కింద చాలా మంది చిక్కుకుని ఉండొచ్చు''అని గాజా సిటీలోని 24 ఏళ్ల సివిల్ డిఫెన్స్ కార్మికుడు అబ్దుల్లా అల్ మజ్దలావి చెప్పారు. 'నా కుటుంబం శిథిలాల కింద కూరుకుపోయింది, దయచేసి త్వరగా రండి''అంటూ కాల్పుల విరమణ తర్వాత కూడా స్థానికుల నుంచి తమకు నిరంతరాయంగా ఫోన్‌కాల్స్ వస్తున్నాయ ని సహాయక ఏజెన్సీ తెలిపింది.

కుప్పకూలిన వ్యవస్థలు

గాజా స్ట్రిప్ అంతటా ప్రజారోగ్య వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయింది. ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో సగం ఆస్పత్రులు ధ్వంసమయ్యాయి. మిగిలినవి సైతం పాక్షికంగానే పని చేస్తున్నాయి. వాటిల్లోనూ సాధారణ సూది మందు, బ్యాండేజీ, కాటన్ వంటి వాటినీ అత్యంత జాగ్రత్తగా, పొదుపుగా వాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వైద్యారోగ్య సంస్థలను మళ్లీ పునర్నిర్మించాల్సి ఉంది. రోడ్లు, మౌలిక సదుపాయాల పరిస్థితి మరీ అధ్వాన్నం. శిథిలాల తొలగించాక ఏర్పడిన కాలిబాటే ఇప్పుడు అక్కడ రోడ్డుగా ఉపయోగపడు

కాల్పులు ఇరువైపులా ఆగిపోవడంతో సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. ఇజ్రాయెల్ దాడుల నుంచి ఎలాగోలా తప్పించుకుని, గాయాలపాలుకాని స్థానికులు సైతం సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. శిథిలాల కింద మృతులను అన్నింటినీ తొలగించడానికి కనీసం వంద రోజులు సమయం పడుతుందని అన్వేషణా బృందాలు అంచనావేస్తున్నాయి. శిథిలాల తొలగింపునకు అవసరమైన బుల్డోజర్లు ఇతర పరికరాల కొరత తీవ్రంగా ఉంది. దీంతో వెలికితీత మరింత ఆలస్యమయ్యే అవకాశముంది. దాడుల ధాటికి అన్ని వాణిజ్య సముదాయాలు మూతపడటంతో పని దొరకడం కూడా కష్టంగా ఉంది. స్థానికులకు ఆదాయం కాదు కదా ఆశ్రయం కూడా లేకపోవడంతో గాజాలో బతకడం కూడా పెద్ద అస్తిత్వ పోరాటంగా తయారైంది. కాల్పుల విరమణ జరిగిన వెంటనే ఆహారం, నిత్యావసర వస్తువులు, ఔషధాలను మానవతా సంఘాలు అందించడం మొదలెట్టాయి. ఒక్క ఆదివారం రోజే 630 లారీల నిండా సరకులు గాజాలోకి ప్రవేశించాయి. సోమవారం మరో 915 లారీలు గాజాలోకి వెళ్లాయని ఐక్యరాజ్యసమితి తెలిపింది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి చూస్తే ఇంతటి భారీ స్థాయిలో మానవతా సాయం అందడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

నెమ్మదిగా మొదలైన సాయం



నిత్యావసరాలు, ఔషధాలతో గాజాలోకి ప్రవేశిస్తున్న ట్రక్కులు

పునర్నిర్మాణానికి చాలా సమయం

ధ్వంసమైన పాలస్తీనా భూభాగంలో పునర్నిర్మాణ ప్రక్రియకు చాలా సమయం పడుతుందని గాజాలోని ఐక్యరాజ్యసమితి పాలస్తీనా శరణార్థి సంస్థ ఉన్వ్రా తాత్కాలిక డైరెక్టర్ సామ్ రోజ్ తెలిపారు. ''గాజాలో ఆవాస వ్యవస్థ దాదాపు తుడిచిపెట్టుకుపోయింది. మళ్లీ కుటుంబాలు, కమ్యూనిటీలను పునర్నిర్మించాల్సిన అవసరం ఉంది. సహాయక చర్యలు మరింత పెరుగుతాయని ఆశిస్తున్నాం''అని ఆయన పేర్కొన్నారు. ప్రజల అత్యవసర అవసరాలను తీర్చడానికి, గాజా ప్రజారోగ్య వ్యవస్థను మళ్లీ గాడిన పెట్టేందుకు తొలి 60 రోజుల ప్రణాళిక ఉందని, వేలాది మంది జీవితాన్ని మార్చేసిన గాయాలను మాన్పేందుకు సిద్ధమవుతున్నామని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రాంతీయ డైరెక్టర్ హనన్ బాల్కీ ప్రకటించారు. ఈ ప్రణాళికలో భాగంగా గాజా స్ట్రిప్‌లో ఆస్పత్రులకు మరమ్మత్తు చేయడం, దాడుల్లో తీవ్రంగా ప్రభావితమైన ప్రాంతాల్లో తాత్కాలిక క్లినిక్‌లను ఏర్పాటు చేయడం, ప్రజల్లో పోషకాహార లోపాన్ని పరిష్కరించడం, అంటువ్యాధులు ప్రబలకుండా చూడటం వంటి వాటిపై ప్రధానంగా దృష్టిసారిస్తున్నామని బాల్కీ వెల్లడించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

అంబేడ్కర్‌ను అమిత్ షా అవమానించారు: ప్రియాంక

బెళగావి(కర్ణాటక): దేశ పార్లమెంట్ లోపల రాజ్యాంగాన్ని, బీఆర్ అంబేడ్కర్‌ను హోం మంత్రి అమిత్ షా అవమానించినంతగా గతంలో మరే ప్రభుత్వమూ అవమానించలేదని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా పేర్కొన్నారు. అంబేడ్కర్‌కు పార్లమెంట్‌లోనే ఇంతటి అవమానం జరుగుతుందని ప్రజలు ఎన్నడూ ఊహించనయినా లేదన్నారు. అమిత్ షా కేవలం అంబేడ్కర్‌నే కాదు, దేశ స్వాతంత్ర్యం కోసం సర్వస్వం త్యాగం చేసిన మహనీయులందరినీ అవమానించారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపర్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. 'అయితే, 2024 ఎన్నికల్లో ప్రధాని మోదీకి ప్రజలు గుణపాఠం చెప్పారు. దీంతో, పార్లమెంట్‌కు వచ్చిన మోదీ రాజ్యాంగం ఎదుట తలవంచారు. ఇది ప్రజల విజయం'అని ప్రియాంక పేర్కొన్నారు. మంగళవారం ఆమె బెళగావిలో ప్రభుత్వం నిర్వహించిన 'గాంధీ భారత్'కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 1924లో బెళగావిలో మహాత్మాగాంధీ అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశానికి వందేళ్లయిన సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటైంది.

వెస్ట్ బ్యాంక్‌పై ఇజ్రాయెల్ దాడులు ఆరుగురు మృతి, 35 మందికి గాయాలు

రమల్లా(వెస్ట్ బ్యాంక్): గాజాలో హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకున్న ఇజ్రాయెల్..ఇప్పుడు వెస్ట్ బ్యాంక్‌పై కన్నేసింది. మంగళవారం జెనిన్ నగరంపై భీకర దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో ఆరుగురు చనిపోగా 35 మంది వరకు క్షతగాత్రులయ్యారు. పాలస్తీనా మిలిటెంట్లపై చేపట్టిన కీలకమైన సైనిక ఆపరేషన్‌గా ఇజ్రాయెల్ ప్రకటించుకుంది. 1967లో జరిగిన పశ్చిమాసియా యుద్ధంలో వెస్ట్ బ్యాంక్, గాజా, తూర్పు జెరూసలేంలను ఇజ్రాయెల్ ఆక్రమించుకుంది. ఈ మూడు ప్రాంతాలను కలిపి స్వతంత్ర దేశంగా ఏర్పాటు చేయాలని పాలస్తీనియన్లు డిమాండ్ చేస్తున్నారు. కాగా, తాజా దాడిని హమాస్ ఖండించింది.

బాంబే హైకోర్టు సీజేగా జస్టిస్ అరాధే ప్రమాణం

ముంబై: తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ అలోక్ అరాధే మంగళవారం బాంబే హైకోర్టు సీజేగా ప్రమాణం చేశారు. రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ చీఫ్ జస్టిస్ అరాధేతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎంలు ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్, అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్, పలువురు మంత్రులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అంతకుముందు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సుజాతా సౌనిక్ ప్రధాన న్యాయమూర్తి నియామకంపై కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ను చదివి వినిపించారు.

ఇండోనేసియాలో వరద బీభత్సం 17 మంది మృతి, 8 మంది గల్లంతు

జకార్తా: ఇండోనేసియాలో సోమవారం ఆకస్మికంగా సంభవించిన వరదలు, కొండచరియలు విరిగి పడిన ఘటనల్లో 17 మంది మృతి చెందగా, మరో 8 మంది కనిపించకుండాపోయారు. దేశంలోని ప్రధాన దీవి జావాలోని కొండ ప్రాంత గ్రామాలను బురద మట్టి, రాళ్లు కప్పేశాయని అధికారులు తెలిపారు. పెటుంగ్‌క్రియోనో గ్రామంలోనే ఎక్కువ నష్టం సంభవించిందన్నారు. బురద, మట్టి కింద సజీవ సమాధి అయిన 17 మృతదేహాలను వెలికి తీశామని, మరో 8 మంది జాడ తెలియాల్సి ఉందన్నారు. మరో 11 మంది గాయాలతో బయటపడ్డారని చెప్పారు. సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. వాతావరణం అనుకూలించకపోవడంతో సహాయక చర్యలకు అంతరాయం కలుగుతోందని చెప్పారు. నది ఒడ్డున నివాసాలు ఏర్పాటు చేసుకున్న మత్స్యకారులే ఆకస్మిక వర దలకు బలయ్యారన్నారు. పెకలొంగన్ జిల్లాలో రెండు వంతెనలు కొట్టుకుపోగా, రెండు ఇళ్లను పూర్తిగా కొండ చరియలు కప్పేశాయని అధికారులు చెప్పారు.

ఉషను ఉపాధ్యక్షురాలిగా చేసేవాడిని

ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సతీమణిని పొగిడిన ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణంచేశాక డొనాల్డ్ ట్రంప్ ప్రసంగిస్తూ తన మిత్రబృందాన్ని పొగిడారు. ముఖ్యంగా ఉపాధ్యక్షుడిగా ప్రమాణంచేసిన జేడీ వాన్స్ దంపతులను ప్రత్యేకంగా ప్రశంసల్లో ముంచెత్తారు. అమెరికా పార్లమెంట్ భవనంలోని రొటుండా హాల్‌లో అధ్యక్షుడి ప్రమాణస్వీకారం పూర్తవగానే ట్రంప్ ఉపన్యసించారు. ''రాజకీయనేతగా జేడీ వాన్స్‌ను మొదట్నుంచీ గమనిస్తున్నా. ఒహాయోలో ఆయనకు మద్దతుగా నిల్చున్నా. ఆయన గొప్ప సెనేటర్. తెలివైన నాయకుడు. ఇందులో విశేషమేమంటే ఆయన భార్య ఉషా సైతం తెలివైన వ్యక్తే''అని అన్నారు. జేడీ వాన్స్ వైపు చూస్తూ.. ''ఆమెకున్న తెలివితేటలకు నిజానికి ఉషానే నేను ఉపాధ్యక్షురాలిగా చేసేవాడిని. కానీ అమెరికా నిబంధనలు అందుకు ఒప్పుకోవుగా''అని ట్రంప్ సరదాగా నవ్వుతూ పొగడటంతో అక్కడున్నవారంతా ట్రంప్‌తో పాటు నవ్వులు చిందించారు. ''ఈమె గ్రేట్. ఈయన కూడా గ్రేట్. వీళ్లది అద్భుతమైన, అందమైన జోడీ. నమ్మశక్యంకానంతటి గొప్ప కెరీర్ వీళ్లది''అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడి సతీమణిని 'ఫస్ట్ లేడీ'గా సంబోధిస్తారు. అలాగే ఉపాధ్యక్షుడి భార్యగా 'సెకండ్ లేడీ'హోదాతో గౌరవిస్తారు. ఈ హోదా పొందిన తొలి భారతీయ అమెరికన్‌గా, తొలి హిందువుగా ఉషా చరిత్ర సృష్టించిన విషయం తెల్సిందే.

కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య

- ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు రూ.10 లక్షల బీమా
- ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ రెండో మేనిఫెస్టో విడుదల
- ఇది దేశానికే ప్రమాదకరమన్న ఆప్ చీఫ్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధాన ప్రత్యర్థులు ఆప్, బీజేపీ, కాంగ్రెస్‌లు పోటాపోటీగా ఉచితాల వర్షం కురిపిస్తున్నాయి. ఇప్పటికే ఒకసారి ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించిన బీజేపీ, తాజాగా మంగళవారం రెండో మేనిఫెస్టోను విడుదల చేసింది. నిరుపేద కుటుంబాలకు చెందిన వారికి కేజీ నుంచి పీజీ వరకు ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఉచిత బోధన, ఇళ్లలో పని చేసేవారు, ఆటో– ట్యాక్సీ డ్రైవర్లకు రూ. 10 లక్షల బీమాతోపాటు రూ.5 లక్షల ప్రమాద బీమా కవరేజీ, యూపీఎస్సీ అభ్యర్థులకు ఒకే విడతలో రూ.15 వేల ఆర్థిక సాయం అందజేత వంటివి ఇందులో ప్రధానంగా ఉన్నాయి. బీజేపీ మేనిఫెస్టో సంకల్ప్ పత్రను కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్ విడుదల చేశారు. అమలు చేయబోయే పథకాలకు సంబంధించిన విధివిధానాలను అధికారంలోకి వచ్చాక ప్రకటిస్తామన్నారు. అంతేకాదు, ఢిల్లీలో తాము అధికారంలోకి వస్తే ఆప్ ప్రభుత్వం పాల్పడిన కుంభకోణాలు, అవకతవకలపై దర్యాప్తును సిట్‌ను ఏర్పాటు చేస్తామని కూడా ఈ సందర్భంగా ప్రకటించారు. యూపీఎస్సీతోపాటు రాష్ట్ర సివిల్ సర్వీసెస్ పరీక్షలకు హాజరయ్యే వారికి ప్రయాణ భత్యాలను రెండు పర్యాయాలు అందజేస్తామన్నారు. ఇళ్లలో పనులు చేసుకునే వారికి, ఆటో–ట్యాక్సీ డ్రైవర్ల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేస్తామని ఠాకూర్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టైపెండ్ యోజన కింద పాలిటెక్నిక్, స్కిల్ సెంటర్లలో చదువుకునే ఎస్సీ విద్యార్థులకు నెలకు రూ.వెయ్యి అందించనున్నామన్నారు. ఇళ్లలో పనిచేసే మహిళలకు వేతనంతో కూడిన ఆరు నెలల మ్యాటర్నిటీ లీవ్ వెసులుబాటు కూడా ఇస్తామని చెప్పారు. పీఎం స్వనిధి పథకం కింద లబ్ధి పొందే వీధి వ్యాపారుల సంఖ్య రెట్టింపు కానుందని ఠాకూర్ వివరించారు. బీజేపీ మొదటి మేనిఫెస్టో సంకల్ప్ పత్ర–1ను గత వారం పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా విడుదల చేశారు. ఇందులో మహిళలకు నెలకు రూ.2,500 సాయంతోపాటు ఆప్ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని రకాల సంక్షేమ పథకాల కొనసాగింపు వంటివి ఉన్నాయి. కాగా, బీజేపీ రెండో మేనిఫెస్టోపై ఆప్ చీఫ్, మాజీ సీఎం కేజ్రీవాల్ స్పందించారు. బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో దేశానికే ప్రమాదకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య, మొహల్లా క్లినిక్‌లలో ఉచిత వైద్య వంటి పథకాలను రద్దు చేయడానికి బీజేపీ పథకం వేసిందని ఆరోపించారు. బీజేపీ కుట్రలను ప్రజలు గమనించాలన్నారు.

ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో మోదీ, అమిత్ షా

సాక్షి, న్యూఢిల్లీ: ఈ సారి జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి ఢిల్లీలో అధికారం చేజిక్కించుకునేందుకు బీజేపీ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో ప్రచారం కోసం స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీని రంగంలోకి దించబోతున్నది. అలాగే.. హోంశాఖ మంత్రి అమిత్ షాతో పాటు బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సహా పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలువులు కేంద్ర మంత్రులు బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించనున్నారు.

మూడు దిక్కులు మూడు సభల్లో ప్రధాని

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ సహా.. కేంద్ర మంత్రులు, బీజేపీకి చెందిన కీలక నేతలు అంతా బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో జనవరి 26 తర్వాత ఢిల్లీలో బీజేపీ ప్రచార జోరు పెంచనుంది. ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీలోని మూడు దిక్కుల్లో మొత్తం మూడు సభల్లో ప్రసగించనున్నారు. ఈ నెల 29, 31, ఫిబ్రవరి 2వ తేదీల్లో ఈశాన్య ఢిల్లీలోని యమునా ఖాదర్, తూర్పు ఢిల్లీలోని కర్కర్‌డూమ, పశ్చిమ ఢిల్లీలోని ద్వారకలో నిర్వహించనున్న సభల్లో ప్రధాని పాల్గొనే అవకాశముంది. మరోవైపు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా 4 సభలు, మరో 4 రోడ్ షోల్లో, బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా 15 సభల్లో పాల్గొనేలా బీజేపీ ప్రణాళిక సిద్ధం చేసింది.

ఇష్టసఖితో నచ్చిన డ్యాన్స్



అమెరికా అధ్యక్షునిగా ప్రమాణంచేశాక డొనాల్డ్ ట్రంప్ తన సతీమణి మెలానియాతో కలిసి 'కమాండర్ ఇన్ చీఫ్ బాల్' వేదికపై డ్యాన్స్ చేస్తున్న దృశ్యం. ఫొటోలో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఆయన సతీమణి ఉష సైతం ఉన్నారు. అమెరికా సైనికులకు గౌరవసూచికగా 'కమాండర్ ఇన్ చీఫ్ బాల్'లో అధ్యక్ష, ఉపాధ్యక్షులు డ్యాన్స్ చేయడం ఆనవాయితీగా వస్తోంది. అమెరికా సైనిక వాయిద్య బృందాల సంగీతానికి లయబద్ధంగా అగ్రనేతలు కాలుకదిపారు. ఎల్విస్ ' యాన్ అమెరికన్ ట్రైలజీ' పాటకు అనుగుణంగా ట్రంప్ దంపతులు డ్యాన్స్ చేశారు. వాషింగ్టన్ డీసీలో ఈ కార్యక్రమం జరిగింది.

ఉరిశిక్ష వేయండి

ఆర్‌జీ కర్ దోషి విషయంలో హైకోర్టును ఆశ్రయించిన బెంగాల్ ప్రభుత్వం

కోల్‌కతా: దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన, వైద్యలోకం ఉద్యమించిన కోల్‌కతా ఆర్‌జీ కర్ బోధనాస్పత్రి జూనియర్ వైద్యురాలి హత్యోదంతంలో దోషి సంజయ్ రాయ్‌కు ఉరిశిక్ష విధించాలంటూ పశ్చిమబెంగాల్ ప్రభుత్వం మంగళవారం కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది. దోషికి యావజ్జీవ కారాగార శిక్ష ఖరారుచేస్తూ సియల్దా అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి అనిర్బన్ దాస్ సోమవారం తీర్పు చెప్పడం తెల్సిందే. విధి నిర్వహణలో ఉన్న యువ వైద్యురాలిని అత్యంత కర్కశంగా అంతమొందించిన నేరానికి జీవితఖైదు సరిపోదని, ఉరిశిక్ష వేయాలంటూ తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ కిశోర్ దత్తా హైకోర్టును కోరారు. సియల్దా కోర్టు తీర్పుపై సవాల్ చేసేందుకు తొలుత అనుమతి కోరగా అందుకు హైకోర్టు అంగీకరించింది. సోమవారం వెలువడిన తీర్పుపై తాము అసంతృప్తితో ఉన్నామని, హైకోర్టులో తీర్పును సవాల్‌చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించిన 24 గంటల్లోపే ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించడం గమనార్హం. ప్రభుత్వం మంగళవారం రాత్రికల్లా అప్పీల్‌ను దాఖలుచేస్తుందని ప్రభుత్వ అధికారి ఒకరు చెప్పారు. బుధవారం ఈ అప్పీల్‌పై వాదనలు ఉండొచ్చని హైకోర్టు వర్గాలు పేర్కొన్నాయి.

రుగ్వేదంలో వ్యవసాయదారుడిని ఏ పేరుతో సూచించారు?

వైదిక నాగరికత - 2



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

తొలి వేద కాలంలో ఆర్యులు ప్రధానంగా సప్త సింధూ ప్రాంతానికే పరిమితమయ్యారు. తూర్పున యమునా నదిని దాటి విస్తరించలేదు. అందుకే తొలివేద కాలానికి చెందిన రుగ్వేదంలో సింధూ, దాని ఐదు ఉపనదులతోపాటు సరస్వతిని అధికంగా ప్రస్తావించారు. కానీ మలివేద కాలానికి ఆర్యులు యమునా నదిని దాటి గంగామైదాన ప్రాంతానికి విస్తరించారు. ఈ భౌగోళిక విస్తరణతో పాటే మలివేద కాలం నాటికి ఆర్యుల ఆర్థిక, సామాజిక, రాజకీయ, మత వ్యవస్థల్లో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి.

వైదిక నాగరికత లక్షణాలు

సామాజిక వ్యవస్థ: ఆర్యులు భారతదేశంలో వర్ణ వ్యవస్థను ప్రవేశపెట్టారు. సమాజాన్ని నాలుగు వర్ణాలుగా విభజించారు. ఇందులో మొదటి మూడు వర్ణాలైన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులను ద్విజులుగా పరిగణించారు. నాలుగో వర్ణమైన శూద్రులు రుగ్వేద కాలం చివరలో కనిపిస్తారు. అయితే ఈ వర్ణ వ్యవస్థ అంత కఠినంగా లేదు. ఏ వర్ణం వారైనా ఏ వృత్తినైనా చేపట్టవచ్చు. వర్ణాంతర వివాహాలు అధికంగానే జరిగేవి. అయితే అనులోమ వివాహాల సంఖ్య అధికంగా ఉంది. ఆనాటి సమాజంలో పైన పేర్కొన్న నాలుగు వర్ణాలతోపాటు దస్యులు అనే మరొక వర్గం కూడా ఉంది. వీరు ఆర్యుల చేతిలో ఓడిపోయిన స్థానిక ప్రజలు. వాస్తవంగా 'వర్ణం' అనే పదానికి రంగు అని అర్థం. నలుపు వర్ణంలో ఉన్న స్థానిక ప్రజలను సూచించేందుకు దీన్ని వాడారు. నాటి సమాజంలో స్త్రీలకు గౌరవప్రదమైన స్థానం ఉండేది. పాలనా సభల్లో కూడా మహిళలకు ప్రాతినిధ్యం ఉంది. స్త్రీలు భర్తతోపాటు యజ్ఞయాగాది క్రతువుల్లో పాల్గొనేవారు. తమ జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవడంలోనూ స్వేచ్ఛ ఉండేది. వీరికి విద్యా హక్కు కూడా ఉండేది. ఉన్నత విద్యను అభ్యసించిన 20 మంది మహిళా మేధావుల ప్రస్తావన రుగ్వేదంలో కనిపిస్తోంది. బాల్య వివాహాలు, సతీ సహగమనం వంటి దురాచారాలకు తావు లేదు. వితంతు పునర్వివాహాలకు, నియోగ వివాహాలకు అవకాశముండేది. అపాల, విశ్వవర, ఘోష మొదలైన బ్రహ్మవాదినులు.. జీవితాంతం వివాహం లేకుండా విద్యార్జనకే తమ జీవితాలను అంకితం చేసినట్లు తెలుస్తోంది. రుగ్వేదంలోని చాలా శ్లోకాలను మహిళలే రచించారని చరిత్రకారుల అభిప్రాయం. బృహదారణ్యక ఉపనిషత్‌లో గార్గి అనే బ్రహ్మవాదినికి యజ్ఞవల్క్య మహర్షికి మధ్య జరిగిన చర్చల ప్రస్తావన ఉంది.

మలివేద కాలం నాటికి చాతుర్వర్ణ వ్యవస్థ బాగా స్థిరపడింది. వర్ణ వ్యవస్థ కఠినంగా మారింది. దీనికి తోడు వర్ణాశ్రమ ధర్మ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. దీని ప్రకారం జీవితాన్ని బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం, సన్యాసం అనే నాలుగు దశలుగా విభజించారు. ఒకే వర్ణానికి చెందిన వారి మధ్య మాత్రమే వివాహాలను అనుమతించేవారు. గోత్ర సంప్రదాయం అమల్లోకి వచ్చింది. ఒకే గోత్రానికి చెందిన వారి మధ్య వివాహాలను అనుమతించేవారు కాదు. వర్ణాంతర వివాహాలు నిషేధించినా అవి ఆగలేదు. అందుకే వర్ణ సంకర సిద్ధాంతాన్ని రూపొందించారు. ఈ కాలంలోనే అష్ట వివాహ పద్ధతి ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇందులో బ్రహ్మ, దైవ, అర్ష, ప్రజాపత్య, గాంధర్వ, అసుర, రాక్షస, పైశాచ అనే 8 రకాల పద్ధతులున్నాయి. వీటిలో గాంధర్వ, రాక్షస వివాహాలకు క్షత్రియులను అనుమతించారు. వర్ణాంతర వివాహాల వల్ల సమాజంలో అనేక మిశ్రమ కులాలు వచ్చి చేరాయి. రుగ్వేద కాలంతో పోలిస్తే స్త్రీల గౌరవ మర్యాదలు క్షీణించాయి. వారిపై అనేక రకాలైన ఆంక్షలను విధించారు. స్త్రీలకు సంబంధించి అనేక సామాజిక దురాచారాలు ప్రారంభమయ్యాయి. బాల్య వివాహాలు,సతీ సహగమనం, వితంతు వివాహాలను నిషేధించారు. వేదాధ్యయనం చేసే అవకాశం స్త్రీలకు లేదు. పున్నామ నరకాన్ని తప్పించేవాడు అని పుత్ర సంతానానికి ప్రాధాన్యం పెరిగింది. సభ, సమితి వంటి వాటిలోనూ స్త్రీలకు సభ్యత్వం లేకుండా పోయింది.

ఆర్థిక వ్యవస్థ: రుగ్వేద ఆర్యుల ప్రధాన వృత్తి పశుపోషణ. కాబట్టి గోవులకు అమిత ప్రాధాన్యతనిచ్చారు. రుగ్వేదంలో 'గోవ్' అనే పదాన్ని 176 సార్లు ప్రస్తావించారు. వీరి సంపదకు మూలం పశువులే. కాబట్టి పశువుల దొంగతనాలను ఘోరాపరాధంగా పరిగణించేవారు. ఈ నేరానికి కఠినమైన శిక్షలుండేవి. ఆ కాలంలో 'పాణిలు' అనేవారు పశువుల దొంగతనాలకు పాల్పడేవారు. పశు సంపదను రక్షించడం రాజన్ ముఖ్య విధి. కాబట్టి రాజన్‌ను 'గోప, గోపతి' అనే పేర్లతో పిలిచేవారు. సంపన్నమైన వ్యక్తిని 'గోమత్' అనేవారు. 'గవిష్టి' అంటే గోవుల కోసం చేసే యుద్ధం లేదా గోవుల కోసం వెదకడం అని అర్థం. ఈ విధంగా వీరి ఆర్థిక వ్యవస్థలో సమస్త పదాలు గోవులతో ముడిపడి ఉండడాన్ని బట్టి చూస్తే పశువులు రుగ్వేదార్యుల ఆర్థిక వ్యవస్థలో ముఖ్య స్థానం ఆక్రమించినట్లు తెలుస్తోంది. పశుపోషణ తర్వాత ఆర్యుల ప్రధాన వృత్తి వ్యవసాయం. ఇంకా స్థిర జీవనం ఏర్పడనందున వ్యవసాయాన్ని పరిమితంగానే చేపట్టారు. వీరి ముఖ్య పంటలు గోధుమ, బార్లీ. తొలివేద కాలంలో అనేక రకాల చేతివృత్తుల వారు ఉన్నారు. చేతివృత్తుల్లో రథాలను తయారు చేసే రథకారులకు (వడ్రంగులు) ప్రముఖ స్థానముండేది.

ఇంకా ఇతర వృత్తుల్లో వస్త్రాలు, కుండలు, చర్మ వస్తువుల తయారీ మొదలైనవి పేర్కొనదగినవి. లోహాన్ని 'ఆయాస్' అని పిలిచారు. లోహ వస్తువులను తయారు చేసేవారిని 'కర్మార' అనేవారు. ఆ కాలంలో రాగి లేదా కంచును అధికంగా ఉపయోగించారు. తొలివేద కాలంలో పరిమిత స్థాయిలో వ్యాపార, వాణిజ్యాలు జరిగాయి. రుగ్వేదంలో 'నిష్క' అనే నిర్దిష్ట విలువ కలిగిన బంగారు ఆభరణం గురించి ప్రస్తావన ఉంది. దీన్ని నాణెంగా ఉపయోగించారని కొందరి అభిప్రాయం. అయినప్పటికీ వాణిజ్యం ప్రధానం వస్తు మార్పిడి పద్ధతిలోనే జరిగేది. వేదాల్లో 'ఫణి' అనే అనార్య జాతికి చెందిన వ్యాపారస్థుల ప్రస్తావన ఉంది.

మలివేద కాలానికి ఆర్యుల ఆర్థిక జీవనంలో పెనుమార్పులు సంభవించాయి. దీనికి ప్రధాన కారణం వీరు సప్త సింధూ నుంచి ప్రపంచంలోనే అత్యంత సారవంతమైన గంగా మైదానానికి విస్తరించడమే. ఈ విస్తరణకు ఇనుప పరిజ్ఞానం తోడై ఆర్యుల ఆర్థిక వ్యవస్థ వ్యవసాయాధార ఆర్థిక వ్యవస్థగా మారడానికి కారణమైంది. ఇనుమును వీరు 'కృష్ణ ఆయా' లేదా 'శ్యామ ఆయా' అని పిలిచారు. ఇనుప నాగళ్ల ఉపయోగం ప్రారంభమైంది. శతపథ బ్రాహ్మణంలో వివిధ రకాలైన వ్యవసాయ కార్యకలాపాల గురించిన ప్రస్తావన ఉంది. గోధుమ, బార్లీతోపాటు వరి ప్రధాన పంటగా రూపొందింది. ఈ వ్యవసాయాభివృద్ధి వల్ల ఆర్యుల సంచార జీవితం అంతమై స్థిర జీవనం ప్రారంభమైంది. తొలివేద కాలంతో పోలిస్తే వృత్తుల సంఖ్య కూడా పెరిగింది. లోహకారులకు ప్రాధాన్యం పెరిగింది. ఈ అభివృద్ధి అంతా కలిసి చిన్న చిన్న పట్టణాలు ఏర్పడటానికి దారి తీసింది. మలివేద గ్రంథాల్లో కనిపించే 'నగరం' అనే పదాన్ని ఈ పట్టణాలకు సంకేతంగా భావించవచ్చు. అయితే వాస్తవంగా పట్టణాలు ఏర్పడింది మాత్రం మలివేద యుగం చివరలో మాత్రమే. మలివేద గ్రంథాల్లో పేర్కొన్న కొన్ని ముఖ్య పట్టణాలు.. కాశీ, కౌశాంబి, వైదేహ, అయోధ్య, హస్తినాపూర్, ఇంద్రప్రస్థ మొదలైనవి. విస్తృత వ్యవసాయం, స్థిరమైన జీవన విధానం,పట్టణ జీవితం, చేతి వృత్తులు ఇవన్నీ కలిసి వ్యాపార వాణిజ్యాల అభివృద్ధికి దోహదపడ్డాయి. దీంతో వ్యాపార నిర్వహణకు వ్యాపారస్తులు 'శ్రేణులు' లేదా 'గణ'లుగా ఏర్పడ్డారు. రుగ్వేద కాలపు నిష్కతోపాటు అనేక రకాలైన నాణేలు వచ్చాయి. అవి.. శతమాన, క్రిష్ణాల, సువర్ణ, హిరణ్య పిండ మొదలైనవి. బృహదారణ్యక ఉపనిషత్‌లో 'పడ' అనే నాణెం ప్రస్తావన ఉంది. అయితే వాస్తవంగా ఇవన్నీ నిర్ణీత విలువ కలిగిన ఆభరణాలు మాత్రమే. అసలైన నాణేలు వాస్తవంగా క్రీ.పూ. 6వ శతాబ్దంలో ప్రారంభమయ్యాయి. అవే విద్ధాంక నాణేలు. అధర్వణ వేదం సంతల గురించి, అక్కడి సందడిని గురించి ప్రస్తావిస్తోంది. ఈ కాలంలో వడ్డీ వ్యాపారం కూడా ఒక వృత్తిగా గుర్తింపు పొందింది. వడ్డీ వ్యాపారిని 'కుసిదిన్' అని పిలిచేవారు.

రాజకీయ వ్యవస్థ: రుగ్వేద కాలంలో పూర్తిస్థాయి రాచరిక వ్యవస్థ ఏర్పడలేదు. పాలక వర్గాలను రాజన్య అని పిలిచేవారు. ఈ వర్గాల నుంచే రాజన్‌ను ఎన్నుకునేవారు. రాజన్‌ను రాజుగా కంటే తెగ నాయకుడిగా పరిగణించడమే సబబుగా ఉంటుంది. రాజన్ ముఖ్య విధి ప్రజలను కాపాడడంతోపాటు వారి ప్రధాన సంపద అయిన గోవులను దొంగిలించకుండా కాపాడటం. దీని కోసం గూఢచారులను నియమించేవారు. ఇంకా పురోహితుడు, సేనాపతి, ప్రజాపతి మొదలైన వారు రాజుకు సహాయకులుగా ఉండేవారు. 'ప్రజాపతి' ముఖ్య విధి గడ్డి మైదానాల పర్యవేక్షణ. రుగ్వేద కాలంలో వశిష్ఠుడు, విశ్వామిత్రుడు ప్రసిద్ధి చెందిన పురోహితులు. దశరాజ యుద్ధానికి వీరు పరోక్ష కారకులు. రుగ్వేద కాలంలో కుటుంబాన్ని 'కుల' అన్నారు. కుటుంబ పెద్దను 'కులప' అని పిలిచేవారు. కొన్ని కులాల కలయికతో ఏర్పడేదే గ్రామం. దీనికి 'గ్రామణి' అధిపతిగా ఉండేవాడు. కొన్ని గ్రామాల సమూహాన్ని 'విస్' అనేవారు. దీనికి విస్పతి అధిపతిగా ఉండేవాడు. ఇలాంటి విస్‌ల సముదాయంతో 'జన' లేదా 'తెగ' ఏర్పడుతుంది. దీని నాయకుడే 'రాజన్'. అయితే రుగ్వేద కాలంలో రాజన్ అధికారం అపరిమితమైంది కాదు. సభ, సమితి, విధాత, గణ అనే ప్రజా సభలు రాజన్ అధికారాన్ని నియంత్రించేవి. రుగ్వేదంలో బలి, భాగ అనే పన్నుల ప్రస్తావన ఉంది. ఇవి వాస్తవంగా పన్నులు కావు. 'బలి' అనేది ప్రజలు రాజుకు ఇచ్చే కానుకలు. 'భాగ' అనేది యుద్ధంలో కొల్లగొట్టిన సంపదలో రాజు వాటా.

మలివేద కాలానికి ఆర్యులు స్థిర జీవనానికి అలవాటు పడ్డారు. కాబట్టి రుగ్వేద కాలం నాటి తెగల ఆధారిత పాలనా వ్యవస్థ స్థానంలో ప్రదేశం ఆధారిత పాలనా వ్యవస్థ ఏర్పడింది. వీటినే 'జనపదాలు' అంటారు. ఈ కాలంలో రాజన్ కేవలం గోవులను రక్షించే గోపతి మాత్రమే కాదు.. సుశిక్షిత సైన్యాన్ని కలిగి ఉండి పక్క రాజ్యాలను ఆక్రమించే స్థాయికి ఎదిగాడు. దీనికోసం రాజసూయ, అశ్వమేధ, వాజపేయ వంటి యజ్ఞ, యాగాలూ ప్రారంభమయ్యాయి. రాజుపై నియంత్రణాధికారమున్న సభలు క్షీణించి సభ, సమితులు మాత్రమే మిగిలాయి. అవి కూడా నామమాత్రపు సలహా మండళ్లుగా మారిపోయాయి. దీనివల్ల సభలతో ఎంపికయ్యే రాజన్ పదవి వంశపారంపర్య పదవిగా మారిపోయింది. ఈ కాలంలో రాజుకు సహాయ సహకారాలు అందించేందుకు 'ద్వాదశ రత్నిన్' అనే మంత్రి మండలి ఏర్పడింది. వీరిలో ప్రధాన పురోహితుడు, పట్టమహిషి, సేనాని, సూత, సంగ్రహిత్రి, భాగదుఘ, అక్షావాప, గోవికర్తన, గ్రామణి మొదలైనవారు సభ్యులుగా ఉండేవారు. బలి, భాగ అనేవి పూర్తిస్థాయి పన్నులుగా మారాయి. వాటి వసూలుకు భాగదుఘ అనే అధికారి ఉండేవాడు. అయినప్పటికీ ఈ కాలానికి పూర్తిస్థాయి అధికార యంత్రాంగం మాత్రం ఏర్పడలేదు.

మత వ్యవస్థ: రుగ్వేద కాలపు ఆర్యులు ప్రకృతి శక్తులను అర్థం చేసుకోలేకపోవడంతో వాటికి దైవత్వాన్ని ఆపాదించారు. మానవ రూపమిచ్చి పూజించారు. రుగ్వేదంలో మొత్తం 33 మంది దేవతల ప్రస్తావన ఉంది. వీరందరిలో అతిముఖ్య దైవం ఇంద్రుడు లేదా పురంధరుడు. ఇతడు యుద్ధ దేవత. రెండో ముఖ్య దైవం అగ్ని. ఇతడిని మానవులకు, దేవతలకు మధ్య వారధిగా భావించారు. వరుణుడు ప్రకృతిని క్రమబద్ధీకరించే దేవత. ఇంకా సోమ, ఉషస్, అదితి, పృథ్వీ, అరణ్యాని మొదలైన దేవతల ప్రస్తావన ఉంది. వీరి పూజా విధానంలో భక్తికి ప్రాధాన్యముండేది. భక్తి శ్లోకాలను ఆలపించడం, కానుకలను సమర్పించడం ద్వారా దేవతలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించారు. తమకు ప్రీతిపాత్రమైన సోమ, సుర అనే పానీయాల్ని నైవేద్యంగా సమర్పించేవారు. వీరు ప్రధానంగా సంతానం, పశు సంపద కోసం దేవతలను ప్రార్థించారు.

మలివేద కాలానికి రుగ్వేదపు ప్రధాన దేవతల ప్రాధాన్యత తగ్గిపోయింది. ఇంద్రుడు, అగ్ని వంటి దేవతల స్థానాన్ని త్రిమూర్తులు ఆక్రమించారు. రుగ్వేదపు ప్రధాన దేవతలు అష్టదిక్పాలకులుగా మారిపోయారు. సృష్టికర్త అయిన ప్రజాపతి ప్రధాన దేవతగా, రుద్రుడు, విష్ణువు మొదలైనవారు ఇతర ముఖ్య దేవతలుగా అవతరించారు. ఈ కాలంలో వచ్చిన మరొక ముఖ్యమైన మార్పు వర్గాల వారీగా దేవతలు ఏర్పడటం. ఈ విధంగా ఏర్పడిన దేవతే 'పుషాన్' అనే శూద్రుల దేవత. ఆర్యుల పూజా విధానంలోనూ మార్పులు సంభవించాయి. భక్తి ప్రాధాన్యత తగ్గి యజ్ఞ యాగాలు, బలిదానాలకు ప్రాధాన్యత పెరిగింది. విపరీతమైన జంతు బలుల వల్ల పశు సంపదకు పెద్ద నష్టం వాటిల్లింది. మోక్ష మార్గం సంక్లిష్టం, వ్యయభరితం అవడమే కాకుండా శూద్రులు, స్త్రీలు వంటి కొన్ని వర్గాలకు మోక్ష మార్గాన్ని నిరాకరించారు. మలివేద కాలంలోని మత వ్యవస్థలో చోటు చేసుకున్న ఈ పరిణామాలన్నీ కలిసి వైదిక యుగం చివరినాటికి అంటే క్రీ.పూ. 6వ శతాబ్దం నాటికి వైదిక మతంపై తిరుగుబాటుగా అనేక మత ఉద్యమాలు రావడానికి కారణమయ్యాయి.

మాదిరి ప్రశ్నలు

1. వేద కాలం నాటి 'పాణిలు' అంటే?
   1) నాణేలు 2) సైనిక వర్గం
   3) వ్యాపారులు 4) పశువుల దొంగలు
2. రుగ్వేదంలో వ్యవసాయదారుడిని ఏ పేరుతో సూచించారు?
   1) కినాస 2) శూద్ర 3) క్షేత్రక 4) కర్షక
3. తప్పుగా జతపర్చిన దాన్ని గుర్తించండి?
   1) గోఘన - అతిథి
   2) దౌహిత్రి - కూతురు
   3) గోప - పశుకాపరి
   4) గవిష్టి - యుద్ధం
4. వీరిలో పురోహితుల దైవం?
   1) ఇంద్రుడు 2) అగ్ని
   3) వరుణుడు 4) సూర్యుడు
5. వైదిక యుగంలోని ఏ సభలను ప్రజాపతి (బ్రహ్మ) పుత్రికలుగా భావిస్తారు?
   1) సభ, సమితి 2) సమితి, విధాత
   3) విధాత, గణ 4) గణ, పరిషత్
6. వేద కాలంలో ఏ వృత్తి వారికి ఉపనయనం ధరించే అర్హతను కల్పించారు?
   1) స్వర్ణకారులు 2) రథకారులు
   3) చర్మకారులు 4) లోహకారులు
7. వీటిలో సరైన జతను గుర్తించండి?
   1) కులాల-కుండలు తయారు చేసేవారు
   2) నిషాద - చేపలు పట్టేవారు
   3) కైవర్త - బుట్టలు అల్లేవారు
   4) వేణ - వేటాడేవారు

సమాధానాలు

1) 4; 2) 1; 3) 3; 4) 2;
5) 1; 6) 2; 7) 1

విద్య, ఉద్యోగ సమాచారం

సీఎస్ఐఆర్-ఎన్ఈఐఎస్‌టీ, అస్సాంలో 12 పోస్టులు

అస్సాంలోని సీఎస్ఐఆర్-నార్త్ ఈస్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఎన్ఈఐఎస్‌టీ).. జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, జూనియర్ స్టెనో గ్రాఫర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 12.
- **పోస్టుల వివరాలు:** జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్-08, జూనియర్ స్టెనోగ్రాఫర్-04.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి/ఇంటర్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 14.02.2025 నాటికి జూనియర్ స్టెనో గ్రాఫర్ పోస్టుకు 27 ఏళ్లు, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్‌కు 28 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు జూనియర్ స్టెనోగ్రాఫర్ పోస్టుకు రూ.25,000 నుంచి రూ.81,100, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ పోస్టుకు రూ.19,900 నుంచి రూ.63,200.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ప్రొఫెషియన్సీ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.02.2025
- **వెబ్‌సైట్:** www.neist.res.in

జీఎస్‌వీ, గుజరాత్‌లో 21 నాన్ టీచింగ్ పోస్టులు

గుజరాత్ రాష్ట్రం వడోదరలోని లాల్‌బాగ్‌లో ఉన్న గతిశక్తి విశ్వవిద్యాలయ (జీఎస్‌వీ)లో డిప్యుటేషన్/డైరెక్ట్ ప్రాతిపదికన నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 21.
- **పోస్టుల వివరాలు:** చీఫ్ ఫైనాన్స్-అకౌంట్స్ ఆఫీసర్-01, జాయింట్ రిజిస్ట్రార్-02, డిప్యూటీ రిజిస్ట్రార్-02, డిప్యూటీ లైబ్రేరియన్-01, సీనియర్ టెక్నాలజీ ఆఫీసర్-01, సీనియర్ అకౌంట్ ఆఫీసర్-01, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(సివిల్)-01, సీనియర్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్-01, అసిస్టెంట్ రిజిస్ట్రార్-03, ఐటీ అండ్ సిస్టమ్ ఆఫీసర్-01, అసిస్టెంట్ డైరెక్టర్ ఫిజికల్ ఎడ్యుకేషన్-01, అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)-01, అసిస్టెంట్ లైబ్రేరియన్-01, అసిస్టెంట్ ప్రోగ్రామర్-01, సీనియర్ సెక్షన్ ఆఫీసర్-01, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్-01, ప్లేస్‌మెంట్ ఆఫీసర్-01.
- **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంబీఏ/సీఏ/ఐసీడబ్ల్యూఏ/ఐసీఏ/ఎస్ఏఎస్, ఎంసీఏ, ఎంఎస్సీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** విద్యార్హతలు,ఉద్యోగానుభవం, దరఖాస్తుల షార్ట్‌లిస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.02.2025
- **వెబ్‌సైట్:** https://gsv.ac.in

పప్పుధాన్యాల్లో ఎక్కువగా ఉండే పోషకాలు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

నమూనా ప్రశ్నలు (ఎస్ఏ)

1. హారిక బ్రెడ్‌ను ఆహారంగా తీసుకోవాలను కుంది. ప్యాకెట్ తెరిచి చూస్తే అది చెడిపోయినట్లు వాసన వచ్చింది. భూతద్దంతో పరిశీలిస్తే తంతువుల లాంటి పోగులు కనిపించాయి. ఆమె గుర్తించిన సూక్ష్మజీవులు ఏ రకానికి చెందుతాయి?
   1) శైవలాలు 2) శిలీంధ్రాలు
   3) బ్యాక్టీరియా 4) వైరస్
2. ఎల్లోస్పాట్‌లో ఎక్కువ సంఖ్యలో ఉండే కణాలు?
   1) దండాలు 2) రోమాలు
   3) కోనులు 4) ఉపకళా కణాలు
3. క్షయకరణ విభజనకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   1) ప్రత్యుత్పత్తి కణాల్లో జరుగుతుంది
   2) క్రోమోజోముల సంఖ్య సగానికి తగ్గించడానికి ఉపకరిస్తుంది
   3) జీవుల్లో క్రోమోజోముల సంఖ్య స్థిరంగా ఉండటానికి దోహదపడుతుంది
   4) ఇది శారీరక కణాల్లోనే జరుగుతుంది
4. సంక్లిష్ట కణజాలాలకు ఉదాహరణ ఇవ్వండి అని ఉపాధ్యాయుడు అడిగినప్పుడు నలుగురు విద్యార్థులు కిందివిధంగా సమాధానం చెప్పారు. వీటిలో సరైనవి ఏవి?
   శేఖర్ - దృఢ కణజాలం
   శ్వేత - మృదు కణజాలం
   శ్రియ - దారు కణజాలం
   శంకర్ - పోషక కణజాలం
   1) శేఖర్, శంకర్ 2) శ్వేత, శ్రియ
   3) శ్రియ, శంకర్ 4) శ్వేత, శేఖర్
5. క్లోమరసంలో కీమోట్రిప్సిన్ అనే ఎంజైమ్ ఏ పదార్థాన్ని వేటిగా మారుస్తుంది?
   1) కొవ్వులు - కొవ్వు ఆమ్లాలు
   2) ప్రోటీన్లు- పెప్టైడులు
   3) పిండి పదార్థాలు - మాల్టోజ్
   4) పిండి పదార్థాలు - పెప్టోనులు
6. మొక్కల్లో లెగుమినేసి - రైజోబియం మాదిరిగా జంతువుల్లో...?
   1) పీతలు - సముద్ర జంతువులు
   2) పీతలు - సీ ఎనిమోన్లు
   3) ఆల్చిప్పలు - జలగలు
   4) సముద్ర నక్షత్రం - షార్క్ చేప
7. రాద్యులా కలిగి ఉన్న జీవికి ఉదాహరణ?
   1) దోమ 2) వానపాము
   3) నత్త 4) కప్ప
8. మానవ శరీరంలో అతి చిన్న ఎముకను కలిగి ఉండే అవయవం ఏది?
   1) కన్ను 2) చెవి
   3) ముక్కు 4) కపాలం
9. వినాళ గ్రంథులకు సంబంధించి కిందివాటిలో సరికాని ప్రవచనం?
   1) జీర్ణ రసాలను స్రవించవు
   2) అంతఃస్రావ గ్రంథులు అని కూడా అంటారు
   3) వీటి స్రావాలు నాళాల ద్వారా అవసరమైన చోటుకు ప్రవహిస్తాయి
   4) వీటి స్రావాలను హార్మోన్లు అంటారు
10. కిందివాటిలో వేటిలో పుపుస శ్వాసక్రియ జరగదు?
    ఎ. కప్ప బి. పావురం
    సి. చేపలు డి. టాడ్‌పోల్ లార్వా
    1) ఎ,బి 2) ఎ, డి
    3) బి, సి 4) సి, డి
11. ఎర్రరక్తకణాల శ్మశాన వాటిక అని ఏ అవయవాన్ని పేర్కొంటారు?
    1) ప్లీహం 2) కాలేయం
    3) ఊపిరితిత్తులు 4) ఎముక మజ్జ
12. విత్తనాలు లేని ఫలాలు ఏర్పడటానికి ఉపయోగపడే రసాయన పదార్థం?
    1) ఆక్సిన్లు 2) అబ్‌సిసిక్ ఆమ్లం
    3) ఇథిలిన్ వాయువు 4) జిబ్బరెల్లిన్లు
13. పన్నెండు జతల కపాల నాడుల్లో హృదయ స్పందన నియంత్రించే వేగస్ నాడీ ఎన్నోది?
    1) 9 2) 12 3) 10 4) 8
14. రవి కోపం, బాధ, ఆనందం లాంటి భావావేశాలను నియంత్రించుకోలేకపోతున్నాడు. అతడి మెదడులోని ఏ భాగంలో లోపం ఉండవచ్చు?
    1) అనుమస్తిష్కం 2) ద్వారగోర్థం
    3) మజ్జాముఖం 4) ఘ్రాణలంబికలు
15. సినర్జిడ్లు అనేవి మొక్కల్లోని ఏ భాగానికి సంబంధించినవి?
    1) పరాగకోశం 2) పిండకోశం
    3) వేరు పోషక కణాలు
    4) శిఖరాగ్ర మొగ్గలు
16. సయాన్, స్టాక్ అనేవి వేటిలో కనిపిస్తాయి?
    1) కోరకీభవనం 2) కణజాలవర్ధనం
    3) అంటుకట్టడం 4) ఫలదీకరణం
17. కిందివాటిలో ఏ రెండు జీవుల్లో బాహ్య ఫలదీకరణం జరుగుతుంది?
    ఎ. బొద్దింక బి. వానపాము
    సి. కప్ప డి. పాము
    1) ఎ, బి 2) బి, సి
    3) సి, డి 4) ఎ, డి
18. రాజేష్ వైద్యుడిని సంప్రదించినప్పుడు అతడు ప్రోటీన్లతో కూడిన ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోకపోవడం వల్ల వ్యాధిగ్రస్తుడయ్యాడని తెలిపాడు. రాజేష్‌కు ఏ వ్యాధి వచ్చి ఉండవచ్చు?
    1) క్వాషియోర్కర్ 2) రికెట్స్
    3) అనీమియా 4) జీరాప్తాల్మియా
19. జ్యోతి అనే గృహిణి ఆహార పదార్థాలను అతిగా ఉడకబెడుతుంది. వారి కుటుంబ సభ్యుల్లో ఏ విటమిన్ లోపం ఉండవచ్చు?
    1) రెటినాల్ 2) కాల్సిఫెరాల్
    3) ఫోలిక్ ఆమ్లం 4) నియాసిన్
20. మలేరియా పరాన్నజీవి జీవితచక్రంలో షైజాంట్ దశ ఎక్కడ అభివృద్ధి చెందుతుంది?
    1) కాలేయ కణాలు
    2) లాలాజల గ్రంథులు
    3) ఎర్రరక్తకణాలు 4) జీర్ణాశయ గోడలు
21. ఎముకల సామాన్య విరుపునకు మరో పేరు?
    1) జటిల ఎముకల విరుపు
    2) మూసివేసిన ఎముకల విరుపు
    3) లేత ఎముక విరుపు
    4) బహిర్గత ఎముక విరుపు
22. కండరాలు ఉత్తేజం చెంది సంకోచస్థితిలోనే ఉండిపోవడాన్ని టిటాని అంటారు. ఈ స్థితికి కారణం?
    1) సమతుల ఆహార లోపం
    2) వాసోప్రెస్సిన్ తగినంత ఉత్పత్తి కాకపోవడం
    3) ఆహార పదార్థాల్లో తగినంత అయోడిన్ లేకపోవడం
    4) పారాథార్మోన్ అధికంగా ఉత్పత్తవడం
23. మెదడులోని ఏ భాగం అతి ముఖ్యమైన శ్వాసక్రియ, హృదయ స్పందన, రక్త పీడనం, శరీర ఉష్ణోగ్రత, లాలాజలం స్రవించడం లాంటి క్రియలను నియంత్రిస్తుంది?
    1) ద్వారగోర్థం 2) మజ్జాముఖం
    3) పిట్యూటరీ గ్రంథి
    4) మస్తిష్క గోళార్ధాలు
24. ఒక మొక్క కణం పూర్తి మొక్కను ఇవ్వగలిగే శక్తిని ఏమంటారు?
    1) టోటిపొటెన్సీ 2) కాలస్
    3) ఎక్స్‌ప్లాంట్ 4) సయాన్
25. కిందివాటిలో ఏ రెండు ఆవశ్యక అమైనో ఆమ్లాలు కావు?
    ఎ. ఐసోటాసిన్ బి. గ్లిసరాల్
    సి. లైజీన్ డి. లిపిడ్లు
    1) ఎ, బి 2) బి, డి
    3) ఎ, సి 4) బి, సి
26. కిందివాటిలో నీటిలో, కొవ్వులో కరిగే విటమిన్లకు సంబంధించి సరైన క్రమం?
    1) BDE - ACK
    2) AEKC - BD
    3) BC - ADEK
    4) CD - ABEK
27. కిందివారిలో ఏ ఇద్దరు శాస్త్రవేత్తలు హెచ్ఐవీని కనుగొన్నారు?
    ఎ. ల్యూక్ మ్యాంట్ గ్నాయర్
    బి. ఇస్‌మార్క్
    సి. రాబర్ట్ గాలో
    డి. కార్ల్ లాండ్ స్టీనర్
    1) ఎ, బి 2) ఎ, సి
    3) బి, డి 4) బి, సి
28. సముద్ర అడుగు భాగంలో ఉండే జీవులను ఏమంటారు?
    1) నెక్టాన్ 2) ప్లవకాలు
    3) బెంథాస్ 4) నిమ్నటిక్
29. సముద్ర మొక్కలు దేన్ని నిక్షిప్తం చేసుకుంటాయి?
    1) క్లోరిన్ 2) బ్రోమిన్
    3) అయోడిన్ 4) సోడియం
30. పప్పుధాన్యాల్లో ఎక్కువగా ఉండే పోషకాలు?
    1) మాంసకృత్తులు 2) పిండి పదార్థాలు
    3) కొవ్వులు 4) విటమిన్లు
31. జుట్టు రాలకుండా ఉండటానికి ఉపయోగించే కొంథారిడియన్ తైలాన్ని స్రవించేది?
    1) సిల్వర్ ఫిష్ 2) లక్కమాత్
    3) పట్టుమాత్ 4) బ్లిస్టర్ బీటిల్
32. కిందివాటిలో ఎలక్ట్రాన్ గ్రహీత కానిది?
    1) పైరిడాక్సిన్
    2) అడినోసిన్ ట్రై ఫాస్ఫేట్
    3) సైటోక్రోం 4) ప్లాస్టో క్వినోన్
33. మైటోకాండ్రియా మాత్రికలో జరిగే శ్వాస క్రియ చర్యల వలయాలను విశదీకరించిన వారు?
    1) మెల్విన్ కాల్విన్ 2) ఆండ్రూ బెన్సన్
    3) సర్‌హాన్స్ క్రెబ్స్ 4) లిన్నియస్
34. కిరణజన్య సంయోగక్రియకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
    1) ఉష్ణశక్తి వినియోగితమవుతుంది
    2) ఉష్ణశక్తి విడుదలవుతుంది
    3) వికిరణ శక్తి వినియోగమవుతుంది
    4) రసాయన శక్తి విడుదలవుతుంది
35. నికర ప్రాథమిక ఉత్పాదకతను ప్రదర్శించేవి?
    1) మొక్కలు 2) సూక్ష్మజీవులు
    3) జంతువులు 4) నిర్జీవ కారకాలు
36. వాణిజ్యపరంగా విలువైన నారను ఇచ్చే మొక్క శాస్త్రీయనామం?
    1) టెక్టోనా గ్రాండ్
    2) క్రొటలేరియా జన్షియా
    3) షోరియారాబస్టా
    4) ఇల్యూసిస్ కొరకాన
37. కిందివాటిలో వరి వంగడం కానిది?
    1) బాసుమతి 2) పూసామోతి
    3) హంస 4) రవి
38. శక్తివనరు మొక్కకు సంబంధించిన కింది ఏ మొక్కలో ప్రత్యేక వేర్లు కనిపిస్తాయి?
    1) యూకలిప్టస్ 2) కాజురైనా
    3) అవిసీనియా 4) లూసినా
39. పెట్రో పంటగా దేన్ని పిలుస్తారు?
    1) డాల్బర్జియా లాటిఫోలియా
    2) డిజిటాలిస్
    3) రిసినస్ కామ్యునిస్
    4) బోడ్రియో కైకస్ బ్రాస్తే
40. ఏకదళ బీజ వర్గానికి చెందిన కార్బోహైడ్రేట్లను కలిగిన మొక్కల్లో పుష్పవిన్యాస రకం?
    1) స్పాడిక్స్ 2) సమశిఖి
    3) కంకి 4) గుచ్ఛం
41. చిన్న పిల్లల్లో ఎక్కువ సంఖ్యలో ఉండే రక్త కణాలు?
    1) ఎర్ర రక్తకణాలు 2) తెల్ల రక్తకణాలు
    3) లింఫోసైట్లు 4) త్రాంబోసైట్లు

సమాధానాలు

1) 2	2) 3	3) 4	4) 3	5) 2
6) 2	7) 3	8) 2	9) 3	10) 4
11) 1	12) 4	13) 3	14) 2	15) 2
16) 3	17) 2	18) 1	19) 3	20) 3
21) 2	22) 4	23) 2	24) 1	25) 2
26) 3	27) 2	28) 3	29) 3	30) 1
31) 4	32) 2	33) 1	34) 3	35) 1
36) 2	37) 2	38) 3	39) 4	40) 3
41) 1				

పశ్చిమ అలజడుల వల్ల వర్షపాతం పొందని రాష్ట్రం ఏది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భూగోళశాస్త్రం

భారతదేశ శీతోష్ణస్థితి

రుతుపవన ప్రక్రియ చాలా సంక్లిష్టమైంది. రుతుపవన ప్రక్రియ ఆవిర్భావాన్ని కింది సిద్ధాంతాల ద్వారా వివరించవచ్చు. అవి:

ఎ) థర్మల్ సిద్ధాంతం బి)ఫ్లాన్ సిద్ధాంతం
సి) జెట్‌స్ట్రీమ్ సిద్ధాంతం
డి) టిబెటన్ హీట్ ఇంజిన్ సిద్ధాంతం
ఇ) ఎల్‌నినో సిద్ధాంతం
ఎఫ్) ఈక్విసో, ఐవోడీ దృక్పథం

థర్మల్ సిద్ధాంతం ప్రకారం.. నైరుతి రుతుపవనాలు సముద్ర పవనాల లాంటివి. ఖండ-సముద్ర భాగాల ఉష్ణ ప్రవర్తనలో వ్యత్యాసం వల్ల ఇవి ఏర్పడతాయి. నైరుతి రుతుపవనాలను భారత ఉపఖండంలోకి ఆకర్షించే అల్పపీడన మండలం వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రతల వల్ల ఏర్పడిందని ఈ సిద్ధాంతం ప్రతిపాదిస్తుంది. ఫ్లాన్ సిద్ధాంతం ప్రకారం ఆగ్నేయ రుతుపవనాలు దక్షిణాసియా ప్రాంతంలో రూపాంతరం చెంది.. నైరుతి రుతుపవనాలుగా భారతదేశంలోకి ప్రవేశిస్తాయి. సూర్యుడి సాపేక్ష గమనం వల్ల భూమధ్యరేఖా అల్పపీడన మండలం కర్కటక రేఖ వద్దకు స్థానభ్రంశం చెంది నైరుతి రుతుపవనాలను ఆకర్షిస్తుంది. వేసవి కాలంలో టిబెట్ పీఠభూమి దాదాపు కొలిమిగా మారుతుంది. పర్వత పరివేష్టిత పీఠభూమి కావడంతో ఇక్కడ ఉపరితల ఉష్ణోగ్రతలు బాగా పెరుగుతాయి. దీంతో టిబెటన్ పీఠభూమి నుంచి సంవహన వాయువులు దక్షిణంగా వీచి దక్షిణ హిందూ మహాసముద్రంలో అవనతం చెందుతాయి. దాంతో దక్షిణ హిందూ మహాసముద్రంలో అధిక పీడనం ఏర్పడుతుంది. దక్షిణ హిందూ మహాసముద్రానికి వాయవ్య భారతదేశానికి మధ్య పీడన ప్రవణత ఏర్పడటంతో దక్షిణ హిందూ మహాసముద్రం నుంచి కవోష్ణ ఆర్ద్ర పవనాలు భారతదేశంలోకి ప్రవేశిస్తాయి. ఉప ఆయనరేఖా పశ్చిమ జెట్‌స్ట్రీమ్ జూన్ మొదటి వారంలో హిమాలయాలకు ఉత్తరంగా స్థానభ్రంశం చెందడం వల్ల నైరుతి రుతుపవనాలు ఉద్ధృతంగా భారతదేశంలోకి ప్రవేశిస్తాయి. ఆఫ్రికా తూర్పు తీరంలోని సోమాలియా నుంచి అరేబియా సముద్రం మీదుగా.. కేరళ తీరం వైపు వీచే సోమాలియా నిమ్న స్థాయి జెట్‌స్ట్రీమ్ నైరుతి రుతుపవనాలను బలోపేతం చేస్తుంది. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే ఎల్‌నినో నైరుతి రుతుపవనాలను బలహీనపరుస్తుందని వాతావరణ నిపుణుల అభిప్రాయం. ఈ కారణంతోనే రుతుపవనాల భవిష్యత్తు నమూనాలో ఎల్‌నినో చలనరాశులకు పెద్దపీట వేశారు. అయితే గ్లోబల్ వార్మింగ్ వల్ల ఇటీవల ఎల్‌నినో నైరుతి రుతుపవన వ్యవస్థల మధ్య సంబంధం బలహీనపడుతున్నట్లు శాస్త్రవేత్తలు నిర్ధారించారు. భూమధ్యరేఖా ప్రాంత హిందూ మహాసముద్రంలో.. పీడనంలో అకస్మాత్తుగా సంభవిస్తున్న మార్పులు, సముద్ర ప్రవాహాల్లో సంభవిస్తున్న మార్పులు నైరుతి రుతుపవనాలను ప్రభావితం చేస్తున్నాయని శాస్త్రవేత్తలు ధ్రువీకరించారు. అందువల్ల రుతుపవన భవిష్యత్తు నమూనాలో సమూల మార్పులు చేశారు.

> నైరుతి రుతుపవనాలు జూన్ మొదటి వారంలో కేరళ రాష్ట్రాన్ని తాకుతాయి. తర్వాత ఇవి దేశమంతటా విస్తరించడంతో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయి. దేశ వార్షిక సగటు వర్షపాతంలో సుమారు మూడింట రెండొంతులు నైరుతి రుతుపవన కాలంలోనే సంభవిస్తుంది. బంగాళాఖాతం, అరేబియా సముద్రం నుంచి వీచే ఆర్ద్ర రుతుపవనాలు విస్తారంగా వర్షాన్నిస్తాయి. పశ్చిమ తీరమైదానం, దక్షిణ షిల్లాంగ్ పీఠభూమి ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం నమోదవుతుంది.

ఆయనరేఖా రుతుపవన శీతోష్ణస్థితి

భారతదేశం వైవిధ్య శీతోష్ణస్థితిని కలిగి ఉంది. స్థూలంగా భారతదేశ శీతోష్ణస్థితిని 'ఆయనరేఖా రుతుపవన శీతోష్ణస్థితి'గా అభివర్ణిస్తారు. ఇక్కడ సంవత్సరాన్ని ఆరు రుతువులుగా విభజించడం సంప్రదాయం. అంటే.. ప్రతి రెండు నెలలకొకసారి శీతోష్ణస్థితిలో గుణాత్మక మార్పులు సంభవిస్తాయి. అయితే శాస్త్రీయంగా భారతదేశ శీతోష్ణస్థితి సంవత్సరాన్ని నాలుగు రుతువులుగా విభజిస్తారు. అవి :

ఎ) రుతుపవన పూర్వకాలం (మార్చి 15 – జూన్ 15)
బి) నైరుతి రుతుపవన కాలం (జూన్ 15 – సెప్టెంబర్ 15)
సి) ఈశాన్య రుతుపవన కాలం (సెప్టెంబర్ 15 – డిసెంబర్ 15)
డి) రుతుపవన అనంతర కాలం (డిసెంబర్ 15 – మార్చి 15)

రుతుపవన పూర్వకాలాన్ని నడివేసవిగా పరిగణిస్తాం. ఈ కాలంలో పగటి ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా ఉంటాయి. ముఖ్యంగా వాయవ్య భారతదేశం, దక్కన్ పీఠభూమి అంతర్భాగాల్లో పగటి ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 45 Cలకు పైగా నమోదవుతాయి. ఈ కాలంలో సంవహన ప్రక్రియ వల్ల మధ్యాహ్నం గాలిదుమ్ములు, చిరుజల్లులతో కూడిన స్థానిక పవనాలు వీస్తాయి. వీటిని దేశంలోని వివిధ ప్రాంతాల్లో వేర్వేరు పేర్లతో పిలుస్తారు. ఉదాహరణకు ఆంధీలు(ఉత్తరప్రదేశ్), లూ (పంజాబ్, హర్యానా), కాల బైశాఖి(బిహార్, పశ్చిమబెంగాల్), మామిడి జల్లులు(దక్షిణ భారతదేశం). నైరుతి రుతుపవన కాలంలో దేశమంతటా విస్తారంగా వర్షాలు కురుస్తాయి. వార్షిక సగటు వర్షపాతంలో సుమారు మూడింట రెండొంతులు ఈ నాలుగు నెలల కాలంలోనే సంభవిస్తుంది. బంగాళాఖాతం, అరేబియా సముద్రం నుంచి వీచే ఆర్ద్ర రుతుపవనాలు విస్తారంగా వర్షాన్నిస్తాయి. పశ్చిమ తీరమైదానం, దక్షిణ షిల్లాంగ్ పీఠభూమి ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం కురుస్తుంది. ఇక్కడ సగటు వర్షపాతం 250 సెం.మీ.కు పైగా నమోదవుతుంది. ఈ మండలానికి చెందిన చిరపుంజి, మాసిన్‌రామ్‌లలో ప్రపంచంలోకెల్లా అత్యధిక వర్షపాతం నమోదవుతుంది. ఈ కాలంలో వర్షపాత విస్తరణలో ప్రాంతీయ అసమానతలు స్పష్టంగా కనిపిస్తాయి. సహ్యాద్రి పర్వతాలకు పవన పరాన్ముఖ దిశలో ఉన్న దక్కన్ పీఠభూమి అంతర్భాగాల్లో వర్షపాతం 50–70 సెం.మీ. ఉంటుంది. ఇది వర్షచ్ఛాయా ప్రాంతం కావడంతో పాక్షిక శుష్క మండలంగా ఏర్పడింది. ఆరావళి పర్వతాలకు పశ్చిమంగా ఉన్న పశ్చిమ రాజస్థాన్ (థార్), ఉత్తర గుజరాత్ (కచ్) ప్రాంతాల్లో వర్షపాతం 30 సెం.మీ. కంటే తక్కువగా) నమోదవుతుంది. ఆరావళి పర్వతాలు నైరుతి రుతుపవనాలకు సమాంతరంగా ఉండటంతో పర్వతీయ వర్షపాతం సాధ్యం కాదు. సహజంగా ఉండే అస్థిరత కారణంగా నైరుతి రుతుపవనాలు ఈ ప్రాంతంలో ఉద్ధాతనం చెందడానికి ప్రయత్నించినప్పటికీ, ఊర్ధ్వ ట్రోపో ఆవరణంలోని శీతల స్థిర వాయురాశులు వాటిని అడ్డుకుంటాయి. దీంతో పశ్చిమ రాజస్థాన్ ప్రాంతంలో తక్కువ వర్షపాతం కురిసి థార్ ఎడారిగా మారింది. నైరుతి రుతుపవనాలు భారతదేశ ప్రధాన భూభాగాన్ని తొలుత జూన్ మొదటి వారంలో తాకుతాయి. ఇవి దేశమంతటా విస్తరించడానికి సుమారు 45 రోజులు పడుతుంది.

రుతుపవనాల తిరోగమనం

సెప్టెంబర్ 15 కల్లా భారతదేశం నుంచి నైరుతి రుతుపవనాల తిరోగమనం ప్రారంభమవుతుంది. తిరోగమన రుతుపవనాలు శీతల శుష్కఖండ వాయురాశులతో కూడి ఉంటాయి. ఇవి బంగాళాఖాతం మీదకు రాగానే సముద్ర నీటిఆవిరిని పీల్చుకొని ఆర్ద్రంగా తయారవుతాయి. ఇదే సమయంలో బంగాళాఖాతంలో ఈశాన్య వ్యాపార పవనాలు బలంగా వీస్తుంటాయి. ఈశాన్య వ్యాపార పవనాల ప్రభావం వల్ల తిరోగమన రుతుపవనాలు, ఈశాన్య రుతుపవనాల రూపంలో తమిళనాడు, దక్షిణ కోస్తా ఆంధ్ర తీరాన్ని తాకుతాయి. ఈ ప్రాంతంలో ఈశాన్య రుతుపవనాల ప్రభావం వల్ల విస్తారంగా వర్షాలు కురుస్తాయి. ఈ కాలంలో దేశమంతటా ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గిపోతాయి. ముఖ్యంగా రాత్రి ఉష్ణోగ్రతలు ఉత్తర, వాయవ్య భారతదేశంలో 10 C కంటే తక్కువగా ఉంటాయి. హిమాలయ ప్రాంతంలో మంచు విస్తారంగా కురుస్తుంది. పశ్చిమ పవనాల ప్రభావం వల్ల మధ్యధరా సముద్రం, ఎర్ర సముద్రం ప్రాంతాల నుంచి వచ్చే బలహీన కవోష్ణ సమశీతోష్ణ మండల చక్రవాతాలు, వాయవ్య భారతదేశంలోకి ప్రవేశిస్తాయి. వీటి ప్రభావం వల్ల పంజాబ్, హర్యానా, రాజస్థాన్, జమ్మూకశ్మీర్, పశ్చిమ ఉత్తరప్రదేశ్ ప్రాంతాల్లో జల్లులు కురుస్తాయి. వీటిని పశ్చిమ అలజడులుగా పిలుస్తారు. ఇవి భారతదేశంలోకి ప్రవేశించడంలో ఉప ఆయన రేఖా పశ్చిమ జెట్‌స్ట్రీమ్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇదే కాలంలో.. ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడే స్థానిక అల్పపీడన ద్రోణులు మరింత తీవ్రమై వాయుగుండాలు తుఫాన్లుగా రూపాంతరం చెంది భారతదేశ తూర్పు తీరాన్ని తాకుతాయి. వీటి ప్రభావం వల్ల తూర్పు తీరంలో నవంబర్, డిసెంబర్‌లో వర్షాలు కురుస్తాయి. జనవరికల్లా ఈశాన్య రుతుపవనాలు బలహీనపడతాయి. జనవరి–మార్చి మధ్య వాతావరణం అనిశ్చితంగా ఉంటుంది. ఈ కాలంలో ఉష్ణోగ్రత, వర్షపాతం, పవన దిశలు క్రమబద్ధమైన రీతిలో ఉండవు. జనవరి నుంచి సూర్యుడి సాపేక్ష గమనం ఉత్తరార్ధ గోళం దిశగా ప్రారంభమవుతుంది. దాంతో భారతదేశంలో క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఈ కాలంలో దేశంలో పవనాలు ఒక స్థిర దిశలో వీయవు. మొత్తం మీద దేశమంతటా సమశీతోష్ణ ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది.

రుతుపవనాలు

భారతదేశ వాతావరణాన్ని రుతుపవనాలు సంవత్సరం పొడవునా ప్రభావితం చేస్తాయి. దక్షిణ హిందూ మహాసముద్ర ప్రాంతంలో నిమ్న ట్రోపో ఆవరణంలో ఏర్పడే విశిష్టమైన పవన వ్యవస్థను రుతుపవన వ్యవస్థగా అభివర్ణిస్తారు. ఇది దక్షిణాసియా, ఆగ్నేయాసియా ప్రాంతాల శీతోష్ణస్థితిని ప్రభావితం చేస్తుంది. శీతాకాలంలో భారత ఉపఖండంపై విస్తరించి ఉన్న శీతల, శుష్క ఖండ వాయురాశిని జూన్–సెప్టెంబర్ మధ్యకాలంలో కవోష్ణ, ఆర్ద్ర సముద్ర వాయురాశి స్థానభ్రంశం చెందిస్తుంది. శీతాకాలంలో ఈశాన్య దిశ నుంచి వీస్తున్న పవనాల స్థానంలో జూన్–సెప్టెంబర్ మధ్యకాలంలో నైరుతి దిశ నుంచి పవనాలు వీస్తాయి. ఈ దృగ్విషయాన్నే రుతుపవన వ్యవస్థ అంటారు.

రుతుపవనాలు-ముఖ్య లక్షణాలు

- రుతువులను అనుసరించి పవన దిశలో సుమారు 180 డిగ్రీల మార్పు
- వేసవి, శీతాకాలాల్లో పరస్పర విరుద్ధ లక్షణాలున్న వాయురాశులు
- దేశంలోకి అకస్మాత్తుగా ప్రవేశించడం
- క్రమపద్ధతిలో దేశమంతటా విస్తరించడం
- క్రమపద్ధతిలో తిరోగమించడం
- అనిశ్చితత్వం

> భారతదేశ శీతోష్ణస్థితిలో ప్రతి రెండు నెలలకు ఒకసారి గుణాత్మక మార్పులు సంభవిస్తాయి. రుతుపవన పూర్వకాలాన్ని నడివేసవిగా పరిగణిస్తాం. రుతు పవన కాలంలో మాత్రం దేశమంతటా వర్షాలు విస్తారంగా కురుస్తాయి. దేశంలోని చిరపుంజి, మాసిన్‌రామ్‌లలో అత్యధిక వర్షపాతం కురిస్తే... థార్, కచ్‌లలో అత్యల్ప వర్షపాతం నమోదవుతోంది!!



మాదిరి ప్రశ్నలు

1. రుతుపవన శీతోష్ణస్థితి ఉన్న దేశాలను గుర్తించండి.
   1) భారతదేశం 2) శ్రీలంక
   3) బంగ్లాదేశ్ 4) పైవన్నీ
2. నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని ఎప్పుడు తాకుతాయి?
   1) జూన్ మొదటి వారంలో
   2) జూన్ మూడో వారంలో
   3) మే చివరి వారంలో
   4) జూన్ చివర్లో
3. నైరుతి రుతుపవనాల వల్ల దేశంలోకెల్లా అత్యధిక వర్షపాతం పొందే ప్రాంతాలు?
   1) దక్కన్ పీఠభూమి
   2) ఆరావళి పర్వతాలు
   3) పశ్చిమ తీరమైదానం, దక్షిణ షిల్లాంగ్ పీఠభూమి
   4) కేరళ తీరం
4. దక్షిణ భారతదేశంలో వేసవిలో కురిసే చిరు జల్లులను ఏమని పిలుస్తారు?
   1) ఆంధీలు 2) లూ
   3) కాలబైశాఖి
   4) మామిడి జల్లులు
5. పశ్చిమ అలజడుల వల్ల వర్షపాతం పొందని రాష్ట్రం ఏది?
   1) ఉత్తరప్రదేశ్ 2) రాజస్థాన్
   3) పంజాబ్ 4) మహారాష్ట్ర
6. నైరుతి రుతుపవనాలు సముద్ర పవనాల లాంటివని తెలిపే సిద్ధాంతం ఏది?
   1) థర్మల్ సిద్ధాంతం
   2) ఫ్లాన్ సిద్ధాంతం
   3) ఎల్‌నినో సిద్ధాంతం
   4) జెట్‌స్ట్రీమ్ సిద్ధాంతం
7. పవన మార్గానికి పర్వతాలు అడ్డుగా వచ్చినప్పుడు సంభవించే వర్షపాతం?
   1) పర్వతీయ వర్షపాతం
   2) చక్రీయ వర్షపాతం
   3) సంవహన వర్షపాతం
   4) పైవేవీ కాదు
8. భారతదేశంలో టైగా శీతోష్ణస్థితిని ఏ రాష్ట్రంలో గుర్తించవచ్చు?
   1) కేరళ 2) రాజస్థాన్
   3) ఉత్తరాఖండ్ 4) అసోం
9. సాంద్ర వ్యవసాయం ఏ శీతోష్ణస్థితిలో ఎక్కువగా అభివృద్ధి చెందింది?
   1) రుతుపవన 2) సవన్నా
   3) తురానియన్ 4) బ్రిటిష్

సమాధానాలు

1) 4	2) 1	3) 3
4) 4	5) 4	6) 1
7) 1	8) 3	9) 1

What did the government do right?

BANK EXAMS
GENERAL ENGLISH

Model Questions

Directions (Q.No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Many economists and expert committees (1)/ have in the past argued that the RBI is holding (2)/ much higher capital than required (3)/ to cover all its risks and contingency. (4)/ No error (5)
2. Harmanpreet became the first Indian woman cricketer to score a century in T-20 Internationals. (1)/ Earlier this year, she is embroiled in controversy (2)/ after the Punjab government withdrew her DSP rank (3)/ saying her degree had been found to be fake. (4)/ No error (5)
3. Sri Lankan President Maithripala Sirisena on Sunday stoutly defended his controversial move (1)/ to dissolve the parliament, saying it was taken to prevent clashes (2)/ between rival lawmakers (3)/ and also blamed Speaker for not accepting his presidential powers. (4)/ No error (5)
4. The Election Commission on Friday imposed a near month-long ban (1)/ on holding exit polls (2)/ beginning November 12 (3)/ in the five poll-bound states include Telangana. (4)/ No error (5)
5. The National Flag will fly at half-mast throughout the country on Monday (1)/ to pay homage Union minister Ananth Kumar (2)/ who died in the early hours. (3)/ The Central government will also accord a state funeral to the senior BJP leader. (4)/ No error (5)

Directions (Q.No. 6-10): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. She looked at him, and laughed; a cold laugh, ____, yet not bitter.
   1) Disdainful 2) respectful
   3) deferential 4) referential
   5) reverent
7. My brother was ____; he has attached himself to the retinue of a wealthy Baroness.
   1) Servile 2) imply
   3) comply 4) entail
   5) authoritative
8. Punishment is ____in deterring from crime only if it be certain and ____.
   1) Useless, slow
   2) futile, leisurely
   3) ineffectual, dawdling
   4) vain, sluggish
   5) efficacious, speedy
9. The Trump administration's ____ indifference to European concerns boils the blood of even the most ____ of Eurocrats.
   1) simple, bustling
   2) basic, docile
   3) ambiguous, serene
   4) undetectable, quite
   5) Apparent, placid
10. The hotel's shabby, outdated exercise room was its ____ attempt at a health spa.
    1) hefty 2) paltry
    3) substantial 4) generous
    5) considerable

Directions: (Q.No. 11 - 15) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. <u>She recommended that John should take the ferry.</u>
    1) She recommended that John takes the ferry.
    2) She recommended that John is taking the ferry.
    3) She recommended that John has taken the ferry.
    4) She recommended that John take the ferry.
    5) No correction required
12. After the attack on the World Trade Center, the President ordered intelligence agencies <u>should prepare lists of who were America's most wanted terrorists.</u>
    1) would do the preparation of lists of America's most wanted terrorists
    2) preparing lists of most wanted terrorists in America
    3) the preparing of a list of the most wanted terrorists in America
    4) to prepare lists of the most wanted terrorists in America
    5) No correction required
13. The exhibit, created by painstaking craftsmanship in the jungles of Burma, consisted of hundreds of paintings, <u>each painting a tiny etched landscape inside its</u> own ceramic work of pottery.
    1) all the paintings a tiny etched landscape inside their
    2) all the paintings a tiny etched landscape inside its
    3) every painting a tiny etched landscape inside their
    4) each painting a tiny etched landscape inside their
    5) No correction required
14. More than one hundred years ago, students of ornithology reported that hummingbirds can hover <u>as insects flitting gracefully from one flower to another.</u>
    1) like insects flitting gracefully from one flower to another
    2) as insects do that flit gracefully from one flower to others
    3) like insects do that flit gracefully from one flower to others
    4) as do insects that flit gracefully from one flower to some other one
    5) No correction required
15. Forced to cut back their stock, automobile dealers in the area have cut prices; <u>have been priced to sell, and they are</u>
    1) are priced to sell, and they have
    2) are priced to sell, and they do
    3) are being priced to sell, and have
    4) had been priced to sell, and they have
    5) No correction required

Directions (Q.No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) The jump in the ranking, from 100 to 77, is correlated with an improvement in the ratings, a jump of 6.6 per cent over last year.
B) Such questions are critical to help evolve a more focussed set of policy priorities for India.
C) What was even more interesting was that construction permits and cross-border trade were two aspects that showed maximum improvement.
D) What did the government do right? If business has become so much easier, why don't we see a boom in new businesses and investment?
E) The improvement in India's "Doing Business" rankings was quite a surprise, and among the few pleasant ones in recent weeks.
F) This is the second year that India has seen a massive jump in the same ratings with its ranking going up by 23 places this year, on top of 30 places last year.

16. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C
    4) D 5) E
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D
    4) F 5) E
18. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D
    4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C
    4) D 5) E
20. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C
    4) D 5) F

Directions (Q.No. 21-25) Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

Sardar Patel had no time for religious extremists of any kind. It didn't matter whether you were Muslim or Hindu; if you were misusing religion and religious sentiments to further your political power, Patel was not your friend. While he may have had more sympathy towards some Hindu traditions than Jawaharlal Nehru, neither Nehru nor Patel was blind to the fact that the Rashtriya Swayamsevak Sangh and Hindutva lot consistently bowed to the British rulers while Congress leaders, like themselves, were slammed into jail where some of them even died. After the murder of Bapu, Patel's anger towards the RSS was unimaginable, and he banned the organization. He lifted the ban only after the group signed an agreement saying they would stay away from politics. That assurance was given in shameless bad faith, and today we have the irony of that same RSS trying to hollow out the legacies of Gandhi, Nehru, Patel and Ambedkar even while building the gigantic Trojan Horse in Narmada district.

I'm sure there are people in Nagpur chortling into their falangist white shirts, thinking this is sweet revenge, that this statue of Patel will actually be a mausoleum of Gandhi's and Sardar's principles and ideology. The statue itself stares over a land destroyed to make the Narmada Dam and so-called Sardar Sarovar, where thousands of people were ripped out of their traditional lands to create an irrigation project that would benefit only a very few, a project that has failed dismally. To erect this obscene pile on the site of that robbery and disastrous planning is to add insult to injury. The insult is as much to the poor people of Gujarat as it is to Sardar Patel, one of their greatest champions. This statue may be intended as the place to inter Patel's idea of India, but in time, when history kicks back, it might well become the mausoleum for the toxic ideology of Hindutva.

21. Which of the following statements is true?
    1) Sardar Patel was tolerant towards Hindutva
    2) Sardar Patel entertained religious extremists
    3) Those who were misusing religion and religious sentiments occupied the coterie of Sardar
    4) all the above
    5) None of the above
22. What is the odd one out from the following options?
    1) Rip out 2) Relegate
    3) Expunge 4) Ratify
    5) Efface
23. The writer is ____
    1) Comparing Gandhi and Patel
    2) Demonstrating the strength of RSS
    3) Talking about Trojan horse
    4) Vehement about the project
    5) Disparaging the project
24. The synonym of dismal is:
    1) Drab 2) Grab
    3) Clutch 4) Dangle
    5) Droop
25. The antonym of obscene is:
    1) Profane 2) Pure
    3) Prurient 4) Ribald
    5) Wanton

KEY

1) 4	2) 2	3) 3	4) 4	5) 2
6) 1	7) 1	8) 5	9) 5	10) 2
11) 4	12) 4	13) 5	14) 2	15) 2
16) 1	17) 2	18) 3	19) 5	20) 3
21) 5	22) 4	23) 5	24) 1	25) 2